
'నా అక్కలూ..చెల్లెళ్లు...తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 279

శుక్రవారం 23-6-2023



క్వార్టర్స్‌లో ప్రణయ్
థాయ్‌ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సత్తా చాటిన భారత క్రీడాకారుడు - 13లో



27 నుంచి 'సైయంట్' ఐపీవో
షేరు శ్రేణి రూ.250-265.. రూ.700 కోట్ల సమీకరణ - 13లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఆయుధ పరిశ్రమలో నవశకం
భారత్‌లోనే ఫైటర్‌జెట్ ఇంజన్లను తయారు చేసేందుకు జీఈ ఏరోస్పేస్, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ మధ్య ఒప్పందం కుదిరింది.
వివరాలు 6లో ▶



మిషన్ 2024
వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనేందుకు శుక్రవారం పట్నాలో 20 ప్రతిపక్ష పార్టీల నేతలు సమావేశమవ్వబోతున్నారు.
వివరాలు 6లో ▶



ఆశలు జల సమాధి
టైటానిక్ ఓడ శకలాలను తిలకించడానికి టైటాన్ జలాంతర్గామిలో వెళ్లిన ఐదుగురు మృతి చెందారని ఓషన్ గేట్ ప్రకటించింది.
వివరాలు 6లో ▶



చైనాలో భారీ పేలుడు
చైనాలోని ఓ రెస్టారెంట్‌లో గ్యాస్ లీకేజీతో పేలుడు సంభవించడంతో 31 మంది మృతి చెందగా.. ఏడుగురు గాయపడ్డారు.
వివరాలు 6లో ▶

మరో 4 అడుగులు

విశాఖ జీఐఎస్ ఒప్పందాల మేరకు శరవేగంగా కార్యరూపం

3 చోట్ల నిర్మాణ పనులు, మరో చోట విస్తరణ యూనిట్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం జగన్

- నెల్లూరు జిల్లాలో క్రిబ్‌కో ఇథనాల్ ప్లాంట్, విశ్వసముద్ర బయో ఎనర్జీ ప్లాంట్
- తిరుపతి జిల్లాలో కాంటినెంటల్ కాఫీ ఫ్యాక్టరీ
- ఏలూరు జిల్లా చింతలపూడిలో 9 నెలల్లోనే మొదలైన గోద్రెజ్ ఆగ్రోవెట్ విస్తరణ యూనిట్
- మూడు జిల్లాల్లో 2,400 మందికి ఉపాధి అవకాశాలు
- రాష్ట్రంలో మరో రూ.1,425 కోట్ల పెట్టుబడులు సాకారం



నెల్లూరు జిల్లా సర్వేపల్లి వద్ద క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ సంస్థ ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్, క్రిబ్‌కో చైర్మన్ చంద్రపాల్‌సింగ్, మంత్రి అమర్‌నాథ్ తదితరులు

సాక్షి, అమరావతి: విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కుదిరిన ఒప్పందాల మేరకు మూడు జిల్లాల్లో రూ.1,425 కోట్ల విలువైన ప్రాజెక్టులు కార్యరూపం దాల్చడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి మూడు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరో ప్రాజెక్టులో ఉత్పత్తిని వర్చువల్‌గా ప్రారంభించారు. క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, విశ్వసముద్ర బయో ఎనర్జీ, సీసీఎల్ ఫుడ్ అండ్ బెవరేజెస్ పరిశ్రమల శిలాఫలకాలను సీఎం జగన్ వర్చువల్‌గా ఆవిష్కరించి నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఏలూరు జిల్లా చింతలపూడిలో ఏర్పాటైన గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ సంస్థ విస్తరించిన యూనిట్‌లో వాణిజ్య కార్యకలాపాలను సీఎం ప్రారంభించారు. ఈ రోజు మూడు జిల్లాల్లో నాలుగు యూనిట్లకు సంబంధించి గొప్ప కార్యక్రమం జరుగుతోందని, వీటివల్ల 2,400 మందికి ఉపాధి లభిస్తుందని సీఎం పేర్కొన్నారు. శంకుస్థాపన చేసిన మూడు ప్లాంట్లు త్వరలో నిర్మాణ కార్యకలాపాలను పూర్తి చేసుకుని అందుబాటులోకి వస్తాయన్నారు. 'ఎలాంటి సహకారం కావాలన్నా ప్రభుత్వం మీకు

మిగతా 2వ పేజీలో ▶

నాలుగు చోట్ల క్రికెట్ అకాడమీలు

- క్రీడాశాఖపై సమీక్షలో సీఎం జగన్ ఆదేశం.. కడప, తిరుపతి, మంగళగిరి, విశాఖలో ఏర్పాటు
- విశాఖలో అత్యాధునిక ప్రమాణాలతో మరో క్రికెట్ స్టేడియం.. క్రీడలకు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా వైఎస్సార్ క్రికెట్ స్టేడియం

2లో

గాయపడిన కౌశిక్‌ను ఆస్పత్రికి తీసుకెళ్తున్న దృశ్యం



చిన్నారిపై చిరుత దాడి

తిరుమల నడకదారిలో మెడను నోటకరుచుకుని లాక్కెళ్లిన వైనం

అందరూ అరుస్తూ వెంబడించడంతో వదిలేసిన చిరుతపులి


బాలుడికి గాయాలు

తిరుమల: అలిపిరి–తిరుమల నడకదారిలోని ఏడోమైలు వద్ద గురువారం రాత్రి ఓ చిరుత బాలుడిని నోటకరుచుకుని అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లింది. అందరూ కేకలు వేస్తూ వెంబడించడంతో కొద్ది దూరంలో వదిలి వెళ్లింది. గాయపడిన బాలుడిని తిరుపతి ఆస్పత్రికి తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన దంపతులు తమ కుమారుడు కౌశిక్ (3)తో కలిసి కాలినడకన అలిపిరి నుంచి తిరుమలకు బయలుదేరారు. వీరు ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయానికి సమీపంలోని ఏడోమైలు వద్ద రాత్రి 9 గంటల సమయంలో నడిచివెళుతుండగా

మిగతా 3వ పేజీలో ▶

సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో

నూతన అధ్యాయం



వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఇచ్చిన విందులో ఆయన సతీమణి జిల్ బైడెన్‌కు 7.5 క్యారెట్ల కృత్రిమ వజ్రాన్ని బహూకరిస్తున్న ప్రధాని మోదీ. పర్యావరణహిత విధానాలను ప్రోత్సహించేలా ప్రత్యేకమైన కశ్మీరీ అట్టపెట్టెలో ఈ వజ్రాన్ని అందజేశారు.

బైడెన్‌కు మోదీ సహస్ర చంద్రోదయ కానుక 6లో

ప్రజాస్వామ్యం భారత్, అమెరికా దేశాల డీఎన్‌ఏలో ఉంది

జో బైడెన్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడిన ప్రధాని మోదీ

- భారత్, అమెరికా మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో నూతన అధ్యాయం చేరిందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చెప్పినట్లుగా ప్రజాస్వామ్యం అనేది భారత్, అమెరికా దేశాల డీఎన్‌ఏలో ఉందని అన్నారు. ప్రపంచంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. గురువారం వైట్‌హౌస్‌లో చర్చలు ముగిసిన అనంతరం మోదీ, బైడెన్ ఉమ్మడిగా మీడియా సమావేశంలో మాట్లాడారు. భారత్–అమెరికా సంబంధాల చరిత్రలో ఈరోజుకు ఒక ప్రత్యేక ప్రాధాన్యం ఉందని మోదీ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య దాపరికాలకు తావు లేదని, పరస్పరం చక్కగా గౌరవించుకుంటున్నాయని బైడెన్ అన్నారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు ఘన సన్మానం

- ఆయన గౌరవార్థం రాష్ట్ర ప్రభుత్వం విందు
- శాలువా కప్పి సత్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- హాజరైన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఏసీజే జస్టిస్ శేషసాయి

2లో



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్‌మిశ్రాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ

'ఆయుష్మాన్ భారత్'

- అమలుకు చర్యలు తీసుకుంటున్న కేంద్ర వైద్య శాఖ
- రాష్ట్రంలో 7 వేలకు పైగా ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు
- ఇప్పటికే రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు రిజిస్టర్



సాక్షి, అమరావతి: ప్రజలకు డిజిటల్ వైద్య సేవల కల్పనలో భాగంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎ) కార్యక్రమం అమలుపై కేంద్ర వైద్య శాఖ దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలో ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లను ఏబీడీఎంలో హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రీ(హెచ్‌ఎఫ్‌ఆర్) చేసుకునేలా చర్యలు చేపడుతున్నారు. సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్(సీజీహెచ్‌ఎస్) నెట్‌వర్క్ ఆస్పత్రులన్నీ హెచ్‌ఎఫ్‌ఆర్ చేసుకోవాలని గత నెలలో సీజీహెచ్‌ఎస్ డైరెక్టర్ లేఖ రాశారు. దీంతో సీజీహెచ్‌ఎస్ నెట్‌వర్క్ ఆస్పత్రులు హెచ్‌ఎఫ్‌ఆర్ చేసుకునే పనిలో పడ్డాయి. ఇదిలా ఉండగా తొలి నుంచి ఏబీడీఎం అమల్లో ఉత్తమ పనితీరు కనబరుస్తున్న రాష్ట్ర వైద్య శాఖ ప్రైవేట్ ఆస్పత్రుల్లో కార్యక్రమం అమలుపై ఫోకస్ పెట్టింది.

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆదేశాలు

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాస్పత్రులను వైద్య శాఖ ఇప్పటికే ఏబీడీఎంలో రిజిస్టర్ చేసింది. మరోవైపు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులన్నీ హెచ్‌ఎఫ్‌ఆర్ చేసుకోవాలని వైద్య శాఖ ఆదేశాలిచ్చింది. ఈ క్రమంలో ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులు రిజిస్ట్రీ ప్రక్రియను మొదలెట్టాయి. రాష్ట్రవ్యాప్తంగా 7,800కు పైగా ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లున్నాయి. వీటిలో ఇప్పటి వరకూ 683 ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు రిజిస్ట్రీ మొదలుపెట్టగా.. ఇందులో 138 ఫెసిలిటీలకు ఆమోదం లభించింది. ఆస్పత్రులు కేవలం రిజిస్టర్ అయ్యి వదిలేస్తే ఏబీడీఎం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం నెరవేరదు. ఈ క్రమంలో రిజిస్టర్ అయిన ఆస్పత్రులు తమ రోజువారీ ఓపీలు, ఐపీలు, ఇతర క్లినికల్ కార్యకలాపాలను డిజిటల్ విధానంలో చేసేలా ప్రోత్సాహకాలను నేషనల్ హెల్త్ అథారిటీ(ఎన్‌హెచ్‌ఏ) అందిస్తోంది. ఇందులో భాగంగా ఒక ఆస్పత్రిలో నెలకు వంద మంది రోగుల హెల్త్ రికార్డులను ఆన్‌లైన్‌లో అనుసంధానించిన అనంతరం 101వ రోగి నుంచి ఒక్కో రోగికి రూ.20 చొప్పున ప్రోత్సాహకం ఎన్‌హెచ్‌ఏ ఆస్పత్రులకు చెల్లిస్తుంది. తద్వారా ఆస్పత్రులకు వచ్చే ప్రతి రోగికీ అందే వైద్య వివరాలను సంబంధిత రోగి ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ అకౌంట్(ఆభా)లో నిక్షిప్తమయ్యేలా చర్యలు చేపడుతున్నారు.

రోగి గురించి సమస్త సమాచారం లభ్యం

ప్రతి పౌరుడి ఆరోగ్య చరిత్ర ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో నిక్షిప్తం అవుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి పౌరుడికి ఆధార్ తరహాలోనే 14 అంకెల ఆభా ఐడీ కేటాయిస్తారు. ఆస్పత్రులు, వైద్యులు, వైద్య సిబ్బందికి ప్రత్యేక రిజిస్ట్రీలుంటాయి. వ్యక్తి వైద్యం కోసం ఏదైనా ఆస్పత్రికి వెళితే అక్కడ చేసిన వైద్యం, వైద్య పరీక్ష ఫలితాలు, తీసుకున్న మందులు వివరాలన్నీ ఆభా ఐడీ ద్వారా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తారు. దీంతో తర్వాతి రోజుల్లో వేరే వైద్యుడి వద్దకు వెళ్లినా ఆభా ఐడీ ద్వారా ఒక్క క్లిక్‌తో ఆ వ్యక్తి ఆరోగ్య చరిత్ర అంతా ప్రత్యక్షమవుతుంది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఈ విధానాన్ని ఇప్పటికే సీఎం జగన్ సర్కార్ అమలు చేస్తోంది. లబ్ధిదారులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ప్రతి రోగి చికిత్స వివరాలను ప్రత్యేక వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. స్మార్ట్ కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే గతంలో ఆ వ్యక్తి అందుకున్న వైద్య సేవల వివరాలన్నీ ప్రత్యక్షమయ్యేలా ఇప్పటికే చర్యలు తీసుకున్నారు.

విచారించాలి.. ఏపీకి రండి

- రామోజీరావు, శైలజా కిరణ్‌లకు సీఐడీ నోటీసులు
- జూలై 5న గుంటూరులో విచారణకు హాజరు కావాలని ఆదేశం
- ఎఫ్‌ఐఆర్‌ల వారీగా విచారణకు సన్నద్ధం
- మార్గదర్శి చిట్ ఫండ్స్ అక్రమాల కేసులో దూకుడు పెంచిన సీఐడీ

3లో





చురుగ్గా జరుగుతున్న బోధనాసుపత్రి భవన నిర్మాణ పనులు

శరవేగంగా ఏలూరు వైద్య కళాశాల నిర్మాణం

యుద్ధ ప్రాతిపదికన హాస్టల్ భవనాల ఏర్పాటు.. రూ.60 కోట్లతో నిర్మాణ పనులు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా వాసుల చిరకాల కోరిక నెరవేరబోతుంది.. దశాబ్దాల కలను సాకారం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎమ్మెల్యే ఆళ్లనాని సారథ్యంలో నగరంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభం కాబోతుంది. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇప్పటికే అనుమతులు ఇవ్వడంతోపాటు, త్వరలో 150 ఎంబీబీఎస్ సీట్లు భర్తీ కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ అకడమిక్ ఇయర్‌లో ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు జరుగుతుండగా, ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ దానిలో ఒకటి. ఒకవైపు సీట్లు భర్తీ ప్రక్రియ ప్రారంభమయ్యే రోజులు దగ్గరపడుతుండగా మరోవైపు మెడికల్ కాలేజీ భవనాలు, బోధనాసుపత్రి, హాస్టల్ భవనాల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి.

యుద్ధ ప్రాతిపదికన భవన నిర్మాణాలు

ఏలూరు జిల్లాకే ప్రతిష్టాత్మకంగా నగరంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇక భవనాల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. రాత్రింబవళ్లు పనులు చేస్తూ భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వ అధికారులు పనిచేస్తున్నారు. మరోవైపు కాంట్రాక్ట్ సంస్థ మేఘా ఇంజనీరింగ్ పనులను శరవేగంగా చేపడుతోంది. ఏలూరు జీజీహెచ్ ప్రాంగణం ముందు భాగంలో మెడికల్ కాలేజీ భవన నిర్మాణం చేపడుతున్నారు. సుమారు 2.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్ 4 భవన నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ భవన నిర్మాణానికి ప్రభుత్వం సుమారుగా రూ.75 కోట్లు వెచ్చిస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో మెడికల్ విద్యార్థులకు తరగతులు నిర్వహించేందుకు పాతబస్టాండ్ సమీపంలో డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్ 2 భవన నిర్మాణం పనులు చివరి దశలో ఉన్నాయి. భవనం నిర్మాణం పూర్తి కాగా తుది మెరుగులు దిద్దుకుంటోంది. జీజీహెచ్ ప్రాంగణంలోనే బాలురు, బాలికలకు వేర్వేరుగా తాత్కాలికంగా హాస్టల్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఎంసీహెచ్ బ్లాక్ భవనం పై అంతస్తు నిర్మాణం చేపట్టారు. దీనిలో హాస్టల్ సదుపాయాన్ని కల్పించేలా వేగంగా పనులు సాగుతున్నాయి. జీజీహెచ్ ప్రాంగణంలోనే కొత్తగా బోధనాసుపత్రిని నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

సదుపాయాల కల్పనకు కృషి

ఏలూరు నగరంలో నూతనంగా ప్రారంభం కాబోతున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుసంధానంగా బోధనాసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇప్పటికే బోధనాసుపత్రిని ఆధునీకీకరణ చేయడంతోపాటు, పూర్తిస్థాయిలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్యులు నియామకం చేపట్టారు. విద్యార్థులకు హాస్టల్ సదుపాయాన్ని కల్పించేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మరో రెండేళ్లలో పూర్తిస్థాయి సౌకర్యాలు, ఆధునిక వైద్యసేవలు, చికిత్సలు అందుబాటులోకి రానున్నాయి.

–డాక్టర్ కేవీవీ విజయకుమార్, బోధనాసుపత్రి సూపరింటెండెంట్, ఏలూరు

'శ్రీవాణి'పై ఆరోపణలు నమ్మవద్దు

టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి

శ్రీవాణి ట్రస్టు నిధుల వినియోగంపై ఎవరికైనా సందేహాలుంటే నేరుగా టీటీడీని సంప్రదించి వివరాలు పొందాలని టీటీడీ ఈవో ధర్మారెడ్డి కోరారు. నిరాధారమైన ఆరోపణలను నమ్మవద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు. శ్రీస్వరూపానందగిరిస్వామి, శ్రీవిరజానందస్వామి, శ్రీదుర్గాప్రసాదస్వామి మాట్లాడుతూ.. శ్రీవాణి ట్రస్ట్ వివరాలన్నీ పరిశీలించామన్నారు. నిధులు దుర్వినియోగమయ్యే అవకాశమే లేదని స్పష్టం చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేస్తే హిందూ ధర్మం పట్ల భక్తుల విశ్వాసం సన్నగిల్లే ప్రమాదం ఉందని హితవు పలికారు.

- వివరాలు 14లో

చిరుధాన్యాలకు 'మద్దతు'



- ఆర్బీకేల ద్వారా జొన్నలు, రాగులు, కందుల కొనుగోలుకు శ్రీకారం
- నేరుగా కల్లాల్లో కొనుగోలు చేయనున్న పౌరసరఫరాల సంస్థ
- గోనె సంచులు, హమాలీ, రవాణా చార్జీల భారం నుంచి రైతులకు ఉపశమనం
- ఈ–క్రాప్ డేటా ఆధారంగా పంటల కొనుగోళ్లు
- మద్దతు ధరకు కొన్నవి పీడీఎస్ ద్వారా పంపిణీ

14లో

ఈసారి దిగుబడులు ఆశాజనకం

ముందస్తు దిగుబడి అంచనాలు ప్రకటించిన వ్యవసాయ శాఖ



సాక్షి, అమరావతి: ఖరీఫ్–2023లో దిగుబడులు ఆశాజనకంగా ఉండబోతున్నాయని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈసారి మెరుగైన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. గత ఖరీఫ్‌లో 171.62 లక్షల టన్నుల దిగుబడులు అంచనా వేయగా, అకాల వర్షాలు, వైపరీత్యాల ప్రభావంతో మూడో ముందస్తు అంచనాల ప్రకారం 162.72 లక్షల టన్నుల దిగుబడులొచ్చాయి. ఈ ఏడాది ముందస్తు అంచనాల ప్రకారం రానున్న ఖరీఫ్–23లో 166.96 లక్షల టన్నుల దిగుబడులు వస్తాయని అంచనా వేశారు.

రికార్డుస్థాయిలో ఆహార ధాన్యాల ఉత్పత్తి

ప్రధానంగా ఆహార ధాన్యాల దిగుబడులు గత ఖరీఫ్‌లో 95.16 లక్షల టన్నుల దిగుబడులొస్తాయని అంచనా వేయగా, 83.36 లక్షల టన్నులొచ్చాయి. ఈ ఏడాది 95.83లక్షల టన్నులు వస్తాయని అంచనా. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతో గతేడాది ధాన్యం దిగుబడులు 74.81 లక్షల టన్నులు రాగా, ఈసారి 85.43 లక్షల టన్నులు వస్తాయని చెబుతున్నారు. ఈసారి చెరకు దిగుబడులు గణనీయంగా పెరుగుతాయని చెబుతున్నారు. గతేడాది 31.22 లక్షల టన్నుల దిగుబడులు రాగా, ఈసారి 51.04 లక్షల టన్నుల దిగుబడులు వస్తాయని అంచనా. అపరాలు గతేడాది 1.46 లక్షల టన్నుల దిగుబడులు రాగా, ఈ ఏడాది 2.05 లక్షల టన్నులొస్తాయని చెబుతున్నారు. వేరుశనగ 7.58 లక్షల టన్నుల దిగుబడులు వస్తాయని చెబుతున్నారు. మొక్కజొన్న గతేడాది 6.10లక్షల టన్నులు రాగా,ఈ ఏడాది 6.78 లక్షల టన్నులు వస్తుందని అంచనా.


గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మిశ్రా, ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శేషసాయితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


ఆత్మీయ విందులో పాల్గొన్న సీఎం జగన్, గవర్నర్, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు


ఆత్మీయ విందుకు హాజరైన న్యాయమూర్తులు, అధికారులు


జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్. చిత్రంలో సీఎం సతీమణి వైఎస్ భారతి, జస్టిస్ మిశ్రా సతీమణి సుచేత

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాకు ఘన సన్మానం

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా పనిచేసి పదోన్నతిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సన్మానించింది. ఆయన గౌరవార్థం గురువారం ఆత్మీయ విందును ఏర్పాటు చేసింది. విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఆయన సతీమణి సుచేత, గవర్నర్‌లను సీఎం వైఎస్ జగన్ పుష్పగుచ్ఛాలతో సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జస్టిస్ మిశ్రాను ముఖ్యమంత్రి శాలువాతో సత్కరించి, శ్రీ వేంకటేశ్వరస్వామి మెమెంటోను ఆయనకు బహూకరించారు. గవర్నర్ నజీర్, ఏసీజే జస్టిస్ శేషసాయిలు కూడా జస్టిస్ మిశ్రాను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఆ తర్వాత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, హోంమంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు, ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్ ఆర్ఎం బాషా, అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్, అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఎన్.హరినాథ్, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.జానకిరామిరెడ్డిలతో పాటు పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాకు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అధికారులను జస్టిస్ మిశ్రాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరిచయం చేశారు. ఐఏఎస్ అధికారి నాయక్, అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్‌లు ధరించిన బ్లేజర్ కాలర్ సరిగా మడత పడకపోవడంతో వాటిని ముఖ్యమంత్రి సరిచేయడం పలువురి దృష్టిని ఆకర్షించింది. ఘనసన్మానం అనంతరం న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆత్మీయ విందులో పాల్గొన్నారు. తర్వాత ఆయన హైకోర్టు న్యాయమూర్తుల వద్దకు వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, వారి సతీమణులు, రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.నాగిరెడ్డి, అదనపు పీపీ శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులు కాసా జగన్‌మోహన్‌రెడ్డి, చింతల సుమన్‌లతో పాటు పలువురు ప్రభుత్వ న్యాయవాదులు, పలువురు ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వసతి గృహాలు, అనాథ శరణాలయాలపై పర్యవేక్షణ పెంచాలి

ప్రభుత్వానికి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్ కుమార్ వినతి

సాక్షి, అమరావతి: ప్రైవేటు కాలేజీ హాస్టళ్లు, మతపరమైన సంస్థలకు చెందిన అనాథ శరణాలయాలపై పర్యవేక్షణ పెంచాలని కృష్ణా జిల్లా బాలల సంక్షేమ(చైల్డ్ వెల్ఫేర్) కమిటీ మాజీ చైర్మన్, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌ల రాష్ట్ర కో ఆర్డినేటర్ బీవీఎస్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విశాఖ ఆశ్రమంలో బాలికపై స్వామీజీ లైంగిక వేధింపుల నేపథ్యంలో ప్రైవేటు వసతి గృహాలపై పటిష్ట చర్యలు తీసుకోవాలంటూ ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏదైనా సంస్థ, వ్యక్తులు ఎవరైనా సరే బాలలను వసతి గృహాల్లో ఉంచాలంటే ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందాలని జాతీయ బాలల హక్కుల కమిషన్ (ఎన్‌సీఆర్‌పీ) కొన్నేళ్ల క్రితం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. పిల్లల సంరక్షణ, రక్షణ(జువైనల్ జస్టిస్) చట్టం–2015(సవరణ 2022) ప్రకారం అనాథ బాలలు, నిర్లక్ష్యానికి గురైన వారిని ఉంచే బాలల గృహాల(చైల్డ్ హోమ్)కు మాత్రమే ప్రభుత్వం లైసెన్స్ ఇస్తుందని, వాటిని జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, మహిళా శిశు సంక్షేమ శాఖలు పర్యవేక్షిస్తాయని తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా వసతి గృహాలు, అనాథ శరణాలయాల నిర్వహణ చట్టరీత్యా నేరమని, బాలల సంక్షేమం, సంరక్షణపై ఎన్‌సీఆర్‌పీ మార్గదర్శకాలను ప్రైవేటు సంస్థలు కూడా పాటించాలని కోరారు. రాష్ట్రంలో అన్ని అనాథాశ్రమాలు, ప్రైవేటు హాస్టళ్లను తనిఖీ చేసి అభాగ్యులైన పిల్లలను రక్షించేలా ప్రభుత్వం లైసెన్సింగ్ వ్యవస్థను రూపొందించాలని కుమార్ కోరారు.

ఎంపీ భార్య, కుమారుడి కిడ్నాప్ కేసులో ఐదుగురి అరెస్ట్

పీఎం పాలెం(భీమిలి)/ దొండపర్తి(విశాఖ దక్షిణ) : విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ భార్య, కుమారుడు, ఆడిటర్ జి.వెంకటేశ్వరరావు(జీవీ) కిడ్నాప్ కేసులో మరో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివారాలిలా ఉన్నాయి. కోలా వెంకటహేమంత్‌కుమార్, ఉలవల రాజేష్, బమ్మిడి రాజేష్ మరో ఐదుగురు ముఠాగా ఏర్పడి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ భార్య జ్యోతి, కుమారుడు శరత్, ఆడిటర్ జి.వెంకటేశ్వరరావులను ఈ నెల 15వ తేదీన కిడ్నాప్ చేశారు. బాధితులను భయభ్రాంతులకు గురిచేసి సుమారు రూ.1.75 కోట్లు వసూలు చేయడంతో పాటు బంగారు నగలు లాక్కున్నారు. నగర పోలీస్ కమిషనర్‌కి ఎంపీ ఘటనపై ఫోన్‌లో తెలియజేయగా పోలీసులు బృందాలుగా ఏర్పడి సినీ ఫక్కీలో కిడ్నాపర్లను వెంటాడి ఆటకట్టించారు. కిడ్నాపనకు గురైన ఎంపీ భార్య, కుమారుడు సురక్షితంగా బయటపడ్డారు. ప్రధాన నిందితుడైన కోలా వెంకటహేమంత్‌కుమార్, అతడికి సహకరించిన ఉలవల రాజేష్, న్యాయవాది బమ్మిడి రాజేష్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న యర్రోలు సాయి(19), బాడితబోయిన బాలాజీ(24)ను ఆనందపురం హైవే కూడలి వద్ద బుధవారం అరెస్ట్ చేశారు. దమ్ము ఆనంద బాబు (26)ను ఆదర్శనగర్ హైవే రోడ్డులో అదుపులోకి తీసుకున్నారు. వీరి ముగ్గురిదీ గాజువాక. వీరి నుంచి రూ.10 లక్షలు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వై.రామకృష్ణ తెలిపారు. మైనర్లను జువైనల్ హోమ్‌కు తరలించామన్నారు.

విశాఖ ఎంపీ ఎంవీవీకి భద్రత పెంపు

ఎంపీ ఎంవీవీకు భద్రత పెంచారు. ఎంపీ కుటుంబ సభ్యులతో పాటు ప్రముఖ ఆడిటర్ గన్నమనేని వెంకటేశ్వరరావు(జీవీ)కు కూడా భద్రత కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎంపీ ఎంవీవీ భార్య, కుమారుడితో పాటు ఆడిటర్ జీవీని హేమంత్‌కుమార్ గ్యాంగ్ కిడ్నాప్ చేసిన వ్యవహారం కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ కేసుల్లో పోలీసులు హేమంత్‌కుమార్, రాజేష్, సాయితో పాటు మరో ఐదుగురిని ఇప్పటికే అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో ఎంపీకి టూ ప్లస్ టూ, అతని కుటుంబ సభ్యులతో పాటు జీవీకి వన్ ప్లస్ వన్ భద్రతా సిబ్బందిని కేటాయించారు.

మరో 4 అడుగులు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. ఒక్క ఫోన్ కాల్ దూరంలో మీకు అందుబాటులో ఉంటామన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి' అని పారిశ్రామికవేత్తలకు సూచించారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, పరిశ్రమలశాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవెన్, వ్యవసాయం, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, పరిశ్రమలశాఖ జాయింట్ డైరెక్టర్ పద్మావతి, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సీఈవో ఎల్.శ్రీధర్ రెడ్డి, పలువురు పారిశ్రామిక వేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం జగన్ ఏమన్నారంటే..

12 నెలల్లో క్రిబ్‌కో ఇథనాల్ ప్లాంట్

నెల్లూరు జిల్లాలో క్రిబ్‌కో ఆధ్వర్యంలో దాదాపు రూ.610 కోట్ల పెట్టుబడితో ఇథనాల్ తయారీ ప్లాంట్ ఏర్పాటవుతోంది. 12 నెలలలోపే ఈ కర్మాగార నిర్మాణం పూర్తవుతుంది. రోజుకు 500 కిలోలీటర్ల ప్రొడక్షన్ కెపాసిటీతో ఇక్కడ బయో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటవుతోంది. రెండు దశల్లో పూర్తయ్యే ఈ ప్లాంట్ ద్వారా 1,000 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. నెల్లూరు జిల్లాలో స్థానికంగా ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. కృష్ణపట్నం వద్ద ఈ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చిన క్రిబ్‌కో యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నా.

ఏడాదిన్నరలో విశ్వసముద్ర బయో ఎనర్జీ ప్లాంట్

ఇదే నెల్లూరు జిల్లాలోనే విశ్వసముద్ర బయో ఎనర్జీ ప్లాంట్ కూడా వస్తోంది. రోజుకు 200 కిలోలీటర్ల కెపాసిటీతో నెలకొల్పుతున్న బయో ఇథనాల్ ప్లాంట్ వల్ల 500 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు దక్కుతాయి. రూ.315 కోట్లతో నెలకొల్పుతున్న ఈ ప్లాంట్ 18 నెలల్లో అందుబాటులోకి వస్తుంది. మన యువతకు ఈ ప్లాంట్ వల్ల ఉద్యోగ అవకాశాలు లభించనుండటం ఆనందదాయకం. ప్లాంట్ డైరెక్టర్ జితేంద్రతో పాటు యాజమాన్యానికి మనస్ఫూర్తిగా అభినందనలు.


క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, విశ్వసముద్ర బయో ఎనర్జీ, సీసీఎల్ ఫుడ్ అండ్ బెవరేజెస్ పరిశ్రమల ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కాంటినెంటల్ కాఫీ ఫ్యాక్టరీ

తిరుపతి జిల్లాలో కాంటినెంటల్ కాఫీ ఫ్యాక్టరీని స్థాపిస్తోంది. రూ.400 కోట్ల పెట్టుబడితో ఏటా 16 వేల టన్నుల కెపాసిటీతో ఈ ఫ్యాక్టరీని నెలకొల్పుతోంది. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 400 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ప్లాంట్ యాజమాన్యానికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నా.

9 నెలల్లోనే మొదలైన గోద్రెజ్ ఆగ్రోవెట్ యూనిట్

ఏలూరు జిల్లాలో గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ సంస్థ రూ.వంద కోట్ల పెట్టుబడి, 400 టన్నుల సామర్థ్యంతో వంట నూనె రిఫైనరీ ప్రాజెక్టును విస్తరిస్తోంది. ప్లాంట్ ఏర్పాటుకు మన దగ్గరకు వచ్చిన తర్వాత అనుమతి ఇచ్చిన 9 నెలల్లోనే యూనిట్ ప్రారంభోత్సవం చేసుకోవడం అభినందనీయం. ఇందుకు సహకరించిన ప్రతి అధికారికి అభినందనలు. ఈ యూనిట్ వల్ల ఏలూరు జిల్లా యువకులకు మరో 500 ఉద్యోగ అవకాశాలు లభించడం శుభపరిణామం. కంపెనీ యాజమాన్యానికి అభినందనలు.

సర్వేపల్లిలో 'క్రిబ్‌కో' గ్రీన్ ఎనర్జీ

నెల్లూరు జిల్లా సర్వేపల్లిలో క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ బయో ఇథనాల్ తయారీని చేపడుతోంది. ఉప ఉత్పత్తిగా ఏడాదికి 64 వేల టన్నుల కార్బన్ డయాక్సైడ్, 4 వేల టన్నుల డ్రైడ్ డిస్టిలరీ గ్రెయిన్స్ తయారవుతాయి.

బియ్యం, మొక్కజొన్నతో 'విశ్వసముద్ర బయో ఎనర్జీ'

నెల్లూరు జిల్లా సర్వేపల్లిలో విశ్వసముద్ర బయో ఎనర్జీ లిమిటెడ్ ఇథనాల్ తయారీ కర్మాగారాన్ని స్థాపిస్తోంది. విరిగిన బియ్యం, రంగు మారిన బియ్యం, పాడైపోయిన బియ్యం నుంచి రోజుకు 200 కిలోలీటర్ల బయో ఇథనాల్ తయారీ చేయనున్నారు.

వరి సాగు చేసే రైతులకు ఇది ఎంతో ఉపయోగకరం. మొక్కజొన్నను వినియోగించుకుని రోజుకు మరో 160 కిలోలీటర్ల డిస్టిలరీతోపాటు బై ప్రొడక్ట్‌గా డ్రైడ్ డిస్టిలరీస్ గ్రెయిన్స్ తయారు కానున్నాయి.

కాంటినెంటల్ ఇన్‌స్టెంట్ కాఫీ

తిరుపతి జిల్లా వరదాయిపాలెం కువ్వకొల్లి వద్ద కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ ఫుడ్ బెవరేజెస్ కంపెనీ ఏర్పాటు కానుంది. ఏటా 16 వేల టన్నుల సాల్యుబుల్ ఇన్‌స్టెంట్ కాఫీ ఈ ప్లాంట్‌లో తయారవుతుంది.

యూనిట్ విస్తరించిన 'గోద్రెజ్ ఆగ్రోవెట్'

ఏలూరు జిల్లా చింతలపూడిలో గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ కంపెనీ రోజుకు 400 టన్నుల వంట నూనె తయారీ సామర్థ్యంతో విస్తరించిన యూనిట్, 200 టన్నుల సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్షన్ యూనిట్‌ను ప్రారంభించింది.

నాలుగు చోట్ల క్రికెట్ అకాడమీలు


క్రీడా సంబరాలపై సమీక్షిస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో క్రికెట్ అకాడమీల ఏర్పాటు దిశగా వేగంగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌లో క్రికెట్ అభివృద్ధికి చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) ముందుకు వచ్చిందని పేర్కొంటూ కడప, తిరుపతి, మంగళగిరి, విశాఖపట్నంలో క్రికెట్ అకాడమీల ఏర్పాటు చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో క్రీడలు, యువజన సర్వీసుల శాఖపై సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. విశాఖలో అత్యాధునిక ప్రమాణాలతో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని నిర్మించాలని సీఎం జగన్ ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న వైఎస్సార్ స్టేడియాన్ని క్రీడలకు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. రాష్ట్రానికి చెందిన ప్రముఖ క్రీడాకారుల భాగస్వామ్యంతో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా సంబరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. యువతలో స్ఫూర్తిని నింపుతూ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు దోహదపడాలని సూచించారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు పౌష్టికాహారంతో పాటు వసతి సౌకర్యాల్లో ఎలాంటి లోటు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి క్రీడా సంబరాలను సమర్థంగా నిర్వహించాలన్నారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి జి.వాణీమోహన్, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎన్.గుల్జార్, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, శాప్ ఎండీ కె.హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

■ తెలంగాణ

ప్రాణం తీసిన సెల్ఫీ సరదా

వాగులో జారి పడి బీటెక్ విద్యార్థి మృతి

నడికూడ: సెల్ఫీ సరదా ఓ బీటెక్ విద్యార్థి ప్రాణం తీసింది. వాగు మాటు వద్ద సెల్ఫీ దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి అందులో పడి మృతిచెందాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామం వాగులో గురువారం చోటు చేసుకుంది. కాజీపేటకు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ (19) హసన్‌పర్తిలోని కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఉదయం కాలేజీ స్నేహితులు సయ్యద్ జాహెద్‌షా, అబ్దుల్ షాదాబ్‌తో కలిసి బైక్‌పై సరదాగా కంఠాత్మకూర్ వాగు వద్దకు వచ్చారు. ఇస్మాయిల్ వాగులోని ఓ మాటు (నీటిని నిల్వచేసేందుకు అడ్డంగా వేసిన కట్ట) వద్ద సెల్ఫీ దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి అందులో పడిపోయాడు. దూరంగా ఉన్న స్నేహితులు గట్టిగా అరవడంతో స్థానికంగా ఉన్న వారు వచ్చి కాపాడేందుకు ప్రయత్నించారు. అప్పటికే అతను మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న దామెర ఎస్సై రాజేందర్ సంఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు.

ఏపీలో అన్ని వర్గాల సమానాభివృద్ధి

సీఎం జగన్ మహిళా సాధికారికతకు, పేదరిక నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు

- విద్యారంగంపై భారీగా ఖర్చు చేస్తున్నారు
- మహిళల జీవనోపాధికి బాటలు వేశారు
- ఇలాంటి పథకాలు, కార్యక్రమాలు ఏ రాష్ట్రంలోనూ లేవు
- రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక మార్పులపై అధ్యయనం
- సీఎం జగన్‌తో స్కోచ్ గ్రూప్ చైర్మన్ సమీర్ కొచ్చర్ భేటీ

సాక్షి, అమరావతి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని వర్గాలు సమానంగా అభివృద్ధి చెందుతున్నాయని, సామాజిక, ఆర్థిక పరంగా మార్పులు కనిపిస్తున్నాయని, ఈ విధానాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలుచేయాల్సిన అవసరముందని స్కోచ్ గ్రూప్ చైర్మన్ సమీర్ కొచ్చర్ తెలిపారు. సీఎం సూచన మేరకు రాష్ట్రంలో సామాజికంగా, ఆర్థికంగా వచ్చిన మార్పులపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా మహిళా సాధికారికతకు వైఎస్ జగన్ అత్యధిక ప్రాధాన్యతనిచ్చారని, ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు, వరుసగా నాలుగేళ్లపాటు ఆర్థిక సాయం అందించడమే కాక వారిని చేయిపట్టుకుని నడిపిస్తూ పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చి వారి జీవనోపాధిని మెరుగుపరుస్తున్నారని సమీర్ కొచ్చర్ వివరించారు. సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఆయన సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 2005లో ఆంధ్రప్రదేశ్ వచ్చానని, అప్పుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా రాష్ట్రంలో సామాజికంగా, ఆర్థికంగా మార్పులను ఎలా తీసుకొచ్చారో అధ్యయనం చేసి డాక్యుమెంట్ రూపొందించానన్నారు. ఇప్పుడు ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో సామాజికంగా, ఆర్థికంగా చాలా మార్పులు కనిపిస్తున్నాయని తెలిపారు. మహిళా సాధికారికతలో భాగంగా మహిళల జీవనోపాధి మెరుగుపరచడమే కాక.. వారి ఆరోగ్యానికి భరోసా కల్పించారని చెప్పారు. విద్యా రంగంపై పెద్దఎత్తున వ్యయం చేస్తున్నారని, తరగతి గదులను డిజిటలైజ్ చేస్తున్నారని, మూడో తరగతి నుంచే ప్రపంచస్థాయి సిలబస్‌తో టోఫెల్ పరీక్షలు నిర్వహించనున్నారని సమీర్ తెలిపారు. అలాగే, వైద్య రంగంలోనూ చాలా మార్పులు తీసుకొచ్చారని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయి నుంచి పెద్దఎత్తున వ్యయంచేస్తున్నారని, ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలుచేస్తున్నారని ఆయన తెలిపారు. అంతేకాక.. వ్యవసాయ రంగంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన ఇన్‌పుట్స్‌ను అందిస్తున్నారని, దేశంలో తొలిసారిగా ఏపీలోనే ఇలాంటి కేంద్రాలున్నాయని, ఇతర రాష్ట్రాలు కూడా వీటిని అనుసరించాల్సిన అవసరముందని ఆయన కొనియాడారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్..

ఇక 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరిస్తుందని, సంపద అందరికీ సమానంగా అందితేనే సామాజికంగా ఆర్థికంగా మార్పులు వస్తాయని సమీర్ తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచన మేరకు రాష్ట్రంలో సామాజికంగా, ఆర్థికంగా వచ్చిన మార్పులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడానికి ఒక బృందాన్ని పంపించనున్నట్లు ఆయన తెలిపారు. సీఎంతో జరిగిన భేటీలో స్కోచ్ గ్రూప్ చైర్మన్ సమీర్ కొచ్చర్ తన 'ఇండియా 2047 హై ఇన్‌కమ్ విత్ ఈక్విటీ' పుస్తకాన్ని ముఖ్యమంత్రికి బహూకరించారు. సమీర్ కొచ్చర్‌ను సీఎం జగన్ సత్కరించారు. ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో స్కోచ్ గ్రూప్ వైస్ చైర్మన్ డాక్టర్ గురుశరణ్ ధంజల్, డైరెక్టర్ రోహణ్ కొచ్చర్ పాల్గొన్నారు.


సమీర్ కొచ్చర్‌కు వేంకటేశ్వర స్వామి జ్ఞాపికను అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఉత్పత్తిలో జెన్‌కో పరుగు

- రాష్ట్రంలో ఏటా 8 శాతం పెరుగుతున్న విద్యుత్ డిమాండ్
- ఈ ఏడాది మేలో గతేడాది కంటే 12% అధికంగా కరెంటు సరఫరా
- అంచనాలకు మించి 45.38 శాతం గ్రిడ్‌కు అందించిన జెన్ కో
- జూలైలో ఎన్‌టీటీపీఎస్ 800 మెగావాట్ల యూనిట్ వాణిజ్య ఉత్పత్తి
- ఉత్పత్తి పెంపుదలతో డిస్కంలపై తగ్గుతున్న ఆర్థిక భారం
- ఫలితంగా ట్రూ అప్ చార్జీల నుంచి వినియోగదారులకు ఉపశమనం


సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పాదక సంస్థ (ఏపీజెన్‌కో) రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. రాష్ట్రంలో ఏటా 8% విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. దానికి తగ్గట్టు అంచనాలకు మించి జెన్‌కో 45.38% విద్యుత్‌ను గ్రిడ్‌కు అందిస్తోంది. దీంతో డిస్కంలపై ఆర్థిక భారం తగ్గుతోంది. తత్ఫలితంగా ఇంధన సర్దుబాటు (ట్రూ అప్) చార్జీల నుంచి వినియోగదారులకు ఉపశమనం లభిస్తుంది.

పెరుగుతున్న సామర్థ్యం..

నాగార్జున సాగర్ కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రం 40 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది మార్చితో ముగిసిన 2022–23 ఆర్థిక సంవత్సరంలో 287.213 మిలియన్ యూనిట్ల అత్యధిక విద్యుత్ ఉత్పత్తి చేసింది. డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం (డాక్టర్ ఎన్‌టీటీపీఎస్)లో ఇటీవల 800 మెగావాట్ల 8వ యూనిట్‌లో ప్రయోగాత్మకంగా ఉత్పత్తి ప్రారంభించి, గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. ఇది పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఏపీ జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల సామర్థ్యం 5,810 మెగావాట్ల నుంచి 6,610 మెగావాట్లకు పెరగనుంది. మరోవైపు మాచ్‌ఖండ్‌లో ఒడిశా హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఓహెచ్‌పీసీ), ఏపీ జెన్‌కో సంయుక్తంగా మాచ్‌ఖండ్ ప్రాజెక్టు ఎగువ, దిగువ 98 మెగావాట్ల సామర్థ్యం గల మూడు జల విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఇతర చిన్న జల విద్యుత్ కేంద్రాల మాదిరి ఇది సీజన్‌లో పనిచేసేది కాదు. ఏడాది పొడవునా విద్యుత్ ఉత్పత్తి చేయనుంది. అప్పర్ సీలేరులో 1,350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ (పీఎస్పీ) నిర్మించాలని ఇప్పటికే కేంద్ర విద్యుత్ మండలి (సీఈఏ) నుంచి జెన్‌కో అనుమతి తీసుకుంది. దీని నిర్మాణానికి టెండరు డాక్యుమెంటును జ్యుడీషియల్ ప్రివ్యూ కమిటీ ఆమోదించింది. రూ.11,154 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలవనుంది.

సరికొత్త రికార్డులు..

రాష్ట్ర గ్రిడ్ విద్యుత్ డిమాండ్ గతేడాది మే నెలలో 5,947.39 మిలియన్ యూనిట్లు కాగా ఏపీ జెన్‌కో 1,989.37 మిలియన్ యూనిట్లు (33.45 శాతం) సమకూర్చింది. ఈ ఏడాది మే నెలలో రికార్డు స్థాయిలో రాష్ట్ర విద్యుత్ డిమాండు 6,430.72 మిలియన్ యూనిట్లకు పెరగ్గా ఏపీ జెన్‌కో 2,917.99 మిలియన్ యూనిట్ల (45.38 శాతం)ను రాష్ట్ర అవసరాల కోసం గ్రిడ్‌కు అందించింది. గతేడాది కంటే 989.37 మిలియన్ యూనిట్లు (12 శాతం) అధికంగా సరఫరా చేసింది. దీంతో విద్యుత్ పంపిణీ సంస్థలకు (డిస్కంలు) ప్రైవేటు ఉత్పత్తి సంస్థలు, ఇతర రాష్ట్రాల నుంచి అధిక ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సిన భారం నుంచి కొంతమేరకు ఉపశమనం లభిస్తోంది. దీనివల్ల విద్యుత్ వినియోగదారులపై సర్దుబాటు చార్జీల పెంపు భారం తప్పుతోంది.


డాక్టర్ ఎన్టీటీపీఎస్ లో వాణిజ్య ఉత్పత్తికి సిద్ధం అవుతున్న 800 మెగావాట్ల యూనిట్

ప్రభుత్వ సహకారం..



రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య రంగాల విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర విద్యుత్ డిమాండ్‌లో అత్యధిక భాగం ఏపీ జెన్‌కో ద్వారా సమకూర్చేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిర్దేశించారు. వారి మార్గదర్శకం మేరకు, ప్రభుత్వ సహకారంతో తక్షణమే 5 వేల మెగావాట్ల సామర్థ్యం గల పీఎస్పీ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాం. అదే విధంగా థర్మల్ కేంద్రాల సామర్థ్యాన్ని పెంచుతున్నాం. ఎన్‌టీటీపీఎస్‌లో 800 మెగావాట్ల యూనిట్ వాణిజ్య ఉత్పత్తి (సీఓడీ)కి జూలైలో శ్రీకారం చుట్టేందుకు సన్నాహాలు చేస్తున్నాం. దీంతో థర్మల్, హైడల్, సోలార్ కలిపి ఏపీ జెన్‌కో మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 8,789.026 మెగావాట్లకు చేరుతుంది.

– కేవీఎస్ చక్రధర్ బాబు, ఎండీ, ఏపీ జెన్‌కో

నేడే టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు

సాక్షి, అమరావతి: పదోతరగతి సప్లిమెంటరీ ఫలితాలను శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్‌లో పాఠశాలవిద్య కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్ విడుదల చేయనున్నారు. విద్యార్థులు www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫలితాలను తెలుసుకోవచ్చని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే స్కూల్ లాగ్ ఇన్‌లో సంబంధిత స్కూల్ మొత్తం ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తన మార్కుల జాబితాను డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కూడా కల్పించినట్లు తెలిపారు.

ఆలయాల్లో ప్రతి మూడు నెలలకు అంతర్గత బదిలీలు

ఆదేశాలు జారీ చేసిన దేవదాయ శాఖ కమిషనర్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని 6 (ఏ) గ్రేడ్ ఆలయాల్లో విధులు నిర్వహించే పైస్థాయి నుంచి కిందస్థాయి వరకు ఉన్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందిని ఇకపై ప్రతి మూడు నెలలకు ఒక సారి అంతర్గతంగా రొటేషన్ పద్ధతిపై బదిలీ చేయాలని దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ గురువారం సర్క్యులర్ జారీ చేశారు. రాష్ట్రంలో 6(ఏ) ఆలయాలుగా సింహాచలం, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ దుర్గగుడి, పెనుగంచిప్రోలు, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీశైలం, మహానంది, కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి వారి ఆలయాలు ఉన్నాయి. ఆయా ఆలయాల్లో విధులు నిర్వహించే ఏఈవోలు, సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లకు రొటేషన్ పద్ధతిలో ప్రతి మూడు నెలలకు ఒక సారి డ్యూటీలు మార్చాలని ఆదేశించారు. అంతే కాకుండా ఫోర్త్ క్లాస్ సిబ్బందితో పాటు కౌంటర్లలో పని చేసే సిబ్బంది, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిపై పని చేసే వారు, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి సైతం ఇదే విధానం అమలు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. గతంలో ఆయా ఆలయాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి ఏడాదికి ఒక దఫా అంతర్గతంగా బదిలీ చేయాలనే నిబంధన ఉండేది. తాజాగా దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఇచ్చిన ఆదేశాలతో ఇకపై ప్రతి మూడు నెలలకు ఒక సారి తప్పనిసరిగా అధికారులు, సిబ్బంది అందరినీ అంతర్గత బదిలీ చేయాల్సిందేనని స్పష్టమైంది. ఇక ఆయా ఆలయాల్లో విధులు నిర్వహించే ఇంజినీరింగ్, లీగల్ విభాగం, అకౌంట్ విభాగంలో పని చేసే సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు దేవస్థాన అవసరాలకు అనుగుణంగా మార్పులు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విచారించాలి.. ఏపీకి రండి

రామోజీరావు, శైలజా కిరణ్‌లకు సీఐడీ నోటీసులు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసు దర్యాప్తులో సీఐడీ మరో కీలక ముందడుగు వేసింది. ఈ కేసులో ఏ–1గా ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ చైర్మన్ చెరుకూరి రామోజీరావు, ఏ–2గా ఉన్న శైలజా కిరణ్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విచారించాలని దర్యాప్తు సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు జూలై 5వ తేదీన ఉదయం 10.30 గంటలకు గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని పేర్కొంటూ వారికి నోటీసులు జారీ చేసింది. రామోజీరావు, శైలజా కిరణ్‌తోపాటు గుంటూరు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచ్ మేనేజర్(ఫోర్‌మేన్) శివరామకృష్ణకు ఈ మేరకు సీఐడీ నోటీసులు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం, ఆర్బీఐ నిబంధనలను ఉల్లంఘిస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ సోదాల్లో ఆధారాలతో సహా బహిర్గతమైంది. దీంతో సీఐడీ అధికారులు రామోజీరావు, శైలజా కిరణ్‌లతోపాటు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్లపై కేసు నమోదు చేసి ఏడు ఎఫ్‌ఐఆర్‌లు రిజిస్టర్ చేసిన విషయం విదితమే. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటికే రామోజీరావును ఒకసారి విచారించగా శైలజా కిరణ్‌ను రెండుసార్లు హైదరాబాద్‌లోని వారి నివాసంలో సీఐడీ అధికారులు ప్రశ్నించారు. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు వారిద్దరిని గుంటూరులో విచారించాలని సీఐడీ నిర్ణయించింది.



న్యాయ సూత్రాల ప్రకారం..

రామోజీరావు, శైలజా కిరణ్, ఇతరులపై సీఐడీ నమోదు చేసిన ఏడు ఎఫ్‌ఐఆర్‌ల ప్రకారం మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆంధ్రప్రదేశ్‌లో నేరానికి పాల్పడింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చందాదారుల సొమ్మును చిట్‌ఫండ్స్ చట్టానికి విరుద్ధంగా మళ్లించింది. ఎఫ్‌ఐఆర్‌లు కూడా ఇక్కడే నమోదయ్యాయి. దీంతో న్యాయ సూత్రాల ప్రకారం ఈ కేసులో నిందితులను ఆంధ్రప్రదేశ్‌లోనే విచారించాల్సి ఉంది. రామోజీరావు, శైలజా కిరణ్‌ను హైదరాబాద్‌లో విచారించినప్పుడే సీఐడీ అధికారులు వారికి ఇదే విషయాన్ని తెలియచేశారు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు కోసం వారిద్దరినీ ఆంధ్రప్రదేశ్‌కు పిలిచి విచారిస్తామని సీఐడీ అధికారులు గతంలోనే మీడియాకు తెలిపారు. దేశంలో అన్ని కేసుల్లో దర్యాప్తు సంస్థలు ఇదే మాదిరిగా వ్యవహరిస్తున్నాయి.

హాజరు కావడం ఆనవాయితీ

నిందితులు దర్యాప్తు సంస్థ కార్యాలయానికి వచ్చి విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది. సీబీఐ, ఈడీ లాంటి అత్యున్నత దర్యాప్తు సంస్థలతో సహా దేశంలోని అన్ని రాష్ట్రాల పోలీసు, సీఐడీ విభాగాలు ఇదే రీతిలో నిందితులను విచారిస్తున్నాయి. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో నిందితులు రామోజీరావు, శైలజా కిరణ్ ప్రముఖులు కావడం, వారికి ఈనాడు పత్రిక, సొంత మీడియా ఉన్నందున ఇంటి వద్దకు వెళ్లి విచారించడం సరికాదని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సామాన్యులకు ఒక విధానం, మీడియా బలం ఉన్న వారికి మరో విధానమా? వారికి చట్టం నుంచి మినహాయింపులు ఉన్నాయా? అని ప్రశ్నిస్తున్నారు. కాగా గతంలో హైదరాబాద్‌లో శైలజా కిరణ్‌ను విచారించిన సందర్భంగా సీఐడీ అధికారులను తన నివాసంలోకి రానివ్వకుండా గంటల తరబడి రోడ్డుపైనే నిలబెట్టి అవమానకర రీతిలో వ్యవహరించినా సంయమనంతో వ్యవహరించిన విషయం తెలిసిందే. కాగా, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో నమోదు చేసిన ఏడు ఎఫ్‌ఐఆర్‌లకు సంబంధించి దశలవారీగా విచారించాలని సీఐడీ భావిస్తోంది. గుంటూరులోని అరండల్ పేట మార్గదర్శి చిట్ ఫండ్స్ బ్రాంచి కార్యాలయంలో ఆర్థిక అక్రమాలకు సంబంధించి జూలై 5న రామోజీరావు, శైలజా కిరణ్‌ను విచారించనున్నట్లు తెలుస్తోంది. అరండల్‌పేట బ్రాంచి కార్యాలయ మేనేజర్(ఫోర్‌మేన్)కు కూడా నోటీసులు జారీ చేశారు.

మూడేళ్లలో లక్ష మంది డ్రోన్ పైలట్లు కావాలి

కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో వ్యవసాయ రంగంతో పాటు వ్యవసాయేతర, పారిశ్రామిక రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో వచ్చే మూడేళ్లలో లక్ష మంది డ్రోన్ పైలట్ల అవసరం ఉంటుందని కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇటీవల వెల్లడించింది. డ్రోన్ టెక్నాలజీ దేశానికి ఆర్థికంగా, వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని కేంద్ర ప్రభుత్వం గుర్తించడంతో పాటు డ్రోన్స్ వినియోగ నిబంధనలను సరళీకృతం చేసినట్లు ఆ శాఖ పేర్కొంది. డ్రోన్స్ డిమాండ్‌కు తగినట్లు నైపుణ్య శిక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే 48 డ్రోన్ శిక్షణ పాఠశాలలకు అనుమతి ఇచ్చామని తెలిపింది. ఇంకా ఈ పాఠశాలల అనుమతికోసం పలు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయంది.

116 ఐటీఐల్లో స్వల్పకాలిక కోర్సులు

డ్రోన్స్ రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులను పెంచేందుకు ఆంధ్రప్రదేశ్‌తో సహా 12 రాష్ట్రాల్లో 116 ఐటీఐల్లో స్వల్పకాలిక కోర్సుల నిర్వహణకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ ఇప్పటికే అనుమతించింది. ఈ ఐటీఐలు డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్, డ్రోన్ మాన్యుఫ్యాక్చరింగ్‌తో సహా ఆరు స్వల్పకాలిక నైపుణ్య కోర్సులను నిర్వహించడానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రెనింగ్ అనుమతించింది.

వ్యవసాయరంగంలో ప్రోత్సాహం

ఖర్చును తగ్గించి రైతుల ఆదాయాన్ని పెంచడానికి వ్యవసాయ రంగంలో డ్రోన్‌ల వినియోగాన్ని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా డ్రోన్స్ వినియోగాన్ని పెంచేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టింది. వ్యవసాయరంగంలో గ్రామాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేలా స్థానిక యువతకు డ్రోన్స్ వినియోగంలో అవసరమైన నైపుణ్య శిక్షణ ఇప్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఐటీఐల్లో డ్రోన్స్‌పై నైపుణ్య శిక్షణ కోర్సులు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరగా రాష్ట్రంలో 10 ఐటీఐల్లో డ్రోన్స్ రంగంలో స్వల్పకాలిక నైపుణ్య శిక్షణకు అనుమతి మంజూరు చేసింది. మరో పక్క కిసాన్ డ్రోన్స్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రైతులకు వ్యక్తిగతంగాను లేదా ఎఫ్‌పీవోకు బ్యాంకులు అవసరమైన రుణాలను మంజూరు చేయాల్సిందిగా నాబార్డు సూచించింది. పది లీటర్ల సామర్థ్యం గల కిసాన్ డ్రోన్ యూనిట్ వ్యయం ఆరు నుంచి ఏడు లక్షల రూపాయలుగా ఖరారు చేసినట్లు నాబార్డు పేర్కొంది. ఆ మేరకు రైతులకు రుణాలను మంజూరు చేయాల్సిందిగా బ్యాంకులకు నాబార్డు సూచించింది.

డ్రోన్ల తయారీకి ప్రోత్సాహం

డ్రోన్స్ ప్రాముఖ్యత నేపథ్యంలో దేశంలోనే వాటి తయారీ, విడి భాగాలు తయారీని ప్రోత్సహించడానికి మూడేళ్లలో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కింద రూ. 120 కోట్లు అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ పేర్కొంది. డ్రోన్లు, విడిభాగాలు తయారీలో దేశం స్వయం సమృద్ధిని సాధించడంతో పాటు ప్రపంచంతో పోటీ పడేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది.

చిన్నారిపై చిరుత దాడి

▶ మొదటి పేజీ తరువాయి

అకస్మాత్తుగా చిరుతపులి చిన్నారిపై దాడిచేసింది. అతడి మెడను నోటకరుచుకుని అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లింది. వెంటనే స్పందించిన అక్కడి దుకాణదారుడు, తల్లిదండ్రులు, భద్రతా సిబ్బంది కేకలు పెడుతూ చిరుత వెనుక పరుగులు తీశారు. టార్చ్‌లు వేస్తూ, రాళ్లు విసరడంతో చిరుత అటవీ ప్రాంతంలోని పోలీస్‌పోస్టు వద్ద బాలుడిని వదలిపెట్టి అడవిలోకి వెళ్లిపోయింది. అక్కడున్న తిరుమల వన్‌టౌన్ సీఐ జగన్మోహన్‌రెడ్డి, ఎస్ఐ రమేశ్‌బాబు తమ సిబ్బందితో బాలుడికి అంబులెన్స్‌లో ప్రథమచికిత్స చేయించారు. బాలుడి చెవి వెనుక, మరికొన్ని ప్రాంతాల్లో చిరుత దంతపు గాయాలయ్యాయి. అతడికి ప్రాణప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి, అటవీశాఖ డీఎస్వో శ్రీనివాసులు అక్కడికి చేరుకుని చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం చిన్నారిని మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రికి తరలించారు.



బాలుడిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

పర్చూరు టీడీపీలో రచ్చకెక్కిన విభేదాలు

- పర్చూరు నియోజకవర్గంలో పచ్చ రచ్చ
- టీడీపీ ఫ్లెక్సీలు చింపుకున్న కార్యకర్తలు
- ఎమ్మెల్యే ఏలూరు తీరుకు నిరసనగా పదవికి రాజీనామా చేసిన అక్కయ్య చౌదరి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ టీడీపీలో విభేదాలు రచ్చకెక్కాయి. కారంచేడు మండల టీడీపీ నేతల మధ్య వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. గురువారం నిర్వహించిన భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం దీనికి వేదికైంది. టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఓ వర్గానికి కొమ్ముకాయడంతో రెండో వర్గం నేతలు ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహంతో గురువారం రోడ్డెక్కారు. ఎమ్మెల్యేపై తిట్ల దండకం అందుకున్నారు. స్థానిక నేత అక్క య్య చౌదరికి మద్దతుగా నిలిచిన కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే ఫ్లెక్సీలను ధ్వంసం చేశా రు. గంటకు పైగా కారంచేడులో టీడీపీ నేతల వీరంగం కొనసాగింది. మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ అనూరాధతోపాటు పలువురు టీడీపీ ముఖ్యనేతల సమక్షంలోనే విభేదాలు రచ్చకెక్కడం గమనార్హం.

నేపథ్యమిదీ

భవిష్యత్‌కు గ్యారెంటీ పేరిట టీడీపీ చేపట్టిన కార్యక్రమం గురువారం కారంచేడు చేరింది. తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ అక్కయ్యచౌదరి టీడీపీ కార్యాలయంలోకి వచ్చి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించి పార్టీ జెండా ఎగురవేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును కోరారు. ఎమ్మెల్యే అందుకు అంగీకరించకపోవడంతో రావాల్సిందేనని అక్కయ్యచౌదరి పట్టుబట్టాడు. బస్సులోంచి దిగిన ఎమ్మెల్యే కార్యాలయం బయటే నిలబడి కార్యకర్త ఇచ్చిన జెండా నిలబెట్టి వెళ్లిపోయారు. దీంతో ఆగ్రహించిన అక్కయ్యచౌదరి వర్గం ఎమ్మెల్యే ఎగురవేసిన టీడీపీ జెండాను అక్కడికక్కడే పీకేశారు. పార్టీ కార్యాలయం పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే ఫ్లెక్సీలను సైతం ధ్వంసం చేశారు. ఎమ్మెల్యే డౌన్‌డౌన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. 'పార్టీ వద్దు.. బొక్కా వద్దు' అంటూ చిందులు తొక్కారు.



చింపేసిన ఎమ్మెల్యే బ్యానర్లు

పార్టీ పదవికి రాజీనామా

ఈ ఉదంతంతో పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు అక్కయ్యచౌదరి ప్రకటించారు. పార్టీ అధికారంలో ఉన్నా.. లేకున్నా పార్టీని అనునిత్యం కాపాడుకుంటూ ఆర్థికంగా ఎంతో నష్టపోయానన్నారు. ఇంత కష్టపడినా ఎమ్మెల్యే వద్ద తనకు కనీస గౌరవం దక్కడం లేదన్నారు. తన వ్యతిరేకులను ప్రోత్సహిస్తూ పార్టీని పాడు చేస్తున్నాడని వాపోయారు. ఈ విషయంపై అధిష్టానంతోనే తేల్చుకుంటానని తెగేసి చెప్పారు. కారంచేడుకు చెందిన సీనియర్ నేత అక్కయ్యచౌదరి అదే పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మండలంలో బలమైన నాయకుడైన ఆయన గతంలో కారంచేడు ఎంపీపీ, పర్చూరు మార్కెట్ కమిటీ చైర్మన్ వంటి పదవులు చేపట్టారు. ప్రస్తుతం కారంచేడు–2 ఎంపీటీసీగా ఉన్నారు. కాగా, అక్కయ్యచౌదరికి వ్యతిరేకంగా ఇదే మండలానికి చెందిన పార్టీ మాజీ అధ్యక్షుడు జాగర్లమూడి ప్రహ్లాదరావు ప్రత్యేకంగా గ్రూపు కట్టా రు. అక్కయ్య చౌదరి వ్యతిరేక వర్గీయులను చేరదీశారు. దీంతో కొంతకాలంగా ఇద్దరి మధ్య విభేదా లు తారస్థాయికి చేరగా.. తాజాగా రోడ్డునపడ్డాయి.

తొలకరితో పులకరింత..

ఎండలు, వడగాడ్పుల ధాటికి విలవిల్లాడిన సర్వప్రాణులకు చిరుజల్లులు సాంత్వన కలిగించాయి. తొలకరి పులకరింపజేసింది. ఆహ్లాదకర వాతావరణంలో మనుషులు సేద తీరటమేకాదు.. పక్షులు కూడా చల్లగా విహరిస్తున్నాయి. గూళ్లలో బిక్కుబిక్కుమంటూ గడిపిన పిచ్చుకలు పిల్లలతో సహా బయటకొచ్చాయి. గింజలు తింటూ.. తమ పిల్లలకు తినిపిస్తూ.. నీరు తాగుతూ.. చూపరులను కట్టిపడేశాయి. ప్రకాశం బ్యారేజి సమీపంలో.. గుంటూరు జిల్లా సీతానగరం వద్ద గురువారం సాయంత్రం ఈ అందమైన దృశ్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.







– పవన్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పోలవరం కుడి కాలువ మట్టి తవ్వకాలపై పూర్తి వివరాలివ్వండి

- జల వనరుల శాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం
- కోర్టు ముందు హాజరైన ముఖ్య కార్యదర్శి, ఈఎన్‌సీ

సాక్షి, అమరావతి : కృష్ణా జిల్లా గన్నవరం, విజయవాడ గ్రామీణ ఆగిరపల్లి మండలాల పరిధిలో పోలవరం కుడి కాలువ రక్షణ గట్టు నుంచి గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలపై పూర్తి వివరాలను తమ ముందుంచాలని జల వనరుల శాఖ అధికారులను హైకోర్టు ఆదేశించింది. మట్టి తవ్వకాలకు తామే అనుమతినిచ్చామని అధికారుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ చెప్పిన నేపథ్యంలో.. ఎంత విస్తీర్ణంలో తవ్వకాలకు అనుమతినిచ్చారు? ఎంత తవ్వారు? ఇంకా ఎంత తవ్వాల్సి ఉంది తదితర వివరాలను కౌంటర్ రూపంలో ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. మట్టిని రవాణా చేస్తున్న వాహనాల నంబర్లను అధికారులకు ఇవ్వాలని పిటిషనర్‌కు సూచించింది. తద్వారా మట్టి రవాణా అక్రమమా సక్రమమా అన్నది తేలుతుందని తెలిపింది. తదు పరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. అక్రమ తవ్వకాలపై గతంలో ఇచ్చిన స్టే ఉత్తర్వులను పొడిగించింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

పోలవరం కాలువ గట్టును అక్రమంగా తవ్వేస్తూ గ్రావెల్, మట్టి తరలిస్తున్నారని, దీని వల్ల కాలువ తీవ్రంగా దెబ్బతింటోందని గన్నవరం మండలం కేసరపల్లికి చెందిన పిల్లి సురేంద్రబాబు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సీజే ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. తక్షణమే అక్రమ తవ్వకాలను నిరోధించాలని జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి, ఇంజనీర్ ఇన్ చీఫ్‌లను ఆదేశించింది. ఈ ఆదేశాలు అమలు కాకపోవడంతో అధికారులపై సురేంద్రబాబు కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం.. తమ ఆదేశాలు అమలు కాకపోవడంపై వివరణ ఇవ్వాలని జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ నారాయణరెడ్డిలను ఆదేశించింది. గురువారం వారిద్దరూ కోర్టు ముందు హాజరయ్యా రు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది చింతల సుమన్ స్పందిస్తూ.. పోలవరం కుడి కాలువ తవ్వకాలకు సంబంధించి 45 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని రాయల్టీ చెల్లించి తీసుకెళ్లేందుకు అనుమతి నిచ్చామని తెలిపారు. తామే అను మతిచ్చినందున అక్రమ తవ్వకాలన్న ప్రశ్నే తలెత్త దన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది పాలేటి మహేశ్వర రావు వాదనలు వినిపిస్తూ.. ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలు అమలు కావడం లేదని, యథేచ్ఛగా గట్టు నుంచి గ్రావెల్, మట్టిని తరలిస్తూనే ఉన్నారని తెలిపారు. 2 కోట్ల క్యూ బిక్ మీటర్ల మేర మట్టి తవ్వకాలు చేపట్టారన్నారు. వాదనలు విన్న ధర్మా సనం.. మట్టి తవ్వకాలపై పూర్తి వివరాలు తమ ముందుంచాలని అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణ నుంచి శశిభూషణ్ కుమార్, నారాయణరెడ్డిలకు మినహాయింపునిచ్చింది.

'ఆడుదాం ఆంధ్రా' అంచనాలు సిద్ధం

- భారీ క్రీడా సంబరానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
- అక్టోబర్ 2వ తేదీ నుంచి పోటీలు ప్రారంభం
- కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్‌లో పోటీలు
- గ్రామ/వార్డు సచివాలయాల స్థాయి నుంచి పోటీలు
- అంచనాలు సిద్ధం చేసిన ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే భారీ క్రీడా సంబరం 'ఆడుదాం ఆంధ్రా' పోటీలకు ఎన్టీఆర్ జిల్లాలో అంచనాలు పూర్తయ్యాయి. జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల స్థాయి నుంచి నిర్వహించే ఈ పోటీలకు సంబంధించిన అంచనాలను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు ఇటీవలే పూర్తి చేశారు. ఈ పోటీల నిర్వహణలో కలెక్టర్ నుంచి క్రీడా శాఖ అధికారులు పూర్తి బాధ్యత వహించనున్నారు. అక్టోబర్ రెండో తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ పోటీలు 46 రోజులపాటు కొనసాగుతాయి.

ఐదు క్రీడాంశాల్లో పోటీలు

రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఆదేశాల మేరకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ (డబుల్స్) క్రీడాంశాల్లో ఈ పోటీలను నిర్వహించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 17 ఏళ్ల దాటి మహిళలు, పురుషులు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించొచ్చు. పోటీలన్నీ నాకవుట్ పద్ధతిలోనే జరుగుతాయి.

క్షేత్ర స్థాయి నుంచే పోటీలు

క్షేత్ర స్థాయి నుంచి క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తోంది. దీనిలో భాగంగానే గ్రామ/వార్డు సచివాలయాల స్థాయి నుంచే ఈ పోటీలు జరుగుతాయి. అక్టోబర్ రెండో తేదీ నుంచి ఎన్టీఆర్ జిల్లాలోని 605 గ్రామ వార్డు సచివాలయాల్లో ఆయా సచివాలయాల జట్లు ఈ పోటీలను ప్రాతినిధ్యం వహిస్తాయి. సచివాలయం పేరు మీదనే జట్టు పోటీల్లో పాల్గొంటుంది. సచివాలయాల స్థాయిలో ఏడు రోజుల పాటు పోటీలు జరుగుతాయి. సచివాలయాల్లో మొదటి స్థానంలో నిలిచిన జట్లు మండల స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. జిల్లాలోని 20 మండల కేంద్రాల్లో 16 రోజుల పాటు ఈ స్థాయి పోటీలు జరుగుతాయి. ఈ స్థాయిలో మొదటి స్థానం సాధించిన జట్లు తొమ్మిది రోజుల పాటు జరిగే నియోజకవర్గ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ప్రథమ స్థానం సాధించిన జట్లు తొమ్మిది రోజుల పాటు విజయవాడలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటాయి. జిల్లా స్థాయి ప్రథమ స్థానం సాధించిన జట్లు విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఈ పోటీలకు సంబంధించి జిల్లాలోని అన్ని సచివాలయాలు, మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లోని క్రీడా స్థలాలను అధికారులు గుర్తించారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా తిరువూరు నియోజకవర్గాన్ని క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు ఎంచుకున్నారు.

ప్రత్యేక కమిటీలు:

గ్రామ/వార్డు సచివాలయాలు, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీలు జిల్లా కలెక్టర్, క్రీడా ప్రాధికార సంస్థ, యువజన సర్వీసుల శాఖ అధికారుల పర్యవేక్షణలో జరుగుతోంది. ఈ పోటీల నిర్వహణకు ప్రత్యేక కమిటీలను అధికారులు ఏర్పాటు చేశారు. సచివాలయాల స్థాయి, మండల స్థాయి పోటీలకు ఆయా మండలాల తహసీల్దార్, ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, ఎంఈఓ, పంచాయతీరాజ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాధ్యత వహిస్తారు. నియోజకవర్గ స్థాయి పోటీలకు తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, యువజన సర్వీసుల శాఖ జిల్లా సీఈఓ, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి బాధ్యులుగా ఉంటారు. జిల్లా స్థాయి పోటీలకు డీఈఓ, డీఆర్‌డీఏ పీడీ, జెడ్పీ సీఈఓ బాధ్యత వహిస్తారు.

భారీగా బహుమతులు

మండల స్థాయి క్రికెట్ పోటీల్లో క్రీడా నైపుణ్యం చాటిన తొమ్మిది(ఏడు పురుషుల, రెండు మహిళల) జట్లకు ఒక్కో జట్టుకు రూ.10 వేల ఖరీదు చేసే క్రికెట్ కిట్ అందిస్తారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన జట్టుకు రూ.20 వేల ఖరీదు చేసే కిట్ అందిస్తారు. బ్యాడ్మింటన్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులకు రాకెట్‌లు అందిస్తారు. సచివాలయాల స్థాయిలో విజేత జట్లకు ప్రత్యేక బహుమతులు, నియోజకవర్గ స్థాయిలో విన్నర్స్‌కు రూ.20 వేలు, రన్నర్స్‌కు రూ.10 వేలు, జిల్లా స్థాయిలో విన్నర్స్‌కు రూ.లక్ష, రన్నర్స్‌కు రూ.50 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్లకు రూ.30 వేలు, రాష్ట్ర స్థాయి పోటీల్లో విన్నర్స్‌కు రూ.5 లక్షలు, రన్నర్స్‌కు రూ.3 లక్షలు, మూడో స్థానం సాధించిన జట్టుకు రూ.2 లక్షల నగదు బహుమతితో పాటు ట్రోఫీలు, సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తారు.

అంచనాలు సిద్ధం చేశాం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ పోటీలకు శాప్ అధికారుల ఆదేశాలతో జిల్లాలో అంచనాలు సిద్ధం చేశాం. పైలెట్ ప్రాజెక్ట్‌గా తిరువూరు నియోజకవర్గాన్ని ఎంపిక చేశాం. ఈ నివేదికను ఇటీవలే జిల్లా ఉన్నతాధికారులకు అందజేశాం. ఈ పోటీలు 46 రోజుల పాటు ఉత్సాహంగా జరుతాయి. జిల్లాలోని కోచ్‌లు, పీడీలు, జిల్లా ఉన్నతాధికారులు, పలు శాఖల అధికారుల పర్యవేక్షణలో ఈ పోటీలను నిర్వహిస్తాం. – ఎస్‌ఏ అజీజ్, చీఫ్ కోచ్, ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ

గురుకులాల్లో ఉత్తీర్ణత పెంచండి

- మంత్రి మేరుగు నాగార్జున

సాక్షి, అమరావతి: బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 9, 10వ తరగతుల విద్యార్థులకు ట్యూటర్స్‌ను నియమించి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రణాళిక చేపట్టాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అధికారులను ఆదేశించారు. అన్ని వసతి గృహాల్లో నూతన మెనూను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. హాస్టళ్ల నిర్వహణ, విద్యార్థుల అడ్మిషన్స్, ట్యూటర్స్ నియామకాలు, స్టడీ సర్కిల్స్ నిర్వహణ, ఎస్సీ కంపోనెంట్ తదితర అంశాలపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి నాగార్జున గురువారం సమీక్షించారు. వసతి గృహాల్లో ఖాళీ లను జూలై 15 లోపు భర్తీ చేయాలన్నారు. విద్యార్థులకు అన్ని సదుపాయాలను(ట్రంకు బాక్సులు, ప్లేట్స్, గ్లాసులు, దుప్పట్లు, జగనన్న విద్యా కానుక కిట్లు) సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జగనన్న విదేశీ విద్యా దీవెన కింద నమోదు చేసుకున్న విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో 2022–23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో రాష్ట్ర పరిధిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించాలని సూచించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు విజయ కృష్ణన్ పాల్గొన్నారు.

తెలంగాణ

సీట్ల బ్లాకింగ్‌లో రూ. కోట్ల లావాదేవీలు

ఈడీ సోదాల్లో వెలుగులోకి మెడికల్ కాలేజీల దందా

సాక్షి, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రైవేటు మెడికల్ కాలేజీలు రూ.లక్షల విలువ చేసే పీజీ సీట్లను రూ.కోట్లకు అమ్ముకున్నట్లు.. ఈ కళాశాలల్లో రూ.వందల కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు ఈడీ గుర్తించింది. మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో భారీ మొత్తంలో నగదును సీజ్ చేసినట్లు ఈడీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. బుధవారం నాటి సోదాల సందర్భంగా మల్లారెడ్డి మెడికల్ కాలేజీ కార్యాలయాల నుంచి రూ.1.4 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నామని, ఆ కాలేజీ బ్యాంకు ఖాతాలో మరో రూ.2.89 కోట్ల నగదును స్తంభింపజేశామని తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా 16 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో బుధవారం జరిపిన సోదాల్లో పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలకు సంబంధించిన కీలక పత్రాలు, హార్డ్‌డిస్క్‌లు, ఇతర రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది.

అనంత కరుణామయుడు (అల్లాహ్)!
ఆయనే మానవుణ్ణి సృష్టించాడు.
ఆయనే అతనికి మాట్లాడటం నేర్పాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 23 జూన్ 2023

ప్రతిపక్షాల ఆశల పందిరి

కొన్ని సమావేశాలకు ఎక్కడ లేని ప్రత్యేకతా ఉంటుంది. సమయం, సందర్భం, చేపట్టిన అంశం, హాజరయ్యే ప్రతినిధులు – ఇలా అందుకు ఏదైనా కారణం కావచ్చు. మరి, కీలకమైన అవన్నీ కలగలిసిన సమావేశమంటే దానికుండే ప్రాధాన్యం చెప్పనక్కర లేదు. జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ)కి చెందని ప్రతిపక్షాలన్నీ ఈ శుక్రవారం పాట్నాలో జరుపుతున్న సమావేశం సరిగ్గా అలాంటిదే. వచ్చే 2024 లోక్‌సభ ఎన్నికల్లో నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీని కలసికట్టుగా ఎదుర్కొనేందుకు వీలుగా ఉమ్మడి ప్రణాళికను మథించేందుకు ప్రతిపక్ష నేతలు ఒక దగ్గరకు వస్తున్నారు. ఆలోచన మంచిదే. పాలక పక్షాన్ని ఎదుర్కొనేందుకు ఇది మంచి ప్రయత్నమే. అయితే, ఆచరణలో ప్రతిపక్ష ఐక్యత ఓ ఊహకందని పజిల్ కూడా కావడంతో పాట్నా భేటీ ఆసక్తి రేపుతోంది. ఎన్నికల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యం గనక, ఢిల్లీ గద్దెపై ఎవరి ఆశలు వారికున్న బడా నేతల మధ్య ఐక్యత ఏ మేరకు ఫలిస్తుంది, నిలుస్తుందనే సందేహాలనూ కలిగిస్తోంది.

ఆ మధ్య కొద్దికాలం క్రితమే బీజేపీ వ్యతిరేకిగా అవతారమెత్తిన బిహార్ సీఎం నితీశ్ కుమార్ కాషాయ పార్టీకి వ్యతిరేకంగా అన్ని పక్షాలనూ ఏకం చేయాలని తపిస్తున్నారు. కొన్నాళ్ళుగా వివిధ పార్టీల అగ్రనేతల్ని కలుస్తూ, కూటమి కట్టడానికి సమాలోచనలు చేస్తున్నారు. అందులో భాగమే పాట్నాలో ఈ మెగా భేటీ. దాదాపు 20 కీలక ప్రతిపక్షాలకు చెందిన నేతలను సాదరంగా స్వాగతించి, ఆతిథ్యమిచ్చేందుకు సిద్ధమవుతున్నారు. నిత్యం కీచులాడుకొంటూ, ఒకరిపై మరొకరు పై చేయి సాధించేందుకు ప్రయత్నించే ప్రతిపక్షాల మధ్య ఇది ఓ అపురూప దృశ్యం. ఉమ్మడి కార్యక్రమం, పార్లమెంట్ లోపల – బయట ఉమ్మడి అజెండా, క్షేత్రస్థాయి వ్యూహం లాంటివన్నీ ఈ భేటీ అజెండాలో భాగం. అలా ఇది ప్రతిపక్షాల నైతిక స్థైర్యాన్ని పెంచనుంది. వచ్చే ఎన్నికలు భీకరపోరు కానున్నాయనే సంకేతం ఇవ్వనుంది. కాషాయ పార్టీకి కంటి మీద కునుకు కరవయ్యేలా చేయనుంది.

ప్రతిపక్షాల ఐక్యతా అజెండాలో అనేకం ఉన్నప్పటికీ, అవి అత్యవసరంగా పరిష్కరించుకోవాల్సిన సమస్యలూ అనేకం. ముందుగా ఆ పార్టీలు తమ మధ్యనున్న విభేదాలను రూపుమాపుకోవాల్సి ఉంది. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సారథి క్రేజీవాల్ లాంటివారు సుప్రీమ్ కోర్ట్ తీర్పును సైతం పక్కన పెట్టేలా కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌పై పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఐక్యతా పోరాటాన్ని ఆశిస్తున్నారు. కానీ, ఆర్డినెన్స్‌పై ఆప్‌ను సమర్థించే విషయంలో కాంగ్రెస్ సందిగ్ధంలో ఉండడం అర్థం చేసుకోదగినదే. ఢిల్లీ, పంజాబ్‌లలో 'ఆప్'కు కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థి. త్వరలో ఎన్నికలు జరగనున్న కాంగ్రెస్ పాలిత రాజస్థాన్‌లో సైతం చొచ్చుకుపోవాలని 'ఆప్' కత్తులు నూరుతోంది. రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లోత్ తమ పార్టీ సామాజిక న్యాయ అజెండానే కాపీ కొట్టారంటూ కేజ్రీవాల్ ఆరోపణలూ చేశారు.

మరి, పరస్పర విరుద్ధ ప్రయోజనాలున్న ఈ పార్టీలు ఎలా కలుస్తాయి? రెండు కత్తులు ఒకే ఒరలో ఎలా ఇముడుతాయి? యూపీలో సమాజ్‌వాది పార్టీకి కాంగ్రెస్, బీఎస్పీలతో; బెంగాల్‌లో తృణమూల్‌కు కాంగ్రెస్, వామపక్షాలతో; ఇంకా అనేక రాష్ట్రాల్లో ఇలాంటి ఉప్పూ నిప్పూ పరిస్థితులే ఉన్నాయి. వాటిని అవి ఎలా సర్దుబాటు చేసుకుంటాయో చూడాలి. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కడికక్కడ బీజేపీపై ఒకే బలమైన ప్రతిపక్ష అభ్యర్థిని నిలబెట్టడం చెప్పినంత సులభం కాదు. ఎన్నికల తర్వాత కన్నా ఎన్నికల ముందే ఐక్యతా రాగాలాపనకు పార్టీలకు ఇలాంటి సమస్యలెన్నో! అందుకే, ఐక్య ప్రతిపక్షం ఆలోచన మంచిదైనా, సరైన అజెండా, ఆచరణాత్మక ప్రణాళిక, అన్నిటికన్నా ముఖ్యంగా అన్ని పక్షాలకూ ఆమోదయోగ్యుడైన ఉమ్మడి నేత లేకపోతే కష్టం.

ప్రతిపక్షాలన్నీ పరస్పర నమ్మకంతో సాగించాల్సిన సుదీర్ఘ ప్రయాణమిది. అలాంటప్పుడు అనుమానాల నివృత్తి అయినా, ఆచరణ ప్రణాళికైనా ఒక రోజు మాటల మథనంతో సాధ్యమనుకుంటే అత్యాశ. ఇలాంటి భేటీలు తరచూ జరగాలి. బలమైన పాలకపక్షాన్నీ, జనాకర్షక విన్యాసాల్లో దిట్ట అయిన దాని సారథినీ ఎదుర్కొనాలంటే, ప్రతిపక్షాలన్నీ తమ మధ్య పాత పగలను పక్కన పెట్టాలి. స్వీయ ప్రయోజనాల కన్నా ఉమ్మడి శత్రువుపై విజయమే వాటి లక్ష్యం కావాలి. అందుకవసరమైతే కొంత త్యాగానికి కూడా సిద్ధం కావాలి. అంతటి దీక్ష, దృఢ సంకల్పం, చిత్త శుద్ధి ఎన్ని పార్టీలకు ఉందన్నది విమర్శకుల సందేహం. అందుకే, ఒక్కరోజు పాట్నా భేటీపై అతిగా అంచనాలు ఎవరికీ లేవు. అదే సమయంలో కలసి పోరాడాలన్న ఆశయంలో ఇది ముందడుగనడంలో అనుమానం లేదు.

ఎన్నికలకు మరో 11 నెలల కన్నా తక్కువ వ్యవధి మాత్రమే ఉన్నందున పాట్నా భేటీ సాక్షిగా ప్రతిపక్షాలు తమలో తాము పట్టువిడుపులు ప్రదర్శించాలి. ఐక్యంగా ఉండడం ఎంత ముఖ్యమో, తమ కూటమి అసలైన ప్రత్యామ్నాయమనే నమ్మకం ప్రజల్లో కల్పించడం అంతకన్నా ముఖ్యం. అలాగే, పాలక నేతకు తమ ప్రత్యామ్నాయం ఎవరో స్పష్టం చేయగలిగి ఉండాలి. ఒకప్పుడు కాంగ్రెస్, ఇందిరా గాంధీలకు వ్యతిరేకంగా జయప్రకాశ్ నారాయణ్ సారథ్యంలో సాగిన ప్రతిపక్ష ప్రయోగం మాదిరిగా... మళ్ళీ అంత నమ్మకం కలిగించగలిగితేనే ఏ కూటమి అయినా ఫలిస్తుంది. ఎన్నికల క్షేత్రంలో ఫలితాలు సాధిస్తుంది. ఏది ఏమైనా, ప్రభుత్వం లోటుపాట్లను ఎత్తిచూపుతూ, ప్రజల పక్షాన నిలదీసే దృఢమైన ప్రతిపక్షం ఉంటేనే ఏ ప్రజాస్వామ్యమైనా నాలుగు కాళ్ళపై నిలుస్తుంది, నడుస్తుంది. తొమ్మిదేళ్ళ తర్వాత దేశంలో ఇప్పుడా అవసరం ఎంతైనా ఉంది. తాజా పాట్నా భేటీ ఆశలు రేపుతోంది అందుకే!

సర్దుకుపోతేనే మణిపూర్‌లో శాంతి!

విశ్లేషణ



ప్రదీప్ ఫన్‌జౌబమ్

నెలన్నరగా మణిపూర్ మండుతూనే ఉంది. తీవ్రత తగ్గినప్పటికీ హింసాత్మక ఘటనలు పూర్తిగా ఆగిపోలేదు. ఇప్పటివరకూ సుమారు 120 మంది ప్రాణాలు కోల్పోగా, 45 వేల మంది సహాయ శిబిరాల్లో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, అటు మైతైలతో పాటు ఇటు కుకీలు కూడా ప్రభుత్వ బలగాలు ఒక పక్షానికి కొమ్ము కాస్తున్నాయన్న అభిప్రాయంలో ఉండటం. ప్రస్తుతం మణిపూర్ పరిస్థితిపై ఉన్న సాధారణ అంచనా ఏమిటంటే, రాష్ట్ర ప్రభుత్వానికి ఏం చేయాల్లో దిక్కుతోచడం లేదు. కేంద్రానికి నిబద్ధత కరవైంది! ప్రస్తుత సంక్షోభం మణిపూర్‌లోని తెగల మధ్య ఉన్న సంక్లిష్టమైన సంబంధాలను మరోసారి ప్రపంచానికి ఎత్తి చూపుతోంది.

మణిపూర్‌లో చీకటి రోజులు నడుస్తున్నాయి. నెలన్నరగా రెండు ప్రధాన తెగలైన మైతై, కుకీల మధ్య ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. సాధారణ పరిస్థితులు నెలకొంటాయన్న సూచనలు కనుచూపుమేరలో కనిపించడం లేదు. మొదలైనప్పటి స్థాయిలో కాకపోయినా అక్కడక్కడా రెండు తెగలకు చెందిన గ్రామాలున్న చోట హింస చోటు చేసుకుంటోంది. ఒకప్పుడు ఆప్తమిత్రుల్లా ఉన్న ఈ తెగలిప్పుడు బద్ధశత్రువుల్లా మారిపోయాయి.



మణిపూర్‌లో ఘర్షణలు మొదలైన తరువాత ఇప్పటివరకూ సుమారు 120 మంది ప్రాణాలు కోల్పోగా, 45 వేల మంది రిలీఫ్ క్యాంపుల్లో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. శాంతి సాధనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్న భావన ఏర్పడటంతో... క్యాంపుల్లో ఆశ్రయం పొందుతున్న వారిలో నిస్పృహ పెరిగిపోతోంది. ఇప్పుడిది ఆగ్రహంగా పరిణమించి మరిన్ని హింసాత్మక ఘటనలకూ, ఘర్షణలకూ దారితీసే అవకాశం ఏర్పడుతోంది. ఈ ఆగ్రహం అధికారంలో ఉన్న వారిపైకి మళ్లినా ఆశ్చర్యం లేదు. ప్రస్తుతం మణిపూర్ పరిస్థితిపై ఉన్న సాధారణ అంచనా ఏమిటంటే, రాష్ట్ర ప్రభుత్వానికి ఏం చేయాల్లో దిక్కుతోచడం లేదు. కేంద్రానికి నిబద్ధత కరవైంది!

ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, అటు మైతైలతో పాటు ఇటు కుకీలు కూడా ప్రభుత్వ బలగాలు ఒక పక్షానికి కొమ్ము కాస్తున్నాయన్న అభిప్రాయంలో ఉండటం. రాష్ట్ర ప్రభుత్వ పోలీసు కానిస్టేబుళ్లు, సాయుధ మణిపూర్ రైఫిల్స్ బలగాలు మైతైలకు అనుకూలంగా పనిచేస్తున్నాయని అనుకుంటూంటే... కేంద్ర పారామిలటరీ బలగాలు, ముఖ్యంగా అస్సామ్ రైఫిల్స్ కుకీలకు వత్తాసు పలుకుతున్నాయని భావిస్తున్నారు. వాస్తవానికి జూన్ రెండున జరిగిన ఘర్షణలు పూర్తిగా నివారించదగ్గవి. మణిపూర్ పోలీస్ కమాండోలు, అసాం రైఫిల్స్‌కు చెందిన ఒక యూనిట్ మధ్య జరిగిన ఈ ఘర్షణ దాదాపుగా కాల్పులకు దారితీసింది. ఈ ఘటనలో అస్సాం రైఫిల్స్‌కు చెందిన ఒక బృందం రెచ్చగొట్టే విధంగా సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ కార్యాలయ దారిని మూసేసింది. గేట్ దగ్గర ఇద్దరు సాయుధ సిబ్బందిని నియమించింది. పరిస్థితి చేయిదాటే సమయానికి ఈ బృందం వెనక్కు తగ్గింది. ఈ ఘటన మొత్తం ఒక వ్యక్తి తాలూకా అసూయ కావచ్చు లేదా ఇంకేదైనా స్థానిక కారణం కావచ్చు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మణిపూర్ పర్యటన జరిగిన రెండు రోజుల తరువాత ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం.

అమిత్ షా హామీ ఇచ్చిన విధంగానే గౌహతి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అజయ్ లాంబా నేతృత్వంలో ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఏర్పాటు కావడం స్వాగతించాల్సిన విషయం. మణిపూర్ సంక్షోభానికి కారణాలను కనుక్కోవడం, ఎవరి బాధ్యత ఏమిటో తేల్చడం ఈ కమిటీ ఉద్దేశం. అయితే రాష్ట్ర గవర్నర్ అనసూయ యుకీ నేతృత్వంలో 51 మందితో ఒక శాంతి కమిటీ ఏర్పాటు చేసే ప్రయత్నం మాత్రం అందరూ ఊహించినట్టుగానే బాలారిష్టాలను ఎదుర్కొంటోంది. కమిటీ కోసం ఎంపిక చేసినవారు క్రమంగా విరమించుకుంటున్నారు. రాజకీయ ప్రమేయం ఉన్నవారు ఎక్కువవుతున్నందుకే విరమించుకుంటున్నట్లు చెబుతున్నారు.

కమిటీలోని కుకీ సభ్యులు ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్ చేరికపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రస్తుత సంక్షోభానికి ఆయనే సూత్రధారి అనీ, ఆయన కుకీ వ్యతిరేకి అనీ వారి వాదన. ఇంకో విషయం... కమిటీలో ముఖ్యమంత్రిని చేర్చడం ద్వారా ఆయన్ని పదవి నుంచి తప్పించే ఉద్దేశమేమీ తమకు లేదని కేంద్రం చెప్పకనే చెప్పినట్లు అయ్యింది. రాష్ట్రపతి పాలన విధించే అవకాశాలూ లేవని తేలిపోయింది. రాష్ట్రంలోని చాలామంది ఈ రెండింటిలో ఏదో ఒకటి సంభవమన్న అంచనాలో ఉండటం గమనార్హం. బీజేపీ పాలిత రాష్ట్రం కావడం వల్లనే ఇవి ఏవీ జరగడం లేదేమో!

ప్రస్తుత సంక్షోభం మణిపూర్‌లోని ఆదిమ తెగల మధ్య ఉన్న సంక్లిష్టమైన సంబంధాలను మరోసారి ఎత్తి చూపుతోంది. ఇది కేవలం తెగల మధ్య ఏర్పడ్డ భేదాభిప్రాయాలు మాత్రమే అనుకునేందుకు లేదు. కొండలు, లోయల్లో నివసించే వారి మధ్య ఘర్షణలుగానూ చూడవచ్చు. ఈ విషయంలో నాగాలు, కుకీలు ఒక వైపున ఉంటే మైతైలు ఇంకోవైపున ఉన్నారు. మణిపూర్ మొత్తమ్మీద 90 శాతం పర్వత ప్రాంతమే. షెడ్యూల్డ్ తెగల కోసం ప్రత్యేకమైన ప్రాంతంగా దీనికి గుర్తింపు ఉంది. లోయ ప్రాంతాలు రాష్ట్ర భూభాగంలో పది శాతం. గిరిజన తెగలకు చెందని మైతైల నివాస ప్రాంతాలు ఇవే. ఇటీవలి కాలంలో మైతైల్లో అధికశాతం మంది తమకూ షెడ్యూల్డ్ తెగల గుర్తింపు కాంక్షిస్తున్నారు. నాగాలు, కుకీలు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ వ్యతిరేకత వల్లనే పరిస్థితి ఈ స్థాయికి చేరింది అనేందుకు అవకాశం లేదు. ఎందుకంటే మైతైల డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ మే 3న నిర్వహించిన ర్యాలీలో నాగాలు తమ సంబంధాల హద్దులను దాటలేదు. కుకీలు మాత్రం చురాచంద్రపూర్ జిల్లాలో మైతైలున్న ప్రాంతాలపై దాడులు చేసి విధ్వంసానికి పాల్పడ్డారు. కుకీ యుద్ధ స్మారకం ఒక దాన్ని మైతైలు తగలబెట్టేశారన్న వదంతులతో ఈ విధ్వంసం జరగడం గమనార్హం.

మైతైలపై కలిసి యుద్ధం చేద్దామని కుకీలు కొన్ని సంకేతాలు పంపినా నాగాలు ప్రస్తుతానికి తటస్థంగానే ఉన్నారు. ఈ తటస్థ వైఖరితోనూ కొన్ని చిక్కులున్నాయి. జూన్ 9న రాష్ట్రానికి చెందిన పది మంది నాగా ఎమ్మెల్యేలు సంప్రదింపుల కోసం అమిత్ షాను కలిశారు. రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు తమ వంతు సాయం అందిస్తామని హామీ కూడా ఇచ్చారు. అయితే కుకీల కోసం ప్రత్యేక పరిపాలన వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన తీసుకురావడం గమనార్హం. దీనికోసం నాగాల భూముల జోలికి మాత్రం రావద్దని వీరు ప్రతిపాదించారు.

మణిపూర్‌లోని పర్వతప్రాంత జిల్లాల్లో మొత్తంగా కుకీ గ్రామాలు విస్తరించి ఉన్నాయి. నాగాలు కూడా చురాచంద్రపూర్ మినహా మిగిలిన పర్వతప్రాంత జిల్లాలు తమ మూల నివాసంగా భావిస్తారు. అంటే ఆచరణలో కుకీల డిమాండ్ ఏమాత్రం ఆమోదయోగ్యం కానిది అవుతుంది. 1990లో యునైటెడ్ నాగా కౌన్సిల్ కుకీ గ్రామాలను ఖాళీ చేయించాలని నిర్ణయించింది. నాగాల దృష్టిలో కుకీలు తమ గ్రామాల్లో ఉంటున్న కిరాయిదారులు. ఈ తీర్మానం చివరకు ఘర్షణలకు దారి తీయడమే కాకుండా, 800 మంది ప్రాణాలు కోల్పోయేందుకు కారణమైంది.

తటస్థ వైఖరి అనేది హెర్బెర్ట్ బి.స్వోప్ కథనం ఒకదాన్ని గుర్తు చేస్తోంది. పులిట్జర్ ప్రైజ్ అవార్డు పొందిన కొన్ని కథనాలను స్వోప్ జర్మనీ నుంచి రాసేవారు. 'న్యూయార్క్ వరల్డ్'లో ప్రచురితమయ్యాయి. ఆ కాలంలో అమెరికన్లు తటస్థ వైఖరి ప్రకటించడంపై జర్మన్లు గుర్రుగా ఉండేవారు. మొదటి ప్రపంచ యుద్ధంలో అమెరికా పాల్గొనేందుకు ఏడాది ముందు ముచ్చట ఇది. అమెరికన్ల తటస్థత జర్మన్ల విషయంలో మెదడు సంబంధి అనీ, మిత్రపక్షాలతో వర్తన మాత్రం హృదయ సంబంధి అనీ జర్మన్లు భావించేవారు. నాగాల పరిస్థితి అలాగే ఉంది. కుకీల పక్షం వహించబోమని చెబుతూనే, మైతైలతో తమకు భేదాభిప్రాయాలు లేవని అనుకోవద్దంటున్నారు. ప్రస్తుతం మణిపూర్ ప్రజల ముందున్న సవాలు ఏమిటంటే... ఘర్షణ పూరిత వాతావరణం తొలగిపోయిన వెంటనే, పరిపాలన వ్యవస్థ నిర్మాణంలో ఏకాభిప్రాయానికి కృషి చేయడం. అప్పుడే దాదాపు 34 భాషాపరమైన సమూహాలున్న మణిపూర్‌లో శాంతి స్థాపన సాధ్యమవుతుంది. పరస్పరం సహకరించుకోవడం, సర్దుకుపోవడం, ఉమ్మడి విధిని అంగీకరించడం ఇప్పుడు జరగాల్సిన పనులు!

వ్యాసకర్త 'ఇంఫాల్ ఫ్రీ ప్రెస్' సంపాదకుడు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పంజాబీ ఆధిపత్యం



పాకిస్తాన్ రాజకీయాలను పంజాబ్ ఎంతగా శాసిస్తున్నదో చెప్పడానికి ఒక ఉదాహరణ. ఆఖరికి ఇమ్రాన్ ఖాన్ (పుట్టుకతో పష్తూన్) కూడా భారత ప్రధాన మంత్రి పేరును నరేందర్ మోదీ అని ఉచ్చరిస్తారు. (ఇంద్రను వారు ఇందర్ అంటారు).

– క్రిస్టోఫ్ ఇవానెక్, కాలమిస్ట్

మంచి చర్య



ఈ ఏడాది తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న మంచి చర్యల్లో ఒకటి సుమారు 500 మద్యం దుకాణాలను మూసేయడం. ప్రత్యేకించి ఇళ్లకు, పాఠశాలలకు దగ్గరగా ఉన్నవి. తమిళ మహిళలతో నేను జరిపిన చాలా సంభాషణల్లో మద్యం వల్ల వాళ్లు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో చెప్పారు.

– కమలా త్యాగరాజన్, జర్నలిస్ట్

రాజకీయ ప్రచారమా?



భారత్‌లోని 98 శాతం మంది ముస్లిములు తమ మతాన్ని స్వేచ్ఛగా ఆచరించగలుగుతున్నామని చెప్పినట్టు 'ప్యూ' పరిశోధన పేర్కొంది. భారత ముస్లింలు విస్తృత వివక్షకు గురవుతున్నారనే భారత వ్యతిరేక యాక్టివిస్టుల రాజకీయ కథనాన్ని ఈ వెల్లడింపులు కొట్టిపారేస్తున్నాయి.

– జెబా జోరియా, కాలమిస్ట్

అదే ముఖ్యం!



బిజినెస్ స్కూల్స్ తమ పాఠ్య ప్రణాళికలో దయచేసి 'వ్యూహం' బోధించడం ఆపాలి. దానికి బదులు ఎక్కువగా ఆచరణ ఎలాగో చెప్పాలి. ఒక స్టార్టప్ స్థాపకుడిగా ఇది నా వినయ పూర్వక వినతి.

– ఉత్సవ్ అగర్వాల్, ఆంట్రప్రెన్యూర్

నాకు ప్రమోషన్



మా మామయ్య తాను కలిసే ప్రతి ఒక్కరితోనూ నాకో ఫుడ్ బ్లాగ్ ఉందనీ, దాన్ని ఫాలో కమ్మనీ చెబుతుంటారు. అది వినడానికి ఎనభై శాతం ఇబ్బందిగా ఉంటుంది, కానీ నూరు శాతం సూపర్ క్యూట్ అనిపిస్తుంది.

– చైతాలీ అగర్వాల్, బ్లాగర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

అమానవీయ ప్రవర్తన ఇంకెన్నాళ్లు?

సందర్భం



సింగారెడ్డి శౌరి రెడ్డి

ఎన్నో గొప్ప సంప్రదాయాలకు పుట్టినిల్లు అయిన మన దేశంలో వితంతువుల పట్ల అమానవీయ ధోరణి కొనసాగడం బాధాకరం. వితంతువుగా మారిన స్త్రీని ఆచారాల పేరుతో అవమానిస్తూ, చులకనగా చూడడం రహస్యమేమీ కాదు. విషాదం ఏమిటంటే ఊళ్లోవాళ్ళే కాక కుటుంబ సభ్యులు, బంధు వులు కూడా వీరి పట్ల అన్యాయంగా ప్రవ ర్తిస్తూ ఉంటారు. ఇందుకు కారణం తర తరాలుగా సమాజంలో పాతుకు పోయిన ఆచారాలూ, నమ్మకాలే. సాటి మనిషిని, అదీ భర్త చనిపోయి పుట్టెడు దుఃఖాన్ని అనుభవిస్తూ ఉన్న ఆడకూతుర్ని నిర్దాక్షిణ్యంగా అనేక సామాజిక కార్యక్రమాలలో పాల్గొనకుండా నిషేధించడం సబబేనా? సమాజం చూసే చిన్నచూపు భరించలేక 29 శాతం మంది యువ వితంతువులు చావే మంచిదని ఆత్మహత్యా ప్రయత్నాలు చేస్తున్నారన్న సంగతి ఈ సందర్భంగా గమనార్హం.

అనేకమంది వితంతువులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. భర్త చని పోయిన వారికి బ్యాంకులు, ఇతర రుణ సంస్థలు రుణాలు (లోన్‌లు) ఇవ్వవు. ఇందువల్ల వారు తమ కాళ్లమీద తాము నిలబడటానికి చేసే ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. అలాగే వీరికి ఉద్యోగాలు దొరకడమూ గగనమే. ఇటువంటి పరిస్థితుల్లో తరచుగా శ్రమదోపిడీకీ, అత్యాచారాలకూ గురవుతూ ఉంటారు వీరు. విచిత్రమేమిటంటే కుటుంబ సభ్యులూ, బంధువులే వీరిపై తరచూ లైంగిక దాడులకు పాల్పడడం.

ప్రపంచ వ్యాప్తంగా సుమారుగా 26 కోట్ల వితంతువులు ఉంటే అందులో భారతదేశంలోనే 4 కోట్లమందికి పైగా వితంతువులున్నారు. పలు దేశాల్లో పలు రకాల ఆర్థిక, సామాజిక వివక్ష, మూఢ నమ్మకాలు, ఆచారాల వల్ల వీరు సతమతమౌతున్నారు. జీవచ్ఛవాలుగా బతుకుబండి లాగిస్తున్న కోట్లాది వితంతువుల సమస్యలపై అన్ని వర్గాలూ చర్చించి వారు గౌరవప్రదమైన జీవనం గడపడానికి పాటుపడాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి జూన్ 23ను 'వితంతువుల దినం'గా 2010లో ప్రకటించింది. దురదృష్టవశాత్తు మన దేశంలో జటిలమైన వితంతు సమస్యపై సానుభూతి లేకపోవడమే కాదు, వితంతువుల దినం నిర్వహించడంపైనా నిర్లక్ష్యం కనిపిస్తోంది.

వితంతువులపై వివక్ష చూపడం మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుంది. కుల, మతాల ఆధారంగా సాటి మనిషిపై వివక్ష చూపడం కూడా మానవ హక్కుల ఉల్లంఘనగా గుర్తించిన రాజ్యాంగం మనది. అలాంటి దేశంలో వితంతువుల పట్ల వివక్షకు వ్యతిరేకంగా మరో సామాజిక ఉద్యమాన్ని నడప వలసిన అవసరం ఉంది.

'బాలవికాస' సంస్థ దశాబ్ద కాలంగా చేస్తున్న సామాజిక చైతన్య కార్యక్రమాల వల్ల లక్షలాది వితంతువులు ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగుతున్నారు. అలాగే పలు గ్రామాలలో ప్రజా ప్రతినిధులు, గ్రామ నాయకులు వారి గ్రామాల్లో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమాలకు, శుభ కార్యాలకు వీరిని ఆహ్వా నిస్తున్నారు. బతుకమ్మ పండుగలలో పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తున్నారు. వేలాదిమంది యువత వారి వివాహాల సందర్భంలో వితంతువులైన తల్లి లేదా వారి బంధువులతో అక్షింతలు వేయించుకుంటున్నారు. 'బాల వికాస' హైదరాబాద్ క్యాంపస్ ప్రారంభోత్సవంలో మూడు రాష్ట్రాల మంత్రులు, ప్రజా ప్రతినిధులు, విదేశీ అతిథులు వచ్చినప్పటికీ తొలి కొబ్బరికాయ వితంతు స్త్రీతో కొట్టించి ప్రేరణగా నిలిచింది.

'బాల వికాస' చేపట్టిన 'వితంతు వివక్షా విముక్తి' ఉద్యమంలో వందలాది స్వచ్ఛంద సంస్థలు, వేలాది కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ సంవత్సరం వితంతు దినానికి ఐక్యరాజ్య సమితి వారు ఎంపిక చేసిన అంశం 'నూతన ఆవిష్కరణలు – సాంకేతికతతో లింగ సమానత్వం'. దీనికి అనుగుణంగా అందరికి అందుబాటులో ఉన్న సోషల్ మీడియాను వేదికగా చేసుకొని సమాచారాన్ని పంచుతూ, చర్చలు చేస్తూ, అవగాహనా ఉద్యమాన్ని చేపడితే మార్పు తథ్యం.

వ్యాసకర్త 'బాలవికాస' ఎన్జీవో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

కావాలనే దివాలా తీయిస్తున్నారు!

అభిప్రాయం



తారానాథ్ మురాల

ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)లను దివాళా తీయించి కార్పొరేట్ సంస్థలకు లాభార్జనలో అడ్డులేకుండా చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం చేయదగినదంతా చేస్తోంది. దీనికి భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరించిన విధానం నిలువెత్తు నిదర్శనం. ఈ సంస్థకు ఒకవైపు నష్టాలు వచ్చేలా పరిస్థి తులను సృష్టిస్తున్నది ప్రభుత్వమే. అదే సమయంలో నష్టాల నుంచి బయట పడేయడానికి పునరుద్ధరణ (రివైవల్) ప్యాకేజీలు పేరిట మాయ చేస్తున్నదీ ప్రభుత్వమే.

ప్రభుత్వం కీలక అనుమతులు ఇచ్చే క్రమంలో ముందు తన సంస్థలకు ఇచ్చి, తర్వాత ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం సహజం. కాదంటే ఎటువంటి వివక్షా లేకుండా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు రెండింటికీ అనుమతులు జారీ చేయాలి. కానీ కేంద్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్‌కు 3జీ సర్వీసులు ఇవ్వడానికి కావాల్సిన స్పెక్ట్రమ్ ఇచ్చే సమయంలో కానీ, 4జీ సర్వీసులు ఇవ్వడానికి కావాల్సిన స్పెక్ట్రమ్ ఇచ్చేందుకు కానీ అనేక అడ్డంకులు సృష్టించింది. కానీ ఇదే సమయంలో ప్రయివేటు టెలికాం కంపెనీలకు 4జీ సేవల అనుమతుల విషయంలో ఉదారంగా వ్యవహరించింది.

ప్రపంచ వ్యాప్తంగా టెలికాం సాంకేతిక పరిజ్ఞానం ఎగుమతి చేసే దేశాలు నాలుగు మాత్రమే ఉన్నాయి. భారత దేశానికి మూడేళ్ళ వరకు ఆ పరిజ్ఞానం లేదు. చాలామంది పెట్టుబడి దారుల ఒత్తిడితో భారత ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ కేవలం మన దేశంలో తయారైన 4జీ సాంకేతిక పరిజ్ఞానాన్ని మాత్రమే వాడుకుని 4జీ సర్వీసులు ఇవ్వాలని నిబంధనలు పెట్టింది. అంటే విదేశాల నుంచి ఈ టెక్నాలజీని ఇది దిగుమతి చేసుకోకూడదన్నమాట. అయితే ప్రైవేటు టెలికాం కంపెనీలకు మాత్రం ఈ నిబంధన విధించలేదు. దీంతో ప్రైవేట్ సంస్థలు 4జీ సేవలు అందిస్తూ మార్కెట్‌లో దూసుకుపోతుంటే... స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం కోసం మూడేళ్లు బీఎస్ఎన్ఎల్ ఎదురు చూడాల్సి వచ్చింది. ఈలోపు దాని ఖాతాదారులు చేజారిపోయారన్న సంగతి వేరే చెప్పనవసరం లేదు. ఇక నష్టాలు వచ్చాయంటే రావా? చివరకు 4జీ సర్వీసులు ప్రారంభించడానికి అయ్యే ఖర్చులు, బీఎస్ఎన్ ఎల్‌కు ఉన్న అప్పులు, నష్టాలు, ఉద్యోగుల కోసం అయ్యే ఖర్చులు పరిశీలించి మొదటి రివైవల్ ప్యాకేజీని సెప్టెంబర్ 2019లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్యాకేజీలో 90,000 మంది ఉద్యోగుల వాలంటరీ రిటైర్మెంట్ పథకం అమలైతే చెల్లించాల్సిన డబ్బూ భాగమన్న విషయం గుర్తుంచుకోవాలి.

దాదాపు 74,000 కోట్ల రివైవల్ ప్యాకేజీని సెప్టెంబర్ 2019లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 20,140



కోట్లు 4జీ స్పెక్ట్రమ్ కోసం కాగా, రూ. 3,674 కోట్లు బీఎస్ఎన్ఎల్ కేంద్రానికి చెల్లించాల్సిన జీఎస్టీ చార్జీలు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల వాలంటరీ రిటైర్మెంట్ పథకం ఖర్చు దాదాపు రూ. 29,935 కోట్లు. ఈ వీఆర్ఎస్ పథకంలో ఉద్యోగులకు రిటైర్మెంట్ రోజు ఇవ్వాల్సిన గ్రాట్యుటీ, కమ్యూటేషన్ లాంటి ఆర్థిక ప్రయోజనాలను వాయిదా వేసి, ప్రభుత్వం మోసం చేసిందనుకోండి. బీఎస్ఎన్ఎల్ 4జీ స్పెక్ట్రమ్‌పై చెల్లించాల్సిన రూ. 3,674 కోట్ల జీఎస్టీపై కూడా ఎలాంటి వెసులుబాటు ఇవ్వలేదు.

బీఎస్ఎన్ఎల్ ఏర్పాటు సమయంలో ఆ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో చేస్తున్న సేవలకు గాను కొంత నగదు తిరిగి చెల్లిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. కాగా 2010 వరకు మాత్రమే ఈ రకమైన చెల్లింపు చేసి ఆ తర్వాత ఈ వెసులుబాటును ఆపేసింది. భారత దేశంలో తయారైన సాంకేతిక పరిజ్ఞానం వాడుకుని 4జీ సేవలు ప్రారంభించడానికి అయ్యే ఖర్చును 'ఆత్మనిర్భర్ భారత్' ప్రోగ్రాంలో భాగంగా భరిస్తామని పేర్కొని, తర్వాత దాన్ని క్యాపిటల్ ఇన్ఫ్యూజన్, ఈక్విటీ ఇన్ఫ్యూజన్‌గా సర్దుబాటు చేసింది ప్రభుత్వం. ఇన్ఫ్యూజన్ అంటే నికరంగా నగదు రూపంలో ఇవ్వకుండా పెట్టుబడులు లేదా షేర్ల రూపంలో లేదా ఇతర మార్గాలలో సర్దుబాటు చేసి చూపడం.

నిజానికి ప్రయివేటు టెలికం కంపెనీలు గత నాలు గేళ్లుగా వాణిజ్య పరంగా లాభాలు వచ్చే పట్టణ ప్రాంతా ల్లోనే 4జీ సర్వీసులు ఇస్తున్నాయి. అంతగా ఆదాయం లేని గ్రామీణ ప్రాంతాల్లో 4జీ సర్వీసులు ఇవ్వాలంటే బీఎస్ఎన్ఎల్ అవసరం. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో 5 లక్షల కిలో మీటర్ల ఓఎఫ్‌సీ కేబుల్ కలిగిన 'భారత్ బ్రాడ్ బాండ్ నెట్‌వర్క్ లిమిటెడ్' (బీబీఎన్ఎల్)ను బీఎస్ ఎన్ఎల్‌లో కేంద్ర ప్రభుత్వం విలీనం చేసింది.

తాజాగా ఈ జూన్‌లో మూడవ రివైవల్ ప్యాకేజీగా రూ. 89,047 కోట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 4జీ/5జీ స్పెక్ట్రమ్ కోసం 46,339 కోట్లు కేటాయించారు. మిగతాది అప్పులు తీర్చడం కోసం ఇచ్చారు. అయితే నికరంగా ఈ ప్యాకేజీలో నగదు సర్దుబాటు చేసింది రూ. 531 కోట్లు మాత్రమే. మొత్తంగా బీఎస్ఎన్ఎల్‌కు మూడు విడతల్లో ప్రకటించిన రూ. 3.23 లక్షల కోట్ల ప్యాకేజీలో నికరంగా నగదు రూపంలో 15,000 కోట్లు మాత్రమే సర్దుబాటు చేశారు. అది కూడా దశాబ్దాల తర్వాత పునరుద్ధరణ చేసిన గ్రామీణ సేవల సర్వీసులకు చేసిన చెల్లింపుగానే దీన్ని ఇచ్చారు. బుక్‌లో సర్దుబాటు చేసే మొత్తానికి ప్యాకేజీ అనే పేరు పెట్టడం వెసులుబాటు ఎలా అవుతుంది?

టెలికాం రంగంలో బీఎస్ఎన్ఎల్ లాంటి ప్రజా సేవలు అందించే సంస్థ లేకపోతే ప్రయివేటు టెలికాం కంపెనీలు ప్రజలను టారిఫ్‌ల పేరుతో దోచుకుంటాయని గమనించాలి.

వ్యాసకర్త టెలికాం రంగ నిపుణులు

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.పంచమి సా.4.46 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** మఖ తె.4.55 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ప.3.36 నుండి 5.24 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 8.57 వరకు, తదుపరి .12.26 నుండి 1.20 వరకు, **అమృతఘడియలు:** రా.2.15 నుండి 4.01 వరకు ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.30, **సూర్యాస్తమయం:** 6.33.

అక్కసుతోనే బాబు అండ్ కో కుట్రలు

- 998వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాష్ట్రంలో కులమతాలు, ప్రాంతాలు, పార్టీలకతీతంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాలు ఆర్థికంగా ఎదగడంతో తమ ఉనికి ఎక్కడ కోల్పోవాల్సి వస్తుందోననే అక్కసుతోనే బాబు అండ్ కో రాష్ట్రంలో కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 998వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. 75 సంవత్సరాల భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసి చూపించారన్నారు. ఊళ్లకు ఊళ్లు నిర్మిస్తున్న జగనన్న ప్రతి పేదవాడికి అండగా నిలిచారనడంలో సందేహం లేదని చెప్పారు. బాబు ఆయన సామాజిక వర్గం స్వప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్రంలో పేదలను అణగదొక్కేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. చిట్‌ఫండ్ సంస్థల్లో నిబంధనలకు పాతరేసి నిలువు దోపిడీ చేసిన రామోజీని అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. వార్డు కౌన్సిలర్‌లుగా గెలవలేని పవన్‌కళ్యాణ్, లోకేశ్‌బాబు నోటికొచ్చిందల్లా మాట్లాడుతున్నారని అన్నారు. వీరి డ్రామా యాత్రలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నాయకులు నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు, బేతపూడి సాంబయ్య, కారుమూరి పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



ధ్వజ స్తంభానికి మొక్కుతున్న జస్టిస్ రామసుబ్రమణియన్, చిత్రంలో సుబ్బారెడ్డి

తిరుమల: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామ సుబ్రమణియన్ గురువారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను, చైర్మన్ ప్రసాదాన్ని అందించారు.

చనిపోయి.. ఐదుగురి జీవితాలకు 'సంతోష'మిచ్చాడు!

బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి అవయవదానం



సంతోష్ తండ్రికి ప్రశంసాపత్రం అందజేస్తున్న రాంబాబు



వెంకట సంతోష్ కుమార్ (ఫైల్)

ఆరిలోవ (విశాఖ తూర్పు): విశాఖలోని ఆరిలోవ ప్రాంతం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన బొండా వెంకట సంతోష్‌కుమార్ (32) బ్రెయిన్‌డెడ్‌కు గురికాగా అతడి అవయవాలను దానం చేసేందుకు కుటుంబీకులు అంగీకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అవయవాలను దానం చేయడానికి గాను సంతోష్ భౌతికకాయాన్ని విమ్స్‌కు తరలించారు. అక్కడ శస్త్రచికిత్స చేసి శరీరంలో బాగా పనిచేస్తోన్న అవయవాలను తొలగించి జీవన్‌దాన్ ప్రొటోకాల్ ప్రకారం ఐదుగురికి కేటాయించారు. విశాఖ సీపీ సహకారంతో ట్రాఫిక్ పోలీసులు గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి అవయవాలను పలు ఆస్పత్రులకు తరలించారు. సంతోష్ భౌతికకాయానికి గురువారం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఆధ్వర్యంలో ఆర్మీ జవాన్‌కు జరిగిన మాదిరిగా ఘన వీడ్కోలు పలికారు. సిబ్బంది రెండు వరసలుగా ఏర్పడి పూలుజల్లుతూ అమర్‌రహే సంతోష్ అంటూ నినాదాలు చేశారు. సంతోష్ తండ్రి శంకర్‌కు రాంబాబు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. విమ్స్ అంబులెన్స్‌లో ఆరిలోవలోని నివాసానికి పార్థివదేహాన్ని తరలించగా... కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. రాంబాబు మీడియాతో మాట్లాడుతూ.. సంతోష్ శరీరం నుంచి 2 కార్నియాలు, కిడ్నీలు, లివర్ తీశామన్నారు. హెల్త్‌సిటీలో అపోలోకు ఓ కిడ్నీ, షీలానగర్‌లో కిమ్స్ ఆస్పత్రికి మరో కిడ్నీ, హెల్త్‌సిటీలో పినాకిల్ ఆస్పత్రికి లివర్, హనుమంతవాక వద్ద ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి కార్నియాలను జీవన్‌దాన్ ప్రొటోకాల్ ప్రకారం తరలించినట్లు తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం

- హైదరాబాద్ నుంచి పాండిచ్చేరికి జాతీయ రహదారిపై వెళుతుండగా ఘటన
- ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట సమీపంలో షార్ట్ సర్క్యూట్
- బస్సులో 25 మంది ప్రయాణికులు.. డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

జరుగుమల్లి (సింగరాయకొండ): అర్ధరాత్రి హైవేపై ప్రయాణిస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపి ప్రయాణికులను అప్రమత్తం చేయడంతో అందరూ కిందికి దిగేశారు. బస్సు పూర్తిగా దగ్ధమైంది. బుధవారం అర్ధరాత్రి సుమారు ఒంటిగంట సమయంలో ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట సమీపంలో హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన మోజో ట్రావెల్స్ బస్సు(స్లీపర్) 25 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి పాండిచ్చేరి వెళుతోంది. బస్సు వెనుక భాగంలో ఉన్న సిగ్నల్ లైట్స్‌కు విద్యుత్ సరఫరా చేసే వైర్లు, ఏసీ కేబుల్స్ కలిసి ఉండటంతో షార్ట్ సర్క్యూటై మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ లక్ష్మణ్.. వెంటనే బస్సును రోడ్డు మార్జిన్‌లో ఆపివేశాడు. ప్రయాణికులను కిందకు దించి మంటలపై బకెట్‌తో నీళ్లు చల్లి ఆర్పే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ మంటలు తగ్గకపోగా, కాసేపట్లోనే బస్సు మొత్తం వ్యాపించాయి. అప్పటికే ప్రయాణికులంతా కిందకు దిగడంతో ప్రాణాపాయం తప్పింది. అగ్నిమాపకశాఖ సిబ్బంది ఫైరింజన్‌తో అక్కడకు చేరుకుని మంటలనార్పారు. అయితే బస్సులోనే ఉండిపోయిన ప్రయాణికుల లగేజీ మొత్తం కాలిపోయింది. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కట్టుబట్టలతో మిగిలిన ప్రయాణికులను ఇతర వాహనాల్లో ఎక్కించి గమ్యస్థానాలకు చేర్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సింగరాయకొండ సీఐ రంగనాథ్ తెలిపారు.



మంటల్లో కాలిపోతున్న బస్సు

9న ఏఎన్‌యూ వద్ద ములాయం విగ్రహావిష్కరణ

- హాజరుకానున్న యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): విజయవాడ-గుంటూరు నేషనల్ హైవేపై కాజా టోల్ గేట్ వద్ద ఉత్తర్‌ప్రదేశ్ మాజీ సీఎం ములాయం సింగ్ యాదవ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జూలై 9న నిర్వహించనున్నట్లు నిర్మాణ కమిటీ కన్వీనర్ బొట్టు మధు తెలిపారు. ములాయం విగ్రహాన్ని ఆయన తనయుడు అఖిలేష్ యాదవ్ ఆవిష్కరిస్తారన్నారు. అదే రోజు సాయంత్రం ఏఎన్‌యూ ఎదురుగా భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఇందులో పలు రాష్ట్రాలకు చెందిన బీసీ నేతలు పాల్గొంటారన్నారు. గురువారం విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో బహిరంగ సభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. బొట్టు మధు మాట్లాడుతూ..బీసీ పోరాటాలకు స్ఫూర్తిగా నిలవాలనే ఉద్దేశంతో ములాయం విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాజకీయాలు, కులాలకతీతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రామవరప్పాడు సర్పంచ్ శ్రీదేవి, బీసీ నాయకులు కె.శివాజీ, ఎల్.వెంగళరావు యాదవ్, కేసన శంకరరావు పాల్గొన్నారు.

ధైర్యంగా రైలుకు ఎదురెళ్లాడు.. 'సంఘమిత్ర'కు ప్రమాదాన్ని తప్పించాడు

- ఈపూరుపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో విరిగిన రైలు పట్టా
- గమనించి పైలెట్‌కు సైగలు చేసి రైలును ఆపిన వైనం
- ఊపిరి పీల్చుకున్న రైల్వే అధికారులు, ప్రయాణికులు

చీరాల: ఓవ్యక్తి అప్రమత్తతతో వ్యవహరించడంతో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌కు పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం ఉదయం 7:15నిమిషాల సమయంలో బహిర్భూమికి వెళుతూ పట్టాలు దాటుతున్న స్థానికుడు గద్దె హేమసుందరబాబు రైలు పట్టా విరగడాన్ని గమనించాడు. అదే సమయంలో చెన్నై వెళుతున్న సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ వేగంగా వస్తోంది. వెంటనే రైలుకు ఎదురెళ్లి లోకో పైలెట్‌కు రైలు పట్టాలు చూపిస్తూ సైగలు చేస్తూ సంకేతాలు పంపించాడు. అప్రమత్తమైన లోకోపైలెట్ రైలు వేగం తగ్గించి రైలును నిలిపివేశాడు. అనంతరం రైలు పట్టా విరిగి ఉందని చెప్పి ఘటనా స్థలానికి తీసుకెళ్లి చూపించాడు. దీంతో విషయాన్ని రైల్వే అధికారులకు తెలియజేశారు. చీరాల, బాపట్ల నుంచి వచ్చిన రైల్వే ఇంజనీరింగ్ అధికారులు విరిగిన పట్టాకు మరమ్మతులు చేశారు. దీంతో 40 నిమిషాలు ఆలస్యంగా సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు బయలుదేరింది. పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. కాగా పెను ప్రమాదం నుంచి తప్పించిన హేమసుందరబాబును రైల్వే అధికారులతో సహా ప్రయాణికులు ప్రశంసించారు. ఘోర ప్రమాదాన్ని నివారించిన గద్దె హేమసుందరబాబు సాహసాన్ని అభినందిస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ ఆయనను ఘనంగా సత్కరించారు. బాపట్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో మెమెంటో, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.



విరిగిన రైలు పట్టా

లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్‌లో పొగలు

- భయంతో పరుగులు తీసిన ప్రయాణికులు

సాక్షి, చెన్నై: లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ ఇంజిన్‌లో పొగలు రావడంతో ప్రయాణికులు ప్రాణభయంతో బయటకు దూకి పరుగులు తీసిన ఘటన గురువారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళ్తే... చెన్నై ఎంజీఆర్ సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ గురువారం రాత్రి 7.15 గంటలకు ముంబైకు బయలుదేరింది. ఈ ఎక్స్‌ప్రెస్ రైలు బేసిన్ బ్రిడ్జ్‌ను దాటి వ్యాసార్పాడి రైల్వేస్టేషన్‌ను సమీపించింది. ట్రాక్ మార్పు కారణంగా ఇక్కడ రైళ్లు అతి తక్కువ వేగంతో వెళుతుంటాయి. ఈ రైలు కూడా తక్కువ వేగంతో వెళుతుండగా ఇంజిన్ ముందు భాగంలో హఠాత్తుగా దట్టమైన పొగలు వచ్చాయి. రైలును డ్రైవర్ ఆపివేయడంతో ప్రమాదం తప్పింది. అయితే ఇంజిన్ వెనుక ఉన్న కొన్ని బోగీల్లోని ప్రయాణికులు భయంతో బయటకు దూకేశారు. అదే సమయంలో మరో ట్రాక్‌పై ఎలక్ట్రిక్ రైలు ఆగి ఉండడం వలన మరో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలకు గల కారణాలపై అన్వేషించారు. విద్యుదాఘాతం కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రత్యామ్నాయ ఇంజిన్ ద్వారా రైలును పంపించారు.

డిజి యాత్ర వినియోగంలో 'విజయవాడ' భేష్

- విజయవాడ విమానాశ్రయానికి రెండోస్థానం • మొదటి స్థానంలో వారణాసి

సాక్షి, న్యూఢిల్లీ: ముఖ ఆధారిత బయోమెట్రిక్ వెరిఫికేషన్ టెక్నాలజీ వినియోగించి బయోమెట్రిక్ బోర్డింగ్ నిమిత్తం తీసుకొచ్చిన డిజి యాత్ర అప్లికేషన్ వినియోగించుకున్న ప్రయాణికుల్లో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం రెండోస్థానంలో నిలిచినట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ తెలిపింది. ఈ అప్లికేషన్‌ను ఇప్పటివరకు 1.74 మిలియన్ల మంది వినియోగించుకున్నారని పేర్కొంది. డిజి యాత్రను తొలుత న్యూఢిల్లీ, బెంగళూరు, వారణాసి విమానాశ్రయాల్లో గత ఏడాది డిసెంబర్‌లో ప్రారంభించారు. విజయవాడ, హైదరాబాద్, కోల్‌కతా, పుణెల్లో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి జూన్ 14వ తేదీ వరకు డిజి యాత్ర అప్లికేషన్‌ను వారణాసిలో 2,69,237 మంది ప్రయాణికులకుగాను 1,52,585 (56.67 శాతం) మంది, విజయవాడ విమానాశ్రయంలో 91,313 మంది ప్రయాణికులకుగాను 46,668 (51.11 శాతం) మంది, హైదరాబాద్‌లో 20,81,400 మంది ప్రయాణికులకుగాను 37,133 (1.78 శాతం) మంది వినియోగించుకున్నారని వివరించింది. జూన్ 14 నుంచి 20వ తేదీ వరకు ఈ అప్లికేషన్‌ను వినియోగించుకున్నవారి శాతం వారణాసిలో 76.40కి, విజయవాడలో 62.20కి, హైదరాబాద్‌లో 4.70కి పెరిగినట్లు తెలిపింది.

14 గంటలు నిర్విరామ నృత్య ప్రదర్శన

- 4 ప్రపంచ రికార్డులు నెలకొల్పిన నృత్య కళాకారిణులు



ఆనం కళా కేంద్రంలో నృత్య ప్రదర్శన

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని శ్రీవెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో గురువారం 101 మంది నృత్య కళాకారులు 101 సార్లు నృత్యంతో తాండవం చేశారు. కళాసమ్మేళనం–2023 పేరిట రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, శ్రీరాధాకృష్ణ ట్రస్టు, శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జాతీయ నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. మొదటిరోజు గురువారం నిర్వహించిన ప్రదర్శన నాలుగు ప్రపంచ రికార్డులను నెలకొల్పింది. ఉదయం 5.40 గంటలకు ప్రారంభమైన నృత్య ప్రదర్శన రాత్రి 7.40 గంటల వరకు కొనసాగింది. 14 గంటల 2 నిమిషాల 2 సెకన్లపాటు హనుమాన్ చాలీసా నృత్య కార్యక్రమంలో 101 మంది కళాకారిణులు 101 సార్లు నిర్విరామంగా నర్తించారు. ప్రతి 15 నిమిషాలకి 9 మంది కళాకారుల చొప్పున ప్రదర్శన నిర్వహించారు. కాలిఫోర్నియా, దుబాయ్ వంటి దేశాల నుంచే కాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నాలుగేళ్ల నుంచి 16 ఏళ్ల బాలికల వరకు ఇందులో పాల్గొన్నారు. శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర వ్యవస్థాపకుడు జి.బి.నారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. గుంటూరుకు చెందిన శ్రీశైవక్షేత్ర స్థాపకుడు శివస్వామి కళాకారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

వరల్డ్ రికార్డ్స్ ఇవే..

భారత్ వరల్డ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, గోల్డెన్ స్టార్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఈ నృత్య ప్రదర్శన నమోదైంది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ వారి నుంచి ఇంకా ధ్రువీకరణ రావాల్సి ఉందని నిర్వాహకుడు జి.బి.నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కుషల్ భట్టాచార్య, డాక్టర్ పోతిన శ్రీనివాస్, డాక్టర్ గోరుగుంతు ఉమా జయశ్రీ, తిరుపతి శ్రీవాణియాళ్ళ, షేక్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో కలవరం

క్షణికావేశంలో గోదావరిలో దూకి బలవన్మరణాలు

సంఘటనలతో కలవరం

- కొన్ని అనాథశవాలకు పోలీసులే అంత్యక్రియలు
- రోడ్డు-కం-రైలు వంతెనపై పోలీసు గస్తీ ఏర్పాటు
- పోలీస్ అవుట్‌పోస్టు ద్వారా మరింత పహారా

ఈనెల 16న తాడేపల్లిగూడెం మండలం కొండ్రుపోలుకి చెందిన బొట్టా విజయ్ కుమార్ అనే యువకుడు ఇష్టం లేని పెళ్లి సంబంధం కుదిర్చారని రోడ్డు-కం-రైలు వంతెన నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఈనెల 17న దేవరపల్లి మండలం దుద్దుకూరుకు చెందిన షేక్ నాగూర్ తన భార్య కాపురానికి రాలేదని మనస్థాపం చెంది గామన్ ఇండియా బ్రిడ్జిపై నుంచి దూకి ప్రాణాలు తీసుకున్నాడు.

ఈనెల 17న భార్య, సోదరుడు మందలించారనే మానసిక వేదనతో రాజమహేంద్రవరానికి చెందిన మహ్మద్ శ్రీనివాస్ అనే వ్యక్తి రోడ్డు-కం-రైలు వంతెనపై నుంచి గోదావరిలో దూకి తనువు చాలించాడు.



కొవ్వూరు టోల్‌గేట్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు అవుట్ పోస్టు వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ

కొవ్వూరు: క్షణికావేశంతో నిండు ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. చిన్న చిన్న కారణాలతో జీవితంపై విరక్తి చెంది గోదావరి నదిలో దూకి బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఎన్ని భద్రతా చర్యలు తీసుకుంటున్నా ఇటీవల ఈతరహా మరణాల సంఖ్య పెరుగుతోంది.రోడ్డు కం రైలు వంతెన, గామన్ ఇండియా బ్రిడ్జి ధవళేశ్వరం ఆనకట్టలు ఆత్మహత్యకు ఎంచుకుంటున్నారు. కుటుంబ సభ్యులతో గొడవలు, ఆర్థిక ఇబ్బందులు, భార్య,భర్తల మధ్య స్పర్థలు, ఇలా పలు కారణాలతో తనువు చాలిస్తున్నారు. వరుసగా సంభవిస్తున్న విషాదాంత సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఈ రెండు చోట్లే ఎక్కువ

గతేడాది జనవరి నుంచి ఇప్పటివరకు కేవలం రోడ్డు-కం-రైలు వంతెన, గామన్ బ్రిడ్జిలపై నుంచి దూకి 46 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. పరిస్థితి తీవ్రతకు ఈ సంఖ్య దర్పణం పడుతోంది. ఇవి పోలీసు రికార్డుల్లో నమోదైనవి మాత్రమే. రాజమహేంద్రవరం, ధవళేశ్వరం పరిధిలో ఆత్మహత్యలకు పాల్పడిన వారి వివరాలు కలుపుకొంటే ఈ సంఖ్య సుమారు వందకి పైగా ఉంటుంది. ఇవి కాకుండా పలువురి శవాలు ఎగువ ప్రాంతాల నుంచి కొట్టుకుని వస్తుంటాయి. జన సంచారం ఉన్న వైపు శవాలను గుర్తిస్తున్నారు .నదిలో అతలివైపు, మధ్యలో ఉన్న ఇసుక తెన్నెల వద్దకు చేరితే ఆస్తిపంజరాలుగా కొన్నాళ్ల తర్వాత కనిపిస్తున్నాయి.

అన్వేషణకు విఫలయత్నం

కొందరు కుటుంబ సభ్యులకు తెలియకుండా నదిలోకి దూకి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వీరి కోసం కుటుంబ సభ్యులు కొన్నాళ్లు వెతికి ఊరుకుంటున్నారు. వీరిలో కొందరి మృతదేహాలు నదీ ప్రవాహం ఎక్కువ ఉన్న సమయంలో దిగువకు కొట్టుకుపోతున్నాయి. గోదావరిలో దూకినట్లు సమాచారం తెలిసిన వారు నదీ తీరం పొడవునా వెతుకుతున్నారు. 24 గంటల తర్వాత శవాలు తేలియాడటం, ఏదో ఒడ్డుకు వచ్చి తేలియాడడం, ఇసుక తిన్నెలు, తుప్పలుంటే అడ్డు పడితే తప్పా శవాలు దొరకని పరిస్థితి ఉంది. ఆచూకీ లభ్యం కాక విడిచిపెట్టిన సందర్భాలూ ఉంటున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడి వచ్చి గోదావరిలో దూకి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఏడాదిన్నరలో ఇలా పది గుర్తు తెలియని వ్యక్తుల శవాలు వచ్చాయి. పోలీసులే వీటికి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.

మద్దూరులంక అంటే భయమే

విజ్జేశ్వరం ఆనకట్ట వద్ద గేట్ల దిగువన మద్దూరులంక సమీపంలో సరదాగా స్నానాలకు దిగి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నెల 4న రాజమహేంద్రవరానికి చెందిన నక్కా సాంబశివరావు నిడదవోలు మండలం పురుషోత్తపల్లి జాతరకు వచ్చారు. మద్దూరులంక వద్ద స్నానానికి మునిగి మృతి చెందాడు. గత ఏడాది జనవరి 30న నిడదవోలుకు చెందిన గొడవర్తి రవితేజ, గత నెల 24న చిన తాడేపల్లికి చెందిన ప్రేమ్‌కుమార్, పురుషోత్తపల్లికి చెందిన అక్కా చెల్లెళ్లు, గత ఏడాది జూన్ 25న పాసన లక్ష్మీప్రసన్న,పాసన సాయి రాజేశ్వరీలు ఇక్కడైస్నానాలకు దిగి నీటి మునిగి చనిపోయారు.



మద్దూరులంకలో స్నానాలు చేస్తున్న సందర్శకులు

నిరంతరం గస్తీ ఏర్పాటు



వంతెనలపై హైవే పెట్రోలింగ్ పోలీసులు,అవుట్ పోస్టులోను సిబ్బందిని అందుబాటులో ఉంచాం. నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. అనుమానితులు వంతెనపై తారసపడినట్లు సమాచారం అందించాలని ఫ్లెక్సీ బ్యానర్లను ప్రదర్శిస్తున్నాం. గోదావరి వంతెనలపై ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. దీంతో అనేక మంది ఫోటోలు దిగుతున్నారు. అందువల్ల ఆత్మహత్యకు పాల్పడే వారిని గుర్తించడం కష్టంగా ఉంటోంది.

–వీఎస్ఎన్ వర్మ, డీఎస్పీ,కొవ్వూరు

పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు

రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఏప్రిల్ 26 కొవ్వూరు వస్తున్న సమయంలో ఓ వ్యక్తి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై వెంటనే ఆమె స్పందించారు. వంతెనపై నిరంతరం గస్తీ ఏర్పాటు చేశారు. టోల్‌గేట్ జంక్షన్ వద్ద పోలీసు అవుట్ పోస్టు పెట్టారు. ఇద్దరు పోలీసు సిబ్బంది, ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది 24 గంటలూ కాపాలా కాస్తున్నారు. హైవే పెట్రోలు వాహనాలు కూడా గామన్ ఇండి యా బ్రిడ్జిపై నిరంతరం ఫోకస్ పెడు తు న్నాయి. ఇటీవల నదిలో దూకిన ఆటో డ్రైవర్‌ను ఈ సిబ్బంది సురక్షితంగా రక్షించారు. అవుట్ పోస్టులో తాళ్లు,లైఫ్ జాకె ట్లు,ఇతర సామగ్రిని అం దుబాటు ఉంచా రు. అగ్నిమాపక శాఖ సైరన్‌తో తిరిగే ఒక బుల్లెట్ వాహనాన్ని కూడా ఏర్పాటు చేశారు.

ఏకాభిప్రాయం లేకున్నా ముందుకే!

గోదావరి-కావేరి అనుసంధానంపై రాష్ట్రాలతో ఒప్పందానికి సిద్ధమైన ఎన్‌డబ్ల్యూడీఏ

సాక్షి, అమరావతి: గోదావరి – కావేరి నదుల అనుసంధానంపై వాటి పరివాహక ప్రాంతాల (బేసిన్) పరిధిలోని రాష్ట్రాల అభిప్రాయాలకు విరుద్ధంగా జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) ముందడుగు వేసేందుకు సిద్ధమైంది. అనుసంధానం ప్రతిపాదనపై రాష్ట్రాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, వచ్చే నెల 11న నిర్వహించనున్న 71వ పాలక మండలి సమావేశం అజెండాలో గోదావరి – కావేరి అనుసంధానం ఒప్పందాన్ని ఎన్‌డబ్ల్యూడీఏ చేర్చింది. దీనిపై ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఇంద్రావతి సబ్ బేసిన్‌లో బచావత్ ట్రిబ్యునల్ తమకు చేసిన కేటాయింపుల్లో వాడుకోని నీటిలో 141.3 టీఎంసీలను కావేరికి ఎలా తరలిస్తారని ఎన్‌డబ్ల్యూడీఏను ఛత్తీస్‌గఢ్ సర్కార్ ఇప్పటికే నిలదీసింది. తమను సంప్రదించకుండా తమ కోటా నీటిపై ఏకపక్షంగా ఎలా నిర్ణయం తీసుకుంటారని ప్రశ్నించింది. ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోకుంటే న్యాయస్థానంలో సవాల్ చేస్తామని స్పష్టం చేసింది. గోదావరిలో 75 శాతం లభ్యత ఆధారంగా నీటి లభ్యతలో మిగులు జలాలు లేవని, శాస్త్రీయంగా నీటి లభ్యతను తేల్చాకే అనుసంధానాన్ని చేపట్టాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు స్పష్టం చేశాయి. వీటిని పరిగణనలోకి తీసుకోకుండా అనుసంధానంపై రాష్ట్రాల మధ్య ఒప్పందాన్ని ఎన్‌డబ్ల్యూడీఏ పాలక మండలి సమావేశం అజెండాలో చేర్చడంపై నీటి పారుదల రంగ నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నీటి లభ్యత తేల్చకుండానే

గోదావరి–కావేరి అనుసంధానం ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడులోని దుర్భిక్ష ప్రాంతాలకు సాగు, తాగు నీరు అందించాలని కేంద్రం నిర్ణయించింది. అకినేపల్లి (వరంగల్ జిల్లా) నుంచి 247 టీఎంసీల గోదావరి జలాలను నాగార్జునసాగర్ (కృష్ణా), సోమశిల (పెన్నా) మీదుగా గ్రాండ్ ఆనకట్ట (కావేరి)కి తరలించేలా 2019 ఫిబ్రవరిలో ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడుకు 80 టీఎంసీల చొప్పున కేటాయించి ఆవిరి, ప్రవాహ నష్టాలుపోను మిగిలిన నీటిని కర్ణాటకకు ఇవ్వాలని ప్రతిపాదించింది. నీటి లభ్యతను శాస్త్రీయంగా తేల్చాకే కావేరికి గోదావరి జలాలను తరలించాలని ఏపీ, తెలంగాణ సూచించడంతో ఎన్‌డబ్ల్యూడీఏ 2021లో మరో ప్రతిపాదన చేసింది. కావేరికి గోదావరి జలాలను తరలించే ప్రాంతాన్ని అకినేపల్లి (వరంగల్ జిల్లా) నుంచి ఇచ్చంపల్లి (జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా)కి మార్చింది. ఇచ్చంపల్లి వద్ద ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141.3 టీఎంసీలకు అదనంగా 106 టీఎంసీల వరద జలాలను జతచేసి.. నాగార్జున సాగర్, సోమశిల మీదుగా కావేరికి తరలించేలా ప్రతిపాదించింది. దీనిపై తెలుగు రాష్ట్రాలు అభ్యంతరం తెలిపాయి. నికర జలాలు, వరద జలాలను ఎలా వర్గీకరిస్తారని ప్రశ్నించాయి. తమ రాష్ట్రాల ప్రయోజనాలు దెబ్బతింటాయని అభ్యంతరం చెప్పడంతో ఎన్‌డబ్ల్యూడీఏ మళ్లీ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది.

కనీసం ఛత్తీస్‌గఢ్‌ను సంప్రదించకుండానే

ఛత్తీస్‌గఢ్‌కు ఇంద్రావతి బేసిన్‌లో కేటాయించిన నీటిలో వాడుకోని 141.3 టీఎంసీలను ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్‌లోకి ఎత్తిపోసి సాగర్ కుడి కాలువకు సమాంతరంగా తవ్వే కాలువ ద్వారా సోమ శిల, కండలేరుకు తరలించి అక్కడి నుంచి కావేరి గ్రాండ్ ఆనకట్టకు తీసుకెళ్లేలా తాజాగా ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. ఆవిరి, ప్రవాహ నష్టాలుపోను ఆంధ్రప్రదేశ్‌కు 41.8, తెలంగాణకు 42.6, తమిళనాడుకు 38.6, పుదుచ్చేరికి 2.2, కర్ణాటకకు 9.8 టీఎంసీలను అందించాలని ప్రతిపాదించింది. ఈ క్రమంలో నదుల అనుసంధానంపై ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఛత్తీస్‌గఢ్ సర్కార్‌ను సంప్రదించకుండానే బేసిన్‌లోని మిగతా రాష్ట్రాలతో మార్చి 6న హైదరాబాద్‌లో సమావేశాన్ని నిర్వహించింది. ఛత్తీస్‌గఢ్‌ను సంప్రదించకపోవడంపై అన్ని రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ప్రధాని నరేంద్ర మోదీ లేదా కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఛత్తీస్‌గఢ్ సర్కారుతో ఈ అంశంపై చర్చిస్తారని టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ వెదిరె శ్రీరాం ఆ సమావేశంలో పేర్కొన్నారు. కానీ.. ఇప్పటివరకూ ఛత్తీస్‌గఢ్‌ను కేంద్రం సంప్రదించిన దాఖలాలు లేవు. ఇప్పుడు ఏకంగా అనుసంధానంపై ఒప్పందాన్ని అజెండాగా చేర్చుతూ ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశం ఏర్పాటు చేసింది.



వైట్‌హౌజ్ సౌత్‌లాన్‌లోని బ్లూ రూం బాల్కనీ నుంచి మోదీ, బైడెన్ దంపతుల అభివాదం



వైట్‌హౌజ్ వద్ద భారత సంతతి ప్రజల సందడి



మోదీతో ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్, పక్కన ఆమె భర్త (ఎడమ వైపు చివరి వ్యక్తి)

సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో నూతన అధ్యాయం

ప్రజాస్వామ్యం భారత్, అమెరికా దేశాల డీఎన్‌ఏలో ఉంది

జో బైడెన్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడిన ప్రధాని మోదీ

వాషింగ్టన్: భారత్, అమెరికా మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో నూతన ఆధ్యాయం చేరిందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చెప్పినట్లుగా ప్రజాస్వామ్యం అనేది భారత్, అమెరికా దేశాల డీఎన్‌ఏలో ఉందని అన్నారు. ప్రపంచంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. ఈ రోజులో బైడెన్‌తో కీలక అంశాలపై చర్చలు జరిపానని తెలిపారు. ప్రజాస్వామికవిలువల గురించి తాము మాట్లాడుకున్నామని వెల్లడించారు. గురువారం వైట్‌హౌస్‌లో చర్చలు ముగిసిన అనంతరం మోదీ, బైడెన్ ఉమ్మడిగా మీడియా సమావేశంలో మాట్లాడారు. భారత్–అమెరికా సంబంధాల చరిత్రలో ఈరోజుకు ఒక ప్రత్యేక



పత్రికా సమావేశంలో మోదీ, బైడెన్

ప్రాధాన్యం ఉందని మోదీ పేర్కొన్నారు. అంతరిక్ష ప్రయోగాల్లో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించామన్నారు. వ్యూహాత్మక సాంకేతిక భాగస్వామ్యాన్ని ఫలవంతం చేయడానికి ఇరుదేశాల ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు ఒక్కతాటిపైకి వచ్చి, కలిసి పనిచేసేలా అంగీకారానికి వచ్చామని స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య భాగస్వామ్యం నేడు మరో కొత్త స్థాయికి చేరిందన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదంపై భారత్, అమెరికా కలిసి పోరాడుతున్నాయని చెప్పారు. నూతన రంగాల్లో భారత్, అమెరికా కలిసి చేయాలన్నదే తన ఆకాంక్ష అని జో బైడెన్ వివరించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంత బలంగా ఉన్నాయన్నారు. భారత్, అమెరికాకు అపరిమితమైన శక్తి సామర్థ్యాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధ్య దాపరికాలకు తావు లేదని, పరస్పరం చక్కగా గౌరవించుకుంటున్నాయని బైడెన్ తెలియజేశారు. ప్రతి పౌరుడికీ గౌరవం లభించాలన్నారు.

అమెరికా స్ఫూర్తితో సాహసోపేత నిర్ణయాలు

రక్షణ, అంతరిక్షం, ఇంధనం, ఆధునిక సాంకేతికత వంటి రంగాల్లో వ్యూహాత్మక సంబంధాలను పెంపొందించుకోవడమే లక్ష్యంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో గురువారం అధికారిక చర్చలు జరిపారు. అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీసు ఈ ముఖాముఖి సమావేశానికి వేదికగా మారింది. పరస్పర ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశాలతోపాటు అంతర్జాతీయ పరిణామాలపై ఇరువురు నేతలు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్–అమెరికా మధ్య సంబంధాల బలోపేతానికి బైడెన్ చేపట్టిన చర్యలను మోదీ ప్రశంసించారు. భారత్–అమెరికా ప్రజల మధ్యనున్న బలమైన అనుబంధమే ఇరు దేశాల నడుమ సంబంధాలకు అసలైన చోదక శక్తి అని పేర్కొన్నారు. నేడు భారత్–అమెరికా సముద్రాల లోతుల నుంచి ఆకాశం అంచుల దాకా, ప్రాచీన సంస్కృతి నుంచి ఆధునిక కృత్రిమ మేధ దాకా భుజం భుజం కలిపి ముందుకు సాగుతున్నాయని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇరుదేశాల మధ్య సంబంధాల విషయంలో అమెరికా చూపుతున్న అంకితభావం తాము సాహసోపేత నిర్ణయాలు, చర్యలు తీసుకోవడానికి స్ఫూర్తినిస్తోందని వ్యాఖ్యానిచారు. మోదీ, బైడెన్ శ్వేతసౌధంలో 24 గంటల వ్యవధిలో రెండుసార్లు కలిసి మాట్లాడుకున్నారు.

దేశ ఆయుధ పరిశ్రమలో నవశకం!

యుద్ధవిమాన జెట్ ఇంజన్ల తయారీకి జనరల్ ఎలక్ట్రిక్‌తో హాల్ ఒప్పందం

ఒప్పందంతో మోదీ అమెరికా పర్యటనలో మేలి మలుపు



వాషింగ్టన్: గగనతలంలో శత్రుదేశంపై పైచేయి సాధించేందుకు మెరుపువేగంతో దూసుకెళ్లి దాడి చేసే యుద్ధవిమానాలు అవసరం. ఆ విమానాలకు అపార శక్తిని సరఫరాచేసే జెట్ ఇంజన్లే గుండెకాయ. అలాంటి అత్యంత అధునాతన ఎఫ్414 జెట్ ఇంజన్లను భారత్‌లోనే తొలిసారిగా తయారుచేసేందుకు మార్గం సుగమమైంది. ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఇది సాధ్యమైంది. భారత్‌లోనే ఫైటర్‌జెట్ ఇంజన్లను తయారుచేసేందుకు సంబంధించిన చరిత్రాత్మక అవగాహన ఒప్పందం జనరల్ ఎలక్ట్రిక్(జీఈ) ఏరోస్పేస్, హిందుస్తాన్ ఎరోనాటిక్స్ (హాల్) మధ్య అమెరికాలో కుదిరింది. 'భారత వాయుసేనకు చెందిన అధునాతన తేలికపాటి యుద్ధవిమానం తేజస్‌లో శక్తివంత ఎఫ్414 ఇంజన్లను బిగిస్తారు. ఈ ఇంజన్లను భారత్‌లోనే తయారుచేస్తామని జీఈ ప్రకటించింది.

ఒప్పందాలు

ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా భారత్–అమెరికా మధ్య పలు కీలక ఒప్పందాలు కుదిరాయి. అవి..

1. ఇరుదేశాల నడుమ కుదిరిన మారీటైమ్ ఒప్పందం ప్రకారం.. ఆసియా ప్రాంతంలో సంచరించే అమెరికా నావికాదళం నౌకలు ఒకవేళ మరమ్మతులకు గురైతే భారత్‌లోని షిప్‌యార్డుల్లో ఆగవచ్చు. మరమ్మతులు చేసుకోవచ్చు.
2. సముద్రాలపై నిఘా కోసం ఆర్మ్‌డ్ ఎంక్యూ-9బీ సీ గార్డియన్ డ్రోన్లను అమెరికా నుంచి భారత్ కొనుగోలు చేయనుంది. దీనిపై ఒప్పందం కుదిరింది.
3. అమెరికాకు చెందిన చిప్ తయారీ కంపెనీ 'మైక్రాన్' గుజరాత్‌లో సెమీ కండక్టర్ల తయారీ, పరీక్షల ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం 800 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుంది.
4. హెచ్-1బీ వంటి వీసాలున్న వారు అమెరికాలోనే వీసా రెన్యువల్ పొందేలా తొలి దఫాలో పైలట్ ప్రాజెక్టు మొదలుపెట్టాలని యోచన.

ఈ ఇంజన్ అసమానం

'ఎఫ్414 ఇంజన్ పనితీరుతో ఏదీ సాటిరాదు. మా కస్టమర్ దేశాల సైనిక అవసరాలు తీర్చడంలో, అత్యుత్తమ ఇంజన్లను అందించేందుకు సదా సిద్ధం. ఇరుదేశాల ధృడ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలన్న మోదీ, బైడెన్ దార్శనికతలో మేం కూడా భాగస్వాములు కావడం గర్వంగా ఉంది' అని లారెన్స్ జూనియర్ అన్నారు. తొలి దఫాలో 99 ఇంజన్లను తయారుచేస్తారు. ఇన్నాళ్లూ రష్యా, ఐరోపా దేశాల నుంచే యుద్ధవిమానాలను కొనుగోలు ఒప్పందాలు చేసుకున్న భారత్ ఇప్పుడు అమెరికా దిగ్గజ సంస్థతో తయారీ ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో భారత ఆయుధ పరిశ్రమలో నూతన శకం ఆరంభం కానుంది. ఎఫ్414–ఐఎన్ఎస్6 ఇంజన్ల ఉమ్మడి తయారీ భాగస్వామ్యంతోపాటు అడ్వాన్స్‌డ్ మీడియా కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఏఎంసీఏ)ఎంకే2 ఇంజన్ ప్రోగ్రామ్ కోసం భారత్‌తో జీఈ కలిసి పనిచేయనుంది. ప్రస్తుతం భారత వాయుసేన తేలికపాటి 88 యుద్ధ విమానాల కోసం హాల్.. జీఈ 404 ఇంజన్లనే దిగుమతి చేసుకుని వాటికి బిగిస్తోంది. ఇకపై శక్తివంత ఎఫ్414 ఇంజన్ల సామర్థ్యంతో గగనతలంలో భారత వాయుసేన సత్తా మరింత ఇనుమడించనుంది. ఇటీవల ఫ్రాన్స్‌కు చెందిన యుద్ధవిమానాల తయారీ సంస్థ దసాల్ట్ నుంచి 36 రఫేల్ యుద్ధవిమానాలను భారత్ కొనుగోలుచేయడం తెల్సిందే.

ప్రజాస్వామిక విలువలే ఆధారం

భారత్, అమెరికా సమాజాలపై మోదీ వ్యాఖ్య

అధికారిక లాంఛనాలతో స్వాగతం పలికిన జో బైడెన్ దంపతులు

ప్రపంచ శాంతి, సౌభాగ్యం, స్థిరత్వం కోసం కలిసి పని చేస్తున్నాయని మోదీ స్పష్టీకరణ

వాషింగ్టన్: భారత్, అమెరికా సమాజాలు, సంస్థలు ప్రజాస్వామిక విలువలపై నిర్మితమై ఉన్నాయని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. తమ వైవిధ్యాన్ని ఇరు దేశాలు గర్వకారణంగా భావిస్తున్నాయని చెప్పారు. నాలుగు రోజుల అధికారిక పర్యటన కోసం అమెరికాలో అడుగుపెట్టిన మోదీకి గురువారం శ్వేతసౌధంలో సాదర స్వాగతం లభించింది. అధికారిక లాంఛనాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. భారత్, అమెరికా రాజ్యాంగాలు 'దేశ ప్రజలమైన మేము' అనే మూడు పదాలతోనే ప్రారంభమవుతాయని గుర్తుచేశారు. తనకు అద్భుతమైన స్వాగతం పలికిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, జిల్ బైడెన్ దంపతులకు, అమెరికా ప్రభుత్వ యంత్రాంగానికి మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈరోజు ఇక్కడ తనకు లభించిన స్వాగతం 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గొప్ప గౌరవమని హర్షం వ్యక్తం చేశారు. అమెరికాలో నివసిస్తున్న 40 లక్షల మందికిపైగా భారతీయులకు గర్వకారణమని అన్నారు.

ప్రజాస్వామ్య బలానికి ఇదొక రుజువు: మోదీ

'అందరి ప్రయోజనాల కోసం, అందరి సంక్షేమం కోసం' అనే ప్రాథమిక సూత్రాన్ని భారత్, అమెరికా ఎంతగానో విశ్వసిస్తున్నాయని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. మూడు దశాబ్దాల క్రితం ఒక సామాన్యుడిగా అమెరికా వచ్చానని, అప్పుడు వైట్‌హౌస్ బయటి నుంచే చూశానని అన్నారు. ప్రధానమంత్రి హోదాలో చాలాసార్లు ఇక్కడికి వచ్చానని చెప్పారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన భారతీయ–అమెరికన్ల కోసం వైట్‌హౌజ్ గేట్లు తెరవడం బహుశా ఇదే మొదటిసారి కావొచ్చని అన్నారు. అమెరికాలో ఉంటున్న భారతీయులు కష్టపడి పని చేస్తున్నారని, భారతదేశ గౌరవాన్ని ఇనుమడింపజేస్తున్నారని మోదీ ప్రశంసించారు. భారత్–అమెరికా స్నేహం మొత్తం ప్రపంచాన్ని బలోపేతం చేయడానికి ఒక సాధనంగా ఉపయోగపడుతుందన్నారు. ప్రపంచ శాంతి, సౌభాగ్యం, స్థిరత్వం కోసం ఇరుదేశాలు కలిసి పని చేస్తున్నాయని వివరించారు. ప్రజాస్వామ్య బలానికి భారత్–అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యమే ఒక రుజువు అని వెల్లడించారు. కీలకమైన అంశాలపై అధ్యక్షుడు జో బైడెన్‌తో చర్చించబోతున్నానని పేర్కొన్నారు. చర్చలు సానుకూలంగా జరుగుతాయని ధీమా వ్యక్తం చేశారు. అమెరికా పార్లమెంట్‌ను రెండోసారి ఉద్దేశించి ప్రసంగించే అవకాశం దక్కడం చాలా ఆనందంగా ఉందన్నారు.

భారత్ సహకారంతో 'క్వాడ్' బలోపేతం: బైడెన్


భారత్–అమెరికా సంబంధాలు 21వ శతాబ్దంలో అత్యంత ప్రభావశీల సంబంధాల్లో ఒకటి అని జో బైడెన్ స్పష్టం చేశారు. వైట్‌హౌస్‌లో మోదీని ఆహ్వానిస్తూ ఆయన మాట్లాడారు. ఈ రోజు రెండు దేశాలు కలిసి తీసుకుంటున్న నిర్ణయాలు రాబోయే తరాల భవిష్యత్తును నిర్ణయిస్తాయని చెప్పారు. ఆరోగ్య సంరక్షణ సేవల విస్తరణ, వాతావరణ మార్పుల నియంత్రణ వంటి అంశాలపై ఇరుదేశాలు సన్నిహితంగా కలిసి పని చేస్తున్నాయని తెలిపారు. స్వేచ్ఛాయుత, భద్రమైన ఇండో–పసిఫిక్ లక్ష్యంగా భారత్ సహకారంతో 'క్వాడ్' కూటమిని బలోపేతం చేస్తున్నామని బైడెన్ వివరించారు.

బైడెన్‌కు మోదీ సహస్ర చంద్రోదయ కానుక

చందనం పెట్టెలో దశదానాల సామగ్రితో బహుమానం | జిల్ బైడెన్‌కు గ్రీన్ డైమండ్ | అరుదైన కానుకలిచ్చిన ప్రధాని మోదీ

వాషింగ్టన్: అమెరికాలో పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడే కానుకలను అధ్యక్షుడు బైడెన్ దంపతులకు బహూకరించారు. శ్వేతసౌధంలో మోదీకి బైడెన్ దంపతులు బుధవారం రాత్రి కుటుంబ సభ్యుల మధ్య విందు ఏర్పాటు చేశారు. ఈ విందు సందర్భంగా ఇరువురు నేతలు కానుకలు ఇచ్చిపుచ్చుకున్నారు. భారతీయ సంప్రదాయంలో సహస్ర చంద్ర దర్శనం చూడడం అంటే జీవితంలో ఒక మైలు రాయి. అధ్యక్షుడు బైడెన్ వచ్చే నెలలో సహస్ర చంద్ర దర్శనం పూర్తి అవుతున్న అరుదైన సందర్భం ఎప్పటికీ గుర్తు ఉండిపోయేలా చందనం చెక్క బాక్స్‌ని ఇచ్చారు. దానిపై రాజస్థానీ కళాకారుడు డిజైన్ వేశారు. చందనం పెట్టె లోపల "దృష్ట సహస్రచంద్రో" అని రాసి ఉన్న ఒక పత్రం, విఘ్నాలను తొలగించే గణేశుడి వెండి ప్రతిమ , దీపం, దశదానాలు చేయడానికి వీలుగా చిన్న చిన్న వెండి పాత్రల్లో ధాన్యాలు, బెల్లం, వెన్న, వస్త్రం వంటివి ఉంచి కానుకగా ఇచ్చారు. రెండు పున్నముల మధ్య 29.53 రోజులు ఉంటుంది. అలా వెయ్యి సార్లు చంద్రుడిని వీక్షించడానికి 29,530 రోజులు లేదంటే 80 ఏళ్ల 8 నెలలు పడుతుంది. అలా సహస్ర చంద్ర దర్శనం చేసుకున్న వ్యక్తిని భారతీయ సంప్రదాయంలో ఎంతో గౌరవిస్తారు. వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడడానికి బైడెన్ వయసుపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో అంత ఆయుష్షు భారత దేశంలో ఎంత గౌరవనీయమో తెలిపేలా మోదీ ఈ బహుమానాన్ని ఇచ్చారు.

బైడెన్ దంపతులకు ఇచ్చిన కానుకలు



- మైసూరులో తయారైన చందనం పెట్టె
- ది టెన్ ప్రిన్సిపల్స్ ఉపనిషద్స్ అనువాద పుస్తకం
- ప్రథమ మహిళ జిల్ బైడెన్‌కు గ్రీన్ డైమండ్‌ను కానుకగా ఇచ్చారు. ల్యాబ్‌లో తయారు చేసిన 7.5 క్యారెట్ వజ్రం ఇది. సోలార్ విండ్, పవర్ విండ్‌తో దీనిని రూపొందించారు. కాగితం గుజ్జుతో తయారు చేసిన ఒక బాక్స్‌లో దీనిని ఉంచి ఇచ్చారు.

మోదీకి బైడెన్ ఇచ్చిన కానుకలు



- అత్యంత ప్రాచీనమైన చేతితో రాసిన పుస్తకం గ్యాలీ
- వింటేజ్ అమెరికన్ కెమెరా
- అమెరికాలో వన్యప్రాణుల ఫోటోగ్రఫీతో కూడిన పుస్తకం
- రాబర్ట్ ఫ్రాస్ట్ రాసిన కవితల పుస్తకం 'కలెక్టెడ్ పోయెమ్స్ ఆఫ్ రాబర్ట్ ఫ్రాస్ట్' పుస్తకం తొలి కాపీ

హెచ్-1బీ వీసా రెన్యువల్ అక్కడే !

- అమెరికాలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించే యోచన
- అమల్లోకొస్తే వేలాది మంది భారతీయ టెకీలకు లబ్ధి

వాషింగ్టన్: హెచ్–1బీ వీసా వంటి నాన్–ఇమ్మిగ్రెంట్ వీసాలపై అమెరికాలో ఉపాధి పొందిన భారతీయులకు శుభవార్త!. వర్క్ వీసాల రెన్యువల్ కోసం ఆయా వీసాదారులు ఇకపై స్వదేశం(భారత్)కు వెళ్లి రావాల్సిన పనిలేకుండా వారికి అమెరికాలోనే పునరుద్ధరణ సేవలు పొందే సదావకాశం కల్పించాలని అమెరికా సర్కార్ యోచిస్తోంది. ఈ నిర్ణయం అమలైతే వేలాది మంది భారతీయులకు ఎంతో సమయం, విమాన ఖర్చులు ఆదా అవుతాయి. ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా భారతీయులకు అగ్రరాజ్యం అందిస్తున్న కానుకగా ఆ దేశ ఉన్నతాధికారి ఒకరు అభివర్ణించారు. నైపుణ్య ఉద్యోగాల్లో నియామకాల కోసం అమెరికా కంపెనీలు విదేశీయులకు హెచ్–1బీ వీసాలిచ్చి అమెరికాకు రప్పించడం తెల్సిందే. ఇలా హెచ్–1బీ వీసాలు పొందుతున్న వారిలో ఎక్కువ మంది భారతీయులే ఉండటం విశేషం. 'వీసా రెన్యువల్ కోసం సొంత దేశానికి వెళ్లకుండానే అమెరికాలోనే ఆ పని పూర్తయ్యేలా మొదట పైలట్ ప్రాజెక్టుగా ఈ విధానం అమలుచేస్తాం. త్వరలోనే ఇది మొదలుపెడతాం. హెచ్–1, ఎల్ వీసా దారులకు ఇది ఎంతో ఉపయోగకరం' అని ఆ అధికారి వెల్లడించారు. 2004 ఏడాదికి ముందువరకు నాన్–ఇమ్మిగ్రెంట్ వీసాల్లో కొన్ని విభాగాల వీసాలకు అమెరికాలోనే రెన్యువల్/స్టాంపింగ్ ఉండేది. తర్వాత పద్ధతి మార్చారు. హెచ్–1బీ వంటి వీసాదారులు ఖచ్చితంగా సొంత దేశం వెళ్లి వీసా పొడిగింపు సంబంధ స్టాంపింగ్‌ను పాస్‌పోర్ట్‌పై వేయించుకోవాలి. ఈ ప్రయాస తగ్గించాలనే అమెరికా భావిస్తోంది. కాగా, గత కొద్దినెలలుగా వీసాల జారీ ప్రక్రియను అమెరికా ప్రభుత్వం మరింత సరళతరం, వేగవంతం చేయడం విదితమే.

మోదీకి ప్రత్యేక విందు..

అగ్రరాజ్య పర్యటనలో ఉన్న భారత ప్రధాని మోదీకి అమెరికా అధ్యక్ష భవనంలో ఘనమైన స్వాగతం లభించింది. బుధవారం అమెరికా అధ్యక్షుడు జోసెఫ్ బైడెన్, ఆయన సతీమణి జిల్ ఎదురొచ్చి మరీ మోదీకి సాదర స్వాగతం పలికారు. ద్వారం వద్దే సరదాగా మాట్లాడుతూ ఫొటోలు దిగారు. తర్వాత శ్వేతసౌధంలోకి తోడ్కొని వెళ్లారు. వ్యక్తిగతంగా ప్రత్యేకమైన విందు ఇచ్చేందుకు అంతకుముందే మోదీని బైడెన్ దంపతులు ఆహ్వానించిన విషయం విదితమే. వైట్‌హౌజ్‌లో బైడెన్ కుటుంబసభ్యులతో మోదీ కాసేపు మాట్లాడారు. ' ప్రత్యేకమైన ఈ కార్యక్రమంలో మోదీ పాల్గొనడం ఇరుదేశాల గాఢమైన స్నేహబంధానికి సంకేతం' అని భారత విదేశాంగ శాఖ ఒక ట్వీట్‌చేసింది. తృణధాన్యాలు, మొక్కజొన్న పొత్తులు, పుచ్చకాయ, పుట్టగొడుగులు, మిల్లెట్ కేక్, స్ట్రాబెర్రీ కేక్ ఇలా భిన్న పదార్థాలతో వేర్వేరు వంటకాలను మోదీకి వడ్డించారు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ విందులో ముందుగా భారత పలు ప్రాంతాలను గుర్తుచేస్తూ అగ్రనేతలకు సంగీతం వినిపించారు. ఈ కార్యక్రమంలో ఇరు దేశాల జాతీయ భద్రతా సలహాదారులు జాక్ సులేవాన్, అజిత్ దోవల్‌లు పాల్గొన్నారు. మరోవైపు మోదీకి దాదాపు 400 మంది అతిథుల సమక్షంలో అధికారిక విందు ఇవ్వనున్నారు.



బెంగళూరు, అహ్మదాబాద్‌ల్లో అమెరికా కాన్సులేట్లు

భారత్‌లోని బెంగళూరు, అహ్మదాబాద్‌ల్లో కొత్త కాన్సులేట్ కార్యాలయాలను అమెరికా ప్రారంభించనుంది. అదేవిధంగా, అమెరికాలోని సియాటెల్‌లో భారత్ కాన్సులేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనుంది. మరో చోట కూడా కాన్సులేట్‌ను ఏర్పాటు చేసేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోందని గురువారం వైట్‌హౌస్ అధికారి ఒకరు వెల్లడించారు. 'గత ఏడాది రికార్డు స్థాయిలో భారతీయ విద్యార్థులకు 1.25 లక్షల వీసాలను అమెరికా మంజూరు చేసింది. అమెరికాలో చదివే విదేశీ విద్యార్థుల్లో భారతీయ విద్యార్థులదే అగ్రస్థానం'అని ఆ అధికారి అన్నారు. రాజధాని వాషింగ్టన్‌లోని రాయబార కార్యాలయంతోపాటు న్యూయార్క్, శాన్‌ఫ్రాన్సిస్కో, షికాగో, హ్యూస్టన్, అట్లాంటాల్లో భారత్‌కు ప్రస్తుతం కాన్సులేట్లున్నాయి. అదేవిధంగా, ఢిల్లీలోని అమెరికా ఎంబసీ ప్రపంచంలోనే అతిపెద్ద రాయబార కార్యాలయాల్లో ఒకటి. భారత్‌లోని ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్‌ల్లో అమెరికా కాన్సులేట్ కార్యాలయాలున్నాయి.

చైనా రెస్టారెంట్‌లో భారీ పేలుడు

31 మంది మృతి..ఏడుగురికి గాయాలు



బీజింగ్: చైనాలోని ఓ బార్బెక్యూ రెస్టారెంట్‌లో గ్యాస్ లీకేజీతో సంభవించిన పేలుడులో 31 మంది మృతి చెందగా మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. నింగ్జియా అటానమస్ ప్రాంతంలోని యించువాన్ నగరంలో బుధవారం రాత్రి 8.40 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. డ్రాగో బోట్ ఫెస్టివల్ సందర్భంగా బుధవారం నగరంలో పండగ వాతావరణ నెలకొంది. డౌన్‌టౌన్‌లోని ఫుయాంగ్ బార్బెక్యూ రెస్టారెంట్ జనంతో కిక్కిరిసి ఉన్న సమయంలో అందులోని గ్యాస్ సిలిండర్ లీకై భారీ పేలుడు జరిగింది. ఈ ఘటనలో 31 మంది చనిపోయారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. పేలుడు తీవ్రతకు చుట్టుపక్కల భవనాలు సైతం దెబ్బతిన్నాయి. సిలిండర్ నుంచి గ్యాస్ లీకవుతుండటంతో సిబ్బంది మరో వాల్వ్‌ను అమరుస్తున్న సమయంలో పేలుడు జరిగిందని అధికారులు తెలిపారు. రెస్టారెంట్ యజమానులుసహా 9 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెస్టారెంట్ ఆస్తుల్ని ప్రభుత్వం సీజ్ చేసింది. కాగా, ఈ ఏడాది చైనాలో రెండు ఘోర ప్రమాద ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇన్నర్ మంగోలియా గని ప్రమాదంలో 53 మంది ప్రాణాలు కోల్పోగా, బీజింగ్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదంలో 29 మంది చనిపోయారు.

మిషన్ 2024

- పట్నాలో నేడే విపక్షాల సమావేశం
- ఒకే కుటుంబంలా పోరాడుతామన్న తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమత

పట్నా: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కోవడానికి బీజేపీ వ్యతిరేక పార్టీలన్నీ ఏకమవుతున్నాయి. 20 ప్రతిపక్ష పార్టీలతో పట్నాలో శుక్రవారం సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ప్రధాని అభ్యర్థి ఎవరు వంటి అంశాల జోలికి పోకుండా ప్రజాసమస్యలపై పోరుబాట పట్టేలా వ్యూహరచన చేయనున్నట్టుగా తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే, పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ, పశ్చిమబెంగాల్, ఢిల్లీ, తమిళనాడు, జార్ఖండ్ ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, కేజ్రీవాల్, స్టాలిన్, హేమంత్ సోరెన్‌లతో పాటు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ వంటి అగ్ర నాయకులు హాజరుకానున్నారు. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్‌జేడీ నేత తేజస్వి యాదవ్ సమావేశానికి ఆతిథ్యం ఇస్తారు. ఈ సమావేశం మొట్టమొదటిది కావడంతో అత్యంత సంక్లిష్టమైన ప్రధాని అభ్యర్థి, సీట్ల సర్దుబాటు వంటి అంశాల జోలికి పార్టీలన్నీ ఒకే తాటిపైకి వచ్చి మోదీపై పోరుబాట పట్టే వ్యూహాలు రచించనున్నాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారమే పట్నాకి చేరుకున్నారు. ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌ని కలుసుకున్న ఆమె బీజేపీని తాము ఉమ్మడిగా ఒక కుటుంబంలా ఎదుర్కొంటామన్నారు. ఇలా విపక్ష పార్టీలన్నీ ఏకం కావడం శుభారంభమని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్‌కు ఆప్ అల్టిమేటమ్

విపక్ష పార్టీల సమావేశానికి ఒక్క రోజు ముందు ఆమ్ ఆద్మీ పార్టీ కాంగ్రెస్‌కు గట్టి షాక్ ఇచ్చింది. ఢిల్లీలో ప్రభుత్వ అధికారుల్నిపై నియంత్రణ కోసం కేంద్రం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌పై పోరాటంలో తమకు మద్దతుగా నిలవకపోతే విపక్ష పార్టీల సమావేశాన్ని బహిష్కరిస్తామని అల్టిమేటమ్ ఇచ్చింది.

టైటాన్ ఆశలు జల సమాధి

కొన్ని శకలాలను గుర్తించిన అమెరికా బలగాలు



దుబాయ్/బోస్టన్: అట్లాంటిక్ మహాసముద్రంలో టైటానిక్ ఓడ శకలాలను తిలకించడానికి టైటాన్ జలాంతర్గామిలో వెళ్లిన అయిదుగురూ ప్రాణాలు కోల్పోయారు. టైటాన్ కోసం అన్వేషణ ఒక వైపు తీవ్రంగా కొనసాగుతున్న సమయంలో గురువారం ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. టైటానిక్‌కు సమీపంలో కొన్ని శకలాలను గుర్తించినట్లు అమెరికా తీర రక్షక దళం తెలిపింది. తాము నీటి అడుగుకు పంపించిన పరికరం వాటిని గుర్తించిందని వెల్లడించింది. అవి టైటాన్‌వేనని తేల్చింది. 'తమ సంస్థ చీఫ్ పైలట్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ స్టాక్టన్ రష్, ప్రయాణికులైన షహ్‌జాదా దావూద్, ఆయన కొడుకు సులేమాన్ దావూద్, హామిష్ హార్డింగ్, పాల్–హెన్రీ నర్గియోలెట్ మృతి చెందారు'అని ఓషన్ గేట్ తెలిపింది. అయితే, వారు ఎలా ప్రాణాలు కోల్పోయారనే విషయం మాత్రం వెల్లడించలేదు. ఆదివారం ఉదయం బయలుదేరిన సమయంలో టైటాన్‌లో దాదాపు 96 గంటలపాటు మాత్రమే శ్వాసించేందుకు అవసరమైన ఆక్సిజన్ ఉంది. ఆ సమయం కూడా ముగిసిపోయింది. గురువారం ఉదయానికల్లా జలాంతర్గామిలో ఆక్సిజన్ ఇక పూర్తిగా నిండుకున్నట్లే. అయితే, టైటాన్ గల్లంతైన రోజే వారు మరణించారా? అంటే..ఆ పరిస్థితిని కూడా కొట్టిపారేయలేమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు అమెరికా కోస్ట్‌గార్డ్ సిబ్బంది సముద్రంలో టైటాన్ కోసం అన్వేషణ కొనసాగిస్తూనే ఉన్నారు. సెర్చ్ ఆపరేషన్ కోసం మరిన్ని నౌకలు, విమానాలను, ఇతర పరికరాలను రంగంలోకి దించారు. ఫ్రెంచ్ పరిశోధక సంస్థ కెమెరాలు, లైట్లతో కూడిన డీప్–డైవింగ్ రోబోట్‌ను సముద్రంలోకి పంపించింది. టైటాన్ ఆదివారం ఉదయం కెనడాలోని న్యూఫౌండ్‌లాండ్ నుంచి 700 కిలోమీటర్ల దూరంలో సముద్రంలో గల్లంతైన సంగతి తెలిసిందే. టైటాన్ ఉన్న ప్రాంతాన్ని గుర్తించడం ఒక పెద్ద సవాలుగా మారింది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
శుక్రవారం । 23 । జూన్ । 2023

కుండపోత వర్షం

సాక్షి, చెన్నై: గురువారం సాయంత్రం చెన్నై, శివార్లలో అనేక చోట్ల హఠాత్తుగా కుండపోత వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వరదలు పోటెత్తాయి. రెండు రోజుల క్రితం చెన్నైలో కుండపోత వర్షం పడ్డ విషయం తెలిసిందే. ఆ తర్వాత వాతావరణం పూర్తిగా మారింది. ఆకాశం మేఘావృతమై ఉంటూ వచ్చింది. ఈ పరిస్థితులలో గురువారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో గంట పాటు గిండి, నుంగంబాక్కం, వడపళణి, కోడంబాక్కం, అడయార్, వేళచ్చేరి, ఆవడి, పూందమల్లి పరిసరాలలో కుండపోత వర్షం పడింది. రోడ్లపై వర్షపు నీరు వరదను తలపించే విధంగా పోటెత్తాయి. దీంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పలేదు. బడులు, కళాశాలల నుంచి ఇళ్లకు వెళ్లే విద్యార్థులకు మరింత తంటాలు తప్పలేదు. ఐదు రోజులు రాష్ట్రంలో పది జిల్లాల్లో వర్షాలు పడతాయని, కొన్ని సమయాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్టు వాతావరణ కేంద్రం పేర్కొంది.

న్యూస్‌రీల్

వజ్రాల వ్యాపారి గోడౌన్‌లో ఐటీ సోదాలు

సాక్షి, చెన్నై: చెన్నై షావుకారుపేటలోని బంగారు, వజ్రాల వ్యాపారి గోడౌన్‌లో గురువారం ఐటీ సోదాలు జరిగాయి. పన్ను ఎగవేత ఆధారాలు ఈ సోదాల్లో బయటపడ్డాయి. చెన్నై షావుకారుపేటలో ఫైనాన్స్ సంస్థతో పాటు కాన్పూరు కేంద్రంగా ఉన్న ఓ వజ్రాల వ్యాపారికి చెందిన బంగారు, వెండి, వజ్రాల గోడౌన్‌లో ఉదయం ఐటీ అధికారులు సోదాల్లో నిమగ్నమయ్యారు. ఇక్కడకు తమిళనాడు నుంచే కాకుండా, పొరుగు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు వచ్చి బంగారు, వెండి, వజ్రాలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నా, అందుకు సంబంధించిన రశీదులు ఇవ్వకుండా పన్ను ఎగవేత సాగుతున్నట్టు పోలీసులకు పట్టుబడిన వ్యాపారుల వద్ద జరిపిన విచారణలో వెలుగు చూసినట్టు సమాచారం. దీంతో షావుకారుపేటలోని రాధా మోహన్ – పురుషోత్తమ దాసు పేరిట ఉన్న బంగారు, వెండి, వజ్రాల విక్రయ గోడౌన్, ఫైనాన్స్ సంస్థలో సోదాలు కొనసాగుతున్నాయి.

పనులు త్వరితగతిన పూర్తిచేయండి

• కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్



రాధాకృష్ణన్

కొరుక్కుపేట: మడిపాక్కంలో భూగర్భ మురుగు పైపుల ఏర్పాటు, రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్ పరిశీలించి పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. చెన్నై పెరుంగుడి మండలం, వార్డు–187, 188లోని 457 రోడ్లలో చెన్నై మెట్రోపాలిటన్ సీవరేజ్ బోర్డు ద్వారా 124 రోడ్లు వేయగా, అందులో 40 రోడ్లు పూర్తయ్యాయి. వర్షం పడిన తర్వాత తాత్కాలికంగా రోడ్డు మరమ్మతు పనులు జరుగుతున్నాయని, మిగతా 84 వీధుల్లో పైపుల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని కమిషనర్ రాధాకృష్ణన్ తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా భూగర్భ మురుగు పైపుల ఏర్పాటు పనులు పూర్తయిన చోట్ల తాత్కాలిక రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలని, చెన్నై మహానగర నీటి సరఫరా, మురుగునీటి పారుదల శాఖ అధికారుల సమన్వయంతో ఇతర పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

హరిత శ్మశాన వాటికలుగా మార్చాలి

కొరుక్కుపేట: తమిళనాడులోని శ్మశాన వాటికలను హరిత శ్మశాన వాటికలుగా మార్చాలని అన్ని జిల్లాల కలెక్టర్‌లకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇరైఅన్బు లేఖలో ఆదేశించారు. ఈ మేరకు శ్మశాన వాటికలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రధాన కార్యదర్శి పంపిన లేఖలో పేర్కొన్నారు. చాలా చోట్ల శ్మశాన వాటికల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో కనీస సౌకర్యాలు లేకుండానే పనిచేస్తున్నాయి. ముఖ్యంగా ఎక్కువ మరణాలు సంభవించే పట్టణ ప్రాంతాల్లో ఇది ఒక ప్రధాన సమస్యగా మారింది. కావున అన్ని శ్మశానవాటికలకు ప్రహరీ గోడలు నిర్మించి, పూల మొక్కలను పెంచి హరిత శ్మశానవాటికలుగా మార్చాలి అని ఆదేశించారు. అలాగే నీటి సౌకర్యం, షెడ్డు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ సౌకర్యాలను మెరుగుపరచడానికి వారు తమ ప్రాంతాల్లోని ప్రైవేట్ కంపెనీలను ఉపయోగించుకోవచ్చు అని తెలిపారు.

30 మంది విద్యార్థులకు అస్వస్థత


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

సేలం: నామక్కల్ జిల్లా కొల్లిమలైలో ఉన్న ఏకలవ్య మోడల్ బోర్డింగ్ స్కూల్‌లో గురువారం ఉదయం అల్పాహారం తిని అనారోగ్యానికి గురై 30 మంది విద్యార్థులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నామక్కల్ జిల్లా, కొల్లిమలై పక్కన రాశిపురం, సెంగరై ప్రాంతంలో ఏకలవ్య మోడల్ బోర్డింగ్ హైస్కూల్ పనిచేస్తోంది. ఈ పాఠశాలలో 378 మందికిపైగా విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. ఈ స్థితిలో గురువారం హాస్టల్‌లో 30 మందికి పైగా విద్యార్థులు లెమన్ రైస్‌ను అల్పాహారంగా చేశారు. హాస్టల్‌లో భోజనం చేసిన విద్యార్థులు పాఠశాల తరగతి గదికి వెళ్లి చదువుకుంటుండగా ఒక్కసారిగా వాంతుల చేసుకుని స్పృహతప్పారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు హుటాహుటిన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసి పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాఠశాలను ముట్టడించారు. అధికారులు ఎవరూ రాకపోవడంతో ఒక్కసారిగా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న కొల్లిమలై తహసీల్దార్, ఆరోగ్యశాఖ, సెంగారై పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చర్చలు జరిపారు. క్యాటరింగ్ కాంట్రాక్టర్‌ను మార్చాలని, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. వెంటనే కాంట్రాక్టర్‌ను మార్చడంతో వారు ఆందోళన విరమించారు.

పేనాకు ఓకే!

• కరుణ స్మారకానికి కేంద్రం పచ్చజెండా
• 15 రకాల నిబంధనలతో మెలిక


పేనా, కరుణ స్మారకం

సాక్షి, చెన్నై: దివంగత మాజీ సీఎం కరుణానిధి స్మారకంగా పేనా నిర్మాణానికి కేంద్ర అటవీ పర్యావరణ శాఖ తుది అనుమతులను గురువారం మంజూరు చేసింది. అయితే, 15 రకాల నిబంధనలతో ఈ పనులకు కొత్త మెలిక పెట్టడం చర్చనీయాంశంగా మారింది. మెరీనా తీరం దివంగత నేతలు అన్నా, ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి సమాధులు ఉన్న విషయం తెలిసిందే. దివంగత సీఎం జయలలిత సమాధిని ఫీనిక్స్ పక్షి ఆకారంతో ఆకర్షణగా అన్నాడీఎంకే హయాంలో తీర్చిదిద్దారు. దీన్ని తలదన్నే విధంగా తమ నేత కరుణానిధి సమాధిపై డీఎంకే పాలకులు తాజాగా సమాధిని సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా పరిసరాలు పర్యాటకంగా బాసిల్లే విధంగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధంచేశారు. ఈ మేరకు సమాధికి కూతవేటు దూరంలోని సముద్ర ముఖ ద్వారం వద్ద పేనా నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేశారు. సమాధి నుంచి ఈ పేనా వరకు అద్దాల వంతెన నిర్మాణానికి రూట్ మ్యాప్ రెడీ అయింది. రూ.80 కోట్లతో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోగా, వ్యతిరేకత కారణంగా అభిప్రాయ సేకరణ, సమగ్ర పరిశీలన, పలుమార్లు నివేదికలను సిద్ధం చేసి అనుమతుల కోసం కేంద్రానికి పంపించారు.

దక్కిన తుది అనుమతి..

ఈ స్మారకానికి వ్యతిరేకంగా ఇప్పటికే పలువురు గ్రీన్ ట్రిబ్యునల్, కోర్టును ఆశ్రయించి ఉన్నారు. పూవులగ నన్బర్గల్ సంఘం, నామ్ తమిళర్ కట్చిలు పోరాటాలు చేస్తున్నాయి. ఈ సమయంలో ఈ స్మారకానికి కేంద్ర అటవీ, పర్యాటక శాఖ తుది అనుమతి మంజూరు చేసింది. అయితే, 15 రకాల మెలికలను పెట్టారు. ఐఎన్ఎస్ అడయార్ దళం అనుమతి తప్పని సరిచేశారు. నిర్మాణాలకు భూగర్భ జలాలను ఉపయోగించ రాదని, నిపుణుల కమిటీ పర్యవేక్షణలో అన్ని రకాల పనులు జరగాలని, సమగ్ర పరిశీలన, పరిశోధనలు నిర్వహించాలన్న 15 రకాల నిబంధనలు ఉంచారు. ప్రధానంగా తాబేళ్ల వృద్ధి చెందే కాలంలో పనులు చేపట్టరాన్న నిబంధన కూడా విధించి ఉండడం గమనార్హం. ఈ ప్రక్రియలు ముగించినానంతరం పనులకు శ్రీకారం చుట్టుకోవచ్చు అని సూచించారు. దీంతో ఈ ప్రయత్నాలతో పాటు పనులకు టెండర్ల కసరత్తులపై ప్రజా పనుల శాఖ దృష్టి పెట్టింది. కలైంజ్ఞర్ కరుణానిధి శత జయంతి ఉత్సవాల వేళ ఈ పనులకు శ్రీకారం చుట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుంటే, అడ్డుకుని తీరుతామని పూవులగ నన్బర్గల్ సంఘం స్పష్టం చేసింది.

సెంథిల్ అరెస్ట్ చట్ట విరుద్ధం

• కోర్టులో వాదన
• వివరణ కోసం ఈడీకి గడువు
• మంత్రి పదవికి వ్యతిరేకంగా పిటిషన్


సెంథిల్ బాలాజి

సాక్షి, చెన్నై: మంత్రి సెంథిల్‌బాలాజి అరెస్టు చట్ట విరుద్ధమని మద్రాసు హైకోర్టుకు ఆయన తరపు న్యాయవాదులు వివరించారు. ఈడీ తీరు పూర్తిగా నిబంధనలను ఉల్లంఘించి జరిగినట్టు వాదనలు వినిపించారు. క్యాష్ ఫర్ జాబ్స్ కేసులో మంత్రి సెంథిల్ బాలాజి అరెస్టును వ్యతిరేకిస్తూ ఆయన సతీమణి మేఘల హైకోర్టును ఆశ్రయించారు. తన భర్తను ఎందుకు అరెస్టు చేశారో వివరాలను తెలియజేయలేదని, చట్ట విరుద్ధంగా జరిగిన ఈ అరెస్టుపై విచారించి న్యాయంచేయాలని ఆమె కోర్టును అభ్యర్థించారు. ఈ పిటిషన్ గురువారం న్యాయమూర్తులు నిషా భాను, భరత్ చక్రవర్తి బెంచ్ ముందు విచారణకు వచ్చింది. సెంథిల్ తరపున సీనియర్ న్యాయవాది ఎన్ఆర్ ఇలంగో వాదనలు వినిపించారు. సెంథిల్ బాలాజి అరెస్టు చట్ట విరుద్ధం అని, తాజాగా దాఖలైన పిటిషన్ ఈ విచారణ యోగ్యం అని కోర్టుకు వివరించారు. సెంథిల్‌బాలాజి ఆస్పత్రిలో చేరినానంతరం కేసు నమోదు చేశారని, రాజకీయ శాసన చట్టం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా ఈడీ పని తీరు ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కోర్టులు ఇచ్చిన తీర్పులు, ఉత్తర్వులను ఈసందర్భంగా గుర్తుచేశారు. 2004లో పత్రికా సంపాదకుడు నక్కీరన్ గోపాల్ అరెస్టు విషయంగా ఆయన తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు విచారణకు స్వీకరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎవరిని వారికి సమాచారం ఇవ్వకుండా అరెస్టు చేయడం, పోలీసుల కస్టడీకి తీసుకోవడం చట్ట విరుద్ధమని గతంలో కోర్టులు స్పష్టం చేశాయని వివరించారు. దీనిని రాజకీయ శాసన చట్టం సెక్షన్ 22 స్పష్టం చేస్తున్నట్టు గుర్తు చేశారు. అంబేడ్కర్ రూపొందించిన రాజకీయ శాసన చట్టంలోని 15ఏ, 22 సెక్షన్లు ప్రాథమిక హక్కుల గురించి స్పష్టంగా సమాచారం తెలియజేసి ఉన్నట్టు వివరించారు. సెంథిల్ బాలాజి అరెస్టు చట్ట విరుద్ధమని స్పష్టం చేయడానికి గతంలో ఇచ్చిన అనేక కోర్టు ఉత్తర్వులను ఈసందర్భంగా తాను గుర్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సమయంలో ఈడీ తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ, ఈ కేసులో తొలుత తమ తరపున వాదనలు వినాలని కోరారు. ఈ అరెస్టులో ఎలాంటి నిబంధనలు ఉల్లంఘన జరగలేదని వాదించే ప్రయత్నం చేశారు. అయితే, ఎన్ఆర్ ఇలంగో తన వాదనను కొనసాగిస్తూ నేర పరిస్థితిని బట్టి అరెస్టుకు ముందు నోటీసులు ఇవ్వాల్సిన అవసరం ఉందని, భద్రతా చర్యలు తీసుకోవాల్సి బాధ్యత ఉందని, వారి కుటుంబానికి సమాచారం ఇవ్వాల్సి ఉందన్న కొత్త అంశాలను తెరపైకి తెచ్చారు. పలువురు వైద్యులు రోగాన్ని నిర్ధారించినా దానిని విమర్శించే విధంగా వ్యవహరించి కస్టడీ పిటిషన్లు దాఖలు చేయడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటో అని ఈడీని ప్రశ్నించారు. చివరకు ఎన్ఆర్ ఇలంగో వాదనలకు సమాధానాలు ఇచ్చేందుకు సమయం కేటాయించాలని ఈడీ తరపు న్యాయవాది కోరడంతో కోర్టు గడువు విధించింది. తదుపరి విచారణను ఈనెల 27వ తేదీకి వాయిదా వేశారు. ఇదిలా ఉండగా, సెంథిల్ బాలాజీని మంత్రి పదవి నుంచి తప్పించాలని కోరుతూ అన్నాడీఎంకే నేత జయవర్ధన్ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆయన మంత్రి పదవిలో కొనసాగేందుకు ఆమోదించబోనని గవర్నర్ సైతం స్పష్టం చేసినా, ప్రభుత్వం కొనసాగిస్తున్నదని, ఆయన్ను తప్పించాలని ఆ పిటిషన్ ద్వారా కోరారు. కాగా, శస్త్రచికిత్స అనంతరం ఐసీయూలో ఉన్న సెంథిల్ బాలాజీకి వెంటిలేటర్ ద్వారా శ్వాస అందిస్తున్నారు.

సీఎస్ ఎవరో?

• సీనియర్లతో సీఎం స్టాలిన్ సమావేశం
• తెరపైకి శివదాస్ మీనా


సచివాలయం

సాక్షి,చెన్నై: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎంపికపై సీనియర్ మంత్రులు, అధికారులతో గురువారం సీఎం స్టాలిన్ సమావేశమయ్యారు. 1988 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఇరైఅన్బు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినానంతరం సీఎస్‌గా ఆయన కీలక పాత్రను ప్రభుత్వంలో పోషిస్తున్నారు. ఆయన ఈనెల 30వ తేదీన పదవీ విరమణ పొందనున్నారు. ఆయనకు సమాచార కమిషనర్ పదవి ఇవ్వవచ్చు అన్న చర్చ జరిగింది. అయితే, ఈ పదవి ప్రస్తుతం మాజీ ఐపీఎస్ అధికారి షకీల్ అక్తర్‌కు అప్పగించారు. దీంతో పదవీ విరమణ అనంతరం ప్రభుత్వ సలహాదారుగా ఇరైఅన్బు వ్యవహరిస్తారన్న సంకేతాలు వెలువడ్డాయి. ఈ పరిస్థితులలో కొత్త సీఎస్ ఎంపిక కసరత్తులు మొదలయ్యాయి. ముగ్గురు సీనియర్లతో కూడిన జాబితా ప్రస్తుతం సిద్ధం చేశారు. ఇందులో 1986 ఐఏఎస్ బ్యాచ్ అధికారి హన్స్ రాజ్ వర్మ ఉన్నారు. ఈయన తమిళనాడు పారిశ్రామిక పెట్టుబడుల బోర్డు చైర్మన్‌గా ఉన్నారు. అయితే, ఈయన పదవీ కాలం 2024 మే వరకు మాత్రమే ఉండడం గమనార్హం. ఇక, 1989 బ్యాచ్‌కు చెందిన ఎస్‌కే ప్రభాకర్ రేసులో ఉన్నారు. ఈయన ప్రస్తుతం రెవెన్యూ పరిపాలనా విభాగం కమిషనర్‌గా ఉన్నారు. ఈయన పదవీ కాలం 2026 వరకు ఉంది. అయితే, గత అన్నాడీఎంకే హయాంలో ఈయన కీలక శాఖల్లో బాధ్యతలు నిర్వర్తించారు. ఇక, చివరగా 1989వ బ్యాచ్‌కు చెందిన శివదాస్ మీనా ఉన్నారు.

ఈయన ప్రస్తుతం నగర పాలక శాఖ కార్యదర్శిగా ఉన్నారు. ఈయన పదవీ కాలం అక్టోబర్ 2024 వరకు ఉంది. ఈయన పదవీ కాలం మరో 15 నెలలు ఉండడంతో పాటు సీఎం స్టాలిన్‌తో సన్నిహితంగా మెలుగుతున్న వ్యక్తి కావడంతో సీఎస్ రేసులో శివదాసు మీనా ముందంజలో ఉండే అవకాశాలు ఉన్నాయని సచివాలయం వర్గాలు పేర్కొంటున్నాయి. ఈనెలలో డీజీపీ శైలేంద్రబాబు, మరో వైపు సీఎస్ ఇరైఅన్బు పదవీ విరమణ చేయనున్న దృష్ట్యా, వీరి సేవలను వినియోగించుకునే విధంగా సీఎం స్టాలిన్ మరేదేని నిర్ణయం తీసుకుంటారా అనేది వేచి చూడాల్సిందే.

5,699 లెక్చరర్ల పోస్టుల భర్తీకి ఉత్తర్వులు

సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్, బీఎడ్ కళాశాలలో ఖాళీల భర్తీ నిమిత్తం గౌరవ వేతనంతో తాత్కాలిక లెక్చరర్ల నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను గురువారం ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కార్తికేయన్ జారీ చేశారు. రాష్ట్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్, బీఎడ్ కళాశాలలో 2023–24కుగాను ఈ తాత్కాలిక పోస్టుల భర్తీకి ఆదేశాలు ఇచ్చారు. అలాగే, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈనెల 30వ తేదీతో ఈ ప్రక్రియ ముగియనుంది. అయితే, ఈ ఏడాది ఈ కోర్సులకు అత్యధిక శాతం విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో ఆయా కళాశాలలో అదనంగా 20 శాతం సీట్ల భర్తీకి ఉన్నత విద్యా శాఖ ఆదేశాలు ఇచ్చింది. ఇక, ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో విద్యార్థులకు ఒకే కటాఫ్ మార్కులు వస్తే గతంలో పదో తరగతి మార్కులను పరిగణలోకి తీసుకుంటారు. అయితే, ప్రస్తుతం కౌన్సెలింగ్‌కు సిద్ధమైన విద్యార్థులు రెండేళ్ల క్రితం కరోనా పుణ్యమా పది పరీక్ష జరగకుండా ఆల్‌పాస్‌లో ఉత్తీర్ణలై ఉన్నారు. దీంతో కటాఫ్ వ్యవహారంలో పదో తరగతి మార్కులను ఈ ఏడాది పరిగణనలోకి తీసుకోకుండా ఉన్నత విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది.

కుష్బూపై పోలీసులకు ఫిర్యాదు

సాక్షి, చెన్నై: సినీ నటి, బీజేపీ నేత, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు కుష్బూ సుందర్‌పై తిరునల్వేలి పోలీసు కమిషనర్‌కు పాళయంకోట్టైకు చెందిన న్యాయవాది రాజు ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు స్పందించారు. కేసు నమోదు విషయంగా అధికారులతో కమిషనర్ రాజేంద్రన్ గురువారం సమావేశమయ్యారు. గత నెల ట్విట్టర్ వేదికగా జయశంకర్, జయ నాథ్ అనే వ్యక్తులకు సమాధానం ఇచ్చే క్రమంలో కుష్బూ తీవ్ర వ్యాఖ్యలు చేశారని, గృహిణులు, మహిళలను ఉద్దేశించి ఆమె అనుచితంగా స్పందించారని ఆరోపించారు. చెప్పులతో కొట్టాలి వంటి వ్యాఖ్యలు చేయడమే కాకుండా తీవ్ర విమర్శలు చేశారని, దీనిని చూసిన తన ఇంట్లోని మహిళలే అసహ్యించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను ట్వీట్ వేదికగా ఆమె చేయడాన్ని ఖండిస్తున్నామని, దీనిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో ఈ ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో అనే విషయంగా కమిషనర్ రాజేంద్రన్ అదనపు కమిషనర్ శరవణకుమార్, సతీష్‌కుమార్, అనిత నగర పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలో అని పరిశీలిస్తున్నారు.

గవర్నర్ నోట మళ్లీ సనాతనం

• మంత్రి ఫైర్


గవర్నర్ ఆర్‌ఎన్ రవి

సాక్షి, చెన్నై: రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి మళ్లీ సనాతన ధర్మం వ్యాఖ్యలను అందుకున్నారు. అయితే, సన్మార్గ సేవకుడు వల్లలార్‌ను ఈ సారి సనాతన ధర్మంలోకి గవర్నర్ తీసుకు రావడం వివాదానికి దారి తీసింది. ఆర్థిక మంత్రి తంగం తెన్నరసుతో పాటు పలువురు గవర్నర్ వ్యాఖ్యలను ఖండించారు. రాష్ట్ర గవర్నర్ ఓ రాజకీయ నాయకుడిలా, కేంద్రంలోని బీజేపీ కార్యకర్తలా, ఆర్‌ఎస్‌ఎస్ మద్దతుదారుడి వలే వ్యవహరిస్తున్నారని ఇప్పటికే అధికారపక్షంతో పాటు కూటమి పార్టీలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితులలో గురువారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఆర్‌ఎన్ రవి మళ్లీ సనాతన ధర్మం ఉపదేశిస్తూ, వడలూరులో ప్రసిద్ధి చెందిన వల్లలార్ క్షేత్రంపై వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మం పరిధిలోనే వల్లలార్ ఉన్నట్టుగా ఆయన వ్యాఖ్యలను స్పందించడం చర్చకు దారి తీసింది. గవర్నర్ వ్యాఖ్యలపై ఆర్థికమంత్రి తంగం తెన్నరసుతో పాటు డీఎంకే మిత్ర పక్షాలు ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి. సన్మార్గం, సనాతన ధర్మంకు తేడా తెలియకుండా గవర్నర్ వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. సన్మార్గంలో నడిచి ప్రజల జీవితాలలో వెలుగును నింపిన వల్లలార్‌ను సనాతన ముసుగులోకి తీసుకెళ్లే ప్రయత్నంలో గవర్నర్ ఉన్నట్టుందని ధ్వజమెత్తారు. వడలూరు సన్మార్గ క్షేత్రమే గానీ, సనాతన ధర్మంతో ముడిపడింది కాదన్న విషయాన్ని గవర్నర్ గుర్తుంచుకుంటే మంచిదని హితవు పలికారు.

మహిళల రక్షణకు స్పెషల్ టీం

• చెన్నైలో కంట్రోల్ రూమ్
• ఎక్కడి నుంచైనా ఆశ్రయించేందుకు అవకాశం


పోలీసుల గస్తీ వాహనం

సాక్షి, చెన్నై: ఒంటరిగా ప్రయాణం చేసే మహిళలు, ఒంటరిగా ఉండడంతో భద్రత లేకుండా ఉన్నట్టు భావించే వారి రక్షణ కోసం స్పెషల్ టీంను రాష్ట్ర పోలీసు యంత్రాంగం రంగంలోకి దించింది. చెన్నైలో ప్రత్యేక కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నంబర్లను ప్రకటించారు.

రాత్రుల్లో విధులను ముగించుకుని ఒంటరిగా వెళ్తున్న మహిళలు, ఇళ్లల్లో ఒంటరిగా ఉన్న వారిని గురిపెట్టి వేధించే వారి సంఖ్య ఇటీవల కాలంగా పెరుగుతోంది. గత వారం కూడా చెన్నైలో ఒంటరిగా వెళ్తున్న యువతులను వేధించిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఒంటరిగా వెళ్తున్న వారికి రక్షణగా ప్రత్యేక బృందాన్ని డీజీపీ శైలేంద్రబాబు రంగంలోకి దించారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను చెన్నైలో ఏర్పాటు చేశారు. టోల్ ఫ్రీ నంబర్లుగా 1091, 112,044–23452365, 28447701లను ప్రకటించారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా సరే భద్రత కోసం మహిళలు, యువతులు ఈ నంబర్లను సంప్రదించే అవకాశం కల్పించారు. ఇక్కడకు వచ్చే కాల్స్‌ను తక్షణం కంట్రోల్ రూమ్‌లో ఉన్న వారు సమీపంలోని గస్తీలో ఉండే వారికి సమాచారంగా పంపిస్తారు. తక్షణం వారు అక్కడికి చేరుకుని సంబంధిత మహిళ లేదా యువతులకు రక్షణ కల్పిస్తారు. వారు చేరాల్సిన ప్రదేశానికి తీసుకెళ్లి వదలి పెట్టే విధంగా ఈ స్పెషల్ టీం పనిచేయనుంది.

మరింత ఆకర్షణగా 'అన్నా' జంతు ప్రదర్శనశాల

• రూ. 4.36 కోట్ల కేటాయింపు
• 3డీ, 7డీ థియేటర్లు
• జంతు సంరక్షణకు ప్రత్యేక చర్యలు


వండలూరు జూ ముఖద్వారం

సాక్షి, చెన్నై: చెన్నై శివారులోని అన్నా జంతు ప్రదర్శనశాలను పర్యాటకంగా మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం రూ.4.36 కోట్లు కేటాయించారు. ఇక్కడ 3డీ, 7డీ థియేటర్లు ఏర్పాటు కానున్నాయి. జంతువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. వండలూరులో దివంగత నేత అన్నా పేరిట జంతు ప్రదర్శన శాల ఉన్న విషయం తెలిసిందే. ఇక్కడ వివిధ జంతువులు, పక్షులు పెద్ద ఎత్తున ఉన్నాయి. వీటిని చూడడానికి వేలాది మంది వస్తుంటారు. ఇక్కడ జంతువుల పర్యవేక్షణకు నిధులు చాలడం లేదు. దీంతో జంతువుల్ని దత్తకు ఇచ్చే పనిలో పడ్డారు. పలు సంఘాలు అనేక జంతువుల్ని దత్తతకు తీసుకున్నాయి. అదే సమయంలో పర్యాటకంగా ఈ జంతుప్రదర్శన శాలను మరింతగా తీర్చిదిద్దేందుకు గతంలో నివేదికను ప్రభుత్వానికి అధికారులు పంపించారు. రెండేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న ఈ నివేదికకు ప్రస్తుతం మోక్షం లభించింది.

రూ.4.36 కోట్లతో పనులు..

ప్రస్తుతం వండలూరు జూకు కూతవేటు దూరంలో కిలాంబాక్కం బస్ టెర్మినల్ రూపుదిద్దుకుంటోంది. ఇది ముగింపు దశకు చేరింది. దీంతో వండలూరు జూకు సందర్శకుల తాకిడి మరింతగా పెరగవచ్చునని అధికారులు భావిస్తున్నారు. దీంతో ఈ జూకు మరింత వన్నె తెచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం రూ.4.36 కోట్లను ప్రభుత్వం గురువారం కేటాయించింది. ఈ నిధులతో పార్క్ థియేటర్, 3డీ, 7డీ థియేటర్లు ఈ జంతు ప్రదర్శన శాలలో ఏర్పాటు కానున్నాయి. ఈ పనులను రెండు లేదా మూడు సంవత్సరాలలో ముగించే విధంగా ఆదేశాలు జారీ అయ్యాయి. జంతువుల కోసం ఈ ప్రదర్శన శాలలో ఉన్న గ్యాలరీలను మరింత అభివృద్ధి పరచడంతో పాటు జంతు సంరక్షణ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. లండన్‌లోని జంతు ప్రదర్శన శాలను తలపించే విధంగా ఈ జూను తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకోనున్నామని అధికారులు పేర్కొన్నారు. ఇక్కడ ప్రత్యేక ఎగ్జిబిషన్ కూడా రూపుదిద్దుకోనున్నదని వివరించారు. ఇక్కడి థియేటర్లలో జంతువులకు సంబంధించిన లఘు చిత్రాలు, అన్ని వివరాలు, అడవులు, వన్య ప్రానుల సంరక్షణ, అభయారణ్యం వాటికి సంబంధించిన ప్రదర్శనలు ప్రదర్శించే విధంగా కార్యాచరణ సిద్ధం కాబోతోందని పేర్కొన్నారు.

అన్నామలై తొలగింపునకు పట్టు

• అన్నాడీఎంకే వ్యూహం


పళని, అన్నామలై

సాక్షి, చెన్నై: బీజేపీ అధ్యక్షుడిగా అన్నామలైను తొలగించాలన్న నినాదాన్ని అందుకునేందుకు అన్నాడీఎంకే వ్యూహరచన చేసి ఉండడం వెలుగులోకి వచ్చింది. ఆయనపై చర్యలు తీసుకున్నప్పుడే కూటమి చర్చ అన్న సంకేతాన్ని బీజేపీ అధిష్టానికి పంపినట్టు సమాచారం. ఇటీవల కాలంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వ్యవహరిస్తున్న తీరు విమర్శలు, ఆరోపణలకు దారి తీస్తున్న విషయం తెలిసిందే. తమ కూటమిలో ఉంటూ తమనే అన్నామలై విమర్శించడం, తీవ్ర ఆరోపణలు గుప్పించడాన్ని అన్నాడీఎంకే తీవ్రంగానే పరిగణించింది. అదే సమయంలో తమ ఆరాధ్య దేవత, అమ్మ జయలలితను ఉద్దేశించి అన్నామలై చేసిన వ్యాఖ్యలను అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళని స్వామి తీవ్రంగా పరిగణించారు. పార్టీ సమావేశంలో అన్నామలైకు వ్యతిరేకంగా ఖండన తీర్మానం సైతం చేయించారు. మిత్రపక్షంతో వ్యవహరించే తీరు ఇదేనా అని బీజేపీ అధిష్టానానికి సమాచారం పంపించారు. తమ హెచ్చరికలను బీజేపీ ఇంతవరకు ఖాతరు చేయక పోవడంతో కొత్త వ్యూహంతో ముందుకెళ్లేందుకు పళనిస్వామి సిద్ధమైనట్టు సంకేతాలు వెలువడ్డాయి. అన్నామలైను తొలగించడం లేదా, ఏదేని చర్యలు తీసుకుంటేనే కూటమి గురించి చర్చలకు సిద్ధమవుతామన్న సంకేతాన్ని బీజేపీ పెద్దలకు పంపించేందుకు నిర్ణయించారు. ఆయనపై చర్యలు తీసుకోకుండా కూటమి ప్రస్తావన తీసుకొచ్చిన పక్షంలో, తమ పార్టీ కేడర్ ముందు చులకన అవుతామని, అన్నామలైను మార్చాల్సిందే అని పట్టుబట్టేందుకు సిద్ధమయ్యారు. ఆయన ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తుండడాన్ని తమ కేడర్ చూస్తూ ఊరుకోరని, తక్షణం ఏదేని చర్యలు తీసుకోవాలన్న సంకేతాన్ని బీజేపీ పెద్దలకు ఏదో ఒక మార్గంలో పంపించే విధంగా వ్యూహ రచన చేసి ఉండడం గమనార్హం.

చిన్నమ్మకు నో...

అన్నాడీఎంకే వర్గాలందర్నీ ఏకం చేసే విధంగా శశికళ విశ్వ ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. పళనిస్వామితో సంప్రదింపులకు ఆమె రాయబారులను రంగంలోకి దించినట్టు గతవారం సమాచారం వెలువడ్డాయి. అయితే, ఈ రాయబారం, సంప్రదింపులకు పళని నిరాకరించినట్టు తెలిసిందే. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా బలోపేతం దిశగా తాను ముందుకెళ్తానని పేర్కొంటూ, రాష్ట్రవ్యాప్తంగా అన్నాడీఎంకే పార్టీ పరంగా ఉన్న జిల్లాలకు కొత్తకార్యదర్శుల నియామక కసరత్తుల్లో పళని నిమగ్నం కావడం గమనార్హం.

ధైర్యంగా నిలదీయండి!

• అధికారులకు మంత్రి ఆదేశం


సావనీర్‌ను విడుదల చేస్తున్న మంత్రి నెహ్రూ

సాక్షి, చెన్నై: ప్రజాప్రతినిధులు తప్పు చేస్తే ధైర్యంగా నిలదీయాలని, ప్రశ్నించాలని అధికారులకు రాష్ట్ర నగరాభివృద్ధిశాఖ మంత్రి కేఎన్ నెహ్రూ ఆదేశించారు. నగరాభివృద్ధి శాఖ నేతృత్వంలో మున్సిపాలిటీ, కార్పొరేషన్ కమిషనర్లు పట్టణ పంచాయతీల అధికారులతో చెన్నైలో సదస్సు గురువారం జరిగింది. ఇందులో మంత్రి కేఎన్ నెహ్రూ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు త్వరితగతిన దరిచేర్చడంలో అధికారులు మరింత ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. ఆయా నగర, కార్పొరేషన్, స్థానిక సంస్థల్లోని ప్రజా ప్రతినిధులు ఏదేని తప్పు చేస్తే ప్రశ్నించాలని, వారిని నిలదీయాలని ఆదేశించారు. వారి నుంచి సరైన సమాధానం లేకుంటే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులకు అండగా ప్రభుత్వం ఉందని, సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. అధికారులు భయపడాల్సిన అవసరం లేదని, ధైర్యంగా ముందుకెళ్లాలని భరోసా ఇచ్చారు. ప్రతి అధికారికి అండగా ప్రభుత్వం ఉందన్న విషయాన్ని గుర్తుంచుకుని ముందుకెళ్లాలని ఆయన సూచించారు.

క్లుప్తంగా

చెరువులకు జల కళ

తిరువొత్తియూరు: భారీ వర్షాల కారణంగా చెరువుల్లోకి నీరు చేరుతోంది. దీంతో చెన్నై ప్రజలకు అంతరాయం లేకుండా తాగునీటిని సరఫరా చేయనున్నట్టు మెట్రో వాటర్ విభాగం అధికారులు తెలిపారు. అలాగే వచ్చే ఏడాది తాగునీటిని అందించే చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టారు. చెన్నై నగరానికి తాగునీటిని అందించేందుకు పుళల్, పూండి, చెంబరంబాక్కం, చోళవరం చెరువులు వున్నప్పటికీ కడలూరు జిల్లా వీరణం చెరువు నుంచి తాగునీటి సరఫరా చేస్తున్నారు. వేసవి కాలం కావడంతో చెరువుల్లో నీటి మట్టం తగ్గుతోంది. దీంతో చెన్నైకి తాగునీటి సరఫరాలో సమస్య ఎదురవుతోంది. నిర్ణీత రోజుల్లో మాత్రమే తాగునీటిని అందిస్తున్నారు. 18, 19 తేదీల్లో నగరం, శివారు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో తాగునీటి చెరువులకు నీటి సరఫరా పెరుగుతోంది. పూండి చెరువు నీటిమట్టం బుధవారానికి 40 శాతం పెరిగి 1,320 మిలియన్ క్యూబిక్ అడుగులకు చేరింది. చెంబరంబాక్కం చెరువు సామర్థ్యం 2,562 మిలియన్ క్యూబిక్ అడుగులు కాగా ప్రస్తుతం 2,300 ఘనపుటడుగుల నీరు ఉంది. పుళల్ చెరువులో ప్రస్తుతం 2,239 మిలియన్ క్యూబిక్ అడుగులుంది. ఈ క్రమంలో చెన్నైకి నిరంతరాయంగా తాగునీరు సరఫరా అవుతుందని అధికారులు తెలిపారు.

విద్యార్థులకు యూనిఫామ్ ఇచ్చేందుకు చర్యలు


మంత్రి గాంధీ

కొరుక్కుపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇచ్చేందుకు 9 లక్షల మీటర్ల యూనిఫామ్ తయారు చేసే పనులు కొనసాగుతున్నాయని చేనేత, జౌళి శాఖ మంత్రి గాంధీ తెలిపారు. ఆయన గురువారం కోయంబత్తూరులోని కురిచి ప్రాంతం, సిట్కోలోని తమిళనాడు కార్పొరేషన్ మగ్గాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మగ్గం, ఎయిర్‌జెట్ యంత్రాలను పరిశీలించామని, ఇందులో పాత పవర్ మెషిన్ల స్థానంలో ఎయిర్ జెట్ మెషిన్లను అమర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చేనేత రంగంలో 12 నాన్ ఆపరేషనల్ మిల్లులు 486 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్నాయని, తమిళనాడుకు మొత్తం 125 లక్షల బేళ్ల పత్తి అవసరమని పేర్కొన్నారు. ఇక్కడ 15 లక్షల బేళ్లు మాత్రమే ఉత్పత్తి అవుతోందన్నారు. ఇతర అవసరాల కోసం ఉత్తరాది రాష్ట్రాల్లోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి వస్తుందని వివరించారు. వచ్చే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 9 లక్షల మీటర్ల యూనిఫాం ఉత్పత్తి చేస్తున్నారని, ఆ దిశగా యూనిఫామ్ తయారు చేయాలని ఫ్యాక్టరీలకు సూచించినట్టు వెల్లడించారు.

జలకంఠేశ్వరాలయాన్ని స్వాధీనం చేసుకోం!



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్, దేవదాయ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

• రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు

వేలూరు: వేలూరు కోటలోని జలకంఠేశ్వరాలయాన్ని దేవదాయ శాఖ స్వాధీనం చేసుకునే ఉద్దేశం లేదని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు అన్నారు. వేలూరు కలెక్టరేట్‌లో వేలూరు, తిరుపత్తూరు, రాణిపేట, తిరువణ్ణామలై, క్రిష్ణగిరి జిల్లాలోని దేవదాయశాఖ అధికారులతో కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, అములు విజయన్, జెడ్పీ చైర్మన్ బాబు, మేయర్ కార్తికేయన్, దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిందూ ఆలయాల్లోని మరమ్మతులు, పార్ట్‌టైమ్ అన్నదాన కార్యక్రమం, పూర్తిస్థాయి అన్నదానం అంశాలపై అధికారులతో చర్చించామన్నారు. రెండేళ్లలోనే పురాతన ఆలయాల్లో మరమ్మతు పనులు చేసేందుకు రూ.200 కోట్లతో పనులు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం తమిళనాడు ఆధ్యాత్మిక వేత్తలకు స్వర్ణయుగంగా మారిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దేవదాయ శాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేయనున్నామని, సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నామన్నారు. జలకంఠేశ్వరాలయాన్ని దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుంటుందని పలువురు విమర్శలు చేస్తున్నారని, అయితే ఇది కేంద్ర ప్రభుత్వ ఆర్కలాజికల్ ఆధీనంలో ఉందని, దేవదాయ శాఖ స్వాధీనం చేసుకునేందుకు కుదరదన్నారు. ఆలయాల్లోని హుండీ లెక్కింపులో అవకతవకలు జరుగుతున్నట్లు ప్రతి పక్ష నాయకులు ఎడపాడి పళనిస్వామి అంటున్నారని ప్రతి ఆలయంలోనూ హుండీ లెక్కించే సమయంలో సీసీ కెమెరాలతో పాటు వీడియో కవరేజ్ ద్వారా హుండీ లెక్కింపు చేస్తున్నామని తెలిపారు.

సినీనటుడు విజయ్ అభిమానుల సేవా కార్యక్రమాలు


చిన్నారులకు ఉంగరాలు బహూకరిస్తున్న అధ్యక్షుడు వేల్‌మురుగన్

వేలూరు: సినీ నటుడు విజయ్ జన్మదిన వేడుకలను వేలూరులో అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. విజయ్ అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్ మురుగన్ అధ్యక్షతన అభిమానులు వేలూరు శిశు భవన్‌లోని అనాథ పిల్లల మధ్య కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అన్నదానం చేశారు. వేలూరు పెట్‌లాండ్ ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం జన్మించిన చిన్నారులకు బంగారు ఉంగరాలు బహూకరించారు. వేల్ మురుగన్ మాట్లాడుతూ సూపర్ స్టార్ విజయ్ జన్మదినోత్సవాన్ని శిశు భవనంలో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. తమ నాయకుడు త్వరలో రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్ అభిమానుల సంఘం కార్పొరేషన్ అధ్యక్షుడు శంకరన్, కార్యదర్శి సురేష్, భరత్, డివిజన్ కార్యదర్శి రాజేష్, జాయింట్ కార్యదర్శి వివేక్, విజయ్ మండ్ర అధ్యక్షుడు శరవణన్, రేణు పాల్గొన్నారు. అదే విధంగా వేలూరు, తిరువణ్ణామలై జిల్లాల్లోనూ విజయ్ అభిమానులు కేక్ కట్ చేసి, టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

అభివృద్ధి పనులపై తీర్మానం


సమావేశంలో చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

పళ్లిపట్టు: పళ్లిపట్టు టౌన్ పంచాయతీ సమావేశంలో అభివృద్ధి పనులకు సంబంధించి గురువారం తీర్మానం ఆమోదించారు. టౌన్ పంచాయతీ చైర్‌పర్సన్ మణిమేగళై అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. బిల్ కలెక్టర్ రాజశేఖర్ స్వాగతం పలికారు. వైస్ చైర్మన్ జ్యోతికుమార్ సహా కౌన్సిలర్లు పాల్గొన్నారు. పట్టణ పంచాయతీలో ఆదాయం, వ్యయంకు సంబంధించిన వివరాల పట్టికను సమావేశంలో ప్రవేశపెట్టారు. అనంతరం పట్టణ పంచాయతీలో తీసుకోవాల్సిన పనులకు సంబంధించి మాట్లాడారు. ప్రధానంగా వర్షాకాలం సమీపిస్తుండడంతో ముందస్తు జాగ్రత్తలకు సంబంధించి సభ్యులు తమ అభిప్రాయాలు తెలిపారు. అదే సమయంలో పట్టణంలో పరిశుభ్రత, వీధి దీపాలు, మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకురావడానికి సంబంధించి చర్చలు జరిపారు. తాత్కాలిక సిబ్బందికి వేతనాలు చెల్లింపునకు సంబంధించి చర్చలు జరిగాయి. స్థానిక ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాల వద్ద కూలిన మురుగునీటి కాలువతో చోటుచేసుకుంటున్న అపరిశుభ్రత నేపథ్యంలో కొత్తగా మురుగునీటి కాలువ నిర్మించడంతో పాటు బజారు, ఈచ్చంపాడి ప్రాంతాల్లో నూతనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు నిర్ణయం తీసుకుని తీర్మానించారు. కౌన్సిలర్ సీజే.సెంథిల్‌కుమార్, స్వప్న, కపిల, విజయులు, గుణశేఖర్, జయలక్ష్మి సహా 12 మంది సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో విజయ్ పుట్టినరోజు వేడుకలు

తిరుత్తణి: వృద్ధాశ్రమంలో నటుడు విజయ్ పుట్టినరోజు వేడుకలను గురువారం ఫ్యాన్స్ ఘనంగా జరుపుకున్నారు. నటుడు ఇళయ దళపతి విజయ్ 49వ పుట్టినరోజు వేడుకలు సందర్భంగా తిరుత్తణి మండల విజయ్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో స్థానిక మురుగప్పనగర్‌లోని రాస్ వృద్ధాశ్రమంలో వృద్ధులతో కలిసి కేక్ కట్‌చేసి బర్త్‌డే వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందజేశారు. తిరుత్తణి ప్రభుత్వాస్పత్రిలో విజయ్ ఫ్యాన్స్ రక్తదానం చేశారు. పలుచోట్ల వేడుకలు జరుపుకుని స్వీట్లు, అన్నదానం పంపిణీ చేశారు. నియోజకవర్గ అధ్యక్షుడు ఢిల్లీ, కార్యదర్శి జ్ఞానం, కోఆర్డినేటర్ లింగప్పన్, మండల నిర్వాహకులు కిరణ్, రాజీ, మాధవన్ పాల్గొన్నారు.


వృద్ధులకు అన్నదానం చేస్తున్న అభిమానులు

విద్యార్థులకు నోటుపుస్తకాల వితరణ

వేలూరు: వేలూరు బంగారుగుడి ఆధ్వర్యంలో అటవీ ప్రాంత విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఉచితంగా నోటుపుస్తకాలు అందజేస్తున్నామని వీటి ద్వారా విద్యార్థులు విద్యాభివృద్ధి చెందాలని బంగారుగుడి డైరెక్టర్ సురేష్ అన్నారు. తిరువణ్ణామలై జిల్లా జవ్వాది కొండలో నివశిస్తున్న కల్యాణమండై, మేల్‌పట్టు, పాలకనూర్, సూడాత్తూర్, కీల్ వలాముర్చి, పులియూర్ గ్రామాల్లో నివశిస్తున్న 1500 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం బంగారుగుడి మేనేజర్ సంపత్ ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ వేలూరు నారాయణిపీఠం పీఠాధిపతి శక్తిఅమ్మ ఇప్పటికే వివిధ దైవభక్తికి సంబంధించిన సేవా కార్యక్రమాలను చేస్తున్నారు. అదేవిధంగా వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలోని ప్రతి పంచాయతిలోనూ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. అందులోభాగంగా ప్రతి సంవత్సరం అటవీ ప్రాంతాల్లో నివశిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేస్తున్నారన్నారు. విద్యార్థులు శక్తి అమ్మ సేవలను సద్వినియోగం చేసుకుని విద్యపై ప్రత్యేక దృష్టిపెట్టి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. అనంతరం నోటు పుస్తకాలను అందజేశారు. జమునామరత్తూరు అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.


నోటు పుస్తకాలను అందజేస్తున్న బంగారుగుడి డైరెక్టర్ సురేష్


కరకట్టకు మరమ్మతులు

తిరువళ్లూరు: చెన్నై ప్రజలకు తాగునీటిని అందించే పూండి సత్యమూర్తి సాగర్ రిజర్వాయర్‌కు నీటి రాక వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో షట్టర్‌కు సమీపంలో కరకట్ట దెబ్బతినడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తక్షణ చర్యల్లో భాగంగా ఇసుక బస్తాలను నింపి ముందస్తు చర్యలు చేపట్టారు. తిరువళ్లూరు జిల్లా పూండిలో సత్యమూర్తి రిజర్వాయర్ నీటి మట్టం 35 అడుగులు(3,231 మిలియన్ క్యూబిక్ అడుగులు) కాగా ప్రస్తుతం 1,284 మిలియన్ క్యూబిక్ నీరు నిల్వ వుంది. ఇటీవల జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలతో పాటు కండలేరు నుంచి సెకనుకు 330 ఘణపుటడుగుల నీరు వస్తుండడంతో పూండీ నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. రిజర్వాయర్ నుంచి చెన్నై ప్రజల తాగునీటి అవసరాల కోసం లింక్ కాలువ నుంచి 289 ఘణపుటడుగుల నీటిని పుళల్, చెమరంబాక్కంకు రిజర్వాయర్‌కు విడుదల చేస్తున్నారు. అయితే రిజర్వాయర్‌కు నీటి ఉధృతి పెరిగి అలలు పెరగడంతో గతంలో మర్మమ్మతు పనులు నిర్వహించిన షట్టర్ సమీప ప్రాంతంలోని కరకట్ట దెబ్బతింది. దీంతో కోతకు గురై దెబ్బతిన్న ప్రాంతాన్ని ఇసుక బస్తాలతో నింపుతున్నారు. నీటి అలలు కారణంగా కరకట్ట దెబ్బతినకుండా జాగ్రత్తలు చేపట్టారు.


కరకట్ట వద్ద మరమ్మతులు చేస్తున్న సిబ్బంది


రజనీకాంత్


కమలహాసన్


విజయ్

మళ్లీ సూపర్‌స్టార్ రచ్చ

తమిళసినిమా: కోలీవుడ్లో సూపర్‌స్టార్ ఎవరనే రచ్చ మళ్లీ రగులుతోంది. గతంలో త్యాగరాజన్ భాగవతార్ తొలి సూపర్‌స్టార్‌గా వెలిగారు. ఆ తర్వాత మక్కల్ తిలకం ఎంజీఆర్‌కు ఆ పట్టాన్ని అభిమానులు అందించారు. అనంతరం కమలహాసన్ రజనీకాంత్ పోటీ పడుతూ వచ్చారు కానీ మాస్ ఫాలోయింగ్‌తో రజనీకాంత్‌నే గత నాలుగు దశాబ్దాలుగా సూపర్‌స్టార్‌గా రాణిస్తున్నారు. విశ్వనటుడుగా పేరుగాంచిన కమలహాసన్ దాని జోలికి వెళ్లలేదు. అలాంటిది ఇటీవల వారీసు తెలుగు వెర్షన్ వారసుడు చిత్ర ప్రమోషన్ కార్యక్రమంలో ఆ చిత్ర నిర్మాత కోలీవుడ్ సూపర్‌స్టార్ విజయ్ అని పేర్కొనడం చర్చకు కాదు కాదు పెద్ద వివాదానికే తెరలేపింది. ప్రముఖ నటుడు శరత్‌కుమార్ వంటి కొందరు కూడా దీనికి వంత పాడారు. అలా కొన్నిరోజులు సాగిన ఈ దుమారం ఆ తర్వాత చల్లబడింది. అలాంటిది ఇప్పుడు మరోసారి సూపర్‌స్టార్ ఎవరన్న అంశంపై రచ్చ వేడెక్కింది. ఇందుకు కారణం లేకపోలేదు నటుడు రజనీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం జైలర్ కేరళ రాష్ట్రంలో అయిన వ్యాపారం కంటే నటుడు విజయ్ కథానాయకుడుగా నటిస్తున్న లియో చిత్ర బిజినెస్ అధికంగా జరిగిందని సమాచారం. మరో కారణం కూడా ఉంది. విజయ్ ప్రస్తుతం రూ.120 కోట్ల వరకు తీసుకుంటున్నట్లు కోలీవుడ్ వర్గాల టాక్. రజనీకాంత్ కూడా అంతే పారితోషికాన్ని తీసుకుంటున్నట్లు సమాచారం. అయితే విజయ్ తన 68వ చిత్రానికి రూ.200 కోట్లు డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుంది. అలా ఏవిధంగా చూసినా విజయ్ నే సూపర్‌స్టార్ అనే ఒక వర్గం గట్టిగా వాదిస్తున్నారు. ఇప్పుడు ఈ చర్చల్లోకి నటుడు కమలహాసన్ పేరు కూడా చేరింది. ఇటీవల ఈయన నటించి, నిర్మించిన విక్రమ్ చిత్రం బాక్సాఫీస్‌ను బద్దలు కొట్టింది. అదేవిధంగా ప్రస్తుతం నటిస్తున్న ఇండియన్-2 చిత్రానికి రూ.100 కోట్లకు పైగా పారితోషికం తీసుకుంటున్నట్లు సమాచారం. అరుపక్క బిగ్ బాస్ రియాల్టీ గేమ్స్ అత్యధిక తీసుకుంటున్నారని, ఇంకోపక్క నిర్మాతగా వరుసగా చిత్రాలు నిర్మించడంతో ఈయన వార్షిక ఆదాయం రజనీకాంత్, విజయ్ కంటే చాలా ఎక్కువ అని కాబట్టి కమలహాసన్‌నే సూపర్‌స్టార్ అని ఆయన అభిమానులు గళమెత్తుతున్నారు.

మారి సెల్వరాజ్ టెన్షన్ పార్టీ

తమిళసినిమా: దర్శకుడు మారి సెల్వరాజ్ టెన్షన్ పార్టీ అని అన్నది ఎవరో కాదు. నటుడ, నిర్మాత, మంత్రి ఉదయనిధి స్టాలిన్‌నే. తాజాగా కథానాయకుడిగా నటించిన చిత్రం మామన్నన్. కీర్తిసురేష్ కథానాయక నటించిన ఇందులో వడివేలు పోషించారు. మారి సెల్వరాజ్ కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహించారు. పరియేరుమ్ పెరుమాళ్ చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన ఈయన ఆ తరువాత ధనుష్ హీరోగా కర్ణన్ చిత్రం చేశారు. మామన్నన్ ఈయనకు మూడో చిత్రం. దీనికి ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న మామన్నన్ చిత్రం ఈనెల 29న తెరపై రావడానికి ముస్తాబవుతోంది. దీంతో చిత్ర వర్గాలు ప్రమోషన్ కార్యక్రమాలను ముంబరం చేశారు. ఇటీవల ఒక చానల్‌లో పాల్గొన్న చిత్ర కథానాయకుడు ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ షూటింగ్ స్పాట్లో దర్శకుడు మారి సెల్వరాజ్ చాలా టెన్షన్‌గా ఉంటారని చెప్పారు. తన అసిస్టెంట్ డైరెక్టర్స్ ఎడాపెడా కొట్టేస్తారని, ఇష్టమొచ్చినట్లు తిట్టేస్తారని చెప్పారు. సెట్ అంతా యుద్ధవాతావరణం నెలకొంటుందని అన్నారు. దీంతో నెటిజన్లు దర్శకుడు మారి సెల్వరాజ్ ఓ రేంజ్‌లో ఆడేసుకుంటున్నారు. శతాధిక చిత్రాలు చేసిన దర్శకులు కూడా మర్యాదగా ప్రవర్తించేవారిని, రెండు చిత్రాలతో మారిసెల్వరాజ్ అసిస్టెంట్ డైరెక్టర్స్‌పై తన ప్రతాపం చూపడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.


ఉదయనిధి స్టాలిన్, వడివేలుతో దర్శకుడు మారిసెల్వరాజ్

నా జీవన విధానం హుందాగా ఉంటుంది

తమిళసినిమా: ఇండియన్ సినిమాలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నటి శ్రుతిహాసన్. ఈమె జీవితం తెరిచిన పుస్తకం అని చెప్పవచ్చు. విశ్వనటుడు కమల్‌హాసన్ వారసురాలు అయిన ఈమె హిందీ చిత్రంతో కథానాయకిగా నట జీవితాన్ని ప్రారంభించి ఆపై తెలుగు, తమిళం అంటూ తన స్థాయిని విస్తరించుకుంటూ వచ్చారు. ముఖ్యంగా తెలుగులో శ్రుతిహాసన్ లక్కీ హీరోయిన్. దాదాపు అక్కడ సక్సెస్ అయ్యాయి. ప్రస్తుతం ప్రభాస్‌కు జంటగా సలార్ అనే భారీ బ్రహ్మాండ చిత్రంలో నటిస్తున్నారు . తమిళం, తెలుగు, మలయాళం భాషల్లో త్వరలో తిరుపతికి రావడానికి ముస్తాబవుతుంది. కాగా శ్రుతిహాసన్ గురించి రకరకాల ప్రచారం జరుగుతుంది. పండ్లు ఉన్న చెట్టుకే దెబ్బలు అన్ని సామెత మాదిరి శ్రుతిహాసన్ సినీ వ్యక్తిగత జీవితాల గురించి ఎవరికీ తోచింది వారు రాస్తుంటారు. ప్రచారం చేస్తుంటారు. ఇవి కూడా ఎవరూ ఎలాంటి ప్రశ్న వేసినా చాలా బోల్డ్‌గా బదులిస్తుంటారు తన బాయ్‌ఫ్రెండ్‌తో కూడా బహిరంగంగా తిరిగే నటి శ్రుతిహాసన్. ఎందుకంటే ఈమె పుట్టి పెరిగిన వాతావరణం అలాంటిది. తమ తల్లిదండ్రులు తమకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చారని, అలాగని వారికి గౌరవానికి తలవంపులు తెచ్చే ఎలాంటి పనిని తాను చేయనని చెబుతారు. ఇదంతా ఇప్పుడు ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే తరుచూ అభిమానులతో ఆన్‌లైన్‌లో ముచ్చటించే శ్రుతిహాసన్ ఇటీవల ఇన్‌స్టాగామ్‌లో అభిమానులు అడిగిన ప్రశ్నలకు బదులు ఇచ్చి వారిని ఖుషీ చేశారు. ఈ సందర్భంగా ఒక అభిమాని మీరు మద్యం తాగుతారా? అన్న ప్రశ్న లేదు తాను మద్యం తాగాను, మాదకదవ్యాలు కూడా తీసుకోను అంటూ బదులిచ్చారు. అంతేకాకుండా తాను జీవితాన్ని హుందాగా గడిపే నటినని స్పష్టం చేసింది. దటీజ్ శ్రుతిహాసన్ అని మరోసారి నిరూపించుకున్నారు.


శ్రుతిహాసన్

పార్కింగ్ షూటింగ్ పూర్తి

తమిళసినిమా: వైవిధ్య భరిత కథా చిత్రాలను సెలెక్ట్ చేసుకుంటూ నటిస్తున్న నటుడు హరీష్ కల్యాణ్. ఈయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రాల్లో పార్కింగ్ ఒకటి. ఇప్పటివరకు కుటుంబ కథా చిత్రాలను చేస్తున్న ఈయన తన థ్రిల్లర్ డ్రామా కథలో నటిస్తున్న చిత్రం పార్కింగ్. ప్యాషన్ స్టూడియోస్ సుదన్ సుందరమ్, సోల్జర్స్ ఫ్యాక్టరీ కేఎస్. సినీష్ కలిసి నిర్మిస్తున్న చిత్రం ఇది రామ్‌కుమార్ బాల కృష్ణన్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈయన కేఎస్.సినీష్ వద్ద బెలూన్ చిత్రానికి సహాయ దర్శకుడిగా పనిచేశారన్నది గమనార్హం. కాగా ఇందూజ నాయకిగా నటిస్తున్న ఈ చిత్రంలో ఎంఎస్ భాస్కర్, రామా రాజేంద్ర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు పార్కింగ్ చిత్రం షూటింగ్ పూర్తిచేసుకుంది. దీని గురించి చిత్ర నిర్మాతలు గురువారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంటూ ప్రణాళిక ప్రకారం చిత్ర షూటింగ్ పూర్తిచేయడం సంతోషంగా ఉందన్నారు. చిత్రం సంతృప్తికరంగా వచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయని ఇతర విశేషాలను వెల్లడించనున్నట్లు చెప్పారు. దీనికి శ్యామ్ సీఎస్ సంగీతాన్ని, జిజు సన్నీ ఛాయాగ్రహణం అందిస్తున్నారు.


హరీష్ కల్యాణ్


ఇందూజ

ఇతను ఎవరు కీర్తి

తమిళసినిమా: నటీమణుల మీద రకరకాల వదంతులు రావడం సహజమే. ఇక్కడ నిప్పు లేనిదే పొగరాదు అనే సామెత కూడా వినిపిస్తూ ఉంటుంది. ఇక హీరోయిన్ల ప్రేమ పెళ్లి గురించి రకరకాల ప్రచారం జరుగుతుండడం, వాటిని వాళ్లు ఖండించడం షరా మామూలే. ఇటీవల ఇలాంటి ప్రచారం కీర్తిసురేష్‌పై ఎక్కువగా జరుగుతోంది. అనతి కాలంలోనే దక్షిణాది కథానాయకిగా పేరు తెచ్చుకున్న మలయాళీ కుట్టి ఈమె. ప్రారంభ దశలోనే మహానటి చిత్రంలో దివంగత నటి సావిత్రి బయోపిక్‌లో అద్భుత అభినయాన్ని చాటి, విమర్శకులను సైతం మెప్పించి, జాతీయ ఉత్తమ నటి అవార్డును గెలుచుకుంది. అంతేకాకుండా చాలా తక్కువ కాలంలోనే హీరోయిన్ ఓరియెంటెడ్ కథా చిత్రాల నటిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ఇలా నటిగా సక్సెస్‌ఫుల్‌పై సాగిస్తున్న కీర్తిసురేష్ వ్యక్తిగతంగా నెటిజన్లు కార్నర్‌కు గుర్తించిందని చెప్పక తప్పదు. ముఖ్యంగా ప్రేమ విషయంలో ఈమెపై రకరకాల వార్తలు ప్రచారం అవుతున్నాయి. కీర్తిసురేష్ ప్రేమలో పడిందని త్వరలోనే పెళ్లి బాజా మోగనుందని ఆ మధ్య ప్రచారం జరిగింది. గోవాకు చెందిన ఒక వ్యాపారవేత్త ప్రేమలో పడిందని ఆ వ్యక్తితో చట్టాపట్టాలేసుకుని తిరుగుతోందని మరో వార్త సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ అయితే దానికి ఆమె తండ్రి సురేష్ వివరణ ఇచ్చారు. కీర్తిసురేష్‌తో ఉన్న వ్యక్తి తమ కుటుంబ సన్నిహితుడేనని తాము గోవాకు వెళ్లినప్పుడల్లా అతను తమకు అన్ని రకాలుగా సహకరిస్తారని, అయితే తను కీర్తిసురేష్ ప్రేమికుడు కాదని స్పష్టం చేశారు. లేకపోతే తాజాగా కీర్తిసురేష్ ఒక వ్యక్తితో సన్నిహితంగా ఉన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. కీర్తీ ఇతను ఎవరమ్మా? ప్రేమికుడా, లేక స్నేహితుడా అంటూ నెటిజన్లు ట్రోలింగ్ చేస్తున్నారు.


ఫ్రెండ్‌తో కీర్తిసురేష్

క్లుప్తంగా

రైల్వే ట్రాక్ జాయింట్‌లో మరమ్మతులు


ట్రాక్ మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

తిరువళ్లూరు: ట్రాక్ జాయింట్‌లో ఏర్పడిన మర్మమతులు కారణంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు 30 నిమిషాల పాటు ఆలస్యంగా రాకపోకలు సాగించాయి. తిరువళ్లూరు–ఏకాటూరు మధ్యలోని రైల్వే ట్రాక్ జాయింట్‌లో మరమ్మతులు ఏర్పడినట్టు అధికారులు గుర్తించారు. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంఘటన స్థలానికి వచ్చిన సిబ్బంది దాదాపు గంటపాటు శ్రమించి మరమ్మతు పనులు చేపట్టి సరి చేశారు. కాగా ఈ పనుల కారణంగా 30 నిమిషాల పాటు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆలస్యంగా రాకపోకలు సాగించాయి. మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను కడంబత్తూరు నుంచి లోకల్ రైళ్లు వెళ్లే ట్రాక్‌లో దారి మళ్లించారు. వందేభారత్ రైలును సైతం కొద్దిసేపు నిలిపి వేశారు. అనంతరం ట్రాక్ మళ్లించి రాకపోకలు సాగించారు.

ఆర్మీ జవాన్ భార్య బలవన్మరణం

వేలూరు: స్నేహితునికి బంగారం, నగదు ఇచ్చిన వ్యవహారంలో ఆర్మీ జవాను భార్య ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వేలూరు జిల్లా ఒడుగత్తూరు సమీపంలోని ఎల్లప్పన్ పట్టికి చెందిన బాలాజీ ఆర్మీలో పనిచేస్తున్నాడు. అతని భార్య రేఖ(30)కు పక్క గ్రామం మరాటికి చెందిన కుమరేశన్‌తో పరిచయం ఏర్పడింది. కుమరేశన్ తరచూ రేఖ నుంచి నగదు, బంగారం తీసుకున్నాడు. మొత్తం 11 సవర్ల బంగారం, రూ.1.25 లక్షల నగదును రేఖ ఇచ్చింది. ఈ విషయం తెలిసి భర్త బాలాజీ, తల్లిదండ్రులు ఆమెను మందలించారు. దీంతో రేఖ తాను ఇచ్చిన నగదు, బంగారాన్ని ఇవ్వాలని కుమరేశన్‌ను నిలదీసింది. అతను తిరిగి ఇవ్వకపోవడంతో రేఖ కుటుంబ సభ్యులు ఈనెల 8వ తేదీన వేపంకుప్పం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుమరేశన్ తాను తీసుకున్న నగదు, బంగారాన్ని ఈ నెల 17వ తేదీన ఇస్తానని ఒప్పుకున్నాడు. చెప్పిన ప్రకారం నగదు, బంగారం ఇవ్వలేదు. దీంతో మంగళవారం ఉదయం బాలాజీ, రేఖ దంపతుల మధ్య ఘర్షణ జరిగింది. మనస్తాపం చెందిన రేఖ ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న వేపంకుప్పం పోలీసులు అక్కడికి చేరుకుని రేఖ మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి విచారణ చేస్తున్నారు.

బెదిరింపుల కేసులో ఇద్దరి అరెస్ట్


అరెస్టయిన కురుమణ కృష్ణ, శ్రీనివాసులు

తిరువళ్లూరు: తిరువళ్లూరుకు చెందిన వ్యాపారిని కిడ్నాప్ చేయడానికి యత్నించిన సంఘటనలో ఇద్దరు ఆంధ్ర యువకులను తిరువళ్లూరు టౌన్ పోలీసులు అరెస్టు చేసి విచారణ చేపట్టారు. తిరువళ్లూరులోని అన్నావీధికి చెందిన కనకరాజ్ కుమారుడు అజిత్‌కుమార్(33). అజిత్‌కుమార్‌ను రెండు రోజుల నుంచి ఇద్దరు యువకులు వెంబడించినట్టు తెలిసింది. దీంతో అజిత్‌కుమార్ తిరువళ్లూరు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విచారణలో పట్టుబడిన యువకులు విశాఖపట్నం సమీపంలోని అప్పయ్యగుంట ఆంథోని నగర్‌కు చెందిన కురుమన కృష్ణ(29), అక్కయ్యపాళ్యం రామచంద్రనగర్‌కు చెందిన సూరిబాబు కుమారుడు శ్రీనివాసులు(33)గా గుర్తించారు. అజిత్‌కుమార్‌కు విశాఖపట్నం మెజిస్టిక్ టవర్ ప్రాంతానికి చెందిన యువతితో(30)తో వివాహం జరిగింది. ఈమెకు వివాహానికి ముందు జిమ్‌మాస్టర్ కృష్ణతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయాన్ని అడ్డుగా వుంచుకుని కనకప్రియను ఫొటో వీడియో తీసి డబ్బుల కోసం బెదిరింపులకు దిగాడు. బాధితురాలు విశాఖపట్నం పోలీసులకు 2019 డిసెంబర్ ఐదున ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో కేసును యువతి వెనక్కి తీసుకోవాలని, తమకు పరిహారం కింద రూ.పది లక్షలు ఇవ్వాలన్న డిమాండ్‌తో అజిత్‌కుమార్‌ను కిడ్నాప్ చేసి బెదిరింపులకు దిగాలని నిర్ణయించినట్టు నిందితులు పోలీసులకు వివరించారు.

వేధింపుల కేసులో పోలీసుల బదిలీ

తిరువొత్తియూరు: తిరుచ్చి సమయపురంలో హాస్టల్‌లో ఉంటున్న మహిళకు వేధింపులు ఇచ్చిన ఎస్ఐ సహా నలుగురు పోలీసులు బదిలీ అయ్యారు. తిరుచ్చి మారియమ్మన్ ఆలయానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. యాత్రికుల వసతి కోసం ఉచిత మండపాలు, వసతి గృహాలు ఉన్నాయి. కొద్దిరోజుల క్రితం బయట ఊరి నుంచి సమయపురం ఆలయానికి ఓ జంట వచ్చి వసతి గృహంలో ఉన్నారు. అప్పుడు హాస్టల్‌ను తనిఖీ చేసేందుకు వెళ్లిన ఎస్ఐ, ముగ్గురు పోలీసులు మహిళతో దురుసుగా ప్రవర్తించారని, ప్రశ్నించిన భర్తపై దాడికి పాల్పడినట్టు తెలిసింది. ఫిర్యాదు మేరకు అధికారులు ఎస్ఐ సహా నలుగురిని బదిలీ చేశారు.

సంక్షేమ పథకాల అమలులో తమిళనాడు అగ్రస్థానం

• మంత్రి మనో తంగరాజ్



మాట్లాడుతున్న మంత్రి మనో తంగరాజ్

కొరుక్కుపేట: వివిధ సామాజిక అభివృద్ధి సూచికల్లో తమిళనాడు మెరుగైన పనితీరుకు సంక్షేమ పథకాలే కారణమని రాష్ట్ర పాలు, పాడిపరిశ్రమ శాఖ మంత్రి టి.మనో తంగరాజ్ అన్నారు. ఫిక్కీ సంస్థ నిర్వహించిన తమిళనాడు హయ్యర్ ఎడ్యుకేషన్ సమ్మిట్, అవార్డుల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో తమిళనాడు, కేరళ రాష్ట్రాలు అగ్రగామిగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో గణనీయమైన సంఖ్యలో విద్యార్థులు, అధ్యాపకులకు శిక్షణనిచ్చిన నాన్ ముదల్వన్, ఫ్యూచర్ స్కిల్స్ ప్రోగ్రామ్‌ల విజయవంతంపై ఆయన చర్చించారు. చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థుల్లో జీవిన నైపుణ్యాలు, ఆంగ్లంలో ప్రావీణ్యం లేకపోవడం వల్ల వారు నష్టపోతున్నారని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కన్యాకుమారి జిల్లాలో సాఫ్ట్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీషులో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంలో తన అనుభవాన్ని పంచుకున్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కోసం ఇలాంటి కార్యక్రమాలను పెద్ద సంస్థలు స్పాన్సర్ చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి ఉచిత విద్యా పథకాన్ని ప్రవేశ పెట్టడంతో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన పుదుమై పెన్ పథకం సహా అందుబాటులో ఉన్న వివిధ స్కాలర్‌షిప్ పథకాలు తమిళనాడును విద్యలో అగ్రగామిగా నిలిపినట్టు వివరించారు. ఫిక్కీ తమిళనాడు ఎడ్యుకేషన్ ప్యానెల్ కన్వీనర్, హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ప్రొ చాన్స్‌లర్ అశోక్ జి వర్గీస్, ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జె.విఘ్నేష్ కుమార్, ఫిక్కీ తమిళనాడు స్టేజ్ కౌన్సిల్ కో చైర్మన్ భూపేష్ నాగరాజన్, బెంగళూరులోని ఫ్రాన్స్ జనరల్ కాన్సులేట్ డాక్టర్ ఫ్రాంకోయిస్– జేవియర్ పాల్గొన్నారు.

రూ.58 కోట్ల మోసం కేసులో నిందితుడి అరెస్ట్

కొరుక్కుపేట: నకిలీ అముద సురభి సహకార సంఘం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రూ.58 కోట్లు మోసం చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సేలం జిల్లా, అయోధ్య పట్నం మునియప్పన్‌కు చెందిన వర జయవేల్ (67) తన బంధువులు తంగపాసం, ప్రేమ్ ఆనంద్, శరణ్యతో కలిసి అముద సురభి పొదుపు, సహకార క్రెడిట్ సంఘాన్ని ప్రారంభించాడు. తద్వారా అధిక వడ్డీ ఇస్తామని చెప్పి పలువురి నుంచి డబ్బు వసూలు చేశారు. ఈ కేసులో గతేడాది నవంబర్‌లో సేలం అమ్మపేట డీడీకి చెందిన భాస్కరన్ (52) సేలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అందులో రూ.2.92 లక్షలు అముద సురభి కో–ఆపరేటివ్ సొసైటీలో పెట్టుబడి పెట్టానని, వడ్డీ, అసలు ఇవ్వకుండా మోసం చేశారని వివరించారు. డీఎస్పీ శ్రీనివాసన్ నేతత్వంలో పోలీసులు విచారణ చేపట్టారు. తమిళనాడు వ్యాప్తంగా రూ.58 కోట్లు మోసం చేసినట్టు గుర్తించారు. అనంతరం నకిలీ సహకార కోఆపరేటివ్ సొసైటీ అధినేతగా వ్యవహరించిన జయవేల్, అకౌంటెంట్ కన్నన్‌ను అరెస్టు చేశారు. 10వ తేదీన మాసినాయకన్‌పట్టికి చెందిన దర్శకుడు తంగపలతై (45)ను అరెస్టు చేశారు. వారిని కోయంబత్తూరు కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. ఈ కేసులో తంగపలతైని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తే రూ. 58 కోట్లతో కొనుగోలు చేసిన ఆస్తుల వివరాలు తెలిసే అవకాశం ఉందని, వాటిని జప్తు చేయవచ్చని పోలీసులు తెలిపారు. ఈ కేసులో పరారీలో ఉన్న దర్శకులు ప్రేమ్ ఆనంద్, శరణ్య కోసం క్రైం బ్రాంచ్ పోలీసులు గాలిస్తున్నారు.

రూ.25.7 కోట్లతో 8 లేన్లుగా కొత్త ఫ్లై ఓవర్ బ్రిడ్జి

కొరుక్కుపేట: పెరుంగళత్తూరు రైల్వే ఫ్లైఓవర్‌ను కూల్చివేసి రూ.25.7 కోట్లతో 8 లేన్ల కొత్త ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని యోచిస్తున్నట్లు హైవే శాఖ అధికారులు తెలియజేశారు. దక్షిణ జిల్లాల నుంచి చెన్నై వైపు వచ్చే వాహనాలన్నీ పెరుంగళత్తూరు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి గుండా వెళుతున్నాయి. అక్కడ రెండు వాహనాలు ఒకేసారి వెళ్లేంత మార్గమే ఉంది. అదేవిధంగా చెన్నై నుంచి దక్షిణ సర్కిళ్లకు వెళ్లే వాహనాలు పెరుంగళూరు రైల్వే ఓవర్ బ్రిడ్జిపై మాత్రమే వెళ్తున్నాయి. దీంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. తాంబరం, మధుర, చెంగల్పట్టు మార్గాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరుతున్నాయి. ఈ నేపథ్యంలో పాత రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిని కూల్చివేసి రూ.25.7 కోట్లతో కొత్త ఫ్లైఓవర్ నిర్మించాలని జాతీయ రహదారుల శాఖ యోచిస్తోంది. దాదాపు 2.4 కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ ఫ్లైఓవర్‌ను ఇరువైపులా ఎనిమిది లేన్ల రహదారిగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. త్వరలో పనులు ప్రారంభించి 2024లోగా పూర్తి చేయాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. తిరుచ్చిలోని ఎనిమిది లేన్లతో కూడిన ఫ్లైఓవర్‌పై గంటకు 65 కిలోమీటర్ల వేగంతో వాహనాలు వెళ్లేందుకు వీలుగా కొత్త ఫ్లైఓవర్ వల్ల ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు.

22 మంది తమిళనాడు మత్స్యకారుల అరెస్ట్

కొరుక్కుపేట: నేదుండివే సమీపంలో సరిహద్దు దాటి చేపలు పట్టుకుంటున్న పుదుకోట్టై జిల్లా జగదపట్నం మండపానికి చెందిన 22 మంది మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేసి నాలుగు పడవలను స్వాధీనం చేసుకున్నారు. రామనాథపురం జిల్లా మండపం నార్త్ ఫిషింగ్ హార్బర్ నుంచి తంగచ్చిమడంకు చెందిన ఆంథోనికి చెందిన బోటులో తంగచ్చిమడంకు చెందిన సంధ్య (32), జిప్రణ్, ఉచిపుల్లికి చెందిన దేవా (40)తో పాటు నాగరాజన్, నటరాజన్ చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. అదేవిధంగా మండపంలో ఉంటూ పుదుక్కోట్టై నుంచి చేపలు వేటకు జగదాపట్నంకు చెందిన ఉదయకుమార్, కాళీముత్తులకు చెందిన బోటులో ఉదయకుమార్, రవీంద్రన్, మధులనాథన్, వైద్యనాథన్, అరుల్‌నాథన్, కుమారేశన్, అజిత్ అనే వారు ఒకే బోటును కలిగి ఉన్నారు. మొత్తం 22 మంది మత్స్యకారులు చేపల వేటకు వెళ్లారు. కచ్చదీవు పక్కనే ఉన్న నేదుండి సమీపంలో గురువారం తెల్లవారుజామున మత్స్యకారులు నాలుగు పవర్ బోట్లలో చేపలు పట్టుకుంటున్నారు. అనంతరం శ్రీలంక నేవీ పెట్రోలింగ్ తమిళనాడు మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్న ప్రాంతానికి వెళ్లి ఆ తర్వాత జగదపట్నం నుంచి 3 బోట్లు సరిహద్దు దాటి చేపలు పట్టినట్లు తెలిపారు. హిందూ మహాసముద్రంలో చేపల వేట సాగిస్తున్న 22 మంది మత్స్యకారులను అరెస్టు చేయడం తీవ్ర కలకలం రేగింది. ఒక్కరిని మాత్రం శ్రీలంక నౌకాదళం విడిచిపెట్టినట్టు సమాచారం.

చెరువులో మునిగి ఇద్దరు కూలీల మృతి


కార్మికులు సుబ్రమణి, ఏలుమలై (ఫైల్)

వేలూరు: చెరువులో మునిగి ఇద్దరు కూలీలు మృతి చెందిన సంఘటన కలకలం రేపింది. తిరువణ్ణామలై జిల్లా వానాపురం సమీపంలోని కుంగిలినత్తం గ్రామానికి చెందిన సుబ్రమణి(42), బంధువు విల్లుపురం జిల్లా కన్‌టాచ్చిపురానికి చెందిన ఏలుమలై(37) మంగళవారం మధ్యాహ్నం వానాపురం సమీపంలోని కోటియాట్టూరు గ్రామంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. సాయంత్రం వరకు ఇద్దరూ ఇంటికి రాకపోవడంతో బంధువులు చెరువు వద్ద పరిశీలించారు. గట్టుపై ఇద్దరి సెల్‌ఫోన్లు, దుస్తులు, చెప్పులు ఉండటంతో చెరువు నీటిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ తెలియకపోవడంతో బానావరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తండ్రాంబట్టు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. బుధవారం రాత్రి వరకు గాలించినా ఫలితం లేదు. గురువారం ఉదయం ఇద్దరి మృతదేహాలు నీటిలో తేలియాడుతుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలను బయటకు తీసి తిరువణ్ణామలై ప్రభుత్వాస్పత్రికి తరలించి విచారణ చేస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగం పేరిట రూ.11.50 లక్షల మోసం

• వ్యక్తి అరెస్ట్


అరెస్టయిన వినోద్‌బాబు

తిరువళ్లూరు: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.11.50 లక్షలు మోసం చేసిన కేసులో యువకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయనపాక్కంకు చెందిన బాబు కుమారుడు వినోద్‌బాబు చెన్నై నొలంబూరుకు చెందిన ఇసక్కీసుందరం కుమారుడు పొన్నయ్య(42)ను కలిశాడు. తనకు తమిళనాడు హౌసింగ్ బోర్డులో బాగా పరిచయాలు ఉన్నాయని, రూ.11.50 లక్షలు ఇస్తే అతను భార్యకు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. ఆ మాటలను నమ్మిన పొన్నయ్య రూ.11.50 లక్షలు ఇచ్చాడు. ఎన్నిరోజులైనా వినోద్‌బాబు ఉద్యోగం ఇప్పించకపోగా, నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా మోసం చేసినట్టు నిర్ధారణ అయ్యింది. దీంతో వినోద్‌బాబును అరెస్టు చేసి పూందమల్లి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి అతనికి 14 రోజులు రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.

హీరోయిన్ అవకాశం ఇస్తానని మోసం

తిరువొత్తియూరు: హీరోయిన్ అవకాశం ఇస్తానని యువతి వద్ద పలు లక్షలు మోసం చేసిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. చెన్నై టీనగర్ ప్రకాశం రోడ్డులో ప్రసిద్ధ సినిమా నిర్మాణం ఈ క్రియేషన్ పేరుతో సంస్థ నడుపుతున్నారు. కొత్త సినిమాలకు నటీనటులు కావాలని కొందరు ప్రచారం చేస్తూ సంప్రదించిన యువతీయువకుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారు. 3 నెలలు గడిచినా కొత్త సినిమాలో నటించడానికి తమకు పిలుపు రాలేదని మోసపోయిన యువతులు కార్యాలయానికి వెళ్లి అక్కడ ఉన్న చిత్ర నిర్మాణ సంస్థ డైరెక్టర్ జగదీశన్ (50)ను ప్రశ్నించగా తమ సంస్థ తరఫున నటించడానికి ఎవరినీ ఎంపిక చేయలేదని వారితో చెప్పారు. తాము ఎటువంటి ప్రకటనలను ఇవ్వలేదని అని చెప్పాడు. అది విని షాక్ తిన్న యువతీ, యువకులు ఏమి చేయాలో తోచలేదు. దీనిపై ఈ క్రియేషన్స్ కో–డైరెక్టర్ జగదీశన్ యువతులకు ఇచ్చిన సెల్‌ఫోన్ నంబర్ల ఆధారంగా తేనాంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు యువతుల నుంచి డబ్బులు తీసుకుని పోలీసులను మోసం చేసిన అనుమానితుల సెల్‌ఫోన్ నంబర్లను పరిశీలిస్తున్నారు.

విద్యార్థికి టీచర్ లైంగిక వేధింపులు

తిరువొత్తియూరు: కన్యాకుమారి జిల్లా ఇరానియల్ సమీపంలో పాఠశాల విద్యార్థిని లైంగికంగా వేధించిన ఉపాధ్యాయుడిపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడు కన్నాట్టు విలై మహోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడని తెలిపారు. అక్కడ పనిచేస్తున్న టీచర్ (47) గత నెల 14న తన కుమారుడిని లైంగికంగా వేధించాడని తెలిసిందన్నారు. సంబంధిత ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పునరుత్పాదక ఇంధనంపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వీఎల్ ఇందిరాదత్

కొరుక్కుపేట: ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో రెన్యూవబుల్ ఎనర్జీ (పునరుత్పాదక శక్తి)– ఫ్యూచర్ సిండ్రోమ్, అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై గురువారం ఒక్క రోజు సదస్సు నిర్వహించారు. చెన్నై తేనాంపేటలో జరిగిన ఈ సదస్సుకు ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్.ఇందిరా దత్ అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ పునరుత్పాదక ఇంధన వ్యవస్థాపక సామర్థ్యంలో ప్రపంచ వ్యాప్తంగా భారత్ 4 స్థానంలో ఉందన్నారు. దీంతో అత్యుత్తమ పారిశ్రామిక పద్ధతులను అనుసరించడానికి పునరుత్పాదక ఇంధనం కీలకమైన ప్రాంతమన్నారు. పవన విద్యుత్, సౌర విద్యుత్ సామర్థ్యంలోనూ భారత్ నాలుగో స్థానంలో ఉందన్నారు. ఎంఎస్ఎంఈలకు రెన్యువబుల్ ఎనర్జీ వెన్నుదన్నుగా ఉందన్నారు. సాంకేతిక సహాయం, ఆర్థిక మద్దతు, నైపుణ్యాభివృద్ధిలో ఎంఎస్ఎంఈలకు భారత ప్రభుత్వం సహాయం చేస్తోందని వివరించారు. క్యాపిటాల్యాండ్ సింగపూర్ – చెన్నై రీజినల్ హెడ్ డాక్టర్ సీ.వేలన్ మాట్లాడుతూ 2019 తర్వాత భారతదేశంలో పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడిదారులు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారని తెలిపారు. ఆరోగ్యకరమైన, మరింత స్థితిస్థాపకమైన ప్రదేశాలను సృష్టించడమే కాకుండా భవిష్యత్ తరాలను నిలబెట్టడానికి, పర్యావరణ పరిరక్షణకు రెన్యూవబుల్ దోహదపడుతుందన్నారు. 2040 నాటికి భారతదేశం మొత్తం విద్యుత్‌లో 49 శాతం పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. 2029–30 నాటికి థర్మల్ ఎనర్జీని ప్రస్తుత 78 శాతం నుంచి 52 శాతానికి తగ్గించడంతో పునరుత్పాదక శక్తి వాటా దాదాపు 44 శాతం ఉంటుందని దేశం అంచనా వేసిందని చెప్పారు. భారతదేశం కూడా 2030 నాటికి 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మనుగడ, సుస్థిరత కోసం ఈ కొత్త స్వచ్ఛమైన ఇంధన వనరులను అవలంబించాల్సిన అవసరాన్ని వివరించారు. కామర్స్ మంత్రిత్వ శాఖ ఎంఎస్ఎంఈ విభాగం రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్.ఇలంగోవన్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కె.ఎస్.సురేష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ ముత్తువేలు, కమిటీ సభ్యులు పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 46 టాస్మాక్ దుకాణాలకు సీల్



సరుకులను గోదాముకు తరలిస్తున్న సిబ్బంది, టాస్మాక్ దుకాణాలకు సీల్ వేస్తున్న సిబ్బంది

తిరువళ్లూరు: కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ ఆదేశాల మేరకు అధికారులు గురువారం తిరువల్లూరు జిల్లాలోని 46 టాస్మాక్ దుకాణాలకు సీల్ వేశారు. ఎన్నికల ప్రచారంలో అంచెలంచెలుగా మద్యమాన నిషేధం విధిస్తామని డీఎంకే ప్రకటించింది. ఇంతవరకు టాస్మాక్ దుకాణాలను మూయకపోవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో 46 టాస్మాక్ దుకాణాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 500 టాస్మాక్ దుకాణాలను మూసివేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా తిరువళ్లూరులోని టాస్మాక్ దుకాణాలకు కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ నేతృత్వంలోని అధికారులు సీల్ వేశారు. వాటిలోని మద్యాన్ని గోదాముకు తరలించారు.

ఇంటి బిల్లుల చెల్లింపులో జాప్యంపై నిరసన


ఆర్కేపేట బీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

తిరుత్తణి: ఇంటి బిల్లుల చెల్లింపుల్లో జాప్యంపై బాధితులు గురువారం నిరసన తెలిపారు. ఆర్కేపేట యూనియన్ ఎస్‌వీజీ.పురం పంచాయతీలోని సమత్తువపురంలో 20 ఇళ్లు దుస్థితికి చేరుకున్నాయి. వాటికి మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇళ్లు కూల్చి వేసి గృహ నిర్మాణ పథకం కింద కుటుంబానికి రూ.రెండు లక్షల చొప్పున మంజూరు చేయాలని ఆదేశించింది. ఆరు నెలల కిందట అధికారులు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. సక్రమంగా బిల్లులు జమ చేయకపోవడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. బిల్లుల కోసం పంచాయతీ సర్పంచ్, బీడీఓకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో 10 కుటుంబాలకు చెందిన బాధితులు బీడీఓ కార్యాలయం ముట్టడించి నిరసన తెలిపారు. వెంటనే తమకు నిర్మాణ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

జూలై నుంచి థర్మల్ పవర్ ప్లాంట్లలో మెయింటెనెన్స్ పనులు

కొరుక్కుపేట: థర్మల్ పవర్ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి సాఫీగా సాగేందుకు జూలై నుంచి నిర్వహణ పనులు చేపట్టి 2 నెలల్లో పూర్తి చేస్తామని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు. తమిళనాడు ఎలక్ట్రిసిటీ బోర్డు ఉత్తర చెన్నై, మేట్టూర్, తూత్తుకుడి థర్మల్ పవర్ స్టేషన్లలో 4,320 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తోంది. ప్రస్తుతం ఉత్తర చెన్నై, మేట్టూర్ థర్మల్ పవర్ స్టేషన్లలో రెండు విభాగాల్లో జరుగుతున్న నిర్వహణ పనులు ఈ నెలాఖరులోగా పూర్తవుతాయి. ఆ తర్వాత అన్ని ఇతర విభాగాలు పూర్తిగా మూసివేసి నిర్వహణ పనులు చేపట్టనున్నారు. పవన విద్యుత్ ద్వారా ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి అవుతున్న తరుణంలో థర్మల్ పవర్ ప్లాంట్లలో మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నారు. 2 నెలల తర్వాత వర్షాకాలం ముగుస్తున్నందున అప్పటికి పనులు పూర్తి చేయాలని యోచిస్తున్నారు.

థర్మల్ పవర్ ప్లాంట్లు..

ఉత్తర చెన్నై, మేట్టూర్, తూత్తుకుడి పవర్ స్టేషన్లతో పాటు తూత్తుకుడి పవర్ స్టేషన్ 40 సంవత్సరాలుగా పనిచేస్తోంది. ఏదైనా మరమ్మతులు జరిగితే దాన్ని సరి చేయడానికి చాలా రోజులు పడుతుంది. తరచూ సాంకేతిక లోపం ఉంది. నెల మొదటి వారంలో 1,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమై ప్రస్తుతం 4,000 మెగావాట్లకు పెరిగింది. సెప్టెంబరు వరకు గాలులు ఎక్కువగా ఉండడంతో పవన విద్యుత్ ఉత్పత్తి పెరుగుతుంది. సెప్టెంబరులో పవన విద్యుత్ ఉత్పత్తి తగ్గుదల ప్రారంభమవుతుంది. అందుకోసం సెప్టెంబరులోగా అంతర్గత నిర్వహణ పనులు పూర్తిచేయాలని నిర్ణయించినట్టు అధికారులు తెలిపారు. నిర్వహణ పనులు పూర్తయితే థర్మల్ పవర్ ప్లాంట్ల సామర్థ్యం పెరగడంతో పాటు నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటారు. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఏకరీతి విద్యుత్ సరఫరా చేయవచ్చని అధికారులు తెలిపారు.

రాజకీయ ప్రవేశంపై నిర్ణయం తీసుకుంటారు


ఈరోడ్ ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువులకు బంగారు ఉంగరాలను ప్రదానం


తిరుచ్చిలో ఆలయ వెండి రథోత్సవం

• విజయ్ నిర్ణయం తీసుకుంటారు

తమిళసినిమా: ఇప్పుడు తమిళ రాజకీయాలు నటుడు విజయ్ చుట్టూ తిరుగుతున్నాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తాను విజయ్ ప్రజా సంఘం తరఫున చాలా కాలంగా రాష్ట్ర వ్యాప్తంగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న రాజకీయ రంగప్రవేశం తథ్యం అనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే విజయ్ అభిమానులు కొందరు ఆయన బొమ్మతో ప్రచారం చేసుకొని గత స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. ఇక గత 19న 10, ప్లస్‌టూ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉత్తీర్ణత సాధించిన రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 1,200లకు పైగా విద్యార్థులను పిలిపించి నగదు బహుమతులు ప్రదానం చేశారు. దీంతో విజయ్ రాజకీయ రంగప్రవేశం గురించి టీవీల్లో డిబేట్‌లు నిర్వహించారు. విజయ్‌కి రాజకీయాల్లోకి రావాలన్న ఆలోచన చాలా కాలంగానే ఉందనే అభిప్రాయాన్ని అధిక శాతం వ్యక్తం చేశారు. ఇకపోతే నటుడు విజయ్ పుట్టినరోజు సందర్భంగా విజయ్ ప్రజా సంఘం ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా గురువారం కార్యకర్తలు, అభిమానులు ఆలయాల్లో ప్రత్యేకపూజలు, అన్నదానం, రక్తదానం నిర్వహించారు. ముఖ్యంగా చెన్నైతో పాటు పలు జిల్లాలలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించిన పిల్లలకు బంగారం ఉంగరాలు బహూకరించారు. ఈ సందర్భంగా విజయ్ ప్రజాసంఘం ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ విజయ్ రాజకీయ రంగ ప్రవేశం గురించి ఆయనే సరైన నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

యువకుడి హత్య

తిరువొత్తియూరు: గంజాయి విక్రయాల వివాదంలో యువకుడు హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. పెరియపాళ్యం పక్కనే ఉన్న తండుమానగర్ ప్రాంతానికి చెందిన మండై ప్రవీణ్ అలియాస్ ప్రవీణ్ (25) ఇంటి నుంచి బయటకు వెళ్లి చాలా సేపు అయినా తిరిగి రాలేదు. బంధువులు పలుచోట్ల వెతికారు. ఈ క్రమంలో చోళవరం పక్కనే ఉన్న బుత్తూరు ప్రాంతంలోని చెరువులో ప్రవీణ్ శవంగా పడి వున్నాడు. అతని తలపై బలమైన గాయం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు. విచారణలో గంజాయి విక్రయాల వివాదంలో హత్య జరిగినట్లు తేలింది. పెరియప్ప గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన కొందరు అతడికి పరిచయస్తులు విషయంలో ప్రవీణ్ జోక్యం చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘర్షణలోనే హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనికి సంబంధించి పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు.

ఆయుధ పూజకు రైలు రిజర్వేషన్లు ప్రారంభం

కొరుక్కుపేట: ఆయుధ పూజకు ముందు స్వగ్రామానికి వెళ్లే వారి కోసం రైలు టికెట్ బుకింగ్ గురువారం నుంచి ప్రారంభమైంది. అక్టోబర్ 23, 24 తేదీల్లో ఆయుధపూజ, విజయ దశమి పండుగలు నిర్వహించనున్నారు. సాధారణంగా ప్రజల సౌకర్యార్థం రైళ్లకు 120 రోజుల ముందే ప్రీ రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుంది. దీనికి సంబంధించి అక్టోబర్ 20వ తేదీ స్వగ్రామానికి వెళ్లాలనుకునే వారి సౌకర్యార్థం గురువారం నుంచి బుకింగ్స్ ప్రారంభించినట్టు సదరన్ రైల్వే అధికారులు వెల్లడించారు. అక్టోబర్ 21, 22 తేదీల్లో బయలుదేరి పట్టణానికి వచ్చే వారు తదుపరి రోజుల్లో బుకింగ్ చేసుకోవచ్చని, అలాగే అక్టోబర్ 23న సరస్వతి పూజ కోసం పట్టణానికి తిరిగి వెళ్లేవారు 24 నుంచి టికెట్ బుక్ చేసుకోవచ్చని వెల్లడించారు.

ఇల్లు ఖాళీ చేయాలని మహిళకు బెదిరింపులు

కొరుక్కుపేట: తాను ఇంటిని కొనుగోలు చేయాలని, ఖాళీ చేయాలని మహిళను కొనుగోలుదారు బెదిరించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. చెన్నైలోని అధంబాక్కం అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఏలుమలై కుమార్తె అర్చన (25) 2019 నుంచి అంబేడ్కర్ నగర్‌లోని ఉమా గౌతమ్ ఇంట్లో ఉంటోంది. అందుకు గాను ఆమె రూ.2 లక్షలు చెల్లించి లీజు అగ్రిమెంట్ చేసుకుంది. ఉమా గౌతమ్ తన కుమార్తె పెళ్లి కోసం అర్చన నుంచి రూ.3 లక్షలు అప్పుగా తీసుకుని తిరిగి ఇవ్వలేదు. దీనికి తోడు రూ.4 లక్షల లాటరీ టికెట్లు రాగా 20వ నెల ముగిసినా డబ్బులు చెల్లించకుండా మోసం చేశాడు. ఇంతలో అర్చనకి తెలియకుండా ఉమా గౌతమ్ ఇంటికి తాళం వేశాడు. ఇంటి గురించి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇంటిని అమ్మేసినట్టు బెదిరించాడు. దీంతో అర్చన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటి యజమాని, ఇల్లు కొనుగోలు చేసినట్లు చెబుతున్న మాలతి ఉదయపైనా చర్యలు తీసుకోవాలని కోరింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా...

హైవేల విస్తరణ, నిర్మాణం వేగవంతం చేయాలి

అధికారులకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వివిధ జాతీయ రహదారుల విస్తరణ, నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించిన పనులను వేగంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల విస్తరణ, నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణ, అటవీ, ఇంధన శాఖల నుంచి పొందాల్సిన అనుమతులు తదితర అంశాలపై సీఎస్ గురువారం తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారుల విస్తరణ, నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించిన పనులను నిర్దిష్ట గడువు ప్రకారం పూర్తిచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా అటవీ, ఇంధన శాఖల నుంచి అనుమతులు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ప్రాజెక్టు లేదా ప్యాకేజీకి సంబంధించిన పనికి నిర్దిష్ట గడువు నిర్ణయించుకుని, ఆ గడువులోపు అన్ని అనుమతులు పొందడంతోపాటు పనులు సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులు, ఇంధన, అటవీ శాఖల అధికారులను సీఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ అండ్ రహదారులు, భవనాల శాఖ (టీఆర్ అండ్‌బీ) కార్యదర్శి ప్రద్యుమ్న జాతీయ రహదారుల విస్తరణ, నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి అటవీ, ఇంధన శాఖల అనుమతులు, భూసేకరణ సంబంధిత అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎస్‌కు వివరించారు.

అన్యాక్రాంతమైన వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వం దృష్టి

గుంటూరు పెద్ద మసీదు ఆస్తుల ఆక్రమణపై మైనారిటీస్ కమిషన్ విచారణ



గుంటూరులోని షాహి జామియా మసీదు వద్ద విచారణ చేస్తున్న ఇక్బాల్ అహమ్మద్ ఖాన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వక్ఫ్ ఆస్తుల్లో ఎలాంటి ఆక్రమణలను ఉపేక్షించబోమని ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ కమిషన్ చైర్మన్ కె.ఇక్బాల్ అహమ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. గుంటూరులోని సుప్రసిద్ధ షాహి జామియా మసీదు(పెద్ద మసీదు) ఆస్తుల అన్యాక్రాంతంపై ఫిర్యాదులు రావడంతో చైర్మన్ ఇక్బాల్ అహమ్మద్ ఖాన్ గురువారం విచారణ చేపట్టారు. ఆయన గుంటూరులోని మసీదు వద్దకు వెళ్లి ముతావల్లీలు, మత పెద్దలతో మాట్లాడి మసీదు నిర్వహణ, ఆస్తుల అన్యాక్రాంతంపై ఆరా తీశారు. అనంతరం ఇక్బాల్ మాట్లాడుతూ వక్ఫ్, మసీదుకు సంబంధించిన ఆస్తుల ఆక్రమణపై క్షుణ్ణంగా విచారణ చేస్తామని చెప్పారు. విచారణ పూర్తయిన తర్వాత చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఏపీ వక్ఫ్ బోర్డు ప్రత్యేక అధికారి షిరిన్‌బేగం, సీఈవో అబ్దుల్ ఖాదిర్, కమిషన్ వైస్ చైర్మన్ ఎ.జాషువా డానియెల్, సభ్యులు, అధికారులు ఉన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం

టీడీపీ కార్యదర్శి నారా లోకేశ్



వెంకటగిరి(తిరుపతి జిల్లా): తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే సోమశిల హైలెవల్ కెనాల్, ఆల్తూరుపాడు రిజర్వాయర్ వంటి పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తామని టీడీపీ కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఆయన గురువారం తిరుపతి జిల్లా వెంకటగిరిలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, స్వయం ఉపాధి ద్వారా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ఏటా ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని, అన్ని జిల్లాల్లో స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. నిరుద్యోగ యువతకు యువగళం నిధి ద్వారా నెలకు రూ.3,000 ఇస్తామని, అన్నదాతలకు ఏటా రూ.20 వేలు ఇచ్చి ఆదుకుంటామని చెప్పారు. యానాదుల కార్పొరేషన్ ఏర్పాటుచేసి వారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఉపకులాల వారీగా నిధులు కేటాయిస్తామని, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం చేస్తామని, చేనేతను దత్తత తీసుకుని నేత కార్మికులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, బీసీ, మైనారిటీలపై దాడులు పెరిగాయని విమర్శించారు. కలువాయి మండలంలో 600 ఎకరాల భూమి కబ్జాకు గురైందని, సిట్ వేసి ఆ భూములను వెనక్కితీసుకుని పేదలకు పంచుతామని తెలిపారు. హార్టికల్చర్ పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పారు. అనంతరం లోకేశ్ పాదయాత్ర వెంకటగిరిలోని కాంపాలెం నుంచి ప్రారంభమై వెంకటగిరి రూరల్ మండలం నిడిగల్లు వరకు కొనసాగింది. ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’ నేటి నుంచే..

సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు సంతృప్త స్థాయిలో పరిష్కారమే లక్ష్యం

- నెలరోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహణ
- నేడు సీఎం క్యాంపు కార్యాలయం నుంచి లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి జగన్
- రేపటి నుంచి గృహాల సందర్శన
- రాష్ట్రవ్యాప్తంగా 1.6 కోట్ల కుటుంబాలను సందర్శించనున్న బృందాలు
- రాష్ట్రవ్యాప్తంగా 15,004 సురక్ష క్యాంపుల నిర్వహణ
- ‘1902’తో హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటు..



సాక్షి, అమరావతి : అర్హులై ఉండి ఏ ఒక్కరూ లబ్ధి అందకుండా మిగిలిపోకూడదన్న తపన, తాపత్రయంతో ప్రతి ఇంట్లో ఏ చిన్న సమస్య ఉన్నా దానిని పరిష్కరించాలన్న చిత్తశుద్ధితో జగనన్నకు చెబుదాం ' కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మరో ప్రతిష్టాత్మక కార్యక్రమం 'జగనన్న సురక్ష'. రాష్ట్రవ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నెలరోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి లాంఛనంగా ప్రారంభిస్తారు.

ఇంటింటికీ వెళ్లి జల్లెడ..

ఇప్పటికే రాష్ట్రంలో శాచ్యురేషన్ పద్ధతిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ మంచి చేసిన జగనన్న ప్రభుత్వం.. అర్హులై ఉండి ఏ కారణంతోనైనా ఇంకా ఎవరైనా మిగిలిపోతే వారికి కూడా సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో ఈ 'జగనన్న సురక్ష' ద్వారా ఇంటింటినీ జల్లెడ పట్టనుంది. తద్వారా వారికి లబ్ధి చేకూర్చడంతో పాటు వారికింకేమైనా సర్టిఫికెట్లు (జనన, మరణ, కుల, సీసీఆర్సీ, రేషన్ కార్డు డివిజన్, హౌస్ హోల్డ్ డివిజన్, ఇన్‌కమ్ మొదలైన 11 రకాలు ధ్రువీకరణపత్రాలు) అవసరమైతే సర్వీస్ ఫీజు లేకుండా వాటిని ఉచితంగా అందించనుంది. కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా.. లంచాలకు, వివక్షకు తావులేకుండా.. నూటికి నూరు శాతం సంతృప్త స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలేమైనా ఉంటే తెలుసుకుని పరిష్కారం చూపించే దిశగా చేస్తున్న వినూత్న కార్యక్రమం ఈ 'జగనన్న సురక్ష'.

రేపటి నుంచి గృహ సందర్శన..

వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, జగనన్న మీద, జగనన్న ప్రభుత్వం మీద ప్రేమ, అభిమానం ఉన్న ఉత్సాహవంతులతో కూడిన టీమ్ రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటినీ సందర్శిస్తుంది. అర్హులై ఉండి ఎక్కడైనా లబ్ధి అందని వారుంటే వారిని గుర్తించి సమస్య పరిష్కారానికి కావల్సిన పత్రాలు సేకరిస్తారు. వారికేమైనా కుల, ఆదాయ, జనన మొదలైన సర్టిఫికెట్లు అవసరమైతే వాటికి అవసరమైన పత్రాలను తీసుకుని దరఖాస్తులను దగ్గరుండి పూర్తిచేస్తారు.

సమస్య పరిష్కారమయ్యే వరకు తోడుగా..

ఇలా తీసుకున్న దరఖాస్తులను సచివాలయానికి తీసుకెళ్లి వాటిని అక్కడ సమర్పించి, టోకెన్ నంబర్, సర్వీస్ రిక్వెస్ట్ నంబరు తీసుకుని వాటిని తిరిగి ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తారు. ఈ క్యాంపులు ఎప్పుడు, ఎక్కడ నిర్వహిస్తారో ముందుగానే తెలియజేస్తారు. ఆ రోజు దగ్గరుండి క్యాంపు వద్దకు తీసుకెళ్తారు. సమస్య పరిష్కారమయ్యేలా వారికి తోడుగా ఉంటారు.

జూలై 1 నుంచి క్యాంపులు..

మండల స్థాయి అధికారులైన తహశీల్దార్, ఈఓపీఆర్డీ ఒక టీమ్ కాగా.. ఎంపీడీఓ, డిప్యూటీ తహశీల్దార్ రెండో టీమ్‌గా ఏర్పడి సచివాలయంలో ఒకరోజు పూర్తిగా గడిపేలా చూస్తారు. జూలై 1 నుంచి ప్రతి సచివాలయంలో క్యాంపు నిర్వహించి అక్కడికక్కడే పథకాల సమస్యలను పరిష్కరించడంతోపాటు సేవా చార్జీలు లేకుండానే అవసరమైన సర్టిఫికెట్లను అందిస్తారు.

సర్వీస్ ఫీజు లేకుండా సర్టిఫికెట్ల జారీ..

జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, లావాదేవీ మ్యుటేషన్లు, ఫోన్ నంబర్‌కు ఆధార్ అనుసంధానం, పంట సాగు కార్డులు, కొత్త రేషన్ కార్డు లేదా రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో మార్పులు చేర్పులు వంటి 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా జారీతో పాటు మరే ఇతర అవసరమైన సర్టిఫికెట్లను కూడా రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో అందిస్తుంది.

కార్యక్రమం వివరాలు..

రాష్ట్రంలోని 5.3 కోట్ల మంది పౌరులకు చేరువయ్యేలా 1.6 కోట్ల కుటుంబాలను సందర్శిస్తూ, జూలై 1 నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 15,004 సురక్ష క్యాంపులు జరుగుతాయి. ఇందులో 1.5 లక్షల మంది గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వోద్యోగులు, 2.6 లక్షల మంది వలంటీర్లు పాల్గొంటారు. ఇక 26 జిల్లాలకు 26 మంది ప్రత్యేక ఐఏఎస్ అధికారులు, ఆయా జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఇతర అధికారులు ఈ క్యాంపులను తనిఖీ చేస్తారు. ప్రోగ్రాం పురోగతిపై జిల్లా కలెక్టర్లు రోజువారీ సమీక్ష నిర్వహిస్తారు. అలాగే, సీఎం కార్యాలయ అధికారులు ఈ కార్యక్రమంపై వారం వారం సమీక్ష నిర్వహిస్తారు.

‘1902’తో హెల్ప్ డెస్క్ ఏర్పాటు

వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, జగనన్న మీద, జగనన్న ప్రభుత్వం మీద ప్రేమ, అభిమానం ఉన్న ఉత్సాహవంతులు ఇళ్లను సందర్శించినప్పుడు ఇంటి యజమాని ఇంటివద్ద లేకపోయినప్పటికీ వారికి సమీపంలో క్యాంపు జరిగే రోజు నేరుగా అక్కడకు వెళ్లినట్లయితే వలంటీర్లతో కూడిన ఈ టీమ్ '1902' హెల్ప్‌డెస్క్ ద్వారా అవసరమైన సహాయం అందిస్తుంది. ఇక గ్రామంలో.. సచివాలయ పరిధిలో ఏ రోజు ఈ కార్యక్రమం జరుగుతుందో తెలుసుకోవాలంటే టోల్ ఫ్రీ నంబర్ '1902' కి కాల్ చేయాలి. లేదా https://vswsonline.ap.gov.in/#home వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

ఆగస్టు 15 నుంచి డిజిటల్ క్రాప్ సర్వే

- ఏపీతో సహా 11 రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు

సాక్షి, అమరావతి: డిజిటల్ క్రాప్ సర్వే (కేంద్ర ప్రాయోజిత పథకం) పైలట్ ప్రాజెక్ట్ అమలుకు ఆంధ్రప్రదేశ్ సహా 11 రాష్ట్రాలను ఎంపిక చేశామని కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి మనోజ్ ఆహూజ తెలిపారు. ఈ మేరకు గురువారం ఢిల్లీ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి సహా ఇతర అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మనోజ్ ఆహూజ మాట్లాడుతూ ఈ ప్రక్రియ ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి ప్రారంభం కానుందని చెప్పారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ మ్యాచింగ్ గ్రాంట్‌గా 40 శాతం నిధులు సమకూరుస్తోందన్నారు. కేంద్రం తన వంతుగా రూ.47.59 కోట్లు కేటాయించిందన్నారు. ఈ పైలట్ ప్రాజెక్టు నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకోవాల్సి ఉందని తెలిపారు.

ప్రతి రైతుకు యూనిక్ ఐడీ

డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా రైతులకు సంబంధించిన సమాచార సేకరణ, నిర్వహణతోపాటు ప్రతి రైతుకూ యూనిక్ ఐడీలను ఇవ్వాల్సి ఉంటుందని ఆహూజ తెలిపారు. అలాగే యూనిఫైడ్ ఫార్మర్ సర్వీస్ ఇంటర్ ఫేస్ (యూఎఫ్ఎస్ఐ)ను అందుబాటులోకి తేవాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి కేంద్రం, ఆయా రాష్ట్రాలు తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. ఈ ప్రక్రియ పూర్తయితే వివిధ పంటలను మరింత కచ్చితత్వంతో అంచనా వేయొచ్చన్నారు. ఆగస్టు 15 నుంచి డిజిటల్ క్రాప్ సర్వేను ప్రారంభిస్తామని చెప్పారు. సీఎస్ జవహర్ రెడ్డి మాట్లాడుతూ డిజిటల్ క్రాప్ సర్వే మంచి నిర్ణయమన్నారు. డిజిటల్ క్రాప్ సర్వేపై వివిధ సందేహాల నివృత్తికి రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు కేంద్ర వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడతారన్నారు. ఈ సర్వేపై రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో చర్చించి.. దీని అమలుకు కృషి చేస్తామని వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, అదనపు సీసీఎల్ఏ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే పవన్‌ని హైదరాబాద్ తరిమేశారు

- చంద్రబాబుతోనే పవన్ కళ్యాణ్‌కు ప్రాణహాని
- వంగవీటి మోహనరంగాను చంపించింది చంద్రబాబే
- ముద్రగడను చంపాలనుకున్నదీ ఆయనే..
- వైజాగ్‌లో ఎకరా అమ్మితే.. తెలంగాణలో 150 ఎకరాలు కొనొచ్చట
- రాజకీయ అవసరాల కోసం పక్క రాష్ట్రాలను కించపరచడం సరికాదు
- పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ఫస్ట్ ప్లేస్‌లో ఉంది
- ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ఆసక్తి
- ఎలక్ట్రానిక్స్, ఐటీ రంగాల్లో భారీ పెట్టుబడులు
- రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ని ఎప్పుడో హైదరాబాద్‌కు తరిమేశారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మంత్రి గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తరిమేద్దామని పవన్ అనడంపై మండిపడ్డారు. చంద్రబాబుతోనే పవన్‌కు ప్రాణహాని ఉందని చెప్పారు. ఇక్కడి పారిశ్రామిక విధానం గురించి విచిత్రంగా మాట్లాడుతున్నారని, రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని చెప్పారు. జగన్‌ను పంపించడం వారి ఇద్దరి కలలో కూడా సాధ్యం కాదని స్పష్టం చేశారు. పవన్, ఆయన దత్త తండ్రి హైదరాబాద్ వెళ్లి దాక్కుంటారని, రాష్ట్ర ప్రజలు వారిని పక్క రాష్ట్రానికి పర్మినెంట్ చేశారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ బ్రాండ్ చూసి ఏపీకి పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. పవన్ ఈ నాలుగేళ్లలో ఏపీలో ఎన్ని రోజులున్నారో చెప్పాలన్నారు. ఇక్కడ ఏం జరుగుతోందో పవన్‌కు తెలియదని, ఆయనకు కనిపించేది కేవలం ప్యాకేజీయేనని తెలిపారు. పవన్ ఏం మాట్లాడతారో ఆయనకు, జనసేన నేతలు, కార్యకర్తలకు కూడా అర్థం కాదన్నారు. ఒక రోజు సీఎం అంటారని, మరో రోజు ఎమ్మెల్యే అని, ఇంకో రోజు ఆయనే గెలవనని చెప్పుకొంటారని, ఇంకోపక్క ప్రాణ హాని ఉందని అంటారని చెప్పారు. పవన్‌ది గందరగోళ మనస్తత్వమని, రాజకీయాలకు పనికిరారని అన్నారు. ప్రజల మధ్యనే ఉంటూ ఎన్నో పోరాటాలు చేసి రాటు దేలిన అసామాన్యుడు సీఎం జగన్ అని చెప్పారు. ప్రత్యామ్నాయంగా ఎదిగితే ఎవరైనా ఎలిమినేషనే.. అదే చంద్రబాబు చరిత్ర అని అన్నారు. వంగవీటి మోహనరంగాను చంపించింది చంద్రబాబేనని, ముద్రగడను చంపాలనుకున్నదీ ఆయనేనని తెలిపారు. ఉపవాసాలు చేస్తే సీఎం అయిపోతారని పవన్ అనుకుంటే పప్పులో కాలేసిన ట్లేనని అన్నారు. ప్రజలకు భరోసా ఇస్తేనే వైఎస్ జగన్‌లా ప్రజా నాయకులవుతారని చెప్పారు. రాష్ట్ర ప్రజలు వైఎస్ జగన్‌లో ఒక ఫైటర్‌ని చూశారని తెలిపారు. గెలవనని ఒప్పుకొనే పవన్‌ను ప్రజలు ఎప్పటికీ గెలిపించరని అన్నారు.

పారిశ్రామిక ప్రగతిలో దూసుకుపోతున్న రాష్ట్రం

ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి దూసుకుపోతోందని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు అన్ని రకాల అవకాశాలు, మౌలిక వసతులు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా దాదాపు రూ.1,400 కోట్ల విలువైన పరిశ్రమలకు గురువారం మూడు శంకుస్థాపనలు, ఒక ప్రారంభోత్సవం చేశారన్నారు. క్రిబ్‌కో, విశ్వసముద్ర, ఇన్‌స్టంట్ కాఫీ సీసీఎల్ సంస్థ, గోద్రెజ్ ఇవన్నీ మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో చేసుకున్న ఎంవోయూల్లో భాగంగా ముందుకు వచ్చిన సంస్థలేనని తెలిపారు. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో ఒప్పందాలన్నీ గ్రౌండింగ్ అయ్యేలా సీఎం నిరంతరం సమీక్షిస్తున్నారని, పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తున్నారని తెలిపారు. ఐటీ రంగంలో ఇన్ఫోసిస్ లాంటి సంస్థలు విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించాయన్నారు. పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ఫస్ట్ ప్లేస్‌లో ఉందని, ఎలక్ట్రానిక్స్, ఐటీ రంగాల్లో భారీ పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే నంబర్ 1 స్థానంలో ఉన్నామన్నారు. మౌలిక వసతుల కల్పనలోనూ మొదటి స్థానంలో ఉన్నామని చెప్పారు. సుజనాచౌదరి, సీఎం రమేశ్ లాంటి వారు కూడా పరిశ్రమలు రాష్ట్రంలో పెడతామంటే స్వాగతించామని తెలిపారు. గత ఏడాది పరిశ్రమల ఆకర్షణలో 2022లో వచ్చిన పెట్టుబడుల్లో 18 శాతం ఏపీకే వచ్చాయని అమర్‌నాథ్ చెప్పారు. ప్రతిపక్షాలకు ఈ అభివృద్ధి కనిపించడంలేదని, కనీసం ఏం జరుగుతోందో కూడా తెలుసుకోవాలనే ప్రయత్నం చేయడంలేదని విమర్శించారు. 2014–19 మధ్య పవన్ కళ్యాణ్‌కి పారిశ్రామిక విధానాలు, పరిశ్రమలను ఇబ్బంది పెట్టిన అంశాలు గుర్తుకురాలేదా.. అని నిలదీశారు. పవన్ పద్ధతులను చూసి సీఎం జగన్.. ఆయనకు దత్తపుత్రుడని సరైన పేరు పెట్టారని అన్నారు. వైజాగ్‌లో ఒక ఎకరా అమ్మితే తెలంగాణలో 150 ఎకరాలు కొనొచ్చు అన్న చంద్రబాబు మాటలను కేసీఆర్ ఎలా నమ్మారని అన్నారు. రాజకీయ అవసరాల కోసం పక్క రాష్ట్రాలను కించపరచడం సరికాదన్న విషయం తెలంగాణ సీఎం కేసీఆర్ తెలుసుకోవాలన్నారు.

ఆ అన్నదమ్ముల వల్లే

రెండుసార్లు ఓడిపోయాం

వీరు గెలవరు, ఎదుటివాళ్లని గెలవనివ్వరు

- చిరంజీవి, పవన్‌కళ్యాణ్‌లపై టీడీపీ నేత బండారు అక్కసు
- టీడీపీ నేతల ఉత్తరాంధ్ర బస్సుయాత్ర ప్రారంభం



బస్సుయాత్రలో పాల్గొన్న టీడీపీ నాయకులు

నక్కపల్లి/పాయకరావుపేట: ఆ ఇద్దరు అన్నదమ్ములు చిరంజీవి, పవన్‌కళ్యాణ్ వల్లే రెండుసార్లు ఓడిపోయామని మాజీమంత్రి, టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి అక్కసు వెళ్లగక్కారు. భవిష్యత్‌కు గ్యారంటీ చైతన్యరథం పేరుతో టీడీపీ నాయకులు చేపట్టిన ఉత్తరాంధ్ర బస్సుయాత్ర గురువారం టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా పాయకరావుపేటలో నిర్వహించిన బహిరంగ సమావేశంలో బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ 2009లో చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ వల్ల, 2019లో పవన్‌కళ్యాణ్ పెట్టిన జనసేన పార్టీ వల్ల రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఓటమి పాలయిందని చెప్పారు. వీరు గెలవరు, ఎదుటివాళ్లని గెలవనివ్వరు.. అన్న చందాన పరిస్థితులు తయారు చేశారన్నారు. ఈ రెండు పార్టీల వల్ల తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షానికే పరిమితం కావాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

ఒక్కొక్కడి సంగతి తేలుస్తాం..

మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పోలీసుల పని పడతామని చెప్పారు. 'అధికార పార్టీకి కొమ్ముకాసిన పోలీసులెవ్వరినీ వదిలే ప్రసక్తి లేదు. ఒక్కొక్కడి సంగతి తేలుస్తాం. ఎవరెవరు అధికార పార్టీకి అనుకూలంగా పనిచేశారో అందరి జాబితాలు మా వద్ద ఉన్నాయి. అధికారం చేపట్టిన మరుసటి రోజు నుంచే శుక్ర, శని, ఆదివారాల్లో అక్రమ కట్టడాల కూల్చివేత కార్యక్రమం ప్రారంభిస్తాం. జగన్ పార్టీపై కక్షతీర్చుకోవడమే లక్ష్యం. వైఎస్సార్‌సీపీ నాయకులంతా శాడిస్ట్ నా కొడుకులు..' అని పేర్కొన్నారు. విశాఖలో ఎంపీ కుటుంబం కిడ్నాప్‌నకు గురైతే ఏం చేయలేని వ్యక్తి సీఎంగా ఉండడం దారుణమన్నారు. టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కిమిడి కళావెంకటరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని, అప్పుల అప్పారావు మాదిరిగా తయారయ్యారని విమర్శించారు. టీడీపీ హయాంలో ఉద్దండపురం వద్ద వాటర్ గ్రిడ్ నిర్మిస్తే పూర్తిచేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని చెప్పారు. ఉద్దండపురం వాటర్ గ్రిడ్ వద్ద వీరంతా సెల్ఫీ దిగారు. ఈ సమావేశంలో మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, మాజీ ఎమ్మెల్యేలు పప్పల చలపతిరావు, పల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ శతాబ్దపు డర్టీ పొలిటీషియన్ చంద్రబాబు

- చంద్రబాబు ప్రయోగించిన పాచిక పవన్
- గౌరవాన్ని పోగొట్టుకునేలా మాట్లాడటం జోగయ్యకు మంచిది కాదు
- డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ




తాడేపల్లిగూడెం అర్బన్: ఈ శతాబ్దపు డర్టీ పొలిటీషియన్ చంద్రబాబు అని ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ ఘాటుగా విమర్శలు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు సామాజికవర్గం అంటే పవన్ కళ్యాణ్‌కు ఎందుకంత కమ్మన అని నిలదీశారు. కాలం మారిందని.. గౌరవాన్ని పోగొట్టుకునేలా మాట్లాడటం మాజీమంత్రి చేగొండి హరిరామ జోగయ్యకు మంచిది కాదని అన్నారు. ఈ విషయాన్ని జోగయ్య గుర్తుంచుకోవాలని హితవు పలికారు. అధికారం కోసం కుయుక్తులు, కుట్రలు, కుతంత్రాలు పన్నడం, అలజడులు సృష్టించడం, ప్రజల ధన మానప్రాణాలతో ఆడుకోవడం చంద్రబాబు అండ్ కోకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. చంద్రబాబుకు తన స్వార్థం, తన సామాజిక వర్గానికి చెందిన కొంతమంది ప్రయోజనాలు తప్ప ప్రజల ప్రయోజనాలు అవసరం లేదన్నారు. వెన్నుపోటు.. కుట్ర.. మోసం.. దగాకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని ఉప ముఖ్యమంత్రి సత్యనారాయణ విమర్శించారు. అందుకే 2019 ఎన్నికల్లో చంద్రబాబును, టీడీపీని పీక లోతున ప్రజలు కప్పెట్టేశారన్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు రాజకీయ జీవితాన్ని పూర్తిగా పాతిపెడతారన్నారు.

చంద్రబాబు పాచిక పవన్

పవన్‌కళ్యాణ్ తన పరువు తానే తీసుకుంటూ సామాజికవర్గం పరువు కూడా తీసేస్తున్నారని కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. ఓడిపోతానని తెలిసి కూడా పారిపోకుండా పోరాడుతున్నానంటూ పవన్ చెప్పే మాటలు వింటుంటే ఆయన ఆత్మన్యూనత భావానికి గురవుతున్నట్టు స్పష్టమవుతోందన్నారు. కాపులు అధికంగా ఉన్న గోదావరి జిల్లాల్లో చంద్రబాబు ప్రయోగించిన పాచిక పవన్ అని విమర్శించారు. స్థిరత్వం లేని మాటలు, పోకిరి చేష్టలతో, సిద్ధాంతం లేని ఆలోచన ధోరణితో వారాహి యాత్ర తుస్సుమందన్నారు. కాపు జాతి కోసం ఉద్యమించిన ముద్రగడ పద్మనాభాన్ని విమర్శించడం పవన్ కళ్యాణ్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. పవన్‌కు సలహాలు ఇస్తున్న నాదెండ్ల మనోహర్, జనసేన పార్టీకి అన్ని వసతులూ సమకూరుస్తున్న లింగమనేని రమేష్ నేపథ్యాన్ని అందరూ గుర్తించాలన్నారు. గోదావరి జిల్లాల్లో తిరుగుతూ కాపు సామాజికవర్గ ప్రతినిధిగా చెప్పుకుంటున్న పవన్‌కు చంద్రబాబు సామాజిక వర్గం అంటే ఎందుకంత కమ్మన అని ధ్వజమెత్తారు. కాపు జాతికి మేలు జరగడం చంద్రబాబుకు, పవన్ కళ్యాణ్‌కు ఇష్టం లేదన్నారు.

పెయిడ్ ఆర్టిస్ట్‌లా షబ్లీ విమర్శలు

ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్



సాక్షి, అమరావతి: మైనారిటీల సంక్షేమంపై పెయిడ్ ఆర్టిస్ట్‌లా మైనార్టీ హక్కుల నాయకుడు షబ్లీ విమర్శలు చేస్తున్నారని ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ షిరిన్ బేగంతో కలిసి ఆసిఫ్ గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని మైనారిటీ కులాలకు అన్ని సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందుతున్నాయని చెప్పారు. షబ్లీ మైనారిటీల సంక్షేమంపై చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హెచ్చరించారు. మొదట అన్ని మైనార్టీ కులాలు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో ఉండేవని, సీఎంగా వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తర్వాత మైనారిటీల్లోని కొన్ని నిరుపేద కులాలను మరికొన్ని కార్పొరేషన్లలో చేర్చారని వివరించారు. షేకులు, దూదేకులు, ముస్లిం సంచార జాతుల వారిని బీసీ డిపార్ట్‌మెంట్‌లో చేర్చి వారికి కూడా అన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించినందునే ముస్లింల పిల్లలు నేడు ఉన్నతస్థానాల్లో ఉన్నారని గుర్తు చేశారు. షబ్లీకి చేతనైతే ముస్లిం సమాజానికి మేలు చేయాలని, అలా కాకుండా చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వంపై బురదజల్లితే ఊరుకునేది లేదని ఆసిఫ్ హెచ్చరించారు.

అవకాశమిస్తే అరాచకం సృష్టిస్తున్నారు

- జనసేన అధినేత పవన్ కళ్యాణ్



సాక్షి, అమలాపురం: 'ఒక్క అవకాశం ఇచ్చినందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్నారు. ఒక్క అవకాశం ఇస్తే ఉద్యోగులను సీపీఎస్ పేరుతో మోసం చేశారు. యువతకు 2.30 లక్షల ఉద్యోగాలు ఇస్తానని నమ్మకద్రోహం చేశారు. రైతుల కంట కన్నీరు పెట్టించారు. మహిళలకు భద్రత లేకుండా చేశారు' అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విమర్శించారు. వారాహి విజయ యాత్రలో భాగంగా అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో గురువారం రాత్రి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఓట్లు వేసేటప్పుడు జాగ్రత్తగా ఆలోచించి వేయాలని, ప్రజల తరపున పోరాడే వారికి వేయండని పిలుపునిచ్చారు. 'జనం బాగుండాలంటే.. జగన్ పోవాలి. హలో ఏపీ.. బై బై వైసీపీ' అని అమలాపురం నుంచి పిలుపునిస్తున్నా అన్నారు. రాష్ట్రానికి అన్నం పెట్టే గోదావరి జిల్లాల్లో పంట పండినా రైతులకు రూ.10 వేలు నష్టం వస్తోందని, కౌలుదారులు ఎకరానికి రూ.20 వేలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కనీసం డ్రెయిన్లలో మట్టి కూడా తీయలేదని విమర్శించారు.

ఆర్‌బీకేలను రైతు భద్రతా కేంద్రాలుగా మారుస్తా

తాను అధికారంలోకి వస్తే ఆర్‌బీకేలను నిజమైన రైతు భద్రతా కేంద్రాలుగా మారుస్తానని పవన్ పేర్కొన్నారు. 'మేం కోనసీమకు రైల్వే లైన్ అడగడం లేదు. రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను కాపాడమని కోరినా మీ నుంచి స్పందన లేదు' అని విమర్శించారు. జనసేన అధికారంలోకి వస్తే రైల్వే లైన్ కోసం కృషి చేస్తామన్నారు. ఎన్నికల ముందు సీపీఎస్ వారంలో రద్దు చేస్తానన్న వైఎస్ జగన్ ఇప్పుడు ఓపీఎస్, జీపీఎస్ అంటూ కొత్త పదాలు పలుకుతున్నారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే సీపీఎస్ రద్దుకు కృషిచేస్తామన్నారు. జగన్ దళితులకు మేనమామను అంటూనే 23 దళిత పథకాలు ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. ఆయన అంతకుముందు వివిధ వర్గాల వారితో సమావేశమయ్యారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై రాజీపడం

ఏపీ జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై రాజీపడే ప్రసక్తే లేదని ఏపీ జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు అన్నారు. గురువారం విజయవాడలో జరిగిన జేఏసీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 12వ పీఆర్సీని ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లు చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో సీపీఎస్ రద్దు తక్షణ అవసరమన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాల పెంపు, ఫ్యాప్టో కార్యాచరణకు మద్దతు, 2024 జనవరిలోగా డీఏ, పీఆర్సీ బకాయిల విడుదల, ఉమ్మడి సర్వీసు రూల్స్ ప్రకారం డీఈవో, ఎంఈవో 1, 2 పోస్టుల భర్తీ, సీపీఎస్ రద్దు కోసం చేపట్టిన ఉద్యమంలో ఉద్యోగులపై పెట్టిన కేసుల ఎత్తివేత తదితర అంశాలపై తీర్మానించారు. ఏపీ జేఏసీ డిప్యూటీ సెక్రటరీ శివారెడ్డి, సెక్రటరీ హృదయరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఫ్యాషన్







ప్రింట్స్.. స్టైయిల్స్

ఫ్లోరల్, మల్టీకలర్ ప్రింట్స్ ఏవైనా మనసుకు ఎప్పుడూ ఆహ్లాదాన్నిస్తాయి. ఫ్యాబ్రిక్ ఏదైనా చూడముచ్చటగా ఉంటాయి. సీజన్‌తో పనిలేకుండా పార్టీ ఏదైనా ఇండోవెస్టర్న్ లుక్‌తో టాప్ టు బాటమ్ ఎవర్‌గ్రీన్ లుక్‌తో ప్రింటెడ్ ఆకట్టుకుంటున్నాయి. క్యాజువల్ వేర్‌గానూ కలర్‌ఫుల్ అనిపిస్తాయి. అందుకే, డిజైనర్లు ప్రింట్ కాన్సెప్ట్‌ను ఎప్పుడూ వినూత్నంగా మన ముందుకు తీసుకు వస్తుంటారు. వాటిలో కొన్ని డిజైన్స్ ఇవి.

లెహంగా శారీ, లాంగ్ కోట్, ట్రౌజర్, శారీ గౌన్, కుర్తా పైజామా.. మల్టీ కలర్ ప్రింట్లతో టాప్ టు బాటమ్ ఒకే కలర్ కాంబినేషన్‌ను ఎంచుకుంటే ఈ థీమ్‌కు సరిగ్గా నప్పుతుంది. ఈ స్టయిల్‌కి ఇతర యాక్ససరీస్ కూడా అంతగా అవసరం ఉండదు. ప్రత్యేకంగా కనిపించే ఈ ప్రింటెడ్ డ్రెస్సులు ఎక్కడ ఉన్నా అంతే ప్రత్యేకతను చాటుతాయి.

మన నైటింగేల్


అడవి బిడ్డల ఆత్మీయ నేస్తం... తేజావత్ సుశీల

వృత్తే దైవంగా, సేవే పరమార్థంగా భావించిన తేజావత్ సుశీలకు ఈ యేడాది ప్రతిష్టాత్మక 'ఫ్లారెన్స్ నైటింగేల్' అవార్డు దక్కింది. తెలంగాణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం, ఎర్రగుంట ప్రాథమిక వైద్యశాలలో ఏఎన్ఎంగా సేవలందిస్తున్న సుశీల గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా 27 ఏళ్ల తన కెరీర్ గురించి సుశీల 'సాక్షి'తో పంచుకున్నారు.




"ఉమ్మడి ఖమ్మం జిల్లాలలోని వీ వెంకటాయ పాలెం అనే గ్రామం మా సొంతూరు. 1996లో ఏఎన్ఎంగా తొలి పోస్టింగ్ మణుగూరులో వచ్చింది. ఆ తర్వాత సుజాతనగర్‌లో కొన్నాళ్లు పని చేశాను. 2010 నుంచి ఏజెన్సీ ప్రాంతమైన ఎర్రగుంట పీహెచ్‌సీలో పని చేస్తున్నాను. 27 ఏళ్ల కెరీర్‌లో పనిలోనే సంతృప్తి వెతుక్కుంటూ వస్తున్నాను. మా ఇల్లు, నాకు కేటాయించిన గ్రామాలు తప్ప పెద్దగా బయటకి పోయిందీ లేదు. హైదరాబాద్‌కు కూడా వెళ్లడం తక్కువే. చదువుకునేప్పటి నుంచి ఈ రోజు వరకు... ఏనాటికైనా ఢిల్లీని చూస్తానా అనుకునేదాన్ని. కానీ ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ వరకు నా ప్రయాణం ఉంటుందని అనుకోలేదు. దేశ ప్రథమ మహిళ చేతుల మీదుగా అవార్డు అందుకున్న క్షణాలు మరువలేనివి.

రెండు ప్రాణాలు

2010 సమయంలో ఛత్తీస్‌గఢ్ నుంచి గుత్తి కోయలు తెలంగాణకు రావడం ఎక్కువైంది. నా పీహెచ్‌సీ పరిధిలో మద్దుకూరు సమీపంలో గుత్తికోయలు వచ్చి మంగళబోడు పేరుతో ఓ గూడెం ఏర్పాటు చేసుకున్నట్టు అక్కడి సర్పంచ్ చెప్పాడు. ఆ గ్రామానికి తొలిసారి వెళ్లినప్పుడు ఎవ్వరూ పలకరించలేదు. నేనే చొరవ తీసుకుని అన్ని ఇళ్లలోకి తలుపులు తీసుకుని వెళ్లాను. ఓ ఇంట్లో ఓ మహిళ అచేతనంగా పడుకుని ఉంది. పదిహేను రోజుల కిందటే ప్రసవం జరిగిందని చెప్పారు. తీవ్ర రక్తస్రావం కావడంతో మనిషి నీరసించిపోయి ఉంది. ఒళ్లంతా ఉబ్బిపోయి ఉంది. వెంటనే ఆ గ్రామ సర్పంచ్‌ను బతిమాలి ఓ సైకిల్ ఏర్పాటు చేసి అడవి నుంచి మద్దుకూరు వరకు తీసుకొచ్చాను. అక్కడి నుంచి ఆటోలో కొత్తగూడెం ఆస్పత్రికి వచ్చాం. పరిస్థితి విషమించడంతో వరంగల్ తీసుకెళ్లాలని సూచించారు. 108లో ఆమెను వెంటబెట్టుకుని వరంగల్‌కు తీసుకెళ్లాను. 21 రోజుల పాటు చికిత్స అందించిన తర్వాత ఆ తల్లిబిడ్డలు ఇద్దరూ ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడ్డారు. ఈ ఘటన తర్వాత అక్కడున్న వలస గుత్తి కోయలకు నాపై నమ్మకం కలిగింది. ఏదైనా సమస్య ఉంటే సంకోచం లేకుండా చెప్పుకోవడం మొదలు పెట్టారు.

రక్తం కోసం బతిమాలాను

ఓసారి గుత్తికోయగూడెం వెళ్లినప్పుడు పిల్లలందరూ నా దగ్గరకు వచ్చారు కానీ జెమిలీ అనే ఏడేళ్ల బాలిక రాలేదు. ఏమైందా అని ఆరా తీస్తూ ఆ పాప ఇంట్లోకి వెళ్లాను. నేలపై స్పృహ లేని స్థితిలో ఆ పాప పడుకుని ఉంది. బ్లడ్ శాంపిల్ తీసుకుని టెస్ట్ చేస్తే మలేరియా పాజిటివ్‌గా తేలింది. వెంటనే పీహెచ్‌సీకి అక్కడి నుంచి కొత్తగూడెం తీసుకువస్తే పాప పరిస్థితి చాలా సీరియస్‌గా ఉందని డాక్టర్లు చెప్పారు. ఖమ్మం తీసుకెళ్లమన్నారు. అక్కడకు వెళ్తే వరంగల్ పొమ్మన్నారు. కానీ డాక్టర్లను బతిమాలి అక్కడే వైద్యం చేయమన్నాను. ఆ పాపది ఓ నెగెటివ్ గ్రూప్ రక్తం కావడంతో చాలా మందికి ఫోన్లు చేసి బతిమాలి రెండు యూనిట్ల రక్తం సంపాదించగలిగాను. చివరకు ఆ పాప ప్రాణాలు దక్కాయి. మరోసారి ఓ గ్రామంలో ఓ బాలింత చంటిపిల్లకు ఒకవైపు రొమ్ము పాలే పట్టిస్తూ రెండో రొమ్ముకు పాలిచ్చేందుకు తంటాలు పడుతున్నట్టు గమనించాను. వెంటనే ఇన్‌ఫెక్షన్ గుర్తించి ఆస్పత్రికి తరలించాను.


● సుశీల

అర్థం చేసుకోవాలి

మైదాన ప్రాంత ప్రజలకు ఒకటికి రెండు సార్లు చెబితే అర్థం చేసుకుంటారు. వారికి రవాణా సదుపాయం కూడా బాగుంటుంది. కానీ వలస ఆదివాసీల గుత్తికోయల గూడేల్లో పరిస్థితి అలా ఉండదు. ముందుగా వారిలో కలిసిపోవాలి. ఆ తర్వాత అక్కడి మహిళలను ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే భర్త/తండ్రి తోడు రావాలి. వాళ్ల పనులకు వెళితే సాయంత్రం కానీ రారు. వచ్చే వరకు ఎదురు చూడాలి. వచ్చినా పనులు వదిలి ఆస్పత్రికి వచ్చేందుకు సుముఖంగా ఉండరు. ఆస్పత్రి కోసం పని వదులుకుంటే ఇంట్లో తిండికి కష్టం. అన్నింటికీ ఒప్పుకున్నా.... ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే అడవుల్లో ఉండే గుత్తికోయ గ్రామాలకు రవాణా కష్టం. క్షేత్రస్థాయిలో ఉండే ఈ సమస్యలను అర్థం చేసుకుంటే అత్యుత్తమంగా వైద్య సేవలు అందించే వీలుంటుంది.

కోవిడ్ సమయంలో

మద్దుకూరు, దామరచర్ల, సీతాయిగూడెం గ్రామాలు నా పరిధిలో ఉండేవి. కోవిడ్ సెకండ్ వేవ్ సమయంలో ఈ మూడు గ్రామాల్లో కలిపి ఒకేసారి 120 మందిని ఐసోలేషన్‌లో ఉంచాను. ఇదే సమయంలో మా ఇంట్లో నలుగురికి కోవిడ్ పాజిటివ్‌గా తేలింది. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఉదయం నుంచి రాత్రి వరకు అన్ని గ్రామాలు తిరుగుతూ ప్రాణనష్టం రాకుండా సేవలు అందించాను. నా పరిధిలో ఉన్న గ్రామాల్లో ఏ ఒక్కరూ కోవిడ్‌తో ఇంట్లో చనిపోలేదు.

వారి సహకారం వల్లే

వృత్తిలో మనం చూపించే నిబద్ధతను బట్టి మన కంటూ ఓ గుర్తింపు వస్తుంది. ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకప్పుడు అర్ధరాత్రి ఫోన్ చేసినా డాక్టర్లు లిఫ్ట్ చేసి అప్పటికప్పుడు సలహాలు ఇస్తారు. అవసరాన్ని బట్టి హాస్పిటల్‌కు వచ్చి కేస్ అటెండ్ చేస్తారు. అదే విధంగా నాతో పాటు పని చేసే ఇతర సిబ్బంది పూర్తి సహకారం అందిస్తారు. ఇక ఆశా వర్కర్లు అయితే నా వెన్నంటే ఉంటారు. ఏదైనా పని చెబితే కొంత ఆలస్యమైనా ఆ పని పూర్తి చేస్తారు. వీరందరి సహకారం వల్లే నేను ఉత్తమ స్థాయిలో సేవలు అందించగలిగాను. ఈ రోజు నాకు దక్కిన గుర్తింపుకు డాక్టర్ల నుంచి ఆశావర్కర్ల వరకు అందరి సహకారం ఉంది'' అని వివరించారు సుశీల.

– తాండ్ర కృష్ణగోవింద్, సాక్షి, భద్రాద్రి కొత్తగూడెం

న్యూస్‌మేకర్

వయసు 18 వృత్తి పైలెట్


● సాక్షి కొచ్చర్

సాక్షి కొచ్చర్‌కు ఇప్పటి దాకా స్కూటర్ నడపడం రాదు. కారు నడపడం రాదు. కాని ఏకంగా విమానం నడపడం నేర్చుకుంది. ప్రస్తుతానికి యంగెస్ట్ కమర్షియల్ పైలెట్ రికార్డ్ సాక్షి పేరున ఉంది. సంకల్పించాను... సాధించాను అంటోంది సాక్షి.

మన దేశంలో అత్యంత చిన్న వయసులో కమర్షియల్ పైలెట్ లైసెన్స్ సాధించిన రికార్డు మైత్రి పటేల్ పేరున ఉంది. ఆమె 19 ఏళ్ల లైసెన్స్ పొందింది. ఇప్పుడు 18 ఏళ్లకే సాక్షి కొచ్చర్ ఈ లైసెన్స్ పొంది మైత్రి రికార్డును బద్దలు కొట్టింది. సరిగ్గా ఆమె 18వ పుట్టిన రోజున ఈ లైసెన్స్ పొందడం విశేషం.

పదేళ్ల వయసు నుంచే

సాక్షి కొచ్చర్‌ది హిమాచల్ ప్రదేశ్‌కు ముఖద్వారం వంటిదైన పర్‌వాను టౌన్. అక్కడ తండ్రి లోకేష్ కుమార్ కొచ్చర్‌కు ఫుట్‌వేర్ వ్యాపారం ఉంది. పదేళ్ల వయసు నుంచి కుమార్తె పైలెట్ కావాలని కోరుకుంటూ ఉంటే అతడు ప్రోత్సహిస్తూ వచ్చాడు. 'పదో క్లాసు పరీక్షలు అయ్యాక నేను పైలెట్ కావాలని మళ్లీ ఒకసారి గట్టిగా చెప్పాను. అయితే నాకు కామర్స్ లైన్‌లో చదవాలని ఉండేది. లెక్కలు పెద్దగా ఇష్టం లేదు. కాని పైలెట్ కావాలంటే ఎంపీసీ చదవాలని తెలిసి ఇంటర్‌లో ఎంపీసీ తీసుకున్నాను' అని చెప్పింది సాక్షి. ఇంటర్ అయిన వెంటనే ముంబైలోని స్కైలైన్ ఏవియేషన్ క్లబ్‌లో పీపీఎల్ (ప్రైవేట్ పైలెట్ లైసెన్స్)కు కావలసిన థియరీ క్లాసులను నాలుగున్నర నెలల పాటు చదివింది సాక్షి. ఈ క్లబ్‌లోనే కెప్టెన్ ఏ.డి.మానెక్ దగ్గర ఏవియేషన్ పాఠాలు నేర్చుకుంది మైత్రి పటేల్. సాక్షి కూడా కెప్టెన్ మానెక్ దగ్గరే తొలి పాఠాలు నేర్చుకుంది. ఆ తర్వాత సీపీఎల్ (కమర్షియల్ పైలెట్ లైసెన్స్) కోసం అమెరికా వెళ్లింది.

70 లక్షల ఖర్చు

అమెరికాలో కమర్షియల్ పైలెట్ లైసెన్స్ పొందాలంటే దాదాపు 70 లక్షలు ఖర్చు అవుతుంది. అయినా సరే సాక్షి కుటుంబం ఆ ఖర్చును భరించి సాక్షిని అమెరికా పంపింది. అక్కడ మూడు నెలల పాటు సాక్షి ట్రైనింగ్‌లో పాల్గొంది. 'ఇన్‌స్ట్రక్టర్ సహాయంతో విమానం నడపడంలో ఒక రకమైన థ్రిల్ ఉంది. కాని ట్రైనింగ్‌లో భాగంగా మొదటిసారి సోలో ఫ్లయిట్ (ఇన్‌స్ట్రక్టర్ లేకుండా) ఒక్కదాన్నే విమానం నడిపినప్పుడు కలిగిన థ్రిల్, ఆ ఫీలింగ్ మాటల్లో చెప్పలేను. ఆ క్షణం నా జీవితంలో అలాగే ఉండి పోతుంది' అని చెప్పింది సాక్షి. 'అయితే పైలెట్ కావడం అనుకున్నంత సులభం కాదు. ఎన్నో సవాళ్లు, సమస్యలు ఉంటాయి. నా ట్రెయినింగ్‌లో ఒకసారి ఎలక్ట్రికల్ సిస్టమ్ ఫెయిల్ అయింది. మరోసారి రేడియో ఫెయిల్ అయింది. నేను కంగారు పడకుండా అలాంటి సమయంలో ఏం చేయాలో అది చేసి సేఫ్ లాండింగ్ చేశాను' అని తెలిపింది సాక్షి.

పైలెట్‌గా ఉద్యోగం

'మా ఊళ్లో నేను పైలెట్ అవుతానని అంటే మా బంధువులు చాలామంది ఎయిర్ హోస్టెస్ అనుకున్నారు. అమ్మాయిలు పైలెట్‌లు కావచ్చునని వారికి తెలియదు. ఇవాళ మన దేశంలో ఎక్కువమంది మహిళా పైలెట్‌లు ఉన్నారు. ఇది చాలా మంచి విషయం. నాకు పైలెట్‌గా ఉద్యోగం రాగానే నా కోర్సు కోసం అయిన ఖర్చు మొత్తం అణాపైసలతో సహా మా అమ్మానాన్నలకు చెల్లిస్తాను' అంది సాక్షి.

ఇంత చిన్న వయసులో లైసెన్స్ పొందిన సాక్షికి ఉద్యోగం రావడం ఎంత సేపనీ.

వంటిల్లు

చేదా..లేదే!

ఎంతమంచి వంటకం అయినా నోటికి రుచిగా లేకపోతే అస్సలు తినబుద్ధికాదు. ఇక చేదుగా ఉండే కాకర కాయ డిష్ అంటే.. "అమ్మో కాకరకాయ" అంటూ ముఖం మాడ్చేస్తారు. అనేక పోషకాలున్న కాకరకాయను మళ్లీమళ్లీ తినాలనిపించేలా ఎలా వండాలో చెబుతోంది ఈ వారం మన వంటిల్లు...



కాకరకాయ పకోడా

కావలసినవి: కాకరకాయలు – రెండు; శనగపిండి – అరకప్పు ; బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు ; కారం – టీస్పూను ; ఇంగువ – చిటికెడు ; ఉప్పు – రుచికి సరిపడా ; నూనె – రెండు కప్పులు.

తయారీ: ● కాకర కాయలను శుభ్రంగా కడిగి గుండ్రని/పొడవు ముక్కలుగా తరుక్కోవాలి. ● ముక్కల్లోని విత్తనాలను వేరుచేసి వెడల్పాటి ప్లేటులో వేయాలి. ● శనగపిండి, బియ్యప్పిండి, కారం, ఇంగువ రుచికి సరిపడా ఉప్పును ముక్కలపై చల్లాలి. ● ఇప్పుడు కొద్దికొద్దిగా నీళ్లు చల్లుకుంటూ పకోడీ పిండిలా గట్టిగా కలుపుకోవాలి. ● నూనె బాగా మరిగాక కలిపి పెట్టుకున్న ముక్కలను వేసి గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు వేయించి తీసేయాలి.



బేక్డ్ కరేలా

కావలసినవి: కాకరకాయలు – అర కేజీ ; జీలకర్ర పొడి – అరటీస్పూను ; ధనియాల పొడి – ముప్పావు టీస్పూను ; ఆమ్‌చూర్ పొడి – ముప్పావు టీస్పూను ; కారం – టీస్పూను ; పసుపు – టీస్పూను ; బెల్లం పొడి – రెండు టేబుల్ స్పూన్లు ; నూనె ఒకటిన్నర టేబుల్ స్పూన్లు ; ఉప్పు – రుచికి సరిపడా ; కొత్తిమీర తరుగు – గార్నిష్‌కు సరిపడా; నిమ్మరసం – టీస్పూను.

తయారీ: ● కాకరకాయలను శుభ్రంగా కడిగి పలుచగా తొక్క తీసి గుండ్రని ముక్కలుగా తరగాలి. ● తరిగిన ముక్కలపై నూనెవేసి కలపాలి. ● ముక్కలన్నింటికి నూనె పట్టిన తరువాత జీలకర్ర, ధనియలపొడి, ఆమ్‌చూర్ పొడి, పసుపు, కారం, రుచికి సరిపడా ఉప్పు, బెల్లం పొడి వేసి ముక్కలకు పట్టించి ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి. ● ఇరవైనిమిషాల తరువాత బేకింగ్ ట్రేలో అల్యూమినియం ఫాయిల్ వేసి కొద్దిగా నూనె చల్లి, కాకరకాయ ముక్కలను పలుచగా పోయాలి. ● ఈ ట్రేని అవెన్‌లో పెట్టి 25 నిమిషాలు బేక్ చేసి తీసేయాలి. ● వేడివేడి ముక్కలపై నిమ్మరసం చల్లి, కొత్తిమీరతో గార్నిష్ చేసి సర్వ్ చేసుకోవాలి. అన్నం, రోటీలోకి ఇది మంచి సైడ్ డిష్.



బిట్టర్ ఆమ్లెట్

కావలసినవి: కాకకర కాయ – మీడియం సైజుది ఒకటి ; గుడ్లు – మూడు ; ఉప్పు – రెండు టీస్పూన్లు ; గరం మసాలా – అరటీస్పూను ; నూనె – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు.

తయారీ: ● కాకర కాయను శుభ్రంగా కడిగి, విత్తనాలు తీసేసి సన్నగా తరగాలి. ● మరుగుతోన్న నీళ్లలో కొద్దిగా నూనె, టీస్పూను సాల్ట్ , కాకరకాయ ముక్కలు వేసి ఐదు నిమిషాలు ఉడికించాలి. ● ఉడికిన ముక్కలను నీటినుంచి వేరు చేసి, తడిలేకుండా తుడిచి పక్కన పెట్టుకోవాలి. ● గిన్నెలో గుడ్లసొనను వేసి చక్కగా కలపాలి. ఈ సొనలో రుచికి సరిపడా ఉప్పు, గరం మసాలా, కాకర కాయ ముక్కలు వేసి కలపాలి. ● పెనం మీద నూనెవేసి, వేడెక్కిన తరువాత గుడ్ల మిశ్రమం వేసి రెండు వైపులా చక్కగా కాల్చితే బిట్టర్ ఆమ్లెట్ రెడీ.



కాకరకాయ పచ్చడి

కావలసినవి: కాకరకాయలు – పెద్దవి రెండు ; పచ్చిమిర్చి – పన్నెండు ; చిన్న ఉల్లిపాయలు – పదిహేను ; అల్లం – అంగుళం ముక్క ; పచ్చికొబ్బరి తురుము – అరకప్పు ; గడ్డ పెరుగు – రెండు కప్పులు , ఆవాలు – అరటీస్పూను, మెంతులు – పావు టీస్పూను ; ఎండు మిర్చి – రెండు ; కరివేపాకు – ఐదు రెమ్మలు ; నూనె – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, కారం – చిటికెడు.

తయారీ: ● కాకరకాయలను నీటిలో నానబెట్టి శుభ్రంగా కడిగి విత్తనాలు తీసేయాలి. ఇప్పుడు కాకరకాయలను చిన్నచిన్న ముక్కలుగా తరుక్కోవాలి. ● అల్లం తొక్కతీసి సన్నగా తరగాలి. 10 పచ్చిమిర్చి, 12 ఉల్లిపాయలను కూడా సన్నని ముక్కలుగా కట్ చేయాలి. ● కాకరకాయ, అల్లం, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలను ఒక గిన్నెలో వేయాలి. దీనిలో కరివేపాకు, కొద్దిగా ఉప్పు, టీస్పూను నూనెవేసి చక్కగా కలుపుకోవాలి. ● ఈ మిశ్రమం మొత్తాన్ని బాణలిలో వేసి రెండు నిమిషాలు పెద్దమంట మీద వేయించాలి. తరువాత మూతపెట్టి సన్న మంట మీద పది నిమిషాలు మగ్గనివ్వాలి. ● మధ్యలో కలుపుతూ... అడుగంటితే మరో టీస్పూను నూనె వేయాలి. ● కొబ్బరి తురుముకు మూడు ఉల్లిపాయలు, రెండు పచ్చిమిరపకాయలు, రెండు టేబుల్ స్పూన్ల నీళ్లు జోడించి పేస్టు చేయాలి. ● బాణలిలో మగ్గుతున్న మిశ్రమంలో ఈ పేస్టు వేసి, కలిపి ఐదు నిమిషాల తరువాత దించేయాలి. ● పెరుగుని సమంగా కలుపుకుని మగ్గిన మిశ్రమంలో వేయాలి. రుచికి సరిపడా ఉప్పు కలిపి తిప్పాలి. ● మిగిలిన నూనెతో ఆవాలు, మెంతులు, ఎండు మిర్చి, కరివేపాకుతో తాలింపు వేసి కలుపుకోవాలి. చివరిగా కారం చల్లుకుని సర్వ్‌చేసుకోవాలి.

● ఆర్ట్ అండ్ కల్చర్

స్వీట్ జర్నీ

ఢిల్లీకి చెందిన శిజ్జ గుప్తా బహుముఖప్రజ్ఞాశాలి. సింగర్, ఎలక్ట్రానిక్ ప్రొడ్యూసర్, విజువల్ ఆర్టిస్ట్, డిజైనర్‌గా తన ప్రత్యేకత చాటుకుంటుంది. శిజ్జకు బాల్యం నుంచి సంగీతం అంటే ఇష్టం. ఆసక్తి మాట ఎలా ఉన్నా తన మ్యూజికల్ జర్నీ మాత్రం ఆలస్యంగానే మొదలైంది. మహిళల కోసం నిర్వహించిన మ్యూజిక్ వర్క్‌షాప్‌కు హాజరైన తరువాత తనకు కూడా ఏదైనా చేయాలనిపించింది. నోయిడాలో జరిగిన గ్లోబల్ మ్యూజిక్ స్కూల్ క్లాసులకు హాజరైన తరువాత ట్యూన్స్ క్రియేట్ చేయడం మొదలుపెట్టింది.

ఫస్ట్ సింగిల్ 'యంగ్ హేట్'తో ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది.

రాజస్థాన్‌లో జరిగిన మాగ్నటిక్ మ్యూజిక్ ఫెస్టివల్‌లో ఫస్ట్ లైవ్ పెర్‌ఫార్మెన్స్‌తో 'వావ్' అనిపించుకుంది.


శిజ్జ గుప్తా

ట్యూన్ కోసం మెదడుకు పని చెప్పినా, వచ్చిన ట్యూన్‌కు పసందైన పదాలు అల్లడానికి కలం పట్టినా, డిజిటల్ ఆడియో మ్యూజిక్ స్టేషన్‌లోకి వెళ్లినా, కీ బోర్డ్ ముందు కూర్చున్నా, తబలా వాయించినా, మ్యూజిక్ ఆల్బమ్ కోసం కవర్ డిజైన్ చేసినా.... ప్రతి సృజనాత్మక పనిలోనూ చెప్పలేనంత ఆనందం సొంతం చేసుకుంటుంది.

శిజ్జ మిత్రబృందంలో ఫిల్మ్ మేకర్స్, యానిమేటర్స్, ఆర్టిస్టులు... మొదలైనవారు ఉన్నారు. వారితో కలిసి సృజనాత్మక చర్చలు చేయడం అంటే ఆమెకు ఇష్టం. ఆ చర్చలు ఎప్పుడూ వృథా పోలేదు. ఏదో ఒక కొత్త ఐడియా ఆ చర్చల్లో నుంచి పుట్టేది.

మొదట్లో తనకు పాటలు రాయడం పెద్దగా ఇష్టం లేదు. అయితే సంక్లిష్టమైన భావాలను సరళమైన పదాలలో చెప్పాలనే ఆలోచన వచ్చిన తరువాత కలానికి పని చెప్పింది.

'సృజనాత్మక ప్రయాణంలో ప్రతి అడుగు ఎంతో శక్తిని ఇస్తుంది...అనే మాటను తరచుగా వినేదాన్ని. ఇప్పుడు అది స్వయంగా అనుభవంలోకి వస్తోంది' అంటుంది శిజ్జ గుప్తా.

● సక్సెస్ స్టోరీ


సాహిల్ నాయక్

గ్రౌండ్ జీరో హీరో

కళారూపాలు అద్భుతాలకు మాత్రమే పరిమితం కానక్కర్లేదని చెబుతాయి సాహిల్ నాయక్ మినీయేచర్‌లు.
అతడి కళాప్రపంచంలో నిర్మాణాల రూపంలో అసహాయుల హాహాకారాలు వినిపిస్తాయి.
మహా నిర్మాణాలకు రాళ్లెత్తిన కూలీల జాడలు దొరుకుతాయి.
పల్లకీ మోసిన బోయీల అడుగు జాడలు కనిపిస్తాయి....


గోవాలోని పొండలో పెరిగిన సాహిల్ నాయక్‌కు చిన్నప్పుడు ఒక్క దీపావళి పండగ వస్తే... వంద పండగలు వచ్చినంత సంబరంగా ఉండేది. రావణాసురుడి దిష్టి బొమ్మలను తయారుచేసే పనుల్లో బిజీ బిజీగా ఉండేవాడు. చిన్నప్పుడు నేర్చుకున్న బొమ్మలకళ ఊరకే పోలేదు. భవిష్యత్‌లో స్కల్ప్చర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోడానికి పునాదిగా నిలిచింది.

బరోడాలోని ఎంఎస్ యూనివర్శిటీలో చదువుకున్న సాహిల్ తన డెబ్యూ సోలో ఎగ్జిబిషన్‌ను ఆ యూనివర్శిటీ ప్రాంగణంలోనే ఏర్పాటు చేశాడు. ఆ తరువాతి షో కోల్‌కత్తాలోని ఎక్స్‌పెరిమెంటల్ గ్యాలరీలో జరిగింది. 'గ్రౌండ్ జీరో' పేరుతో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లోని మినీయేచర్‌లు కళాభిమానులను ఆకట్టుకున్నాయి.

సాహిల్ కళాప్రపంచం గురించి చెప్పాలంటే...

అందానికి, అద్భుతానికి మాత్రమే పరిమితమై ఉంటే 'గ్రౌండ్ జీరో'లో విశేషం ఉండేది కాదేమో!

సాహిల్ మినీయేచర్స్‌ను 'ఆర్టిస్టిక్ రిప్రెంజటేషన్'కు మాత్రమే పరిమితం చేయడం సరికాదేమో అనిపిస్తుంది.


సాహిల్ నాయక్

ఎందుకంటే సాహిల్ కళా ప్రపంచంలో యుద్ధానంతర, ప్రకృతి విలయం తరువాత కట్టడాల కళ్లలో కనిపించే దైన్యం కదిలిస్తుంది. ప్రశ్నిస్తుంది.

ప్రకృతి విలయాల తరువాత దృశ్యాలపై ఆసక్తితో వందలాది ఫొటోలను అంతర్జాలంలో చూసేవాడు.

పాత పుస్తకాల్లో దృశ్యాల వెంట వెళ్లేవాడు సాహిల్.

అద్భుతమైన ఆర్కిటెక్చర్ కొలువుదీరిన ఊళ్లను వెదుక్కుంటూ వెళ్లేవాడు. ఈ ప్రయాణంలో తనకు ప్రత్యేక ఆసక్తి కలిగించిన గ్రామాల్లో ఒకటి గోవాలోని కుర్డీ. డ్యామ్ నిర్మాణం వల్ల ఈ ఊళ్లోని వాళ్లు నిరాశ్రయులు అయ్యారు. ఎక్కడెక్కడికో వెళ్లి బతుకుతున్న వాళ్లు వేసవి సమయంలో మాత్రం తమ ఊరి ఆనవాళ్లను చూసుకోవడానికి తప్పకుండా వస్తారు. శిథిలమై, చిరునామా లేని ఊరిని తన కళలోకి తీసుకువస్తాడు సాహిల్.

టెక్ట్స్, క్లిప్స్, రిపోర్ట్... తన అన్వేషణలో ఏదీ వృథా పోయేది కాదు. కొన్ని కట్టడాలను ఆర్ట్‌కి తీసుకురావడానికి ప్రత్యేకమైన పరికరాలను ఆశ్రయించడమో, తయారుచేయడమో జరిగేది.

'ఆర్కిటెక్చర్ అనేది కళ కంటే ఎక్కువ. చరిత్రకు మౌనసాక్షి' అంటాడు సాహిల్.

ఆ మౌన సాక్షిని తన కళతో అనర్గళంగా మాట్లాడించడం సాహిల్ ప్రత్యేకత!

'మాన్యుమెంట్స్, మెమోరియల్ అండ్ మోడ్రనిజం' పేరుతో చేసిన సెకండ్ సోలో షోకు కూడా మంచి స్పందన లభించింది. చాలామంది సాహిల్ మొదటి షో 'గ్రౌండ్ జీరో: సైట్ యాజ్ విట్‌నెస్/ఆర్కిటెక్చర్ యాజ్ ఎవిడెన్స్'తో పోల్చుకొని మంచి మార్కులు వేశారు. 'ఎక్కడా తగ్గలేదు' అని ప్రశంసించారు.

కోల్‌కత్తాలో జరిగినా, అక్కడెక్కడో జపాన్‌లోని కాంటెంపరరీ ఆర్ట్స్ సెంటర్‌లో జరిగినా సాహిల్ ఎగ్జిబిషన్‌కు ప్రేక్షకుల నుంచి వచ్చే స్పందన ఒక్కటే.

'మన ఆలోచనల్లో ఉండే సంక్లిష్టతను కళలోకి తీసుకురావడం అంత తేలిక కాదు. సాహిల్ మాత్రం ఆ క్లిష్టమైన పనిని తేలిక చేసుకున్నాడు' అంటారు 'ఖోజ్' గ్యాలరీ క్యూరెటర్, ప్రోగ్రామ్ మేనేజర్ రాధ మహేందు.

గోవాలో మొదలైన సాహిల్ ప్రయాణం అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది.

అయితే 'గౌండ్ జీరో' రూపంలో గ్రౌండ్ రియాలిటీకి ఎప్పుడూ దూరం కాలేదు.

అదే అతడి విజయ రహస్యమని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు కదా!

● టెక్.. టాక్

టెక్నో కామన్ 20



డిస్‌ప్లే: 6.67 అంగుళాలు ఓఎస్: ఆండ్రాయిడ్ 13
మెమోరీ: 512 జీబి 8జీబి ర్యామ్ బరువు: 203 గ్రా.
రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్ కనెక్టివిటీ: 5జీ

శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్9 సిరీస్



రాబోయే శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్9 సిరీస్ కోసం టెక్ ప్రియులు ఆసక్తి కనబరుస్తున్నారు. గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 5, జెడ్ ఫ్లిప్ 5తో పాటు ఎస్9 సిరీస్ లాంచ్ కానున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల విడుదల చేసిన గెలాక్సీ ట్యాబ్ ఎస్9 అధికారిక ప్రోమో ఇమేజ్‌లలో ట్యాబ్ ఎస్9, ట్యాబ్ ఎస్9 ప్లస్, ట్యాబ్ ఎస్9 ఆల్ట్రా ఉంది.

యాపిల్ విజన్ ప్రో



రాబోయే ఆల్ట్రా హై-యెండ్ హెడ్‌సెట్ 'యాపిల్ విజన్ ప్రో' గురించి యాపిల్ కంపెనీ వివరాలు ప్రకటించింది.
ఆపరేటింగ్ సిస్టమ్: విజన్ వోస్ అథంటికేషన్: ఆప్టిక్ ఐడీ
డిస్‌ప్లే టైప్: మైక్రో-వోఎల్‌ఈడి
టోటల్ పిక్సెల్స్: 23 మిలియన్; రిఫ్రెష్ రేట్: 90/96 హెచ్ జడ్ బ్యాటరీ లైఫ్: రెండు గంటలు

వాట్సాప్‌లో కొత్త ఫీచర్



స్పామ్ కాల్స్‌ను దృష్టిలో పెట్టుకొని వాట్సాప్ కొత్త ఫీచర్‌ని తీసుకువచ్చింది. ఈ ఫీచర్ ద్వారా అన్‌నోన్ కాల్స్ ఆటోమెటిక్‌గా సైలెన్స్ అయిపోతాయి. కొంతకాలంగా ప్రయోగ దశలో ఉన్న ఈ ఫీచర్ ఆండ్రాయిడ్, ఐవోఎస్ యూజర్‌లకు అందుబాటులోకి వచ్చింది. దీని కోసం... 1. వాట్సాప్ ఓపెన్ చేసి టాప్ రైట్ కార్నర్‌లోని 'కెబాబ్ మెనూ' క్లిక్ చేయాలి; 2. సెట్టింగ్స్‌లోకి వెళ్లాలి; 3. ప్రైవసీ-క్లిక్; 4. సెలెక్ట్- కాల్స్ అన్‌నోన్; 5. సైలెన్స్ అన్‌నోన్ కాలర్స్-ఎనేబుల్

● గేమింగ్

యాక్షన్ ప్యాక్‌డ్ గేమ్



అడ్వెంచర్ గేమ్ ట్రేపాంగ్-2 ఇటీవల విడుదల అయింది. 'ఫీయర్'కు సీక్వెల్‌గా వచ్చిన గేమ్ ఇది.

ట్రేపాంగ్-2 అనేది ఒక ఎస్కేప్‌డ్ సోల్జర్ కథ. ఆ సైనికుడికి రివేంజ్ తప్ప గతం గుర్తు ఉండదు. ఈ సైనికుడిలోకి పరకాయప్రవేశం చేసే గేమర్ ముందు ఎన్నో సవాళ్లు ఉంటాయి. మరో ప్రపంచం శత్రువులతో పోరాడాలనుకుంటే, గతాన్ని ఛేదించాలనుకుంటే, కుట్రని అణచివేయాలనుకుంటే, మానవాతీతమైన వేగం, శక్తిని సొంతం చేసుకోవాలంటే ఈ గేమ్ మంచి ఛాయిస్.

గత సంవత్సరం విడుదల కావల్సిన ఈ గేమ్ అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. 'డిలే ట్రైలర్'లో క్షమాపణలు కోరిన నిర్మాణ సంస్థ 'మీరు ఏం కోరుకుంటున్నారు?' అంటూ ఫ్యాన్స్ నుంచి సలహాలు, సూచనలు ఆహ్వానించింది. ఫీడ్‌బ్యాక్ ఆధారంగా మార్పులు చేసి 'ట్రేపాంగ్-2' విడుదల చేసింది.

తుపాకుల కాల్పుల మధ్య వినిపించే 'నో సర్వైవర్స్. నాట్ ఈవెన్ యూ' గేమ్‌లోని వేడిని చెప్పకనే చెబుతుంది.

జానర్స్: షూటర్ వీడియో గేమ్, ఇండి గేమ్, అడ్వెంచర్ గేమ్
ఇంజిన్: అన్ రియల్ ఇంజిన్ 4
ప్లాట్‌ఫామ్: మైక్రోసాఫ్ట్ విండోస్

సినిమా


● విజయ్

నేను రెడీ

'మాస్టర్' (2021) తర్వాత హీరో విజయ్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'లియో'. త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సంజయ్ దత్, అర్జున్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్ఎస్ లలిత్‌కుమార్ నిర్మిస్తున్నారు. కాగా గురువారం (జూన్ 22న) విజయ్ బర్త్ డే. ఈ సందర్భంగా 'లియో' ఫస్ట్ లుక్, 'నాన్ రెడీ...'(నేను రెడీ) పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. అక్టోబరు 19న ఈ చిత్రం విడుదల కానుంది.


● కీర్తీ సురేష్

చైతూకి జోడీ?

హీరో నాగచైతన్య సరసన కీర్తీ సురేష్ హీరోయిన్‌గా నటించనున్నారన్నది ఫిల్మ్‌నగర్ టాక్. 'ప్రేమమ్', 'సవ్యసాచి' చిత్రాల తర్వాత హీరో నాగచైతన్య, దర్శకుడు చందూ మొండేటి కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందనుందనే వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలోనే కీర్తీ సురేష్ కథానాయికగా నటించనున్నారట. సూరత్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ లవ్‌స్టోరీలో నాగచైతన్య బోటు డ్రైవర్ పాత్రలో నటించనున్నారని, జీఏ2 పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుందని ప్రచారం జరుగుతోంది. కాగా హీరోయిన్ పాత్ర కోసం కీర్తీ సురేష్, అనుపమా పరమేశ్వరన్ తదితర పేర్లను చందు పరిశీలిస్తున్నారట. కీర్తీ సురేష్‌ని ఫైనలైజ్ చేశారని భోగట్టా. మరి.. నాగచైతన్య, కీర్తీ సురేష్‌ల జోడీ కుదురుతుందా? వేచి చూడాల్సిందే.


● తరుణ్ తేజ, బీవీఎస్ఎన్ ప్రసాద్, విమలా రామన్, వసంత్ రవి


సరికొత్త అనుభూతినిస్తుంది - బీవీఎస్ఎన్ ప్రసాద్

"తరుణ్ తేజతో కలిసి మా అబ్బాయి బాపినీడు హారర్ జోనర్‌లో 'అశ్విన్స్' సినిమా నిర్మించాడు. ఈ చిత్రం విజువల్స్, సౌండింగ్ అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది'' అని నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ అన్నారు. వసంత్ రవి హీరోగా, విమలా రామన్ కీ రోల్‌లో నటించిన చిత్రం 'అశ్విన్స్'. తరుణ్ తేజ దర్శకత్వంలో బాపినీడు బి. సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా తరుణ్ తేజ మాట్లాడుతూ– ''అశ్విన్స్' కాన్సెప్ట్‌తో ఓ షార్ట్ ఫిల్మ్ తీశాను. అది చూసిన బాపినీడుగారు అదే కాన్సెప్ట్‌ను ఫీచర్ ఫిల్మ్‌లా చేద్దామన్నారు. ప్రసాద్‌గారు, బాపినీడుగారి సహకారంతో ఈ సినిమా చేశాను'' అన్నారు. ''అశ్విన్స్' తరుణ్ కల.. దాన్ని నెరవేర్చిన నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు విమలా రామన్. ''తెలుగు ప్రేక్షకుల ముందుకు 'అశ్విన్స్' వంటి మంచి చిత్రంతో రావటం హ్యాపీగా ఉంది'' అన్నారు వసంత్ రవి.

స్పై ఆడియన్స్‌ను థ్రిల్ చేస్తుంది - నిఖిల్


● ఐశ్వర్య, నిఖిల్, సానియా

"కొన్ని రోజుల క్రితం నేను 'స్పై' సినిమా చూసినప్పుడు వర్క్ బ్యాలెన్స్ ఉందనిపించింది. అందుకే ఈ నెల 29న రిలీజ్ వద్దన్నాను. కానీ 200మంది చేయాల్సిన వీఎఫ్ఎక్స్ వర్క్‌ని, 2000వేల మందితో ఐదారు కంపెనీలు కలిసి చేశాయి. అందుకే సెన్సార్ కూడా పూర్తి చేయగలిగాం'' అని నిఖిల్ అన్నారు. నిఖిల్ సిద్ధార్థ్, ఐశ్వర్యా మీనన్ జంటగా నటించిన చిత్రం 'స్పై'. ఎడిటర్ గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో కె. రాజశేఖర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నిఖిల్ మాట్లాడుతూ– ''ఇరవై రోజులుగా మా టీమ్ నిద్రలేకుండా పని చేస్తున్నారు. గ్యారీ ఈ సినిమాను చివరి నిమిషం వరకు చెక్కుతున్నారు. మేం అనుకున్న కథను అనుకున్నట్లుగా తీయగలిగాం. ఈ సినిమాలో రానాగారి రోల్ సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. సినిమా బాగుంటుందనే నమ్మకంతో బయ్యర్లంతా హ్యాపీగా ముందుకొచ్చారు. 'స్పై' ఆడియన్స్‌ను థ్రిల్ చేస్తుంది'' అన్నారు. ''ఇంటెన్స్ అండ్ ఇన్ఫర్మేటివ్ మూవీ 'స్పై'' అన్నారు సానియా. నటుడు అభినవ్ గోమటం, సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల, సీఈవో చరణ్ తేజ్ మాట్లాడారు.



ఆ గ్యారంటీ ఇవ్వగలను - శివ కందుకూరి

"ఏ సీజన్‌లో అయినా మంచి చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తుంటారు. ఇప్పుడు మేం తీసిన 'మను చరిత్ర' కూడా ఓ మంచి చిత్రంగా తెలుగు ప్రేక్షకులను అలరిస్తుందనే గ్యారంటీ ఇవ్వగలను'' అని శివ కందుకూరి అన్నారు. శివ కందుకూరి హీరోగా భరత్ పెదగాని దర్శకత్వంలో ఎన్. శ్రీనివాసరెడ్డి నిర్మించిన చిత్రం 'మను చరిత్ర'. మేఘా ఆకాష్, ప్రియా వడ్లమాని, ప్రగతి శ్రీవాత్సవ్ హీరోయిన్లు. ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో శివ కందుకూరి మాట్లాడుతూ – ''ఈ చిత్రంలో మను అనే క్యారెక్టర్ చేశాను. నా క్యారెక్టర్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. ఏడెనిమిదేళ్ల టైమ్ పీరియడ్‌లో ఈ సినిమా సాగుతుంది. అందుకే 'మను చరిత్ర' అని టైటిల్ పెట్టాం. ట్రైలర్‌లో యాక్షన్ కనిపిస్తున్నప్పటికీ సినిమాలో మంచి లవ్‌స్టోరీ కూడా ఉంది. తన నిజజీవితంలోని వ్యక్తుల నుంచి స్ఫూర్తి పొంది ఈ సినిమాలోని పాత్రలను డిజైన్ చేసినట్లు, అలాగే తన ముగ్గురు స్నేహితుల వ్యక్తిత్వాలను మిళితం చేసి మను పాత్రను డిజైన్ చేసినట్లు దర్శకుడు భరత్ నాతో చెప్పారు. మా నాన్నగారు (నిర్మాత రాజ్ కందుకూరి) 'మను చరిత్ర' సినిమా చూసి, నీ కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి బాగా యాక్ట్ చేశావని అన్నారు. దాన్ని పెద్ద కాంప్లిమెంట్‌గా భావిస్తున్నాను'' అని అన్నారు.

సినిమా కష్టాలతో...

"సినిమా ఇండస్ట్రీకి వచ్చిన చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేను కూడా అవన్నీ దాటుకొచ్చిన వాడినే. అలాంటి ఇతివృత్తంతో తీసిన 'నట రత్నాలు'. మంచి విజయం సాధిస్తుంది. మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది'' అని డైరెక్టర్ నర్రా శివనాగు అన్నారు. సుదర్శన్, 'రంగస్థలం' మహేశ్, తాగుబోతు రమేశ్, ఇనయా సుల్తాన కీలక పాత్రల్లో నర్రా శివనాగు దర్శకత్వం వహించిన చిత్రం 'నట రత్నాలు'. డా. దివ్య, సుప్రీం బాబు నిర్మించారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో మాజీ ఎమ్మెల్యే ఎరపతినేని శ్రీనివాసరావు 'నట రత్నాలు' ఆడియో సీడీలను ఆవిష్కరించారు. ''సినిమా బాగా వచ్చింది. త్వరలో విడుదల చేస్తాం'' అని సుప్రీం బాబు, దివ్య అన్నారు. దివ్యవాణి, డాక్టర్ పద్మ, చీకోటి ప్రవీణ్, రవికుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.


● శివనాగు, చీకోటి ప్రవీణ్, దివ్య, ఇనయా

ఆ మేకప్ ఓ పెద్ద సవాల్

"షూటింగ్ చేసిన ప్రతి రోజూ కాస్ట్యూమ్స్ ధరించడానికి, మేకప్ వేసుకోవడానికి నాలుగైదు గంటలు పట్టే క్యారెక్టర్ చేయడం చిన్న విషయం కాదు. మేకప్ పూర్తయ్యేంతవరకూ కదలకుండా కూర్చోవడం అనేది పెద్ద చాలెంజ్'' అన్నారు మాళవికా మోహనన్. విక్రమ్ హీరోగా పా. రంజిత్ దర్శకత్వంలో రూపొందుతున్న తమిళ చిత్రం 'తంగలాన్'లో మాళవికా మోహనన్ ఓ లీడ్ రోల్ చేస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్ నేపథ్యంలో పీరియాడికల్ ఫిల్మ్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో విక్రమ్ ఓ గిరిజన తెగ నాయకుడి పాత్రలో నటిస్తున్నట్లుగా తెలుస్తోంది. మాళవికా మోహనన్ కూడా అదే తెగకు చెందిన యువతిగా నటిస్తున్నారని సమాచారం. ఈ పాత్రకు సంబంధించిన మేకప్‌కి నాలుగైదు గంటలు పడుతోంది. ''ఇలాంటి పాత్రలు చేసే అవకాశం అరుదుగా వస్తుంది కాబట్టి ఇష్టంగా చేస్తున్నాను'' అన్నారు మాళవికా మోహనన్.


● మాళవికా మోహనన్


● మంచు విష్ణు

'మా'తో బాలీవుడ్ ఒప్పందం

"మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా), బాలీవుడ్ అసోసియేషన్ మధ్య ఉన్న ఒప్పందం ప్రకారం తెలుగు చిత్రాలు చేసే బాలీవుడ్ కళాకారులకు 'మా' సభ్యత్వం అందుతుంది. అలాగే బాలీవుడ్ చిత్రాల్లో నటించే తెలుగువాళ్లకి బాలీవుడ్ అసోసియేషన్ సభ్యత్వం ఉంటుంది'' అని 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు అన్నారు. మంచు విష్ణు, 'మా' కోశాధికారి శివ బాలాజీ బాలీవుడ్ ఆర్టిస్ట్ అసోసియేషన్‌ని కలిసి, రెండు అసోసియేషన్‌లు కలిసికట్టుగా ఉండాలనే ప్రతిపాదన ఉంచారు. అందుకు బాలీవుడ్ అంగీకారం తెలిపింది. ఇందులో భాగంగా 'మా', సినేటా (హిందీ చలనచిత్రం మరియు టీవీ అసోసియేషన్) ఉమ్మడి ఒప్పందంపై సంతకం చేశాయి. ''త్వరలో వేరే ఇండస్ట్రీలతో కూడా ఈ ఒప్పందం జరుగుతుంది. అన్ని ఇండస్ట్రీలు ఒకే కుటుంబంగా ఉండాలి'' అన్నారు మంచు విష్ణు.

ఓసినీ వయ్యారి...


● ప్రశాంత్, ఆది

'నాతో నేను'లో మా నాన్న (సాయికుమార్) కీలక పాత్ర చేస్తున్నారు. ఇది చాలా మంచి పాత్ర. ఈ సినిమా నుంచి నేను రిలీజ్ చేసిన 'ఓసినీ వయ్యారి..' పాట బాగుంది.. సినిమా కూడా మంచి హిట్టవ్వాలి'' అని హీరో ఆది సాయికుమార్ అన్నారు. సాయికుమార్, శ్రీనివాస్ సాయి, ఆదిత్య ఓం, దీపాలీ రాజపుత్, రాజీవ్ కనకాల కీలక పాత్రల్లో శాంతి కుమార్ తూర్లపాటి దర్శకత్వంలో ప్రశాంత్ టంగుటూరి నిర్మించిన చిత్రం 'నాతో నేను'. సత్య కశ్యప్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'ఓసినీ వయ్యారి రామ చిలుక..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను ఆది సాయికుమార్ రిలీజ్ చేశారు.

సోషల్ టీచర్ ఇంగ్లీష్ పాఠాలు చెబితే...


● హర్ష

హర్ష చెముడు టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సుందరం మాస్టర్'. దివ్య శ్రీ పాద హీరోయిన్. కళ్యాణ్ సంతోష్ దర్శకత్వంలో రవితేజ, కుర్రు సుధీర్‌కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను హీరో రవితేజ విడుదల చేశారు. ''సోషల్ స్టడీస్ బోధించే సుందరం మాస్టర్ మిర్యాలమెట్ట అనే మారుమూల పల్లెకి ఇంగ్లిష్ టీచర్‌గా బదిలీ అవుతాడు. అక్కడున్నవారికి ఎలా ఇంగ్లిష్ బోధిస్తాడు? అనేది ప్రధాన ఇతివృత్తం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ఆవారా కుర్రాళ్ల కథ


● చెర్రీ, దేపా శ్రీకాంత్, శ్రీహాన్

'బిగ్ బాస్' శ్రీహాన్, ముక్కు అజయ్, 'ఢీ' చెర్రీ, జస్వంత్, షాయాజీ షిండే ముఖ్య పాత్రల్లో దేపా శ్రీకాంత్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మా ఆవారా జిందగీ'. నంద్యాల మధుసూదన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా దేపా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ– ''హైదరాబాద్ నగరంలో నలుగురి ఆవారా కుర్రాళ్ల పనులు ఎలా ఉండబోతున్నాయి? అనే కథాంశంతో రూపొందిన చిత్రం ఇది. ప్రేక్షకులు ఫుల్లుగా నవ్వుకునేలా ఉంటుంది'' అన్నారు. ''ఇలాంటి మంచి సినిమాలో నటించినందుకు హ్యాపీ'' అన్నారు శ్రీహాన్, ముక్కు అజయ్, 'ఢీ' చెర్రీ, మహేందర్ నాథ్.

సాక్షి బిజినెస్

శుక్రవారం
23-6-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	284	63,239
నిఫ్టీ ▽	86	18,771

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.00 గంటలకు)			
నాస్‌డాక్	13,561	△	59
డోజోన్స్	33,870	▽	81
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,502	▽	57
డాక్స్	15,988	▽	35
షాంఘై	3,198	▽	42
నికాయ్	33,264	▽	310

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	58,654	▽	210
బంగారం (99.5 స్వచ్ఛత)	58,628	▽	209
వెండి (కిలో)	70,133	▽	1,124

సైయంట్ డీఎల్‌ఎం ఐపీవో 27 నుంచి...

- షేరు శ్రేణి రూ. 250–265
- రూ. 700 కోట్ల సమీకరణ

ముంబై: ఎలక్ట్రానిక్స్ తయారీ సేవల సంస్థ సైయంట్ డీఎల్‌ఎం ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ (ఐపీవో) జూన్ 27న ప్రారంభమై 30న ముగియనుంది. దీని కోసం షేరు ధర శ్రేణిని రూ. 250–265గా నిర్ణయించినట్లు సంస్థ తెలిపింది. ఇన్వెస్టర్లు కనీసం 56 షేర్లకు బిడ్ చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సైయంట్ డీఎల్‌ఎం ఈ ఐపీవో ద్వారా రూ. 700 కోట్లు సమీకరించనుంది. ప్రమోటర్లు 30 శాతం



వాటాలను విక్రయించనుండగా మాతృ సంస్థ సైయంట్ 70 శాతం వాటాను అట్టి పెట్టుకోనుంది. ఐపీవో ద్వారా సమీకరించిన నిధులను పెట్టుబడుల అవసరాలు, రుణాల చెల్లింపులు, ఇతర సంస్థల కొనుగోళ్లు మొదలైన వాటి కోసం సైయంట్ డీఎల్‌ఎం వినియోగించుకోనుంది. ఐపీవో నిధుల్లో రూ. 160 కోట్లను టర్మ్ రుణాలు, రూ. 290 కోట్లను వర్కింగ్ క్యాపిటల్ రుణాల చెల్లింపునకు.. మిగతాది పెట్టుబడి అవసరాల కోసం ఉపయోగించుకోనున్నట్లు ఎండీ రాజేంద్ర వెలగపూడి తెలిపారు. ఏరోస్పేస్ దిగ్గజం హనీవెల్ అండ్ థేల్స్, జర్మనీ పారిశ్రామిక సంస్థ ఏబీబీ తదితర 30 పైచిలుకు క్లయింట్లకు సైయంట్ సర్వీసులు అందిస్తోంది. ఈ ఏడాది మార్చి ఆఖరు నాటికి ఆర్డర్ బుక్ విలువ రూ. 2,450 కోట్లుగా ఉన్నట్లు చైర్మన్ గణేష్ వెంకట కృష్ణ బోదనపు వివరించారు. ఇష్యూలో 75% భాగాన్ని అర్హత గల సంస్థాగత కొనుగోలుదారులకు (క్యూఐబీ), 15% సంస్థాగతేతర ఇన్వెస్టర్లకు, మిగతా 10% రిటైల్ ఇన్వెస్టర్ల కోసం ఉద్దేశించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-6-2023	
విశాఖ	550–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	530–00
విజయవాడ	530–00
రిటైల్ ధర (డజను)	72.00
22-6-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

భారత్‌లో మైక్రాన్ సెమీకండక్టర్ ప్లాంట్

- గుజరాత్‌లో అసెంబ్లీ, టెస్ట్ ప్లాంట్
- రూ.22,500 కోట్ల పెట్టుబడులు
- 20 వేల మందికి ఉపాధి కల్పన



న్యూఢిల్లీ: కంప్యూటర్ స్టోరేజీ చిప్ తయారీ సంస్థ మైక్రాన్ 'సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్ట్ ప్లాంట్'ను గుజరాత్‌లో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందుకు రూ.2.75 బిలియన్ డాలర్లు (సుమారు రూ.22,550 కోట్లు) పెట్టుబడులు అవసరం కానున్నాయి. ఇందులో మైక్రాన్ సొంతంగా రూ.825 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనుండగా, మిగిలిన మొత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చనున్నాయి. స్థానికంగా సెమీకండక్టర్ ఎకోసిస్టమ్ (తయారీ, వ్యాల్యూ చైన్) ఏర్పాటుకు భారత్ తీసుకుంటున్న చర్యలు ఎంతో ప్రోత్సాహకరంగా ఉన్నట్లు మైక్రాన్ ప్రెసిడెంట్, సీఈవో సంజయ్ మెహరోత్రా పేర్కొన్నారు. భారత్‌లో ప్లాంట్ ఏర్పాటుతో స్థానిక కస్టమర్లకు సేవలు అందించడంతోపాటు, అంతర్జాతీయంగా తయారీ సామర్థ్యం పెరుగుతుందని ప్రకటించారు.

సర్కారు నుంచి భారీ సాయం

మైక్రాన్ ప్లాంట్‌కు కేంద్ర సర్కారు 'మోడిఫైడ్ అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్ అండ్ ప్యాకేజింగ్ (ఏటీఎంపీ)' పథకం కింద ఆమోదం లభించడం గమనార్హం. ఈ పథకం కింద మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 50% కేంద్ర సర్కారు నుంచి లభిస్తుంది. ప్రాజెక్టు వ్యయంలో 20% మేర ప్రోత్సాహకాల రూపంలో గుజరాత్ సర్కారు అందిస్తుంది. మైక్రాన్ తన వంతు 30% వెచ్చిస్తే సరిపోతుంది.

దశలవారీగా..

గుజరాత్‌లో మైక్రాన్ సెమీకండక్టర్ అసెంబ్లింగ్, టెస్టింగ్ ప్లాంట్ దశల వారీగా కార్యకలాపాలు చేపట్టనుంది. ''తొలి దశ నిర్మాణం ఈ ఏడాదిలోనే ప్రారంభం అవుతుంది. ఇందులో 5 లక్షల చదరపు అడుగుల క్లీన్‌రూమ్ స్పేస్ ఉంటుంది. 2024 చివరికి కార్యకలాపాలు మొదలవుతాయి''అని మైక్రాన్ ప్రకటించింది. ఈ ప్లాంట్‌తో 5,000 మందికి ప్రత్యక్షంగా, 15,000 మందికి పరోక్షంగా వచ్చే కొన్నేళ్లలో ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపింది. ఫేస్ 2 నిర్మాణం ఈ దశాబ్దం ద్వితీయార్థంలో ఉంటుందని పేర్కొంది.

సెమీకండక్టర్ రంగానికి ఊతం



మైక్రాన్ ఏర్పాటు చేయబోయే సెమీకండక్టర్ అసెంబ్లింగ్, టెస్ట్ ప్లాంట్ భారత సెమీకండక్టర్ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేస్తుంది. వేలాది హైటెక్ ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. దేశ సెమీకండక్టర్ ఎకోసిస్టమ్ వర్ధిల్లడానికి ఈ పెట్టుబడి కీలక పునాది అవుతుంది.
– అశ్విని వైష్ణవ్, ఐటీ, టెలికం మంత్రి

అవకాశాల కోసం చూస్తున్నాం..

భారత్‌లో గొప్ప అవకాశాల కోసం చూస్తున్నాం. మెమొరీ, స్టోరేజీలో మైక్రాన్ ప్రపంచ దిగ్గజంగా ఉంది. డేటా సెంటర్లు, స్మార్ట్‌ఫోన్లు, పీసీలకు మేము కీలక సరఫరాదారుగా ఉన్నాం.
– సంజయ్ మెహరోత్రా, మైక్రాన్ సీఈవో

పెట్టుబడులతో రండి...





మోదీతో సీఈవోల భేటీలో గ్యారీ డికర్సన్, హెచ్ లారెన్స్‌కల్ప్, సంజయ్ మెహరోత్రా (ఎడమ నుంచి వరుసగా)

- అమెరికన్ కంపెనీలకు ప్రధాని పిలుపు
- ప్రముఖ సీఈవోలతో భేటీ

వాషింగ్టన్: భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ప్రముఖ అమెరికన్ కంపెనీలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని పలు అగ్రగామి కంపెనీల సీఈవోలతో వాషింగ్టన్‌లో చర్చలు నిర్వహించారు. భారత సెమీకండక్టర్ పరిశ్రమకు మద్దతుగా నిలవాలని అమెరికన్ చిప్ తయారీ సంస్థ మైక్రాన్ టెక్నాలజీని కోరారు. టెక్నాలజీ ప్రాసెస్, ప్యాకేజింగ్ సామర్థ్యాల అభివృద్ధికి భారత్‌కు విచ్చేయాలని సెమీకండక్టర్ రంగంలో పనిచేసే ప్రముఖ సంస్థ అప్లయిడ్ మెటీరియల్స్ సంస్థను ప్రధాని కోరారు. భారత్‌లోని సంస్థలతో సహకారానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని అప్లయిడ్ మెటీరియల్స్ సీఈవో గ్యారీ డికర్సన్‌కు సూచించారు. భారత ఏవియేషన్, రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో ముఖ్య పాత్ర పోషించాలని జనరల్ ఎలక్ట్రిక్ సీఈవో హెచ్ లారెన్స్‌కల్ప్‌తో భేటీ సందర్భంగా కోరారు.

"పరస్పర విజయానికి వీలుగా ప్రధాని మోదీ, భారత్‌లోని ప్రతి ఒక్కరితో కలసి పనిచేయడానికి సుముఖంగా ఉన్నాం.
– గ్యారీ డికర్సన్, అప్లయిడ్ మెటీరియల్స్

వృద్ధి రేటు అంచనాలు పెంచిన ఫిచ్..

- 6 శాతం నుంచి 6.3 శాతానికి అప్
- తయారీ రంగంలో పురోగతి
- మౌలికంపై వ్యయాలు మెరుగుదల



న్యూఢిల్లీ: భారత్ వృద్ధి ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరంలో అంచనాలకు మించి మెరుగుపడుతున్నట్లు అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజం- ఫిచ్ రేటింగ్స్ పేర్కొంది. తయారీ రంగంలో ఉత్పత్తి మెరుగుదల, మౌలిక సదుపాయాల వ్యయంలో స్థిరమైన పెరుగుదల వంటి అంశాల నేపథ్యంలో మార్చిలో వేసిన తొలి 6 శాతం అంచనాలను తాజాగా 6.3 శాతానికి పెంచుతున్నట్లు వివరించింది. ఈ అంచనా ప్రపంచంలో అత్యధిక వృద్ధి రేటు అని కూడా పేర్కొంది. ఫిచ్ గ్లోబల్ ఎకనమిక్ తాజా అవుట్‌లుక్‌లో కొన్ని ముఖ్యాంశాలను పరిశీలిస్తే...

- 2024–25, 2025–26 ఆర్థిక సంవత్సరాల్లో 6.5 శాతం చొప్పున వృద్ధి నమోదుకావచ్చు.
- బ్యాంకింగ్ భారీ రుణ వృద్ధి, మౌలిక సదుపాయాల వ్యయం నుంచి ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలు పొందుతోంది.
- తయారీ రంగంలో రికవరీతోపాటు నిర్మాణ, వ్యవసాయ రంగాలు కూడా పురోగతిలో ఉన్నాయి. ఆయా అంశాలు దేశీయ డిమాండ్‌ను పెంచుతున్నాయి.
- ద్రవ్యోల్బణం భయాలు తొలగుతున్నాయి. తగిన వర్షపాతం అంచనాలు ఉన్నాయి. 2023లో ఆర్‌బీఐ రెపో రేటు (ప్రస్తుతం 6.50 శాతం) యథాతథంలో కొనసాగవచ్చు.

ప్రపంచ వృద్ధి అంచనా పెంపు

కాగా ఊహించినదానికన్నా పరిస్థితులు మెరుగ్గా ఉన్నందున ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి అంచనాలను సైతం 2.4 శాతానికి పెంచుతున్నట్లు నివేదిక పేర్కొంది. మార్చిలో ఈ అంచనా 2 శాతం.

మెర్సిడెస్ టాప్ ఎండ్ రైడ్

ముంబై: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న జర్మనీ కంపెనీ మెర్సిడెస్ బెంజ్ రూ.1 కోటి కంటే అధిక ధర కలిగిన టాప్ ఎండ్ మోడళ్లను భారత్‌కు తీసుకురానుంది. మెట్రోయేతర నగరాల నుండి కూడా డిమాండ్ వేగంగా పెరుగుతుండడం ఇందుకు కారణమని మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. టాప్ ఎండ్ వెహికల్స్ (టీఈవీ) వాటా సంస్థ మొత్తం విక్రయాల్లో 25 శాతం ఉందన్నారు. ఏఎంజీ ఎస్‌ఎల్55 4మేటిక్ ప్లస్ రోడ్‌స్టర్ విడుదల సందర్భంగా మీడియాతో మాట్లాడారు. దీని ధర ఎక్స్‌షోరూంలో రూ.2.35 కోట్లు.



బ్యాంకింగ్, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ

- రికార్డు స్థాయిల వద్ద దిద్దుబాటు
- రెండురోజుల లాభాలకు అడ్డుకట్ట
- సెన్సెక్స్ నష్టం 284 పాయింట్లు
- మళ్లీ 18,800 దిగువకు నిఫ్టీ



ముంబై: రికార్డు గరిష్ట స్థాయిల వద్ద ఐటీ, ఇంధన, బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీల రెండు రోజుల లాభాలకు గురువారం అడ్డుకట్ట పడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న ప్రతికూల సంకేతాల ప్రభావం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఉదయం సెన్సెక్స్ 79 పాయింట్ల స్వల్ప లాభంతో కొత్త జీవితకాల గరిష్ట స్థాయి 63,602 వద్ద.., నిఫ్టీ మూడు పాయింట్ల నష్టంతో 18,854 వద్ద మొదలయ్యాయి. మిశ్రమ ప్రారంభం తర్వాత సూచీలు రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 322 పాయింట్లు పతనమై 63,201 వద్ద, నిఫ్టీ 98 పాయింట్లు దిగివచ్చి 18,759 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. ఆఖరికి సెన్సెక్స్ 284 పాయింట్లు నష్టపోయి 63,239 వద్ద, నిఫ్టీ 86 పాయింట్లను కోల్పోయి 18,771 వద్ద ముగిశాయి. మెటల్, మీడియా మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫలితంగా బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం చొప్పున నష్టపోయాయి. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ. 219 కోట్ల షేర్లను కొన్నారు. బీఎస్‌ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే కంపెనీ మొత్తం విలువ రూ. 2.05 లక్షల కోట్లు నష్టపోయి రూ.292 లక్షల కోట్లకు దిగొచ్చింది. వడ్డీ రేట్ల పెంపు భయాలతో ప్రపంచ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

సాక్షి స్పోర్ట్స్



బోపన్న జోడీ శుభారంభం

సించ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ ఏటీపీ-500 టోర్నమెంట్‌లో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. లండన్‌లో గురువారం జరిగిన తొలి రౌండ్‌లో బోపన్న ద్వయం 7-6 (10/8), 7-6 (7/5)తో జేమీ ముర్రే (బ్రిటన్)-మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జంటను ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది.

అంతర్జాతీయ బాక్సింగ్ సంఘంపై వేటు

అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబీఏ)పై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) నిషేధం విధించింది. అయితే పారిస్ ఒలింపిక్స్‌లో బాక్సర్లకు ఏ ఇబ్బంది లేకుండా పోటీ పడే అవకాశమిచ్చారు. కొన్నేళ్లుగా ఐబీఏ వివాదాలతో వార్తల్లో నిలిచింది. సమస్యల్ని పరిష్కరించుకోవాలని ఐఓసీ ఎన్ని సార్లు సూచించినా ఐబీఏ మాత్రం పెడచెవిన పెట్టింది. దీంతో ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాచ్ నేతృత్వంలో ఎగ్జిక్యూటివ్ బోర్డు ఐబీఏను బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకుంది.

క్వార్టర్స్‌లో ప్రణయ్



తైపీ: ఈ ఏడాది నిలకడగా రాణిస్తున్న భారత నంబర్‌వన్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ తైపీ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ 21–9, 21–17తో టామీ సుగియార్తో (ఇండోనేసియా)పై గెలుపొందాడు. భారత్‌కే చెందిన పారుపల్లి కశ్యప్ కథ ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. కశ్యప్ 16–21, 17–21తో సు లి యాంగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ (భారత్) ద్వయం 13–21, 18–21తో చియు సియా సియె–లిన్ జియావో మిన్ (చైనీస్ తైపీ) జోడీ చేతిలో ఓటమి చవిచూసింది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో తాన్యా హేమంత్ (భారత్) 11–21, 6–21తో తై జు యింగ్ (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పాలైంది.

పోరాడి ఓడిన శ్రీజ



న్యూఢిల్లీ: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) కంటెండర్ టోర్నీలో భారత క్రీడాకారిణులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల సింగిల్స్‌లో జాతీయ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ, దియా చితాలె తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా... అహిక ముఖర్జీ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంది. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో శ్రీజ 6–11, 11–4, 5–11, 11–2, 7–11తో హువాంగ్ యిహువా (చైనీస్ తైపీ) చేతిలో, దియా 11–9, 7–11, 2–11, 1–11తో మియు కిహారా (జపాన్) చేతిలో ఓడిపోయారు. అహిక 11–8, 11–3, 11–2తో జియొటాంగ్ వాంగ్ (చైనా)పై గెలుపొందింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సత్యన్ జ్ఞానశేఖరన్–మనిక బత్రా (భారత్) ద్వయం 11–3, 11–3, 11–6తో అబ్దుల్ బాసిత్ చైచి–మలీసా నస్రి (అల్జీరియా) జంటను ఓడించి క్వార్టర్ ఫైనల్ చేరింది.

'శత'క్కొట్టిన హోప్, పూరన్

నేపాల్‌పై వెస్టిండీస్ ఘనవిజయం


షై హోప్


పూరన్

హరారే: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో నేపాల్‌పై వెస్టిండీస్ అదరగొట్టే విజయం సాధించింది. గ్రూప్ 'ఎ'లో గురువారం జరిగిన మ్యాచ్‌లో విండీస్ 101 పరుగుల తేడాతో నేపాల్‌పై అలవోక విజయం సాధించింది. టాపార్డర్‌లో కైల్ మేయర్స్ (1), జాన్సన్ చార్లెస్ (0) వికెట్లు పారేసుకున్నా... మిడిలార్డర్‌లో కెప్టెన్ షై హోప్ (129 బంతుల్లో 132; 10 ఫోర్లు, 3 సిక్సర్లు), నికోలస్ పూరన్ (94 బంతుల్లో 115; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీలతో కదంతొక్కారు. నాలుగో వికెట్‌కు వీరిద్దరు 216 పరుగులు జోడించడంతో విండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 339 పరుగులు చేసింది. మిగతా వారిలో ఓపెనర్ బ్రాండన్ కింగ్ (42 బంతుల్లో 32; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), రోవ్‌మన్ పావెల్ (14 బంతుల్లో 29 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. తర్వాత నేపాల్ భారీ లక్ష్యాన్ని ఛేదించలేక 49.4 ఓవర్లలో 238 పరుగుల వద్ద ఆలౌటైంది. ఆరిఫ్ షేక్ (93 బంతుల్లో 63; 4 ఫోర్లు, 1 సిక్స్), గుల్షన్ ఝా (58 బంతుల్లో 42; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. హోల్డర్ 3, జోసెఫ్, కీమో పాల్, అకీల్ హొసీన్ తలా 2 వికెట్లు తీశారు.

నెదర్లాండ్స్‌ను గెలిపించిన తేజ నిడమనూరు

మరో మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 5 వికెట్ల తేడాతో అమెరికాపై గెలిచింది. మొదట అమెరికా 50 ఓవర్లలో 8 వికెట్లకు 211 పరుగులు చేసింది. షాయన్ జహంగీర్ (86 బంతుల్లో 71; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించాడు. తర్వాత నెదర్లాండ్స్ 43.2 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి 214 పరుగులు చేసి గెలిచింది. నెదర్లాండ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తేజ నిడమనూరు (68 బంతుల్లో 58; 5 ఫోర్లు), కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (60 బంతుల్లో 67 నాటౌట్; 6 ఫోర్లు) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

ఆసియా అథ్లెటిక్స్ పోటీలకు జ్యోతి, జ్యోతిక శ్రీ


జ్యోతి

న్యూఢిల్లీ: ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి యర్రాజీ, దండి జ్యోతిక శ్రీ ఈ మెగా ఈవెంట్‌కు ఎంపికయ్యారు. జూలై 12 నుంచి 16 వరకు బ్యాంకాక్‌లో ఈ పోటీలు జరుగుతాయి. భారత్ నుంచి మొత్తం 54 మంది ప్లేయర్లు బరిలోకి దిగుతారు. మహిళల 100 మీటర్ల హర్డిల్స్, 200 మీటర్ల విభాగంలో జ్యోతి యర్రాజీ... మహిళల 4x400 మీటర్ల రిలే, 4x400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో జ్యోతిక శ్రీ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు.

'పోరాట' రెజ్లర్లకు వెసులుబాటు

ఒక్క బౌట్‌తోనే జట్టుకు ఎంపిక చేసే అవకాశం



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై కొన్ని నెలలుగా న్యాయ పోరాటం చేస్తున్న స్టార్ రెజ్లర్లకు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అడ్‌హక్ కమిటీ గొప్ప ఊరటనిచ్చింది. ప్రతిష్టాత్మక ఆసియా క్రీడలు, ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో పాల్గొనే భారత జట్టు ఎంపిక కోసం నిర్వహించే ట్రయల్స్‌లో ఆరుగురు రెజ్లర్లకు కేవలం ఒకే బౌట్ ద్వారా అర్హత పొందే అవకాశం కల్పించింది. స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్, సంగీత ఫొగాట్, సత్యవర్త్ కడియాన్, బజరంగ్ పూనియా, జితేందర్ కిన్హాలు మిగతా సెలక్షన్ ట్రయల్స్ విజేతలతో తలపడి గెలిస్తే చాలు ప్రతిష్టాత్మక క్రీడలకు ఎంపిక చేయనున్నారు. ఆగస్టు 5 నుంచి 15వ తేదీ వరకు దీనికి సంబంధించిన ట్రయల్స్ నిర్వహిస్తారు. అంతర్జాతీయ వేదికలపై భారత్‌కు పతకాలు తెచ్చిపెట్టిన వీరంతా కేంద్ర క్రీడాశాఖను నేరుగా ఆయా క్రీడల్లో పాల్గొనే వెసులుబాటు కల్పించాలని కోరారు. దీంతో స్టార్ రెజ్లర్ల విన్నపాన్ని కేంద్ర క్రీడాశాఖ, ఐఓఏ మన్నించాయి. అయితే ఈ నామమాత్ర బౌట్‌పై ఇతర ఔత్సాహిక రెజ్లర్లు విమర్శిస్తున్నారు.

ఆరోన్ వర్గీస్ 321

హెచ్‌సీఏ రెండు రోజుల లీగ్ మ్యాచ్‌లో సంచలన ప్రదర్శన



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) రెండు రోజుల లీగ్‌లో ఆరోన్ జార్జ్ వర్గీస్ అద్భుత ప్రదర్శన నమోదు చేశాడు. కాంకర్డ్ క్రికెట్ క్లబ్, శ్రీశ్యామ్ క్రికెట్ క్లబ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో గురువారం ఈ మెరుపు ప్రదర్శన చోటు చేసుకుంది. కాంకర్డ్ తరఫున ఆడిన ఆరోన్ 260 బంతుల్లో 50 ఫోర్లు, 1 సిక్స్‌తో 321 పరుగులు సాధించడం విశేషం. ఆరోన్ అద్భుత బ్యాటింగ్‌తో పాటు అయాన్ అహ్మద్ (52), రామ్ రేపాల (50) రాణించడంతో కంకార్డ్ 85.5 ఓవర్లలో (నిర్ణీత 90 ఓవర్లు) 560 పరుగులకు ఆలౌటైంది.

'గ్లోబల్ టీమ్‌ను తయారు చేస్తాం'

- మున్ముందు క్రీడా లీగ్‌లకు మరింత ఆదరణ
- 'తెలుగు టాలన్స్' యజమాని అభిషేక్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: భారత క్రీడల్లో గత కొన్నేళ్లుగా వేర్వేరు లీగ్‌లు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. వివిధ క్రీడాంశాల్లో సాగుతున్న ఈ లీగ్‌లపై అటు ఫ్యాన్స్‌ను ఆకర్షిస్తుండగా, ఇటు పలు వ్యాపార వర్గాలు లీగ్‌లతో జత కట్టి తమ ఆసక్తిని ప్రదర్శిస్తున్నాయి. ఇదే కోవలో ఇప్పుడు 'ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్' నడుస్తోంది. జైపూర్ వేదికగా ఈ నెల 8న ప్రారంభమైన టోర్నీ 25 వరకు సాగనుంది. ఇందులో హైదరాబాద్‌కు చెందిన 'తెలుగు టాలన్స్' జట్టుకు కంకణాల అభిషేక్ రెడ్డి యజమానిగా ఉన్నారు. అభిషేక్‌కే చెందిన 'హైదరాబాద్ బ్లాక్ హాక్స్' టీమ్ ఇప్పటికే ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో ఆడుతోంది. అంతకుముందే ఆయన ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌తో పాటు బాక్సింగ్ లీగ్‌లో కూడా భాగస్వామిగా ఉన్నారు. క్రీడలపై అభిరుచితో పాటు ఎక్కువ మందికి ఆయా క్రీడాంశాలకు మరింత ప్రాచుర్యం కల్పించే ప్రయత్నంలో భాగంగానే ఇలా చేస్తున్నట్లు అభిషేక్ రెడ్డి చెప్పారు. ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్, అందులో తన టీమ్ తెలుగు టాలన్స్ పాత్రకు సంబంధించి వివిధ అంశాలపై అభిషేక్ 'సాక్షి'తో మాట్లాడారు. విశేషాలు ఆయన మాటల్లోనే...

వరుసగా లీగ్‌లలో జట్లను కొనడంపై...

మొదటి నుంచి నాకు క్రీడలపై అమితాసక్తి. ప్రపంచ వ్యాప్తంగా జరిగే అన్ని పెద్ద ఈవెంట్లను అనుసరించేవాడిని. విదేశాల్లో ఉన్నప్పుడు అక్కడి పోటీలకు ప్రత్యక్షంగా తిలకిస్తున్న సమయంలో అక్కడి అభిమానులు చూపించే ఆసక్తి, ఆట పట్ల అక్కడ ఉండే క్రేజ్ నన్ను ఆశ్చర్యపర్చాయి. మన దేశంలో క్రికెటేతర క్రీడల్లో మనం ఇలాంటిది చాలా తక్కువగా చూస్తాం. అయితే లీగ్‌లు రంగప్రవేశం చేశాక ఫ్యాన్స్ కూడా సదరు ఆటవైపు ఆకర్షితులవుతున్నారు. నా ప్రవృత్తి క్రీడలు. అందుకే ఏదో రూపంలో వాటితో జత కట్టాలని భావించాను. వాలీబాల్ లీగ్‌కు వచ్చిన బ్రహ్మాండమైన స్పందన చూసి ఇప్పుడు హ్యాండ్‌బాల్ వైపు వచ్చాం.

హ్యాండ్‌బాల్‌లో లీగ్ అవసరం గురించి...

మన దగ్గర కూడా హ్యాండ్‌బాల్ పోటీలను రెగ్యులర్‌గా చూసే అభిమానులు ఉన్నారు. అయితే దురదృష్టవశాత్తూ చాలా చోట్ల అది అవుట్‌డోర్ గేమ్‌గా, మట్టి కోర్టులలో కనిపిస్తుంది. కానీ ఆధునిక యూరోపియన్ శైలిలో ఇండోర్ హ్యాండ్‌బాల్ బాగా పాపులర్. అలాంటి ఆటను ఇప్పుడు లీగ్ ద్వారా అందరికీ చేరువ చేస్తున్నాం.

తెలుగు టాలన్స్ ప్రదర్శనపై...

చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికే సెమీఫైనల్లోకి అడుగు పెట్టాం. తొలి లీగ్ విజేతగా కూడా నిలుస్తామనే నమ్మకం ఉంది. లీగ్‌లోని ఆరు జట్లలోనూ మా ఒక్క టీమ్‌కే విదేశీ కోచ్ (ఫెర్నాండో న్యూనెస్–పోర్చుగల్) ఉన్నాడు. ఆయన నేతృత్వంలో టీమ్ చాలా బాగా ఆడటమే కాదు, లీగ్‌లో ఒక టీమ్‌ను, ఆటగాళ్లను ఎలా తీర్చిదిద్దాలో కూడా దిశానిర్దేశం చేసేలా కోచింగ్ సాగింది.

తెలుగు రాష్ట్రాల్లో ఆటగాళ్ల గురించి...

ఈ విషయంలో కొంత నిరాశ ఉన్న మాట వాస్తవం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కొందరు చక్కటి హ్యాండ్‌బాల్ ఆటగాళ్లు ఉన్నా... మా లీగ్‌కు తగినట్లుగా కొన్ని ప్రమాణాల ప్రకారం మాకు తగిన ఆటగాళ్లు లభించలేదు. అయితే రాబోయే రోజుల్లో ఈ పరిస్థితి మారడం ఖాయం. లీగ్ కూడా అందుకు సహకరిస్తుంది. ఈసారి జట్టులో హైదరాబాద్‌లో ఆర్మీలో పని చేస్తున్న ఏడుగురు ఏఓసీ ఆటగాళ్లను మాత్రం తీసుకున్నాం.

టీమ్ యజమానిగా ఆర్థిక అంశాలపై...

లీగ్‌లలోకి అడుగు పెట్టేటప్పుడే నాకు దానిపై స్పష్టమైన అవగాహన ఉంది. ఇవి ఇతర వ్యాపారాల్లాగా ఇప్పటికిప్పుడు లాభాలు తెచ్చిపెట్టేవి కావు. మా ఉత్సాహం మాత్రమే టీమ్‌ను నడిపిస్తుంది. అయితే లాభం గురించి బెంగ లేదు. లీగ్‌తో పాటు సదరు క్రీడ కూడా పైస్థాయికి ఎదగడం ముఖ్యం. స్పాన్సర్లు ముందుకు రావడం కూడా సానుకూల పరిణామం. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో తలపడే గ్లోబల్ టీమ్‌ను తయారు చేయడమే మా లక్ష్యం.

గ్యాంజస్ గ్రాండ్‌మాస్టర్స్ గెలుపు

దుబాయ్: గ్లోబల్ చెస్ లీగ్‌లో భాగంగా తొలి రోజు జరిగిన రెండు మ్యాచ్‌ల్లో అప్‌గ్రాడ్ ముంబా మాస్టర్స్, గ్యాంజస్ గ్రాండ్‌మాస్టర్స్ జట్లు గెలుపొందాయి. గ్యాంజస్ గ్రాండ్‌మాస్టర్స్ 10–4 పాయింట్లతో చింగారి గల్ఫ్ టైటాన్స్‌పై, ముంబా మాస్టర్స్ 8–7 పాయింట్లతో త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ జట్టుపై విజయం సాధించాయి. ముంబా మాస్టర్స్‌కు ఆడిన ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక తమ ప్రత్యర్థులతో గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు.

క్లుప్తంగా...

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ నోటిఫికేషన్ విడుదల

- డిగ్రీ, పీజీ ప్రవేశాల దరఖాస్తుకు జూలై 31 వరకు గడువు

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2023–24 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు విజయవాడలోని వర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.అజంతకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తిచేసిన వారు, పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సుల్లో పాసైన వారు నేరుగా డిగ్రీలో అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు. పీజీలో చేరేందుకు మూడేళ్ల డిగ్రీ పాసైనవారు అర్హులని వివరించారు. లైబ్రరీ సైన్సు కోర్సులో చేరడానికి డిగ్రీ పూర్తి చేసినవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు జూలై 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. మరింత సమాచారం కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు రెండో విడత ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. ఈ విషయాన్ని సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు గురువారం తెలిపారు. ఎంపిక జాబితాలు https://aprs.apcfss.in లో ఉంచామన్నారు. సంబంధిత పాఠశాలల jnbnivas లాగిన్‌కు కూడా జాబితాలను పంపించినట్లు తెలిపారు. ఎంపికైన వారి మొబైల్ ఫోన్లకు మెసేజ్ పంపించినట్లు చెప్పారు. ఫలితాలను విద్యార్థి ఐడీ, హాల్ టికెట్ ద్వారా https://aprs.apcfss.in నుంచి తెలుసుకోవచ్చన్నారు. ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో విడివిడిగా కౌన్సెలింగ్ జరిపి రెండో విడత ఖాళీల మేరకు మెరిట్, రోస్టర్ విధానంలో సీట్లు కేటాయిస్తామని వివరించారు. గుంటూరు, తాటిపూడి, నిమ్మకూరు, నాగార్జున సాగర్, గుంటూరు (మైనార్టీ), వెంకటగిరి కళాశాలల్లో ఈ నెల 26న ఎంపీసీ, ఈఈటీ, 27న బైపీసీ, సీజీటీ, 28న ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఏపీ గురుకుల విద్యాలయం (మైనార్టీ బాలురు), కర్నూలు–గ్యారంపల్లి, వాయల్పాడు (మైనార్టీ), కొడిగెనహళ్లి, బనవాసి, కర్నూలు(మైనార్టీ) కళాశాలల్లో ఈ నెల 26న ఎంపీసీ, ఈఈటీ, 27న బైపీసీ, సీజీటీ, ఎంఈసీ, నాగార్జునసాగర్ డిగ్రీ కాలేజీ, పల్నాడు జిల్లాకి సంబంధించి అన్ని కోర్సులకు 24న అదే కాలేజీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

28 వరకూ రీ–కౌంటింగ్ దరఖాస్తుల స్వీకరణ

- డీఎంఈ డాక్టర్ నరసింహం

సాక్షి, అమరావతి: జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరి 2022 (రెగ్యులర్) పరీక్ష ఫలితాలను బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరి బుధవారం రాత్రి విడుదల చేసింది. ఈ ఏడాది జనవరి నెలలో నర్సింగ్ విద్యార్థులకు పరీక్షలను నిర్వహించారు. ఫలితాలు వెలువడిన నేపథ్యంలో రీ–కౌంటింగ్ అవసరం అనుకున్న విద్యార్థులు ఈ నెల 28వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఎంఈ డాక్టర్ నరసింహం సూచించారు.గడువు ముగిసిన అనంతరం దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమన్నారు.

ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశానికి 32,500 దరఖాస్తులు

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని 4 ట్రిపుల్ ఐటీలకు సంబంధించి అడ్మిషన్లలో భాగంగా గురువారం సాయంత్రానికి 32,500 దరఖాస్తులు వచ్చినట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు గురువారం తెలిపారు. ఈ నెల 26న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 4 ట్రిపుల్ ఐటీలలో కలిపి 4,400 సీట్లు ఉండగా, దరఖాస్తులు పెద్ద ఎత్తున రావడం గమనార్హం. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 4% డిప్రివేషన్ స్కోర్‌ను కలపనున్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను జూలై 13న ప్రకటిస్తారు.

అగ్రి వర్సిటీలో సర్టిఫికెట్ కోర్సులు

సాక్షి, అమరావతి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొ.ఆదాల విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సేంద్రియ వ్యవసాయం, మిద్దె తోటలు, తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకంపై 8 వారాల పాటు ఆన్‌లైన్‌లో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒక్కో కోర్సుకు రూ.1,500 చొప్పున ఫీజు చెల్లించి జూలై 20లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్నవారు ఆన్‌లైన్ సదుపాయం (కంప్యూటర్ /ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్/ఐపాడ్) కలిగి ఉండాలన్నారు. కోర్సుల పూర్తి వివరాలకు www.angrau.ac.in లేదా 8008788776, 8309 626619, 9110562727 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

‘శ్రీవాణి’పై ఆరోపణలు నమ్మవద్దు

- సందేహాలుంటే టీటీడీని సంప్రదించండి
- మీడియా సమావేశంలో టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి
- శ్రీవాణి నిధుల వినియోగంపై మఠాధిపతులు, పీఠాధిపతుల ప్రశంస



సమావేశంలో మాట్లాడుతున్న స్వామీజీలు, టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుమల: శ్రీవాణి ట్రస్టు నిధుల వినియోగంపై భక్తులకు ఎవరికైనా సందేహాలుంటే నేరుగా టీటీడీని సంప్రదించి వివరాలు పొందాలని టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి కోరారు. ఈ ట్రస్టుకు సంబంధించి నిరాధారమైన ఆరోపణలను నమ్మవద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు. తిరుమలలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో 8.25 లక్షల మంది శ్రీవాణి ట్రస్టు ద్వారా స్వామిని దర్శించుకున్నారని చెప్పారు. ఎన్నో నియమ నిబంధనల ప్రకారం ట్రస్టు ఏర్పాటవుతుందన్నారు. ఇంతమంది భక్తులకు రసీదులు ఇవ్వకపోతే మిన్నకుంటారా అని ప్రశ్నించారు. విరాళానికి, దర్శన టిక్కెట్‌కు వేర్వేరుగా రసీదులు వస్తాయని చెప్పారు. ఆరోపణలు చేసేముందు వాస్తవాలను పూర్తిగా తెలుసుకోవాలని, లేనిపక్షంలో కోట్లాదిమంది భక్తుల విశ్వాసం దెబ్బతింటుందని ఆయన పేర్కొన్నారు.

నిధుల దుర్వినియోగం అవాస్తవం

శ్రీనివాసమంగాపురంలోని లలితా పీఠాధిపతి శ్రీస్వస్వరూపానందగిరిస్వామి, కడపలోని బ్రహ్మంగారి మఠం మఠాధిపతి శ్రీవిరజానందస్వామి, హైదరాబాద్‌కు చెందిన శ్రీహనుమత్‌పీఠం పీఠాధిపతి శ్రీదుర్గాప్రసాదస్వామి మాట్లాడుతూ శ్రీవాణి నిధులు దుర్వినియోగం అవుతున్నాయని వస్తున్న ఆరోపణలపై వాస్తవాలు తెలుసుకునేందుకు తిరుమలలో ఈవోను కలిశామన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా ఎంత మంది దర్శించుకున్నారు.. ఎక్కడెక్కడ ఆలయాల నిర్మాణాలు జరుగుతున్నాయి.. ట్రస్టు నిధులు ఏయే బ్యాంకుల్లో ఉన్నాయి.. వడ్డీ ఎంత వచ్చింది.. తదితర వివరాలను ఈవో తెలియజేశారని చెప్పారు. ఈ వివరాలు పరిశీలించాక తమకు ఎంతో సంతోషం కలిగిందన్నారు. నిధులు దుర్వినియోగమయ్యే అవకాశమే లేదని స్పష్టం చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేస్తే హిందూధర్మం పట్ల భక్తుల విశ్వాసం సన్నగిల్లే ప్రమాదం ఉందని చెప్పారు.

శ్రీవాణి ట్రస్ట్ అకౌంట్లు పక్కాగా ఉన్నాయి

హైదరాబాద్‌కు చెందిన సోలిస్ ఐకేర్ ఎండీ రామాంజనేయులు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా సామాన్య భక్తుడిగా తిరుమల శ్రీవారిని దర్శించుకుంటున్నానని, శ్రీవాణి ద్వారా కూడా పలుమార్లు దర్శనానికి వెళ్లానని చెప్పారు. శ్రీవాణి ట్రస్టు అకౌంట్లను పరిశీలించాక తనకు ఉన్న సందేహాలన్నీ తొలగిపోయాయని తెలిపారు. భక్తులు ఇస్తున్న విరాళాలతో వెనుకబడిన ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. మీడియా సమావేశంలో వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, పతంజలి సంస్థల ప్రతినిధులు శ్రీధర్‌రావు, మురళి, దీపక్‌రెడ్డి, శ్రీనివాస్, సుబ్బన్న, సురేష్, కుమారస్వామి, టీటీడీ వీజీవో బాలిరెడ్డి, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రయోజనాల కోసం దుష్ప్రచారం చేయవద్దు

సనాతన హిందూధర్మ ప్రచారంలో భాగంగా గిరిజన, ఎస్సీ, మత్స్యకార, ఇతర వెనుకబడిన గ్రామాల్లో శ్రీవాణి ట్రస్టు నిధులతో టీటీడీ ఆలయాల నిర్మాణం, పురాతన ఆలయాల పునరుద్ధరణ చేయడం అభినందనీయమని పలువురు పీఠాధిపతులు, మఠాధిపతులు మీడియా సమావేశంలో ప్రశంసించారు. విశ్వహిందూ పరిషత్ సెంట్రల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు రాఘవులు మాట్లాడుతూ టీటీడీ ధర్మప్రచారం కోసం ఏర్పాటుచేసిన శ్రీవాణి ట్రస్టుపై రాజకీయ ప్రయోజనాల కోసం దుష్ప్రచారం చేయవద్దని కోరారు. శ్రీవాణి ట్రస్టుపై కొందరు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. సనాతన ధర్మంలో కీలకమైన దేవాలయం సమాజ సంక్షేమ కేంద్రమని చెప్పారు. పురాతన కాలంలో ఆలయం.. ధర్మశాల, వేదశాల, భోజనశాల, యోగశాల, వైద్యశాల, మల్లశాల, గోశాలగా ఏడు ప్రధాన బాధ్యతలను నిర్వహించేదని తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ధార్మికసంస్థ టీటీడీపై నిరాధారమైన ఆరోపణలు చేయడం వల్ల కోట్లాదిమంది భక్తుల మనోభావాలు, విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. తాము శ్రీవాణి ట్రస్టు అకౌంట్లను పరిశీలించామని, ఒక్కపైసా కూడా దుర్వినియోగమయ్యే అవకాశం లేదని చెప్పారు. ఎవరికైనా సందేహాలుంటే నేరుగా తిరుమల వచ్చి శ్రీవాణి ట్రస్టు రికార్డులను, అకౌంట్లను పరిశీలించి నివృత్తి చేసుకోవచ్చని సూచించారు.

చిరుధాన్యాలకు ‘మద్దతు’



సాక్షి, అమరావతి: చిరు ధాన్యాలు పండించే రైతన్నలకు మద్దతు ధర కల్పిస్తూ ఖరీఫ్ నుంచి ఆర్బీకేల ద్వారా రాగులు, జొన్నలు, కందుల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మధ్యవర్తులు, దళారుల బెడద లేకుండా ధాన్యం మాదిరిగానే నేరుగా కల్లాల్లో పంట ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించి పౌర సరఫరాల సంస్థ మద్దతు ధరకు సేకరించనుంది. పంట వేసిన తర్వాత ఆర్బీకేలో నమోదు చేసే ఈ–క్రాప్ వివరాల ఆధారంగా కొనుగోలు చేయనుంది. క్వింటాల్ కందులకు కనీస మద్దతు ధర రూ.7 వేలు, రాగులకు రూ.3,578, జొన్నలకు రూ.2,970(హైబ్రీడ్), రూ.2,990 (మల్దండి) చొప్పున ప్రకటించింది. రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేసిన వారంలోగా వారి ఖాతాల్లో డబ్బులను జమ చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 1.41 లక్షల టన్నుల కందులు, 64,738 టన్నుల రాగులు, 3.63 లక్షల టన్నుల జొన్న ఉత్పత్తుల దిగుబడులు రావచ్చని అంచనా వేస్తోంది. ఈమేరకు రాగులు, జొన్నలు, కందుల కొనుగోళ్ల వివరాలను పౌర సరఫరాల సంస్థ గురువారం విడుదల చేసింది.

రాష్ట్రంలోనే సేకరణ.. రాయితీపై విత్తనాలు

ప్రజలకు పౌష్టికాహారాన్ని అందించాలన్న సంకల్పంతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రాయలసీమ జిల్లాల్లో రాగులు, జొన్నల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇంటింటికీ రేషన్ పంపిణీ వాహనాల ద్వారా ప్రతి నెలా కార్డుకు మూడు కేజీల బియ్యం బదులు రాగులు/జొన్నలను అందిస్తోంది. ఇప్పటికే రాయలసీమ జిల్లాల్లో పౌరసరఫరాల సంస్థ మద్దతు ధరకు జొన్నల కొనుగోలు చేపట్టగా రాగులను కర్ణాటక నుంచి సేకరిస్తోంది. అయితే మన రాష్ట్రంలో పండే చిరుధాన్యాలు, కందులను స్థానికంగానే కొనుగోలు చేసి రైతులకు సంపూర్ణ మద్దతు ధర అందించి వాటిని తిరిగి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో వర్షాధార, మెట్ట పంటలైన రాగి, జొన్నల సాగును ప్రోత్సహించేందుకు 50 శాతం రాయితీపై రైతులకు విత్తనాలను అందిస్తోంది.

రైతులపై భారం లేకుండా..

పంట ఉత్పత్తులను నేరుగా కల్లాల్లోనే కొనుగోలు చేయడం ద్వారా రైతులకు రవాణా, హమాలీ ఖర్చుల భారం నుంచి ప్రభుత్వం ఉపశమనం కలిగిస్తోంది. గోనె సంచులు, లోడింగ్, మిల్లు వద్దకు తరలించేందుకు రవాణా ఖర్చులను కూడా భరిస్తోంది. ఒకవేళ రైతులు వాటిని స్వయంగా సమకూర్చుకుంటే అందుకు అయిన ఖర్చులను తిరిగి చెల్లిస్తోంది. ఒక్కో గోనె సంచికి (50 కేజీలు) రూ.3.39, లేబర్ చార్జీ కింద రూ.22 చొప్పున అందచేస్తోంది.

నాణ్యత ప్రమాణాలు ఇలా..

ఎంత శాతం లోపు?	కందులు	రాగి	జొన్న
తేమ	12	12	14
ఇతర వ్యర్థ పదార్థాలు	2	1	1
ఇతర ధాన్యం గింజలు	-	1	3
కల్తీ గింజలు	3	-	-
దెబ్బతిన్న గింజలు	3	1	1.5
రంగుమార్పు, విరిగిన గింజలు	4	1	1
ముతక, పూర్తిగా తయారు కానివి	3	-	4
పురుగు పట్టిన గింజలు	4	-	1

పోటీతో రైతులకు లాభసాటి ధర

చిరుధాన్యాలు, కందులు పండించే రైతులకు మద్దతు ధర కల్పిస్తాం. స్థానికంగా పంటలను కొనుగోలు చేసి స్థానికులకే పీడీఎస్ ద్వారా పంపిణీ చేసే బృహత్తర ప్రణాళిక ఇది. తొలుత ఖరీఫ్‌లో ఆర్బీకేల ద్వారా జొన్నలు, రాగులు, కందుల సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటి వరకు వీటిని మార్కెట్‌లో వ్యాపారులే కొనుగోలు చేస్తుండగా ప్రభుత్వం ముందుకు రావడంతో పోటీ పెరగనుంది. తద్వారా రైతుకు మద్దతు ధర మించి లాభసాటి రేటు దక్కుతుంది. రైతులు కచ్చితంగా ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలి.

– హెచ్.అరుణ్ కుమార్,
కమిషనర్, పౌరసరఫరాల శాఖ

ఏపీ సహకారంతో ఇథియోపియాలో ఈ–క్రాప్

- కస్టమ్ హైరింగ్ సెంటర్లు కూడా ఏర్పాటు చేస్తాం
- వ్యవసాయ ఉన్నతాధికారులతో భేటీ అయిన ఇథియోపియా బృందం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సాగవుతున్న వ్యవసాయ, ఉద్యాన పంటలను గుర్తించే ఎలక్ట్రానిక్ క్రాపింగ్ (ఈ–క్రాప్) అద్భుతంగా ఉందని, ఈ సాంకేతికతను తమ దేశంలో అమలు చేసేందుకు అవసరమైన సహకారాన్ని అందించాలని ఇథియోపియా ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర పర్యటనలో భాగంగా మూడో రోజైన గురువారం ఇథియోపియా ప్రతినిధి బృందం మంగళగిరిలోని వ్యవసాయ శాఖ కమిషనరేట్ క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ ఉన్నతాధికారులతో భేటీ అయింది. ఈ సందర్భంగా ఏపీలో రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని తమ దేశంలో రైతులకు కూడా అందించేందుకు ఆసక్తిగా ఉన్నామని ఇథియోపియా ప్రతినిధి బృందం స్పష్టం చేసింది. ముఖ్యంగా ఈ–పంట నమోదుతోపాటు యంత్ర సేవా పథకం, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ రైతు భరోసా వంటి పథకాలను తమ రైతులకు అందించాలని భావిస్తున్నామన్నారు. వీటి అమలు కోసం అవసరమైన సాంకేతికతను అందించేందుకు చేయూతనివ్వాలని కోరారు. ఇథియోపియా దేశానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కమిషనర్ చేవూరు హరికిరణ్ వెల్లడించారు.

ఎరువులు, పురుగు మందులపై ఆరా

ఆర్బీకేల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను ఎక్కడ నుంచి కొనుగోలు చేస్తున్నారు, ఎలా కొనుగోలు చేస్తున్నారనే విషయాలను ఇథియోపియా ప్రతినిధి బృందం ఆరా తీసింది. కాగా, వ్యవసాయ రంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బృందానికి వివరించారు. ఈ–క్రాప్ నమోదు, ఉచిత పంటల బీమా, ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇతర ఇన్‌పుట్స్ పంపిణీ, ఆర్బీకేలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలు (కస్టమ్ హైరింగ్ సెంటర్స్), డ్రోన్ టెక్నాలజీ, ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్, వైఎస్సార్ అప్లికేషన్ సాంకేతికతను, పొలం బడుల ద్వారా గ్యాప్ సర్టిఫికేషన్ జారీ అంశాలను వివరించారు. ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్‌పాండే, వ్యవసాయ శాఖ జేడీ వల్లూరి శ్రీధర్ వివిధ అంశాలపై మాట్లాడారు.

‘ఆయుష్మాన్ భారత్’తో అందరికీ ఆరోగ్యం

కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి దేవుసిన్హ్ చౌహాన్



లేపాక్షి: మారుమూల గ్రామాలవారికీ మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ‘ఆయుష్మాన్ భారత్’ అమలు చేస్తున్నారని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి దేవుసిన్హ్ చౌహాన్ తెలిపారు. అందులో భాగంగానే విద్య, వైద్య రంగాలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. ఆయన గురువారం శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, డీలర్లు, డ్వాక్రా సంఘాల మహిళలు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అర్హులందరికీ ఆయుష్మాన్ కార్డులిచ్చామని, ఈ కార్డు ద్వారా దేశంలోని ఏ ఆస్పత్రిలోనైనా వైద్యం చేయించుకునే అవకాశం కల్పించామన్నారు. దేశంలోని 40 కోట్ల మందికి ‘జన్‌ధన్’ బ్యాంకు ఖాతాలు ప్రారంభించామని, మహిళలకు ఉజ్వల పథకం కింద సబ్సిడీతో వంట గ్యాస్ అందిస్తున్నామని, ఒక్కో డ్వాక్రా సంఘానికి రూ.3 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్లు నరసయ్య, లక్ష్మీకుమారి, సీడీపీవో రెడ్డిరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విశాఖలో సీఏసీపీ సమావేశం

- హాజరు కానున్న 8 రాష్ట్రాల వ్యవసాయశాఖాధికారులు
- రబీ సీజన్‌కు కనీస మద్దతు ధరల నిర్ణయం..
- శనగకు రూ.7,983, ఆవాలుకు రూ.6,608గా రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలు

సాక్షి, అమరావతి: రబీ 2024–25 మార్కెటింగ్ సీజన్‌కు కనీస మద్దతు ధరలు నిర్ణయించేందుకు వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ (సీఏసీపీ) దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సమావేశం విశాఖపట్నంలో శుక్రవారం జరగనుంది. సీఏసీపీ చైర్మన్ విజయ్‌పాల్ శర్మ అధ్యక్షతన విశాఖలోని పార్క్ హోటల్‌లో జరగనున్న ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్, పుదుచ్చేరి, లక్షద్వీప్ రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ, ఉద్యాన శాఖ కమిషనర్లు, శాస్త్రవేత్తలు, నిపుణులు పాల్గొననున్నారు. ఆయారాష్ట్రాల్లో సాగవుతున్న వ్యవసాయ, ఉద్యాన పంటలకు ప్రస్తుతం ఉన్న కనీస మద్దతు ధర్షైన ఖర్చులు, రాబడి వివరాలను కమిషన్ దృష్టికి తీసుకెళ్తారు. రాబోయే సీజన్‌కు కనీస మద్దతు ధరలను నిర్ణయించి ముసాయిదా నివేదికను కమిషన్ కేంద్రానికి సమర్పిస్తుంది. కేంద్రం వీటిని అధ్యయనం చేసి ప్రతీ ఏటా వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు ప్రయోజనం చేకూర్చేలా కనీస మద్దతు ధరలను నిర్ణయించి ప్రకటిస్తుంది. రబీ పంట కాలానికి సంబంధించి ఆహార ధాన్యాల కింద గోధుమ, బార్లీ పంటలకు, అపరాల కిందశనగ, మెంతులు పంటలు, నూనెగింజల కింద ఆవాలు, కుసుమ పంటల ఉత్పాదక ఖర్చులను పరిగణనలోకి తీసుకుని కనీస మద్దతు ధరలను ఆయా రాష్ట్రాలు ప్రతిపాదిస్తాయి. ఏపీలో అపరాల పంటలలో ఎక్కువగా సాగయ్యే శనగ పంటతో పాటు నూనెగింజలలో ఒకటైన ఆవాలకు కనీస మద్దతు ధరలకు ప్రతిపాదనలు పంపాల్సిందిగా సీఏసీపీ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. రబీ–2022–23 మార్కెటింగ్ సీజన్‌లో శనగ పంటకు క్వింటాల్ రూ.5,230, ఆవాలకు రూ.5,050గా ప్రకటించారు. అయితే ప్రస్తుతం పెరిగిన పెట్టుబడి ఖర్చులు, రాబడిని దృష్టిలో పెట్టుకుని రబీ 2024–25 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి శనగ పంట ఉత్పత్తులకు క్వింటాల్‌కు రూ.7,983లుగా, ఆవాలు క్వింటాల్‌కు రూ.6,608 చొప్పున పెంచి కనీస మద్దతు ధరగా నిర్ణయించాలని రాష్ట్ర ప్రభుత్వం కమిషన్‌కు నివేదిక సమర్పించనుంది. మిగిలిన రాష్ట్రాలు కూడా తమకు కేటాయించిన పంట ఉత్పత్తులకు సంబంధించిన ప్రతిపాదనలను కమిషన్‌కు సమర్పించనున్నాయి.

అత్యాచారం కేసులో కమ్యూనిస్ట్ నేత అరెస్ట్

- 8 నెలలుగా అత్యాచారం
- బాలిక గర్భం దాల్చడంతో విషయం బయటకు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాలిక కుటుంబ సభ్యులు



గిడ్డూభాయ్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో 15 ఏళ్ల మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ కేసులో కమ్యూనిస్టు పార్టీకి చెందిన గిడ్డూభాయ్ అనే మహ్మద్ షరీఫ్ (58)ను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. టూటౌన్ ఎస్ఐ ప్రసాద్ కథనం మేరకు.. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీకి చెందిన గిడ్డూభాయ్.. చిత్తూరుకి చెందిన 15 ఏళ్ల బాలికకు చాక్లెట్ల ఆశ చూపి లొంగదీసుకున్నాడు. గత ఎనిమిది నెలలుగా బాలికపై లైంగిక దాడి చేస్తున్నాడు. ఇటీవల బాలిక తనకు తీవ్రమైన కడుపునొప్పి వస్తోందంటూ కుటుంబ సభ్యులకు చెప్పగా వైద్యులకు చూపించారు. పరీక్షలు చేసిన వైద్యులు బాలికకు మూడు నెలల గర్భం అని చెప్పారు. కుటుంబ సభ్యులు బాలికను విచారించడంతో విషయం చెప్పింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు గిడ్డూభాయ్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించడంతో చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

వైద్య రంగానికి కేంద్రం అధిక ప్రాధాన్యత

- మోదీ వైద్య కళాశాలల సంఖ్యను 387 నుంచి 648కి పెంచారు
- ప్రపంచంలో అతి పెద్ద గృహ నిర్మాణ పథకాన్ని మోదీ ప్రారంభించారు
- కేంద్ర మంత్రి భారతీ ప్రవీణ్ పవార్



సాక్షి, భీమవరం/పాలకొల్లు సెంట్రల్: కేంద్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, దీనిలో భాగంగానే వైద్య కళాశాలలను పెంచుతున్నామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీప్రవీణ్ పవార్ చెప్పారు. కేంద్ర మంత్రి గురువారం పశ్చిమ గోదావరి జిల్లాలో టిడ్కో గృహాలను సందర్శించి అక్కడ స్థానికులతో, భీమవరంలో మీడియాతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం వచ్చాక దేశవ్యాప్తంగా వైద్య కళాశాలలు 387 నుంచి 648కి పెంచారని వివరించారు. ప్రపంచంలోనే అతి పెద్ద గృహ నిర్మాణ పథకాన్ని ప్రారంభించిన ఘనత ప్రధాని మోదీదేనని అన్నారు. దేశంలో 2014 వరకు 60 లక్షల ఇళ్ల నిర్మాణం చేస్తే మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత 3.50 కోట్ల ఇళ్ల నిర్మాణం చేపట్టారన్నారు. అయినా మోదీ చిత్రపటం ఎక్కడా లేదని అన్నారు. రెండు నెలల్లో మళ్లీ వస్తానని, ఇక్కడ ప్రతి అపార్ట్‌మెంట్‌పై ప్రధాని మోదీ ఫొటో ఉండాలని, ప్రధాని ఆవాస్ యోజన అని రాసి ఉండాలని స్పష్టం చేశారు. ఇక్కడ 6,144 గృహాలు మంజూరవ్వగా 1854 మందికే ఇళ్లు అప్పగించారని, సౌకర్యాలు కూడా కల్పించలేదని అన్నారు. తాను మళ్లీ వచ్చేసరికి మిగిలిన ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలని చెప్పారు. సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో కేంద్ర ప్రభుత్వం వాటా 20 శాతమని, రాష్ట్ర ప్రభుత్వం వాటా 35 శాతమని, లబ్ధిదారుల వాటా 45 శాతం ఉందని తెలిపారు. కాగా, కేంద్ర మంత్రి ఎదుట రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేక భావన కలిగించాలని కొందరు బీజేపీ నాయకులు చేసిన ప్రయత్నం విఫలమైంది.

నిరుద్యోగ రహిత ఏపీ రూపకల్పనే లక్ష్యం

- అందుకు సీఎం దృఢనిశ్చయంతో ముందుకు సాగుతున్నారు
- త్వరలో ఉమ్మడి తొమ్మిది జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ తరఫున జాబ్‌మేళాలు
- ఎంపీ నిధుల నుంచి ఏఎన్‌యూకి రూ.50 లక్షలు ఇస్తా
- రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి



ఏఎన్‌యూ/సాక్షి, అమరావతి: నిరుద్యోగ రహిత ఆంధ్రప్రదేశ్ రూపకల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారని రాజ్యసభ సభ్యులు వి. విజయసాయిరెడ్డి అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రెండ్రోజుల పాటు జరగనున్న జాబ్‌మేళాను గురువారం ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువకులందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలనే దృఢ నిశ్చయంతో సీఎం ముందుకు సాగుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గత ఏడాది నాలుగు ఉమ్మడి జిల్లాల్లో మెగా జాబ్‌మేళాలు నిర్వహించి నలభై వేల మందికి పైగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. త్వరలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో కలిసి మిగిలిన ఉమ్మడి జిల్లాల్లో కూడా వేర్వేరుగా మెగా జాబ్‌మేళాలు నిర్వహిస్తామని విజయసాయిరెడ్డి వివరించారు. వీటి ద్వారా అరవై నుంచి లక్ష మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఏపీలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి ప్రభుత్వ వ్యవస్థను సామాన్యుల చెంతకు చేర్చడంతోపాటు యువతకు సీఎం జగన్ లక్షలాది ఉద్యోగాలు కల్పించారన్నారు. జాబ్‌మేళా నిర్వహణ బృహత్తర కార్యక్రమమని తెలిపారు. ఏఎన్‌యూలో ఇంక్యుబేషన్ కేంద్రాల అభివృద్ధికి తన ఎంపీ నిధుల నుంచి రూ. 50 లక్షలు ఇస్తానని విజయసాయిరెడ్డి ప్రకటించారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్ మాట్లాడుతూ.. ఏఎన్‌యూలో అంతర్జాతీయ విద్య, పరిశోధనా ప్రమాణాలు ఉన్నాయన్నారు. జాబ్‌మేళాకు రాష్ట్రవ్యాప్తంగా ఎవరైనా హాజరుకావచ్చన్నారు. ఏఎన్‌యూ సెంటర్ ఫర్ హెచ్ఆర్డీ డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు మాట్లాడుతూ.. చెన్నైకి చెందిన సిటిజన్ ఫర్ ఛేంజ్ ఇంటర్నేషనల్ సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో 75 సంస్థలు పాల్గొంటున్నాయని పది వేల మంది వరకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు.

ఎల్లో మీడియా దుష్ప్రచారాల్ని తిప్పికొట్టాలి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై కొన్ని మీడియా సంస్థలు, పత్రికలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టేందుకు వైఎస్సార్‌సీపీ న్యాయ విభాగం క్రియాశీలకంగా వ్యవహరించాలని రాష్ట్ర పార్టీ కోఆర్డినేటర్, అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్ విజయసాయిరెడ్డి కోరారు. పార్టీ పంచాయతీరాజ్, న్యాయ విభాగాల అధ్యక్షులు, జోనల్ ఇన్‌చార్జ్‌లతో తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వేర్వేరుగా ఆయన సమావేశమయ్యారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077.
Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943